ఈనాడు

విజయవాడ 29-7-2025 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 350
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ హతం



- 'ఆపరేషన్ మహదేవ్'తో మట్టుబెట్టిన సైన్యం
- సోనామార్గ్ టన్నెల్ దాడి ముష్కరుడూ మృతి
- మరో ఉగ్రవాదీ ఎన్‌కౌంటర్

సైన్యానికి భారీ విజయం



సులేమాన్

శ్రీనగర్

జమ్మూ కశ్మీర్‌లో సైన్యం భారీ విజయం సాధించింది. ముగ్గురు కీలక ఉగ్రవాదులను అంతమొందించింది. వీరిలో పహల్గాం ఉగ్ర దాడికి కుట్ర పన్నిన ముష్కరుడూ ఉన్నాడు. జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ శివార్లలో ఉన్న అటవీ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. 'ఆపరేషన్ మహాదేవ్' పేరుతో సైన్యానికి చెందిన ఎలైట్ పారాకమాండోలు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో పహల్గాం ఉగ్ర దాడికి సూత్రధారిగా భావిస్తున్న సులేమాన్ అలియాస్ ఆసిఫ్‌తోపాటు అతడి ఇద్దరు అనుచరులు హతమయ్యారు. భద్రతా దళాలు అంతమొందించిన ఉగ్రవాదుల్లో గత ఏడాది సోనామార్గ్ టన్నెల్ పేల్చివేతలో పాల్గొన్న జిబ్రాన్ ఉన్నాడు. మరో ఉగ్రవాదిని హమ్జా అఫ్గానీగా గుర్తించారు. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు శాటిలైట్ ఫోన్‌ను ఉపయోగించడంతో భద్రతా దళాలు.. వారి ఉనికిని పసిగట్టాయి. అలాంటి ఫోన్‌నే పహల్గాం ఉగ్ర దాడి సందర్భంగా వినియోగించారు. దీంతో వెంటనే స్పందించిన పారాకమాండోలు మెరుపు దాడి చేసి ముష్కరులను హతమార్చారు. ముల్నార్ గ్రామ సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలంలో ఒక ఎం4 కార్బైన్ రైఫిల్, ఇతర ఆయుధ సామగ్రి లభించాయి. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్ సభ్యులు, 4వ పారా యూనిట్ సిబ్బంది.. ముగ్గురు ఉగ్రవాదుల ఉనికిని గుర్తించారని, సుదీర్ఘ ఆపరేషన్ తర్వాత ముగ్గురు ముష్కరుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని కశ్మీర్ జోన్ ఐజీ (మిగతా 3లో)

ఉగ్రవాదంపై పోరులో ఎంత దూరమైనా వెళతాం

- లక్ష్యం సాధించాకే 'సిందూర్'కు విరామం
- పౌరులకు నష్టం లేకుండా జాగ్రత్త తీసుకున్నాం
- ఎవరి ఒత్తిడీ మనపై లేదు
- లోక్‌సభ చర్చలో రాజ్‌నాథ్ స్పష్టీకరణ

3లో



రండి.. కలిసి పనిచేద్దాం

గ్రీన్ హైడ్రోజన్, పోర్టుల నిర్మాణంలో భాగస్వాములవ్వండి

- సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్‌కు చంద్రబాబు ఆహ్వానం
- గృహ నిర్మాణం, సబ్ సీ-కేబుల్ రంగాల్లో సహకరిస్తామన్న లాంగ్
- అమరావతిలో హౌసింగ్ ప్రాజెక్టుల్లో చెయ్యి కలపండి
- ఆ దేశ హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డును కోరిన ఏపీ సీఎం
- బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు పరిశీలన



సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు గురించి వివరిస్తున్న అక్కడి ప్రభుత్వ అధికారి

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కొత్త ఆలోచనలు, ఆధునిక వసతులు, అత్యుత్తమ విధానాలతో భవిష్యత్ నగరంగా నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో చేపట్టే అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం తీసుకోవాలని సింగపూర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులను ఆయన కోరారు. సింగపూర్‌లో రెండో రోజు పర్యటనలో భాగంగా బిడదారి ఎస్టేట్‌ను చంద్రబాబు రెండుగంటల పాటు కాలినడకన తిరిగి పరిశీలించారు. అనంతరం సింగపూర్ హౌసింగ్ బోర్డు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కార్పొరేషన్ ఎంటర్‌ప్రైజ్, ప్రపంచ బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. 'రాజధాని అమరావతిలో చేపట్టే హౌసింగ్ ప్రాజెక్టుల్లో మీరు భాగస్వాములు కావాలి. అమరావతికి సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చింది. రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకూ భాగస్వామి అవుతోంది. గతంలో జరిగిన కొన్ని ఘటనల వల్ల ఏపీ- సింగపూర్ ప్రభుత్వాల మధ్య అంతరం వచ్చింది. ఆ తప్పులను సరిదిద్దడంతో పాటు అంతరాన్ని (మిగతా 3లో)

సింగపూర్ మోడల్‌లో ఏపీ పోర్టుల అభివృద్ధి

టువాస్ పోర్టు సందర్శించిన చంద్రబాబు

రాష్ట్రంలో 'ఎవర్‌వోల్ట్' నైపుణ్య శిక్షణ కేంద్రం

సంస్థ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం

లోపలి పేజీలో



అత్యంత ఖరీదు.. అమూల్య సేవలు!

మానవాళి చరిత్రలో అత్యంత ఖరీదైన భూపరిశీలన ఉపగ్రహ ప్రయోగానికి రంగం సిద్ధమైంది. రూ.11,200 కోట్ల వ్యయంతో రూపొందిన అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో) సింథటిక్ ఎపెర్చర్ (నైసార్) శాటిలైట్ బుధవారం సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా నింగిలోకి దూసుకెళ్లనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం దీనికి వేదిక కానుంది. రోదసి రంగంలో రెండు దేశాల మైత్రికి ప్రబల నిదర్శనంగా నిలిచిన ఈ ఉపగ్రహం.. ప్రపంచమంతటికీ అద్భుత సేవలు అందించబోతోంది.

... వివరాలు 14లో

- రేపు నింగిలోకి నైసార్ ఉపగ్రహం



కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

18 ఏళ్ల తర్వాత.. నెల ముందే నిండిన సాగర్

నేడు గేట్లు ఎత్తి పులిచింతలకు నీటి విడుదల



శ్రీశైలం డ్యాం ఐదు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు 3లో

చదరంగంలో రారాణి



చెస్ ప్రపంచకప్ కైవసం చేసుకున్న దివ్య

ఫైనల్లో హంపికి నిరాశ

కోనేరు హంపి గ్రాండ్‌మాస్టర్ అయిన మూడేళ్లకు పుట్టిన అమ్మాయి దివ్య దేశ్‌ముఖ్. అపార అనుభవం, లెక్కకు మిక్కిలి టైటిళ్లు, గత ఏడాదే ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో విజయం.. ఇలా హంపి బలాన్ని చాటే ఘనతలు ఎన్నెన్నో. దివ్య చూస్తే ఇంకా గ్రాండ్‌మాస్టర్ కూడా కాలేదు. ప్రపంచ వేదికల్లో ఆమె సాధించిన పెద్ద ఘనతలేమీ లేవు. ఇలాంటి ఇద్దరి మధ్య పోరు అంటే మొగ్గు హంపికే అనుకుంటారంతా! కానీ ప్రతిష్ఠాత్మక మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్లో దివ్య అద్భుత ప్రదర్శనతో తెలుగమ్మాయికి షాకిచ్చింది మహారాష్ట్ర యువ తార. టోర్నీ ఆరంభం నుంచి అసాధారణంగా ఆడుతూ హేమాహేమీలను వెనక్కినెట్టి ఫైనల్ చేరిన దివ్య.. తుది పోరులోనూ తన ప్రతిభను చాటింది. హంపికి దీటుగా నిలుస్తూ, రెండు క్లాసికల్ గేమ్‌లను డ్రా చేసుకున్న దివ్య.. సోమవారం టైబ్రేక్‌లో 1.5-0.5తో పైచేయి సాధించి ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయింది. టైబ్రేక్‌లో తొలి గేమ్ డ్రా కాగా.. రెండో గేమ్‌లో దివ్య విజయం సాధించింది. ఇప్పటిదాకా ఇంటర్నేషనల్ మాస్టర్‌గా ఉన్న దివ్య.. ఈ విజయంతో నేరుగా గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించింది.

ఈ టోర్నీకి ముందు వరకు మహిళల చెస్ ప్రపంచకప్‌లో ఏ భారత క్రీడాకారిణీ కనీసం సెమీస్ కూడా చేరలేదు. అలాంటిది ఈసారి ఇద్దరు భారత క్రీడాకారిణులు ఫైనల్లో తలపడటం, కప్పు మన దేశానికే దక్కడం విశేషం.

వివరాలు ఛాంపియన్ లో..



జస్టిస్ బట్టు దేవానంద్ చేత ప్రమాణం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

హైకోర్టు న్యాయమూర్తిగా... జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణం

29కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య 2లో

రాష్ట్రం వెలుపల ఇంటర్ చదివినవారూ 'లోకలే'

వారి దరఖాస్తులను స్వీకరించండి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైద్య విద్య ప్రవేశాల కౌన్సెలింగ్‌లో తమను ఏపీ స్థానికులుగా పరిగణించి, దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించాలని కోరుతూ ఇంటర్మీడియట్ రాష్ట్రం వెలుపల చదివి, నీట్ రాసిన పలువురు అభ్యర్థులు అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లను రాష్ట్రంలో స్థానిక అభ్యర్థులుగా పరిగణించి వారి దరఖాస్తులను స్వీకరించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని, ఆ తర్వాత లోకల్, నాన్‌లోకల్ వ్యవహారంపై లోతైన విచారణ చేపడతామని స్పష్టం చేసింది. విచారణను వారం (మిగతా 3లో)

విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు టెండర్లు

రూ.4,150 కోట్లతో 38.40 కిలోమీటర్ల మేర నిర్మాణం

ఈనాడు - అమరావతి



విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టు పనులకు రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ సోమవారం టెండర్లు పిలిచింది. తొలిదశలో 4.33 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ నాలుగు లైన్ల పైవంతెన సహా మొత్తం 38.40 కి.మీ.తో రెండు కారిడార్ల పనులు చేపట్టనున్నారు. ఇందుకు రూ.4,150 కోట్ల వ్యయం కానుంది. 32 చోట్ల ఎలివేటెడ్ మెట్రోస్టేషన్లు, ఒకచోట అండర్ గ్రౌండ్ మెట్రోస్టేషన్ నిర్మాణానికి ఈపీసీ విధానంలో మెట్రో రైల్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. సాంకేతిక, ఆర్థికాంశాలను పరిశీలించి గుత్తేదారు సంస్థలను ఎంపిక చేసిన అనంతరం ఈ ఏడాది సెప్టెంబరు 12 నుంచి బిడ్ల స్వీకరణ మొదలై అదే నెల 17న ముగియనుంది. అదేరోజు టెండర్లు తెరవనున్నారు. గుత్తేదారు సంస్థల అర్హతలపై మెట్రోరైల్ కార్పొరేషన్ నాలుగైదు రోజుల్లో మరో నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పనుల విలువకు సంబంధించిన వివరాలతో సోమవారం నోటిఫికేషన్ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయి కాంపిటీటివ్ బిడ్డింగ్ కావడంతో ప్రాజెక్టుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అధ్యయనం చేసేందుకు గుత్తేదారు సంస్థలకు 45 రోజులపాటు సమయం ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆసక్తి కలిగిన సంస్థలు మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులను వర్చువల్‌గా సంప్రదించే వెసులుబాటు కల్పించారు. విశాఖలోనూ తొలి దశలో 46.23 కిలోమీటర్లలో మూడు కారిడార్ల పనులకు ఈ నెల 25న టెండర్లు పిలిచారు.




జస్టిస్ నూనెపల్లి హరినాథ్


జస్టిస్ మండవ కిరణ్మయి


జస్టిస్ జగడం సుమతి


జస్టిస్ న్యాపతి విజయ్

నలుగురు హైకోర్టు అదనపు న్యాయమూర్తులకు...

శాశ్వత న్యాయమూర్తుల హోదా

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

ఈనాడు, అమరావతి: హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నలుగురికి శాశ్వత న్యాయమూర్తులుగా హోదా కల్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం సోమవారం కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు సిఫారసు చేసిన వారిలో అదనపు న్యాయమూర్తులు జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ పేర్లున్నాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల తర్వాత వీరు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తారు. ఈ నలుగురూ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 2023 అక్టోబరు 21న ప్రమాణం చేసిన విషయం తెలిసిందే.

పీ4.. ఓ స్వచ్ఛంద కార్యక్రమం

- బలవంతం చేస్తున్నట్లు విపక్షాల తప్పుడు ప్రచారం
- పథకం వైస్ ఛైర్మన్ కుటుంబరావు

ఈనాడు, అమరావతి: పేదరిక నిర్మూలన కోసం రూపొందించిన పీ-4 కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందమని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సీహెచ్ కుటుంబరావు పేర్కొన్నారు. ఈ పథకంపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ఇందులో ఎవరినీ బలవంతంగా చేర్చడం లేదని, పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమం అని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'మార్గదర్శకులుగా నమోదు కావాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖాధికారులు ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవం లేదు. ఇష్టమైన వారు మాత్రమే పాలుపంచుకోవచ్చు. ఎవరైనా బలవంతం చేస్తే సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి సమాచారం ఇవ్వొచ్చ'ని ఆయన సూచించారు. పీ4ను ప్రభుత్వాధికారులు స్వచ్ఛంద కార్యక్రమంగానే చూడాలని, బలవంతం లేకుండా పనిచేయాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోందని వివరించారు.

హైదరాబాద్ శివారులో 'ఈగల్' భారీ ఆపరేషన్

అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టు

ఈనాడు, హైదరాబాద్: ఒడిశా నుంచి ఏపీ, తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును తెలంగాణ ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఛేదించింది. ముగ్గురిని అరెస్టు చేసి, రూ.5 కోట్ల విలువైన 935.6 కిలోల గంజాయి పట్టుకుంది. ఈ మేరకు భారీ ఆపరేషన్ చేపట్టి హైదరాబాద్ శివారులోని బాటసింగారం పండ్ల మార్కెట్ వద్ద పెద్ద పొట్లాల్లో ఉన్న గంజాయితోపాటు 6 మొబైల్ ఫోన్లు, డీసీఎం వాహనం, కారు స్వాధీనం చేసుకున్నారు.

పర్యాటక హబ్‌గా రాష్ట్రం

మంత్రి కందుల దుర్గేష్



తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. తిరుమలలో శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆయన దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయం వద్ద మంత్రికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ఆలయం వెలుపల మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వైఎస్సార్ కడప జిల్లాలో తీర్చిదిద్దిన గండికోట పర్యాటక ప్రదేశాన్ని వచ్చేనెల 1న సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తాం. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు తెచ్చాం' అని మంత్రి వివరించారు.

హైకోర్టు న్యాయమూర్తిగా... జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణం

ఈనాడు, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్.. జస్టిస్ దేవానంద్ చేత ప్రమాణం చేయించారు. అంతకుముందు.. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దేవానంద్ బదిలీకి ఆమోదముద్ర వేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీ) వైవీఎస్‌బీజీ పార్థసారథి చదివి వినిపించారు. జస్టిస్ దేవానంద్ రాకతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరింది. ఆయన 4వ స్థానంలో కొనసాగుతారు. పదవీ కాలం 2028 ఏప్రిల్ 13 వరకు ఉంది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు, బంధువులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, హైకోర్టు న్యాయవాదులు, దిగువ కోర్టుల నుంచి పలువురు న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు, జస్టిస్ దేవానంద్ కుటుంబసభ్యులు, మద్రాస్ హైకోర్టు న్యాయవాదులు, తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ప్రతినిధులు ప్రమాణ కార్యక్రమానికి హాజరయ్యారు.

★ 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దేవానంద్ బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై మద్రాస్ హైకోర్టుకు వెళ్లి 2023 ఏప్రిల్ 10న అక్కడ బాధ్యతలు చేపట్టారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ఈ ఏడాది మే 26న సమావేశమై.. జస్టిస్ దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టు నుంచి తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేసేందుకు కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

తమిళనాడు బార్ కౌన్సిల్ ప్రతినిధులకు సన్మానం

జస్టిస్ దేవానంద్ ప్రమాణ కార్యక్రమానికి హాజరైన తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ప్రతినిధుల బృందాన్ని నల్లారి ద్వారకానాథరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ఛైర్మన్ పీఎస్ అమల్‌రాజ్, వైస్ ఛైర్మన్ వి.కార్తికేయన్, మద్రాస్ హైకోర్టు పీపీ హసన్ మొహ్మద్ జిన్నా, తమిళనాడు హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఆర్.కృష్ణకుమార్, కార్యనిర్వాహక సభ్యులు రమేశ్.. సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు.


ప్రస్తుత పరిస్థితి.. భవిష్యత్తును చాటిచెప్పదు

ఒక వ్యక్తి ప్రస్తుత పరిస్థితి ఆధారంగా
తన భవిష్యత్తు గురించి ఎప్పుడూ తుది అంచనాకు రాకూడదు!
సమయం చాలా శక్తిమంతమైనది.
అది నల్లని బొగ్గును తళతళ మెరిసే వజ్రంగా మార్చగలదు. నాయకత్వ స్థానంలో ఉన్నవారు ఉద్యోగుల విషయంలో ప్రస్తుత పరిస్థితులను దాటి చూడాలి. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు వారిలో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించాలి.
– అమన్ సహోటా, లీడర్షిప్ కోచ్

అలవాటు చేసి.. విక్రేతలుగా మార్చి..

- 13 మంది గంజాయి ముఠా అరెస్టు


నిందితులను చూపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ జనార్దనరావు. చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కూలీలు, మైనర్లకు తొలుత గంజాయిని అలవాటు చేసి, తర్వాత సులభంగా నగదు సంపాదించవచ్చని వారినే విక్రేతలుగా మారుస్తున్న ముఠాను గుంటూరు జిల్లా తెనాలి పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3.15 లక్షల విలువైన 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెనాలిలో సోమవారం ఎస్పీ సతీష్‌కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన బసంతి నాయక్ మూడేళ్ల కిందట తాపీ పనుల నిమిత్తం ప్రత్తిపాడు మండలం దాసరిపాలెం వచ్చాడు. అతనికి అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్, తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన రషీద్ పరిచయమయ్యారు. బసంతినాయక్ ఒడిశా నుంచి తీసుకువచ్చిన గంజాయిని వినియోగిస్తూ తమకు పరిచయమైన మరికొందరితో విక్రయాలు చేయించడం ప్రారంభించారు. నిఘా ఉంచిన పోలీసులు తొలుత వీరిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ముఠాలో సభ్యులైన విజయవాడకు చెందిన వెంకటేష్, తెనాలికి చెందిన నాగూర్, నజీరుద్దీన్, కుమార్‌సాయి, సాల్మన్, నాగమల్లేశ్వరరావు, నలుగురు మైనర్లతో పాటు మొత్తం 13 మందిని అరెస్టు చేశారు. పొట్లాలు కట్టి విక్రయాలకు సిద్ధం చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో రషీద్‌పై 50, సాల్మన్‌పై 23, మరో మైనర్‌పై 5 చోరీ కేసులు ఉన్నాయి. సాల్మన్‌పై రౌడీ షీట్ ఉంది. తెనాలి పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 10 గంజాయి కేసుల్లో 53 మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.5.25 లక్షలకు పైగా విలువైన సరకును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు.

500 మంది ముస్లిం విద్యార్థులకు ఉచిత ఇంటర్ విద్య

వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 500 మంది ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థులకు ఉచితంగా రెసిడెన్షియల్‌తో కూడిన ఇంటర్మీడియట్ విద్యను చదివే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఉచితంగా ఐఏఎస్ కోచింగ్‌నూ అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి ముస్లిం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ అందించి మిషన్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు. విజయవాడలోని కార్యాలయంలో సోమవారం వక్ఫ్‌బోర్డు పాలకమండలి సమావేశం నిర్వహించారు. నూతనంగా నియమించిన ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీల సభ్యులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. "ప్రతి వక్ఫ్‌బోర్డు సంస్థ ఆదాయానికి అనుగుణంగా విద్యార్థులను దత్తత తీసుకోవాలి. సంస్థ ఆదాయాన్ని పెంచి అది పిల్లల చదువుకు ఉపయోగపడేలా వినియోగించాలి" అని సూచించారు.

వీఐపీలు ఏడాదికోసారే తిరుమల రావాలి

- భక్తుల కానుకలను ఆధ్యాత్మిక కార్యక్రమాలకే వాడాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన


వెంకయ్యనాయుడు, ఉష దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న వెంకయ్యచౌదరి, చిత్రంలో భానుప్రకాష్‌రెడ్డి, వెంకయ్యనాయుడు కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్, ఇతర కుటుంబ సభ్యులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులు స్వామివారికి సమర్పించే కానుకలను పూర్తిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తుల వసతుల పెంపునకు వినియోగించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సోమవారం వీఐపీ బ్రేక్‌లో సతీమణి ఉష, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వారికి అర్చకులు వేదాశీర్వచనం, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. 'ప్రాచీన సంప్రదాయం ప్రకారం దేవస్థానం నిధులతో ప్రతి ఊరిలో ఆలయ నిర్మాణానికి పూనుకోవాలి. దేవస్థానం నిధులను ప్రభుత్వ, ఇతర కార్యక్రమాలకు మళ్లించే ప్రయత్నం చేయకూడదు. శ్రీవారి దర్శనానికి వీఐపీలు సంవత్సరానికి ఒకసారి మాత్రమే రావాలి. స్వామి దర్శనానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. వీఐపీ దర్శనాలను దృష్టిలో ఉంచుకుని సామాన్య భక్తులకు ఇతర సమయం కేటాయిస్తారు. అందువల్ల వీఐపీలు ఆలయాలకు వచ్చేటప్పుడు హుందాగా వ్యవహరించాలి' అని సూచించారు.

యెమెన్‌లో భారతీయ నర్సు నిమిష ప్రియకు ఉరిశిక్ష రద్దు!

యెమెన్: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో భారత దౌత్యం ఫలించింది. ఆమెకు విధించిన ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు భారత గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ సోమవారం రాత్రి ప్రకటించారు. ఇక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్ష రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.. గ్రాండ్ ముఫ్తీ అభ్యర్థనతో యెమెన్ పండితులు మధ్యవర్తిత్వం జరిపారు. వారు ఉత్తర యెమెన్ పాలకులతో చర్చలు జరిపారు. మరణశిక్షను రద్దు చేసినట్లు గ్రాండ్ ముఫ్తీ కార్యాలయం ప్రకటించింది. అయితే ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఇంకా అందాల్సి ఉందని వెల్లడించింది.

ఆగస్టు 2న పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ

ఈనాడు, అమరావతి: పీఎం కిసాన్ 20వ విడత వాయిదా సొమ్ము ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో జమ కానుంది. వారణాసిలో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా నిధులు విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో 41.58 లక్షల రైతు కుటుంబాలకు రూ.831.60 కోట్లు అందుతాయి. అదే రోజు అన్నదాతా సుఖీభవ సొమ్ము కూడా రైతుల ఖాతాల్లో జమ కానుంది. ఈ మేరకు ఇప్పటికే సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పీఎం కిసాన్ నుంచి రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ కింద తొలివిడతగా రూ.5 వేలు అందించనున్నాయి. రాష్ట్రంలో అన్నదాతా సుఖీభవ పథకానికి 46.64 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. వీరిలో 46.20 లక్షల కుటుంబాల్లోని రైతులకు ఈకేవైసీ పూర్తి చేయగా.. ఇంకా 40,346 మందికి కేవైసీ చేయాల్సి ఉంది. కార్డుల జారీ ప్రక్రియ పూర్తయ్యాక కౌలు రైతులకు రెండో విడతలో.. మొదటి, రెండో విడత నిధులను కలిపి జమ చేస్తారు.

నేటి నుంచి వైద్య శిబిరాలు

ఈనాడు, అమరావతి: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నియోజకవర్గాల వారీగా మంగళవారం నుంచి అక్టోబరు 10 వరకు వైద్య శిబిరాలు నిర్వహించేలా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

కట్టర్‌తో కోసి.. నోట్ల కట్టలు ఎత్తుకెళ్లి

- రూ.38 లక్షల నగదుతో పాటు 10 కేజీల బంగారం అపహరణ


లాకరను కట్టర్‌తో కోసారిలా..

హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ ఎస్‌బీఐ బ్యాంకులో ఆదివారం రాత్రి భారీ దోపిడీ జరిగింది. లాకర్‌లో ఉంచిన రూ.38 లక్షల నగదు, 10 కేజీల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లిపోయారు. డీఎస్పీ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హిందూపురం గ్రామీణ మండలం తూముకుంట పారిశ్రామికవాడలోని ఎస్‌బీఐకి వెనుక వైపునున్న కిటికీని దుండగులు కట్టర్‌తో కోసి బ్యాంకులోకి చొరబడ్డారు. వెంటనే సీసీ కెమెరాల వైర్లు కట్ చేశారు. లాకర్ గదికి వేసిన తాళాలను కట్టర్‌తో కోసి అందులోని రూ.38 లక్షల నగదుతో పాటు మూడు ట్రేలల్లో ఉంచిన 10 కేజీల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం బ్యాంకు అధికారులు దోపిడీ జరిగినట్లు గుర్తించారు. డీఎస్పీ మహేశ్, సీఐ అబ్దుల్‌కరీం ఘటనా స్థలికి వచ్చి ఆధారాలు సేకరించారు. కాగా, బ్యాంకుకు నాలుగేళ్ల నుంచి సెక్యూరిటీ గార్డ్ లేరని, దీనిపై బ్యాంకు వారిని తాము ముందే హెచ్చరించినా ఏర్పాటు చేయలేదని డీఎస్పీ చెప్పారు.

గ్రహం అనుగ్రహం 29-7-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
పంచమి: రా.12-48 తదుపరి షష్ఠి; **ఉత్తర:** రా.8-35 తదుపరి హస్త
వర్జ్యం: లేదు; **అమృత ఘడియలు:** మ. 12-56 నుంచి 2-38 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-14 నుంచి 9-05 వరకు, తిరిగి రా. 10-58 నుంచి 11-43 వరకు; **రాహుకాలం:** సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5.40; సూర్యాస్తమయం: సా.6.31,
నాగ పంచమి, గరుడ పంచమి, మంగళగౌరీ వ్రతం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ	ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విశాఖపట్నం	37.0	27.8	విజయవాడ	34.8	26.2
రాజమహేంద్రవరం	37.0	27.0	తాడేపల్లిగూడెం	34.6	27.2
నెల్లూరు	36.5	27.6	గుంటూరు	34.0	27.0
విజయనగరం	36.0	26.0	కడప	34.0	26.0
ఒంగోలు	35.6	27.0	అనంతపురం	33.5	24.2
నరసాపురం	35.0	28.0	శ్రీకాకుళం	33.0	28.0
తిరుపతి	35.0	25.1	కర్నూలు	31.8	24.1
			నిజామాబాద్	31.4	23.8
			హైదరాబాద్	30.1	22.4
			మహబూబ్‌నగర్	29.0	23.1

'ధర్మస్థల'లో అనుమానాస్పద మరణాలపై విచారణ ముమ్మరం

మంగళూరు, న్యూస్‌టుడే: ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం ధర్మస్థలలో అనుమానాస్పద మరణాలకు సంబంధించిన కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చిపెట్టానని గతంలో ధర్మస్థలలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేసినట్లు చెప్పుకొన్న ఒక వ్యక్తి వెల్లడించడంతో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు సోమవారం అతడిని తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో రికార్డింగ్ చేస్తున్నామని సిట్ అధికారి ఎంఎన్ అనుచేత్ వెల్లడించారు. మృతదేహాలను ఖననం చేసిన ప్రాంతాలను గుర్తిస్తానని.. అక్కడ పుర్రెలు, ఎముకలు, ఇతర అవశేషాలను చూపిస్తానని అతడు చెప్పడంతో సిట్ ప్రతినిధులు, ఫోరెన్సిక్ విభాగం, రెవెన్యూ, అటవీ శాఖల సిబ్బంది అటవీ ప్రాంతానికి చేరారు. నేత్రావతి నది స్నానఘట్టానికి ఆవలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభమైంది. దర్యాప్తు పూర్తయ్యాక అతడిని న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని సిట్‌కు నేతృత్వం వహించిన డీఐజీ ప్రణబ్ మొహంతి తెలిపారు. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి, సమాధానాలు రాబట్టారు. మృతదేహాల అవశేషాలు లభిస్తే, విచారణ ఒక కొలిక్కివచ్చే అవకాశం ఉంది.

అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థకు కేటాయించిన పార్వతీపురం మన్యం జిల్లా కురుకుట్టిలో 1,200 మెగావాట్లు, కర్రివలసలో వెయ్యి మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ప్రాజెక్టు (పీఎస్‌పీ)లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికంగా ఉన్న సమస్యలతో ఆయా ప్రాజెక్టులను రద్దు చేయాలని సదరు సంస్థ కోరిన మీదట ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

ఉద్యోగ అవకాశాలు



నిండుగా నాగార్జునసాగర్

కృష్ణమ్మ పరవళ్లు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, విజయపురి సౌత్, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం వస్తోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 2,31,612 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఐదు గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,35,325 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,904 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

■ నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు 584.70 అడుగుల నీటిమట్టం చేరింది. ఇది 296.5695 టీఎంసీలకు సమానం. పూర్తిస్థాయి మట్టానికి మరో 6 అడుగుల దూరంలో ఉంది. కుడి కాలువకు 5,394 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 6,643 క్యూసెక్కులు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు భారీగా నీరు వస్తోంది. మంగళవారం క్రస్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. 2007లో జులైలో గేట్లను ఎత్తగా.. మళ్లీ 18 ఏళ్ల తర్వాత ఇదే నెలలో సాగర్ నిండటంతో గేట్ల ద్వారా పులిచింతలకు నీటిని వదలనున్నారు.

■ కర్నూలు జిల్లాలో తుంగభద్ర నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కౌతాళం మండలంలోని మేళిగనూరు వద్ద లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది.

రండి.. కలిసి పనిచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించే ప్రయత్నం చేస్తున్నా, భవిష్యత్తులో రెండు ప్రభుత్వాల మధ్య సహకారం కొనసాగాలి' అని పేర్కొన్నారు.

పర్యావరణహిత ప్రాజెక్టు బిడదారి

సింగపూర్ ప్రభుత్వం బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును పర్యావరణహితంగా, అద్భుతంగా తీర్చిదిద్దిందని చంద్రబాబు కితాబిచ్చారు. సింగపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ.. శ్మశాన ప్రాంతాన్ని సుందరమైన పార్కుగా మార్చడం ఆకట్టుకుందని ప్రశంసించారు. సిటీ ఇన్ ఎ గార్డెన్ పేరుతో 250 ఎకరాల్లో బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును తీర్చిదిద్దారు. ప్రకృతితో మమేకమయ్యేలా ఈ ప్రాజెక్టు చేపట్టినా ఎక్కడా పర్యావరణానికి హాని కలగనియ్యలేదు. చెట్లు తొలగించకుండా, సహజ నీటివనరులు దెబ్బతినకుండా ఇళ్లు నిర్మించారు. ఆధునాతన పచ్చని నిర్మాణాలు చేపట్టారు. పట్టణ, నగర ప్రాంతాల్లో ఇళ్లు అందుబాటు ధరల్లో ఉండేలా చూడటంతో పాటు నాణ్యతలోనూ రాజీ పడలేదు. 10 వేల కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి' అని ఆ దేశ అధికారులు చంద్రబాబుకు వివరించారు.

ఏపీ భాగస్వామ్య సదస్సుకు రండి

వైకాపా ప్రభుత్వ హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం చంద్రబాబు ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టాన్ సీ లాంగ్‌కు తెలిపారు. నవంబరులో ఏపీ ప్రభుత్వం నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు రావాలని సింగపూర్ మంత్రిని ఆహ్వానించారు. రెండో రోజు సింగపూర్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం సోమవారం.. మంత్రి టాన్ సీతో సమావేశమైంది. 'ఏపీలో చేపట్టిన గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, ట్రాన్స్‌మిషన్ కారిడార్లు, పోర్టుల నిర్మాణంలో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం కావాలి. రాష్ట్రంలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలు అనుసరించడంలో మా రాష్ట్రానికి సహకరించండి. మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక, వాణిజ్య రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరం' అని చంద్రబాబు పేర్కొన్నారు. గృహ నిర్మాణం, సబ్ సీ-కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు సింగపూర్ మంత్రి టాన్ సీ అంగీకరించారు. గ్రీన్ ఎనర్జీ, గృహ నిర్మాణ రంగాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పనిచేస్తున్నామని చంద్రబాబుకు వివరించారు. గతంలో హైదరాబాద్‌లో కలిసినప్పటి విషయాలను ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అధికారులు పాల్గొన్నారు.



బిడదారి ఎస్టేట్‌లో నివాస సముదాయాల వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ తదితరులు

సింగపూర్ తరహా క్రీడా పాఠశాలలు

విజయవాడ, విజయనగరం, కడపల్లో సింగపూర్ తరహా క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. సింగపూర్‌లోని క్రీడా పాఠశాలను ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, అధికారులు, మంత్రులతో కలిసి ఆయన సందర్శించారు. క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ ఓంగ్ కిమ్ సూన్‌తో సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. 'క్రీడలకు ఏపీ అత్యంత ప్రాధాన్యమిస్తోంది. అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయడంతో పాటు వినోదం, పర్యాటక, వాణిజ్య కేంద్రాలుగా క్రీడా పాఠశాలలు ఉండాలి. రాజధాని అమరావతిలో క్రీడా నగరాన్ని నిర్మించబోతున్నాం. తిరుపతి, విశాఖ, అమరావతిలలో సమీకృత క్రీడా కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తాం. ఏపీ స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్లు 2 నుంచి 3 శాతానికి పెంచాం. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తే రూ.7 కోట్లు, రజతం సాధిస్తే రూ.5 కోట్లు, కాంస్య పతకం పొందిన వారికి రూ.3 కోట్లు ఇస్తామని ప్రకటించాం. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన వారికి గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తున్నాం. ప్రపంచ ఛాంపియన్, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచాం' అని పేర్కొన్నారు. సింగపూర్ క్రీడా పాఠశాలలో హై పెర్ఫార్మెన్స్ స్పోర్ట్స్ సిస్టం అమలు చేస్తున్నామని ప్రిన్సిపాల్ ఓంగ్ సీఎంకు చెప్పారు. జాతీయ క్రీడా సంఘాలు, అకాడమీలతో క్రీడా పాఠశాలను అనుసంధానం చేశామని.. 12 ఏళ్లున్న వారిని పాఠశాలలో చేర్చుకుని శిక్షణ ఇస్తున్నామని వివరించారు.

రాష్ట్రం వెలుపల ఇంటర్ చదివినవారూ 'లోకలే'

(మొదటి పేజీ తరువాయి)

రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఎస్కే కమరుద్దీన్, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన సనపల వెంకటరమణ, మరో 51 మంది నీట్ అభ్యర్థులు సోమవారం హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యాలు వేశారు. వారి తరఫున న్యాయవాదులు కొర్రపాటి సుబ్బారావు, పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు.

పదో తరగతి వరకు ఇక్కడే చదివారు

న్యాయవాది సుబ్బారావు వాదనలు వినిపిస్తూ 'కమరుద్దీన్ 1 నుంచి 5వ తరగతి ప్రత్తిపాడు, 6 నుంచి 10 వరకు గుంటూరు, ఇంటర్ తెలంగాణలోని మేడ్చల్‌లో చదివారు. తల్లిదండ్రులు ఏపీలోనే నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ రాష్ట్రంలో స్థానిక అభ్యర్థి అవుతారు' అన్నారు. 52 మంది అభ్యర్థుల తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ 'పిటిషనర్లందరూ 1 నుంచి 10వ తరగతి వరకు ఏపీలోనే చదివారు. ఆధార్, నివాస ధ్రువపత్రాలు ఏపీవే ఉన్నాయి. తల్లిదండ్రులు ఇక్కడే నివసిస్తున్నారు. ఇంటర్మీడియట్ రాష్ట్రం వెలుపల చదివారనే కారణంతో నాన్‌లోకల్‌గా పరిగణిస్తున్నారు. నీట్ పరీక్ష రాసేనాటికి విద్యార్థులు వరుసగా నాలుగేళ్లు ఏపీలో చదివి ఉండాలని లేదా ఏపీలో నివసించి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జీవోలు జారీ చేయడం చట్టవిరుద్ధం. పిటిషనర్లను ఏపీ స్థానిక అభ్యర్థులుగా పరిగణించి వైద్య విద్య ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించండి' అని కోరారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం తరఫు న్యాయవాది టీవీ శ్రీదేవి వాదనలు వినిపిస్తూ.. లోకల్, నాన్ లోకల్ అభ్యర్థులను గుర్తించేందుకు రాష్ట్రప్రభుత్వం ఇటీవల జీవోలు జారీ చేసిందన్నారు. నీట్ పరీక్ష రాసేనాటికి విద్యార్థులు వరుసగా నాలుగేళ్లు ఏపీలో చదివి ఉండాలని లేదా ఏపీలో నివసించి ఉండాలన్నారు. వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని కోరారు.

శిశువు వేళ్లు కోల్పోవడానికి వైద్యురాలే కారణం

రూ.33.75 లక్షల పరిహారం ఇవ్వాలని వినియోగదారుల కమిషన్ తీర్పు

ఈనాడు, చెన్నై: ప్రసవం సమయంలో జరిగిన లోపం వల్ల శిశువు కుడి కాలి ఐదు వేళ్లూ తొలగించాల్సి వచ్చినందుకు కారణమైన వైద్యురాలికి ఉత్తర చెన్నై వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. చికిత్స ఖర్చు రూ.23.65 లక్షలు, బాధితులు అనుభవించిన వేదనకు రూ.10 లక్షలు, వైద్యుని నిర్లక్ష్యానికి మరో రూ.10 వేలు.. మొత్తం రూ.33.75 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చింది. నెలలు పూర్తిగా నిండని శిశువును తల్లి గర్భం నుంచి తీసే క్రమంలో అనుమతి లేని పరికరాన్ని వాడి సెర్వికల్ పెస్సరీ ప్రక్రియను వినియోగించారని, ఇది శిశువుపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపింది. ఆ చికిత్స వల్ల శిశువు కుడి కాలికి రక్త ప్రసరణ నిలిచిపోవడంతో ఐదు వేళ్లనూ తొలగించాల్సి వచ్చిందని తెలిపింది.

గైడ్‌బండ్, రివిట్‌మెంట్‌లోనూ డిజైన్ లోపాలే!

జగన్ ప్రభుత్వం నిర్వాకం వల్లే గైడ్‌బండ్ కుంగింది

పోలవరంపై తేల్చి చెప్పిన విదేశీ నిపుణుల బృందం

ఆ బండ్‌ను పునరుద్ధరించాల్సిందేనని సిఫార్సు

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టులో గైడ్ బండ్ కుంగడానికి డిజైన్, నిర్మాణ లోపాలే కారణం. ఎడమ గట్టు రివిట్‌మెంట్ డిజైన్ సరిగా లేదు. మార్చుకోవాలి. స్పిల్ ఛానల్ కుడి గట్టు వాలు దెబ్బతినడానికి కూడా ఇలాంటి కారణాలే ఉన్నాయి. వీటి డిజైన్లలో ఫ్యాక్టర్ ఆఫ్ సేఫ్టీ (రక్షణ స్థాయి) తగినంత లేదు. అప్రోచ్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ చేస్తేనే మేలు' అని విదేశీ నిపుణుల బృందం తాజాగా సిఫార్సులు చేసింది. పోలవరం ప్రాజెక్టును ఈ బృందం మే నెలలో సందర్శించింది. అప్పట్లో చర్చించిన అంశాలపై సిఫార్సులతో జూన్ నెలలో నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత పోలవరం అధికారులు మరో 4 అంశాలను ఈ బృందానికి నివేదించారు. ఆ అంశాలపై కూడా అధ్యయనం చేసి తాజాగా సిఫార్సులు చేసింది. జగన్ ప్రభుత్వ హయాంలో రూ.83 కోట్లు వెచ్చించి నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోవడానికి నిర్మాణ, డిజైన్ లోపాలే కారణమని తేల్చి చెప్పింది.

గైడ్‌బండ్ కుంగడానికి ఇవీ కారణాలు

■ గైడ్‌బండ్‌లో భాగంగా నిర్మించిన ఆర్‌సి డయాఫ్రం వాల్ ప్యానళ్లన్నింటినీ అనుసంధానించే రీఇన్‌ఫోర్స్‌మెంట్ క్యాపింగ్ బీమ్ లేకపోవడం.

■ ఈ గోడను చాలినంత మందంతో నిర్మించకపోవడం.

■ డి వాల్ నిర్మాణంలో ప్యానళ్ల జాయింట్ చేయడానికి ఎంచుకున్న పద్ధతి, అందులో సరైన నాణ్యత లేకపోవడం.

■ నాణ్యత నియంత్రణ ప్రమాణాలు సరిగా అనుసరించ లేదు.

ఆఫ్రి డిజైన్ సామర్థ్యం సరిపోతుందా?

పోలవరంలో ప్రస్తుతం ఆఫ్రి డిజైన్ కన్సల్టెన్సీ పని చేస్తోంది. 'గైడ్‌బండ్‌లో భాగంగా నిర్మించే డయాఫ్రం వాల్ డిజైన్ రూపకల్పనకు ప్రస్తుతం ఆఫ్రి అనుభవం సరిపోతుందా లేదా అన్నది పరిశీలించాలి. పోలవరం ప్రాజెక్టు అథారిటీ మదింపు చేయాలి. అవసరమైన గుర్తింపు పొందిన, అనుభవం ఉన్న డి వాల్ డిజైనర్‌ను నియమించాలి' అని విదేశీ నిపుణుల బృందం సిఫార్సు చేసింది. ఈ అంశంపై అంతర్గతంగా చర్చించి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా గుత్తేదారు ప్రమేయం లేకుండా ఒక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించింది.

ఉగ్రవాదంపై ఎంత దూరమైనా వెళతాం

• లోక్‌సభ చర్చలో

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టీకరణ

దిల్లీ: ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించడానికి ఎంతదూరమైనా వెళతామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. ఆశించిన 'రాజకీయ, సైనిక లక్ష్యాల'ను చేరుకున్నందువల్లనే 'ఆపరేషన్ సిందూర్'కు విరామం ఇచ్చామని, ఈ విషయంలో మనపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టంచేశారు. పాకిస్థాన్ మరోసారి దుస్సాహసానికి ఒడిగడితే ఈ ఆపరేషన్‌ను పునరుద్ధరిస్తామని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ మొదలైంది. బిహార్ ఓటర్ల జాబితా సవరణపై కనీసం అర నిమిషమైనా మాట్లాడేందుకు అనుమతివ్వాలని విపక్షాలు తొలుత పట్టుబట్టడం వాదోపవాదనలకు దారితీసింది. దీంతో సిందూర్‌పై చర్చ రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. చర్చను ప్రారంభిస్తూ రక్షణమంత్రి దాదాపు గంటసేపు మాట్లాడారు. మోదీ నేతృత్వంలోని సరికొత్త భారతదేశం.. ప్రత్యర్థులకు అర్థమయ్యే భాషలోనే బదులిస్తోందని చెప్పారు. ధర్మాన్ని రక్షించాల్సిన సమయం వచ్చినప్పుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించాలని శ్రీకృష్ణుడు బోధించాడని గుర్తుచేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రతీకారం తీర్చుకున్నాం

"మన సైనిక దళాలు తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై ఎంతో సమర్థంగా దాడులు జరిపాయి. ఏడింటిని పూర్తిగా నాశనం చేశాయి. 22 నిమిషాల్లోనే ఆపరేషన్ పూర్తయింది. పహల్గాం మారణహోమానికి ప్రతీకారం తీర్చుకున్నాం. పాక్‌లో, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కలిగించిన నష్టంపై ఆధారాలూ సంపాదించాం. వందమందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం. ఉద్రిక్తతలకు తావివ్వని రీతిలో మన దాడులు జరిగాయి. ఆపరేషన్‌ను మొదలుపెట్టడానికి ముందే మన దళాలు ప్రతిఒక్కటీ అధ్యయనం చేశాయి. ఉగ్రవాదులకు గరిష్ఠ నష్టం కలిగించి, అమాయకులైన సాధారణ పౌరులకు ఎలాంటి హాని కలగకుండా సకల జాగ్రత్తలు తీసుకున్నాయి. లంకకు వెళ్లిన హనుమంతుడు తనకు హాని చేద్దామనుకున్నవారికి మాత్రమే ఎలా బుద్ధిచెప్పాడో అలాగే చేశాం. వియ్యానికైనా, కయ్యానికైనా సమ ఉజ్జీ ఉండాలి. మన సైనిక దళాలు సింహాల్లాంటివి. సింహం వెళ్లి కప్పను చంపితే మంచి సందేశం వెళ్లదు. ఏదో ఒత్తిడికి తలొగ్గి ఆపరేషన్‌ను నిలిపివేశామని చెప్పడం, విశ్వసించడం నిరాధారం. అది పూర్తి అవాస్తవం. దాడుల్ని ఆపాలని పాక్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) మన డీజీఎంవోను అభ్యర్థించారు.

తుపాకులు పేలితే ఎవరూ మిగలరు

శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. మనం యుద్ధాలు కోరుకోం. ప్రతీది మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరు. మన ప్రజలను చంపుతుంటే మాత్రం సైన్యం చూస్తూ ఊరుకోదు" అని రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. పోరులో మన విమానాల్లో ఎన్నింటిని కోల్పోయామనే ప్రశ్నలపై ఆయన స్పందిస్తూ- ఏ పరీక్షలోనైనా ఫలితం ముఖ్యం తప్పిస్తే పెన్సిల్ విరిగిందా, పెన్ను పోయిందా అనేది కాదన్నారు. భారత్ మొదట స్నేహ హస్తాన్ని అందిస్తుందని, ఏ దేశమైనా మనల్ని వంచిస్తే అవతలివారి చేతిని ఎలా మెలిపెట్టాలో కూడా తెలుసునని చెప్పారు. విపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను ఆపడానికి కారణమేమిటో చెప్పాలన్నారు. తన ప్రసంగంలోనే దానికి సమాధానం ఉందని, ప్రసంగాన్ని వినాలని రాజ్‌నాథ్ బదులిచ్చారు.

పాక్ సూర్యోదయం చూసేది కాదు

సిందూర్ అనేది వీరత్వానికి, శౌర్యానికి ప్రతీక. పాక్ దాడులన్నింటినీ భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. మన దాడులను అనేక దేశాలు సమర్థించాయి. సరిహద్దులు దాటి వెళ్లడం, యుద్ధం చేయడం ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే మన ధ్యేయం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్నచిన్న విషయాలు పట్టించుకోకూడదు. ఆచితూచి ప్రశ్నలడగాలి. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. భారత్ సైనికుల చర్యను ఆనాడు వాజ్‌పేయి ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ ఆయన లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని చెప్పారు. ఆనాడు వాజ్‌పేయి తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు.

తిప్పికొట్టే హక్కుంది: జైశంకర్



లోక్‌సభలో మాట్లాడుతున్న మంత్రి జైశంకర్

విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ- ఉగ్రదాడికి గురైన దేశానికి దానిని తిప్పికొట్టే హక్కు ఉంటుందని, భారత్ అదే పని చేసిందని చెప్పారు. పాకిస్థాన్‌కు, ఉగ్రవాదులకు గట్టి సందేశం ఇవ్వాలనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్ర మౌలిక స్థావరాలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. భారత్-పాక్ మధ్య ఎలాంటి మధ్యవర్తిత్వం జరగలేదని, అణ్వస్త్ర బ్లాక్ మెయిలింగ్‌కు భారత్ ఎప్పుడూ తలొగ్గదని వెల్లడించారు. ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని స్పష్టం చేశారు. వాణిజ్యంతో ఈ ఆపరేషన్‌ను అమెరికా ఏ దశలోనూ ముడిపెట్టలేదని తేల్చిచెప్పారు. ఐరాసలోని 193 దేశాల్లో మూడు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.

పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ హతం

(మొదటి పేజీ తరువాయి)

వీకే బిర్డి తెలిపారు. ఆ ప్రాంతంలో మరో ఉగ్ర గ్రూపు ఉందనే నిఘా వర్గాల సమాచారంతో సైనిక బలగాలు గాలింపు చేపట్టాయి.


ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడి చేసి బీభత్సం సృష్టించిన ఘటనకు సులేమాన్ సూత్రధారిగా భావిస్తున్నారు. ఈ ఘటనలో 26 మంది అమాయక పర్యాటకులు మరణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. తాజాగా పహల్గాం ఉగ్ర దాడికి సూత్రధారిని అంతమొందించి ప్రతీకారం తీర్చుకుంది. గత ఏడాది అక్టోబరులో సోనామార్గ్ టన్నెల్ పేల్చివేతలో ఏడుగురు మరణించారు. అందులో ఒక వైద్యుడు ఉన్నారు.

ఎవరీ సులేమాన్?

జమ్మూ కశ్మీర్‌లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన పహల్గాం ఉగ్ర దాడి సూత్రధారి సులేమాన్‌కు హాషీం మూసా అనే పేరుంది. అతడు గతంలో పాకిస్థాన్ సైన్యంలో పని చేశాడు. ఆ తరువాత లష్కరే తయ్యిబాతో అనుబంధం ఏర్పరుచుకున్నాడు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.20లక్షల రివార్డును జమ్మూ కశ్మీర్ పోలీసులు ప్రకటించారు. పహల్గాం దాడి తర్వాత మధ్య కశ్మీర్‌లోని గందేర్‌బల్‌లో సులేమాన్ షా తలదాచుకున్నాడు.

సంతానోత్పత్తి కేంద్రాల పని తీరుపై నివేదిక ఇవ్వండి: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉన్న సంతానోత్పత్తి కేంద్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సంతానోత్పత్తి కేంద్రం వ్యవహారం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి స్పందిస్తూ.. రాష్ట్రంలో ఉన్న సంతానోత్పత్తి కేంద్రాల పరిస్థితిపై ఆరా తీశారు. ఎన్ని కేంద్రాలకు అనుమతి ఇచ్చారు, ఎన్ని తిరస్కరించారు, అనుమతులు లేకుండా ఎన్ని పనిచేస్తున్నాయి, తదితరాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



ఆసుపత్రిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో సుహాసిని

సృష్టి సంతాన సాఫల్య కేంద్రాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

• అనుమతి పత్రాల తనిఖీ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ గాయత్రినగర్ కంచుకోటవారి వీధిలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాన్ని ఎన్టీఆర్ డీఎంహెచ్‌ఓ సుహాసిని సోమవారం పరిశీలించారు. సృష్టి ఆసుపత్రులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో విజయవాడలోని కేంద్రంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కేంద్రం యజమాని డాక్టర్ నమ్రతపై ఆరోపణలు రావడం.. ఆమెను అరెస్టు చేసిన నేపథ్యంలో విజయవాడ శాఖలో అలాంటి మోసాలు ఏమైనా జరుగుతున్నాయా? అనుమతులు ఉన్నాయా అనే కోణంలో తనిఖీ చేసేందుకు సుహాసిని సోమవారం యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రానికి వచ్చారు. ఆ సమయంలో కేంద్రం మూసి ఉంది. సిబ్బంది, రోగులు కూడా లేరు. నిర్వాహకులకు ఫోన్ చేస్తే ఒక ఉద్యోగి వచ్చారు. కేంద్రానికి ఉన్న ధ్రువపత్రాలు చూపించారు. అందులో యూనివర్సల్ హెల్త్ కేర్ అని రిజిస్ట్రేషన్ అయినట్లు ఉంది. ఆసుపత్రి మాత్రం యూనివర్సల్ సృష్టి పేరుతో కొనసాగుతున్న విషయాన్ని ఆమె గుర్తించారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. 'డాక్టర్ పి.నమ్రత యజమానిగా యూనివర్సల్ హెల్త్ కేర్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయ్యింది. కానీ యూనివర్సల్ హెల్త్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో నిర్వహిస్తున్నారు. అదే పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. రికార్డులు చూపించడానికి సిబ్బంది అందుబాటులో లేరు. మొక్కుబడిగా వచ్చిన వారు కూడా సరైన సమాధానాలు చెప్పడం లేదు. ఇక్కడ ఉన్న పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా.. కలెక్టర్ అనుమతి మేరకు మళ్లీ వచ్చి రికార్డులు తనిఖీ చేస్తా' అని ఆమె వివరించారు.

మరో 20 ఏళ్లు వైకాపా అధికారంలోకి రాదు: నాగబాబు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మరో ఇరవై ఏళ్లు వైకాపా అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ఆ పార్టీ అరాచకాలపై కార్యకర్తలు పోరాడాలని జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో.. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ఏర్పాటు, ఎన్నికల్లో విజయానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, భాజపా నేతలు కృషి చేశారు. పదవుల విషయంలో కార్యకర్తలు అసంతృప్తి చెందవద్దు. దామాషా ప్రకారం నామినేటెడ్ పోస్టులు వస్తాయి. కూటమిలోని పార్టీల నాయకులతో అపార్థాలు తలెత్తితే సమన్వయ కమిటీ చూసుకొంటుంది. కార్యకర్తలు స్పందించవద్దు. ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని ఆశించాను. సీట్ల పంపకాల్లో కుదరకపోవడంతో పవన్‌కల్యాణ్ చెప్పగానే క్షణం ఆలోచించకుండా తప్పుకొన్నాను' అని నాగబాబు చెప్పారు. విశాఖ దక్షిణం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణపత్రాల జారీకి ఇంటింటి సర్వే

• ఈసారి ఓసీ కులాల వివరాలూ నమోదు

ఈనాడు, అమరావతి: కుల ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన సమాచారాన్ని ప్రత్యేకంగా ఇంటింటి సర్వే ద్వారా సేకరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సుమోటో విధానంలో జరగబోయే ఈ ఇంటింటి సర్వే రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానుంది. అక్టోబరు 2 నాటికి దీనిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు ఆదేశాలననుసరించి.. రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్), పౌర సరఫరాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, రెవెన్యూ శాఖలు ఈ సర్వేలో భాగస్వాములవుతాయి. ఇప్పటికే ఆయా శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి.. డేటా బేస్ తయారు చేస్తున్నారు. దీనిని వీఆర్వో లాగిన్‌కు పంపుతారు. దానికి అనుగుణంగా ఇంటింటికి సర్వేకు వెళ్లి వివరాలు సేకరిస్తారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల గురించి మాత్రమే వివరాలు నమోదు చేశారు. ఈసారి ఓసీల వివరాలను కూడా సేకరించి, నమోదు చేస్తారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ట్యాంపరింగ్‌కు వీలులేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా ఈ ధ్రువపత్రాలు జారీచేస్తారు. సర్వే ద్వారా సేకరించబోయే సమాచారాన్ని ఇతర ప్రభుత్వ శాఖలు కూడా తమ అవసరాలకు తగ్గట్లు వినియోగించుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తుంది.

ఈనాడు

చదరంగ ప్రపంచంపై భారత ముద్ర


రణరంగాన్ని తలపించే చదరంగంలో ఇటీవలి కాలంలో ఇండియా అద్భుత ప్రగతి సాధించిందన్నది- అయిదు సార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సైతం అంగీకరించిన వాస్తవం. నిరుడు క్యాండిడేట్స్ టోర్నీలో అచ్చతెలుగు కుర్రాడు గుకేశ్ గెలుపును 'భారత్ సృష్టించిన భూకంపం'గా అభివర్ణించిన గ్యారీ కాస్పరోవ్ మాటల్లో వ్యక్తమైంది- చెస్ ప్రపంచంలో మన చిచ్చరపిడుగులు దూసుకెళ్తున్న తీరుపై ఓ దిగ్గజ క్రీడాకారుడి అబ్బురం! అరవై నాలుగు గళ్ల ఆటలో ఆధిపత్యం వహిస్తూ సంచలనాత్మక విజయాలను అందుకున్న భారతీయ యువకెరటాల జాబితాలో తాజాగా మరోపేరు వచ్చిచేరింది. ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లో కోనేరు హంపిని ఓడించి ఛాంపియన్‌గా నిలిచిన దివ్య దేశ్‌ముఖ్- ఇండియా నుంచి 'గ్రాండ్ మాస్టర్' హోదా దక్కించుకున్న నాలుగో అమ్మాయిగానూ చరిత్రపుటలకు ఎక్కింది. 46 దేశాలకు చెందిన 107 మంది అత్యుత్తమ క్రీడాకారిణులు... అందులోనూ 'టాప్-20'లోని పదిహేడు మంది తలపడిన సమరంలో పందొమ్మిదేళ్ల దివ్య జయకేతనం ఎగురవేయడం- నవతరానికొక స్ఫూర్తిపాఠం! మనవారు ఏనాడూ క్వార్టర్‌ఫైనల్ దశను దాటని మహిళల చెస్ ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరిన దివ్య, హంపి- అంతిమ పోరుకు ముందే భారతావనికి టైటిల్ ఖాయంచేశారు. భారత చదరంగాన్ని మరో మలుపు తిప్పే అపూర్వ ఘనత ఇది!

పదిహేనేళ్ల వయసులోనే గ్రాండ్‌మాస్టర్ అయ్యి, తన పేరిట కొత్త రికార్డును లిఖించుకున్న హంపి- రెండు దశాబ్దాలుగా ఒక నాయకురాలిగా భారత మహిళల చెస్‌ను ముందుకు నడిపిస్తోంది. బిడ్డకు జన్మనిచ్చిన దరిమిలా రెండేళ్ల విరామం తరవాత ఆటలోకి పునరాగమనం చేసిన ఆమె- అనుభవాన్ని ఆయుధంగా మార్చుకుని నవతరంతో పోటీపడుతూ అపురూప విజయాలను నమోదుచేసింది. ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్‌గా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. హంపి 'జీఎం' అయిన మూడేళ్లకు జన్మించిన దివ్య దేశ్‌ముఖ్- రెండేళ్ల కిందటి వరకు చెస్‌లో కొనసాగాలా వద్దా, చదువుపై దృష్టిపెట్టాలా అన్న డైలమాలోనే ఉండిపోయింది. అటుపిమ్మట చదరంగంపైనే మనసు లగ్నం చేసిన ఆమె- దూకుడు, పరిణతి కలగలిసిన ఆటతో విశ్వనాథన్ ఆనంద్ వంటివారి ప్రశంసలనూ అందుకుంది. తాజా ఫైనల్ రెండో టైబ్రేకర్‌లో కీలక సమయంలో హంపి చేసిన తప్పును అనుకూలంగా మార్చుకుని అలవోకగా విజయతీరాలకు చేరుకుంది. తరాల మధ్య పోరుగా వాసికెక్కిన విశ్వసమరం తుది ఘట్టంలో తనకు రెట్టింపు వయసు ఉన్న సీనియర్ క్రీడాకారిణిపై గెలవడం- దివ్య కెరీర్‌లోనే ఓ మైలురాయి వంటిది. ఆమె దీక్షాదక్షతలకు, అకుంఠిత సాధనకు లభించిన ప్రతిఫలమది!

ఒత్తిడిని అధిగమించి అప్పటికప్పుడు సరైన నిర్ణయాలు తీసుకుంటూ, ప్రత్యర్థుల ఎత్తులకు వేగంగా పైఎత్తులు వేస్తూ ఆడాల్సిన మేధోక్రీడ చదరంగానికి పుట్టిల్లు భారతావనే. విదేశీ క్రీడాకారుల హవానే ఎక్కువ కాలం కొనసాగిన ఆ ఆటలో మన జెండాను ఎగరేసిన ఖ్యాతి విశ్వనాథుడిదే! ఆనంద్ స్ఫూర్తితో, ఆయన మార్గదర్శకత్వంలో ఆపై దేశవ్యాప్తంగా ఎంతోమంది చెస్‌లోకి అడుగుపెట్టారు. అయితే, అందులో అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉండటమే దురదృష్టకరం. మహిళలకోసం ఎక్కువగా టోర్నీలు నిర్వహించకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆసక్తి ఉన్నవారూ ఆటకు దూరం కావాల్సి వస్తోంది. ఆ మేరకు ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలిస్తే- జాతి కీర్తిని దిగంతాలకు వ్యాపింపజేసిన హంపి, హారిక, వైశాలి, దివ్య లాంటివారు ఇంకెందరో వెలుగులోకి రాగలరు. అస్తమానం పుస్తకాలే పట్టుకోవాలని పోరకుండా తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను గమనించి, వారికి నచ్చిన రంగాన్ని ఎంచుకునే స్వేచ్ఛనివ్వడం అన్నింటికన్నా ప్రధానం!

మంచి రొట్టె చెయ్యాలంటే పిండి బాగుండాలి. బంగారు కర్రతో చేసినంత మాత్రాన రొట్టె రుచి మారదు. ఏ పనికైనా ఈ సూత్రం వర్తిస్తుంది. నాణ్యతను మొదట నిర్మించాలి, తరవాత పర్యవేక్షించాలి.

– జేఆర్‌డీ టాటా



సుపర్ణతత్త్వం

శ్రీమహావిష్ణువుకు గరుత్మంతుడనే గొప్ప పక్షి వాహనమని పురాణాలు వర్ణించాయి. తిరుమల శ్రీవారి బంగారు వాకిలికి ఎదురుగా ఉండే గరుడ మందిరంలోని ఆరడుగుల శిలామూర్తిది చూడచక్కని రూపం. బ్రహ్మోత్సవాల్లో అయిదో రోజున జరిగే గరుడోత్సవం ఎంతో ప్రధానమైనది. గరుత్మంతుడికే వైనతేయుడు, సుపర్ణుడనే పేర్లు ఉన్నాయి. కశ్యప మహర్షి ద్వారా వినతకు జన్మించాడు కాబట్టి వైనతేయుడన్నారు.

గరుత్మంతుణ్ని పురాణాలు కాలపురుషుడిగా పరిగణించాయి. ఉత్తరాయణం-దక్షిణాయనం, శుక్లపక్షం- కృష్ణపక్షం, పగలు- రాత్రి.. ఇలా కాలానికి చెందిన రెండు విభాగాలను పురాణాలు ఆయన రెండు రెక్కలుగా సంకేతించాయి.

పురాణాల్లో గరుత్మంతుణ్నే వేదాలు సుపర్ణుడిగా చెప్పాయి. 'ఇంద్రం మిత్రం వరుణమగ్నిమాహు రథోదివ్యః ససుపర్ణోగరుత్మాన్..' అంటూ వేదం వర్ణించింది. ఇంద్రాది దేవతలతో సమానంగా పెద్దపీట వేసింది. ఆయన రెండు రెక్కలను జ్యోతిర్విద్య, మోక్షవిద్యలుగా సూచించింది. శాస్త్రవిద్య, బ్రహ్మవిద్యలకు వాటిని ప్రతీకలుగా చెప్పింది. ఈ వర్ణనలతో కూడిన రుగ్వేదం మొదటి మండలంలోని 'అస్య వామస్య సూక్తా'నికి ప్రత్యేకంగా 'సుపర్ణసూక్తం'గా పేరు స్థిరపడింది. దీన్నిబట్టి వేదాల్లో సుపర్ణుడికి గల ప్రాధాన్యాన్ని గ్రహించవచ్చు. పురాణాల్లోని గరుడ ఉపాఖ్యానానికి- వేదాల్లోని సుపర్ణసూక్తానికి మధ్య ప్రతీకాత్మక సమన్వయాన్ని అర్థం చేసుకుంటే 'సుపర్ణతత్త్వం' మనకు బాగా బోధపడుతుంది. ఆగమ శాస్త్ర గ్రంథాలు సుపర్ణుణ్నే ఒకవైపు ప్రాణవాయు స్వరూపుడిగా మరోవైపు వేద స్వరూపుడిగా అభివర్ణించాయి. వీటిలో మొదటి ప్రాణవాయు స్వరూపుడనేది జీవాత్మకు సంకేతం. రెండోది పరమాత్మకు ప్రతీక. వేదవేద్యుడైన శ్రీమన్నారాయణుడికి వేదస్వరూపుడైన గరుత్మంతుణ్ని వాహనంగా చెప్పడంలోని విశేషం ఏమంటే- జీవాత్మను పరమాత్మ చైతన్యం ఆవహించిందని లేదా ఆక్రమించిందని అర్థం.



అంతర్యామి

గరుత్మంతుడు కూర్చుని ఉన్నప్పుడు కుడికాలి పాదాన్ని నేలపై నిలిపి, ఎడమ కాలిని మడిచి నేలకు ఆనించి, చేతులు జోడించి నమస్కరిస్తున్న భంగిమలో ఉంటాడు. లోకప్రసిద్ధమైన ఆ భంగిమను క్రియా యోగ ముద్రగా యోగశాస్త్రం చెబుతోంది. అది జీవాత్మ పరమాత్మల అనుసంధానానికి యోగ్యమైన ముద్ర. ఆ స్థితిలో సర్వేసర్వత్రా పరమాత్మ భావన నిండిపోతుంది. కాలాలు లోకాలు.. వంటి పరిమితులు, సరిహద్దులు చెరిగిపోతాయి. కైవల్యస్థితి సిద్ధిస్తుంది. అలా పరమాత్మ స్వరూపాన్ని భావన చేసిన అన్నమయ్య దేశకాలాదులు చెరిగిపోయిన వైనాన్ని గమనించాడు. 'ఇట గరుడుని నీవు ఎక్కినను పటపట దిక్కులు బగ్గన పగిలె' అంటూ ఎలుగెత్తి గానం చేశాడు. కేవలస్థితిలో చేసిన గానమది. ఆ అనుభూతి పేరే కైవల్యం. గరుడ పంచమినాడు సుపర్ణతత్త్వాన్ని ఆవాహన చేసుకుంటే- అన్నమయ్యకు సిద్ధించిన కైవల్యస్థితి భక్తులకూ దక్కుతుంది.

– ఎర్రాప్రగడ రామకృష్ణ

ఏఐ రేసులో ఎక్కడున్నాం?

చాట్ జీపీటీ... కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సంభాషణా సాధనం. దాన్ని అమెరికా ఆవిష్కరించినప్పుడు ప్రపంచం ఔరా అంది. ఆ తర్వాత కొద్దిపాటి వ్యయంతోనే చైనా డీప్‌సీక్‌ను తీసుకొచ్చింది. అందరూ నివ్వెరపోయారు. డీప్‌సీక్ వచ్చిన పది రోజులకు ఇండియా మేల్కొంది. సొంత ఏఐ ఫౌండేషనల్ మోడల్ రూపకల్పనకు ప్రతిపాదనలను ఆహ్వానించింది. దేశంలో నిపుణులు, డేటా, మార్కెట్ అన్నీ ఉన్నా సొంత మోడల్‌ను మనమెందుకు తీసుకురాలేకపోతున్నాం?

కేవలం రెండు కోట్ల జనాభా ఉన్న మధ్యాసియా దేశం కజఖ్‌స్థాన్ మాతృభాషలో 'కజ్ఎల్ఎల్ఎం' అనే ఏఐ మోడల్‌ను నిర్మించగలిగింది. భవిష్యత్తులో దేశాల ఆర్థిక, సైనిక సత్తాకు ఏఐయే పునాది అవుతుందనే వాస్తవాన్ని సౌదీ అరేబియా, యుఏఈలు కూడా గుర్తించి తమ జాతీయాభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాయి. ఈ క్రమంలో ఏఐ రేసులో మనం వెనకంజలో ఉన్నామా అనే ఆందోళన నెలకొంటోంది. ఇండియా ఇంతకాలం పాశ్చాత్య దేశాలకు ఐటీ సేవలు అందించడంతోనే సరిపెట్టుకుంది. ఐటీ సర్వీసుల మీద పెట్టిన శ్రద్ధను, అదే ఐటీ ఉత్పత్తుల మీద పెట్టకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం అమెరికాయే ప్రపంచానికి అత్యధికంగా చిప్‌లు, సాఫ్ట్‌వేర్, డేటా, క్లౌడ్ సర్వీసులు, కృత్రిమ మేధ (ఏఐ)ను అంది స్తోంది. ట్రంప్ దుందుడుకు విధానాల వల్ల అమెరికా టెక్నాలజీ మీద అతిగా ఆధారపడటం మంచిది కాదనీ, సాంకేతికపరంగా సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవాలనీ చైనా, భారత్, ఐరోపా దేశాలు గ్రహిస్తున్నాయి. అందుకోసం డిజిటల్ పునాదులను మరింతగా విస్తరించాల్సి ఉంది. ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ ప్రజా మౌలిక వసతులను ఇండియా విస్తృతంగా నెలకొల్పింది. యూపీఐ డిజిటల్ చెల్లింపులు వెల్లువెత్తడం భారత డిజిటల్ సత్తాకు నిదర్శనం. ఈ సామర్థ్యాన్నే ఏఐ మోడల్స్ రూపకల్పనకు పునాదిగా మార్చుకోవాలి.



భాషా భేదాలతో బ్రేకులు!

చైనా మాదిరిగా భారత్, ఐరోపా దేశాలూ సొంత ఏఐ మోడల్స్‌ను రూపొందించుకోక తప్పదు. ఇండియాలో మాదిరిగా ఐరోపాలోనూ అనేక భాషలు ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న ఏఐ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎం)ను ఇంగ్లిష్ భాష ఆధారంగా సృష్టించారు. దాంతో అవి ఇతర భాషల్లో సమర్థంగా పనిచేయడం లేదు. భారతీయ భాషలపై ఎల్ఎల్ఎంలకు శిక్షణ ఇవ్వాలన్నా ఆ భాషల్లో నాణ్యమైన డేటా లభించడం లేదు. ప్రస్తుతం వెబ్ డేటా దాదాపు పూర్తిగా ఆంగ్లంలో లభ్యమవుతోంది. భారతీయ భాషల్లో ఆన్‌లైన్ కంటెంట్ ఒక శాతానికి మించదు. ఆంగ్ల డేటాతో రూపొందిన ఓపెన్ ఏఐ, డీప్‌సీక్‌లు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. భారతీయ భాషల్లోని డేటాతో రూపొందే ఏఐ ఫౌండేషనల్ మోడల్స్ స్వదేశంలో, అది కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతాయా అనే సందేహాలు కలుగుతున్నాయి. భారతీయ భాషల మధ్య లిపులు, వ్యాకరణాల్లో తేడాలు ఉన్నందువల్ల వీటిపై ఏఐ ఫౌండేషనల్ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడం కష్టంగా మారనుంది. అయినా 'సర్వం ఏఐ' హిందీ, సంబంధిత భాషల్లో 'ఓపెన్ హాథీ' అనే మోడల్‌ను వెలువరించింది. ఆంగ్లం, 22 భారతీయ భాషలకోసం 'కృత్రిమ్-2 ఏఐ' ఒక మోడల్‌ను సృష్టిస్తోంది. ఈ ప్రాజెక్టులన్నీ ఇండియా ఏఐ మిషన్‌లో అంతర్భాగాలు. ఏఐ మిషన్ తోడ్పాటుతో 'సోకెట్ ఏఐ', 'సర్వం ఏఐ', 'జ్ఞాన్ ఏఐ' వంటి స్టార్టప్‌లు భారత్‌కు అవసరమైన మోడల్స్ రూపకల్పనలో నిమగ్నమయ్యాయి.

నిపుణులకు కొదవ లేకున్నా...

సుమారు 50లక్షల మంది ఐటీ సిబ్బంది కలిగిన ఇండియాకు ఏఐ ఫౌండేషనల్ మోడల్ సృష్టి అసాధ్యమేమీ కాదు. అయినా భారత్ ఇంతవరకు వీరిని ఏఐ సృజనకు సమర్థంగా వాడుకోలేకపోయింది. 2010-22 మధ్య ప్రపంచ ఏఐ పేటెంట్లలో 60శాతం అమెరికాకు, 20శాతం చైనాకు దక్కగా, భారత్ అరశాతంకన్నా తక్కువ పేటెంట్లతో సరిపెట్టుకుంది. దేశంలో ఏఐ నిపుణులు పెద్దసంఖ్యలోనే తయారవుతున్నా, అత్యధికులు విదేశాలకు వలసపోతున్నారు. వారిని స్వదేశంలోనే నిలపగలగాలి. ఏఐ పరుగు పందెంలో భారత్ దూసుకుపోవాలంటే ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యావేత్తలు చేతులు కలపాలి. భారీ పెట్టుబడులు పెట్టాలి. అమెరికా స్టార్‌గేట్ పథకం కింద ఏఐ మౌలిక వసతుల నిర్మాణానికి 50వేల కోట్ల డాలర్లను, చైనా 13,700 కోట్ల డాలర్లనూ కేటాయించగా, నిరుడు మన దగ్గర 121 కోట్ల డాలర్లతో జాతీయ ఏఐ మిషన్‌ను ప్రారంభించారు. ఈ మిషన్ ఇటీవల ఏఐ పరిశోధనకు కీలకమైన 15,916 గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను (జీపీయూ) అదనంగా సమకూర్చింది. దీంతో మొత్తం జీపీయూలు 34,333కు చేరాయి. అవి ఏఐకి అవసరమైన కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందజేస్తాయి. అయినా మరింత శక్తిమంతమైన జీపీయూలు అవసరం. అత్యాధునిక ఏఐ హార్డ్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్ వనరులకూ కొరత ఉంది.

అగ్రగామిగా ఎదగాలంటే...

ప్రస్తుతం సుమారు 7,114 భారతీయ స్టార్టప్‌లు జనరేటివ్ ఏఐ రూపకల్పనలో నిమగ్నమయ్యాయి. అవి ఇంతవరకు 2,300 కోట్ల డాలర్ల మూలధనాన్ని సమీకరించగలిగాయి. ఇవి సముద్రంలో నీటిబొట్టంతే! 2014-2023 మధ్య అమెరికా ఏఐపై 2.34లక్షల కోట్ల డాలర్లను, చైనా 83,200 కోట్ల డాలర్లనూ పెట్టుబడిగా పెట్టాయి. కానీ, ఇండియా 14,500 కోట్ల డాలర్లతో సరిపెట్టింది. హాలీవుడ్ సినిమా గ్రావిటీకన్నా తక్కువ పెట్టుబడితో కుజగ్రహానికి మంగళ్‌యాన్ యాత్ర చేపట్టగలిగిన ఇండియా, తనకున్న పరిమిత వనరులతోనే ఏఐలో అద్భుతాలు చేయగలదు. తక్కువ ఖర్చుతో చాలా ఎక్కువ పరిశోధన ఫలితాలను సాధించగలదు. అలాగని అరకొర నిధులతో పరిశోధన-అభివృద్ధిలో దూసుకుపోలేం. 2024లో భారత్ తన జీడీపీలో ఆర్‌అండ్‌డీకి కేవలం 0.65శాతం కేటాయిస్తే, చైనా 2.68శాతాన్నీ, అమెరికా 3.5శాతాన్నీ కేటాయించాయి. అందుకే ఏఐకి బలమైన పునాది ఏర్పరచడంలో మనం వెనకబడిపోయాం. ఏఐలో భారత్ అగ్రగామిగా ఎదగాలంటే- ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసి పనిచేయాల్సిందే!

– ఏఏవీ ప్రసాద్



వాన పాఠం విన్నారా!

వాన రాకడ ప్రాణం పోకడ ఎప్పుడో చెప్పలేమని సామెత. నిజానికి పోయే ప్రాణం కన్నా ఉన్న జీవితంతోనే వానకి సాపత్యం ఎక్కువ. గాలి మేఘమై, మేఘం చినుకై నేల రాలి మట్టిని ముద్దాడుతుంది. తడిసిన మట్టి మైమరచి సువాసనలు వెదజల్లుతూ లోపల నిద్రపోతున్న గింజలను తట్టి లేపుతుంది. అవి ఒళ్లు విరుచుకుంటూ చేతులు చాపి పచ్చని ఆకులై పైకి వస్తాయి. మరో జీవితచక్రం మొదలవుతుంది.

'భూమికి ఆకాశం రాసే ప్రేమలేఖ వాన' అంటూ భావుకులు కవిత్వం చెప్పినా, 'నాకు వానలో నడవడం ఇష్టం. అప్పుడు కన్నీళ్లు కనపడవు' అని చార్లీ చాప్లిన్‌లాంటి వాళ్లు జీవిత సత్యాలు చెప్పినా... వాన ఒక్కటే! ఆకాశం నుంచి కురిసే నీటి చుక్కలే. అవి ఎక్కడ, ఎంత, ఎలా కురిశాయన్నదే జీవి మనుగడకు ముఖ్యం. కొందరికి జీవితం గాలివానలో, వాననీటిలో పడవ ప్రయాణంలాగా ఒడుదొడుకుల మయం. మరికొందరికి పడీ పడనట్లు పడుతూ ఒంటిని మృదువుగా తాకే మంచుపూల వాన. ఒక్కోసారి ఎంత ఎదురుచూసినా... వాన రాదు. నిరుద్యోగులకు ఉద్యోగంలా, బ్రహ్మచారులకు పెళ్లి వార్తలా ఎదురుచూడగా చూడగా వచ్చే వాన జీవితం పట్ల ఆశనీ ప్రేమనీ నింపుతుంది. ఒక్కోసారి ఉరుములేని పిడుగులా మబ్బుల్లేకుండానూ వాన ముంచెత్తుతుంది. లాభం కన్నా నష్టం ఎక్కువ కలిగించే ఆ వానని ముదనష్టపు సిరిలా వచ్చిపడింది పాడువాన అనుకుంటారు రైతులు. అవినీతి మార్గంలో వచ్చే సంపద లాగే కాలం కాని కాలంలో వచ్చే వాన ఎందుకూ ఉపయోగపడదు. వాన కొందరికి విలాసం. వెచ్చగా ఇంట్లో కూర్చుని కాఫీ తాగుతూ కురుస్తున్న వానను కిటికీలోంచి చూడటం బాగుంటుంది. వాన కొందరికి విషాదం. కురిసే పైకప్పు, కూలడానికి సిద్ధంగా ఉన్న గోడలు... క్షణ క్షణం భయం భయంగా ఉంటుంది. కానీ వాన అసలు చిరునామా వికాసమే కదా?!

నేర్చుకునేవాళ్లు ఉండాలే కానీ వాన చాలా పాఠాలు నేర్పుతుంది. ఎంత పెద్ద ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలైనట్లు కుంభవృష్టి కూడా ఒక్క చినుకుతోనే మొదలవుతుంది. చినుకే కదా అనుకోకుండా జాగ్రత్తపడమని హెచ్చరిస్తుంది. ఏ కష్టం వచ్చినా జరిగిందంతా మర్చిపోయి జీవితాన్ని కొత్తగా మొదలెట్టమంటారు. దానికి వానని మించిన ఉదాహరణేముంటుంది? తుపాను, గాలివాన, కుంభవృష్టి... అలా ఓ చూపు చూసి వెళ్లాక మిగిలేదంతా.. బురదే. ఏం చేస్తాం? శుభ్రంచేసుకుని మళ్లీ కొత్త సంసారం మొదలెడతాం. 'వర్షం కురిసేటప్పుడు అందరి దృష్టీ దానిమీదే ఉంటుంది. అందుకే మనమూ వానలాగా ఉండాలి' అని వ్యక్తిత్వ వికాస నిపుణులు పాఠాలు చెబుతారు. వానలాగా ఎలా ఉంటాం? వాన రేపటి మీద ఆశలు రేపుతుంది, ప్రాణాలు నిలుపుతుంది. మన ఉనికి కూడా అలా ఉండాలని దానర్థం. వర్షం వచ్చేటప్పుడు మనం చేయగలిగిన బెస్ట్ థింగ్.. దాన్ని పడనీయడమే అంటాడో కవి. జీవితమూ అంతే... దాన్ని సాగిపోనివ్వాలి!

– విస్మయ



లెక్క మారింది!

చాలా కాలంగా భారత తీరరేఖ పొడవును 7,516.60 కి.మీ.గా చెబుతున్నారు. సవరించిన గణన ప్రకారం అది 11,098.81 కిలోమీటర్లు. కాలిక్యులేషన్ మెథడాలజీలో మార్పు కారణంగా తీరం పొడవులో సవరణలు చోటుచేసుకున్నట్లు ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వశాఖ రవాణా పరిశోధన విభాగం ఇటీవల పేర్కొంది. ఆధునిక జీఐఎస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి తీర ప్రాంత పొడవును తాజాగా గణించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి దీనిపై అవగాహన ఉండటం తప్పనిసరి.

రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	తీరరేఖ పొడవు (కి.మీ.)
గుజరాత్	2,340.62
మహారాష్ట్ర	877.97
గోవా	193.95
కర్ణాటక	343.30
కేరళ	600.15
తమిళనాడు	1,068.69
ఆంధ్రప్రదేశ్	1,053.07
ఒడిశా	574.71
పశ్చిమ్‌బెంగాల్	721.02
దమణ్, దీవ్	54.38
పుదుచ్చేరి	42.65
లక్షద్వీప్ దీవులు	144.80
అండమాన్, నికోబార్ దీవులు	3,083.50

(ఆధారం- ఓడరేవులు, నౌక, జలమార్గాల మంత్రిత్వశాఖ రవాణా పరిశోధన విభాగం సర్క్యులర్)

వ్యసనాల నుంచి వికాసం వైపు...

దేశంలో మత్తుకు బానిసలయ్యే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అడుగడుగునా మద్యం, మత్తు మందులు దొరికే మన దేశంలో ఈ వ్యసనాల నుంచి విముక్తి కల్పించే డీఅడిక్షన్ కేంద్రాలు సరిపడా లేకపోవడం దురదృష్టకరం. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దేశవ్యాప్తంగా పట్టణాల్లో వ్యసన విముక్తి కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిని వికాస కేంద్రాలుగా తీర్చిదిద్దితేనే మన యువత భవితను కాపాడుకోగలం.

మన దేశంలో ప్రతి ఏటా మద్యం అమ్మకాల విలువ రూ.4.6-5.3 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. రోజురోజుకీ మద్యం ద్వారా భారీగా నిధులు సమకూరుతున్నా, డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు మాత్రం ప్రభుత్వాలు సుముఖత చూపడంలేదు. ఉన్నవాటి పనితీరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఫలితంగా మద్యం, ఇతర మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు కోల్పోతున్న యువత సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇటీవల తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో పలు మెడికల్ షాపుల్లో దొంగతనాలు జరిగాయి. ఆ దుకాణాల్లో డబ్బులు, ఖరీదైన మందులు పోలేదు కానీ కొన్ని ఇంజెక్షన్లు మాత్రం చోరీకి గురయ్యాయి. విషయంపై ఆరా తీయగా కొందరు యువకులు మత్తు కోసం వాటిని వినియోగిస్తున్నారని తేలింది. అంతకు కొన్నిరోజుల ముందు వైద్యుల ప్రిస్క్రిప్షన్లు నకిలీవి సృష్టించి మత్తు ఇంజెక్షన్లు కొనుగోలు చేసిన ఉదంతాలు బయటపడ్డాయి. మారుమూల ఏజెన్సీల నుంచి నగరాల వరకు గంజాయి విస్తృతంగా వ్యాపించింది. కాలేజీ యువతా వీటికి బానిసలుగా మారుతున్నారు. క్రమంగా కొందరు అనారోగ్యాల బారినపడి కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. మరికొందరేమో విచక్షణ కోల్పోయి దొంగతనాలు, హత్యలు వంటి దారుణాలకు ఒడిగడుతున్నారు.



అరకొర కేంద్రాలు

డీఅడిక్షన్ సెంటర్లు బాధితులకు పరీక్షలు చేసి.. వాళ్లలో ఉన్న ట్రామా, ఆందోళన, కుంగుబాటు తగ్గేలా చికిత్స చేయాలి. మళ్లీ మత్తు బారిన పడకుండా ఉండేలా మానసికంగా శారీరకంగా సిద్ధం చేయాలి. కానీ ఈ ప్రక్రియ అంతంత మాత్రంగానే అమలవుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో 31, బిహార్‌లో 25, మధ్యప్రదేశ్ 23, గుజరాత్ 22, అరుణాచల్‌ప్రదేశ్ 21, ఉత్తర్‌ప్రదేశ్ 18, ఝార్ఖండ్ 16, పంజాబ్ 16, అసోంలో 10 జిల్లాల్లో... ఇలా దేశవ్యాప్తంగా మొత్తం 291 గ్యాప్ జిల్లాలు(ప్రస్తుతం డీఅడిక్షన్ సెంటర్ల సదుపాయాలు లేని జిల్లాలు) ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానించింది. తెలంగాణలో 16 డీఅడిక్షన్ కేంద్రాలు ఉండగా అందులో కేవలం 11 మాత్రమే మెరుగ్గా పనిచేస్తున్నాయని ఇటీవల రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నివేదించింది. దేశవ్యాప్తంగా 340 ఇంటిగ్రేటెడ్ రిహాబిలిటేషన్ సెంటర్లు(ఐఆర్‌సీఏ) ఉన్నా... అవన్నీ ఎక్కువ శాతం నగరాలకే పరిమితమయ్యాయి. పట్టణాల్లో అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ మధ్య కొన్నిచోట్ల ఎలాంటి అనుమతులు, సరైన నిపుణులు లేకుండానే ప్రైవేటు డీ అడిక్షన్ సెంటర్లు వెలుస్తున్నాయి. అవి మెదడును కాస్త రిలాక్స్ చేసి నిద్రపుచ్చే సెడెటివ్స్‌ను అధిక మోతాదులో ఇస్తూ బాధితుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. డబ్బు దండుకోవడమే వాటి నిర్వాహకుల లక్ష్యంగా మారిపోయింది. ఈ ప్రైవేటు కేంద్రాల్లో చికిత్స తీసుకున్న వారిలో ఎలాంటి మార్పు ఉండటంలేదు. తిరిగి మళ్లీ మత్తుకు బానిసలవుతున్నారు.

జాతి మనుగడకు ముప్పు...

డీ అడిక్షన్ సెంటర్లు బాధితులకు వికాస కేంద్రాలుగా ఉండాలి. అప్పుడే వారి మనసు చికిత్స మీద లగ్నమవుతుంది. జిల్లా కేంద్రాలతో పాటు చిన్న పట్టణాల్లోనూ ప్రభుత్వం ఈ సెంటర్లు ఏర్పాటు చేయాలి. మానసిక నిపుణులను నియమించి, నాణ్యమైన సేవలు అందించాలి. మందులు, ఆహార కొరత లేకుండా చూడాలి. మైనర్ల కోసం ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. జైళ్లలోనూ ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. ప్రతి ఆసుపత్రిలో ఇలాంటి కేంద్రాలు ఉండేలా చూడాలి. చికిత్స అనంతరం యోగా, సంగీతం వంటి ఇతర వ్యాపకాల మీదకు మనసు మరలేలా చేయాలి. గతంలో మత్తు వ్యసనం నుంచి బయటపడిన వారితో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయించాలి. అప్పుడే డీ అడిక్షన్ కేంద్రాలు నిజమైన వికాస కేంద్రాలుగా మారతాయి. ప్రజలకు వీటి మీద విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దాంతోపాటుగా నకిలీ, ప్రైవేటు డీ అడిక్షన్ కేంద్రాల మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. యువతను మత్తు వ్యసనం నుంచి కాపాడుకోకపోతే జాతి మనుగడకు ముప్పు తప్పదని అందరూ గుర్తించాలి.

– బండారి సాయికుమార్

'మైండ్ బ్లోయింగ్'!

హాయ్ ఫ్రెండ్స్..! మూడు రోజుల క్రితం సైన్సు టీచర్ ఏ పాఠం చెప్పారూ.. అని ఎవరైనా అడిగితే తెల్లమొహం వేస్తాం. అతి కష్టమ్మీద గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. కానీ ఈ నేస్తం అయితే ఏం చెప్పినా ఇట్టే గుర్తుపెట్టుకుని అందరూ ఆశ్చర్యపోయేలా చేస్తోంది.

ఒడిశాలోని జయపురానికి చెందిన ఆరాధ్యకు ఆరేళ్లు. తండ్రి అజయ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగి.. తల్లి సుమిత్ర గృహిణి. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా బాపడుపాలెంలో ఉంటున్నారు. ఆరాధ్య అక్కడే ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. తను చిన్నప్పటి నుంచే చాలా చురుగ్గా ఉండేదట. అలాగే జ్ఞాపకశక్తి చాలా ఎక్కువట. ఏ అంశాన్నైనా ఇట్టే గుర్తు పెట్టేసుకుంటుంది. అది గమనించిన వాళ్ల ఉపాధ్యాయుడు గంగాధర్.. చిన్నారికి 'మైండ్ మ్యాపింగ్'లో శిక్షణ ఇచ్చారు. అది కూడా చాలా తక్కువ సమయంలోనే నేర్చేసుకుంది. ఆంగ్ల అక్షరాలతో ఉన్న కార్డులను జంబ్లింగ్ విధానంలో ఒక టేబుల్ మీద ఉంచారు. వాటిని కొన్ని సెకన్లు మాత్రమే చూసిన ఆ చిన్నారి, ఏ నుంచి జడ్ వరకు వరస క్రమంలో అక్షరాల కార్డులను తీసింది. అలాగే.. 1-20 వరకు అంకెలనూ గుర్తించింది. దీనికి సంబంధించిన వీడియోను ఉపాధ్యాయుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అది చూసిన ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్.. 'మైండ్ మ్యాపింగ్.. మైండ్ బ్లోయింగ్' అంటూ చిన్నారిని అభినందించారు. ఆరాధ్య తన జ్ఞాపకశక్తిని ఇంకా పదును పెట్టుకుని మరిన్ని విజయాలు అందుకోవాలని ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా!

హాయ్! బుజ్జీ!!



– మజ్జి వెంకటేష్

అక్కడా.. ఇక్కడా..!

ఇక్కడ కొన్ని వాక్యాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి గడుల్లో వచ్చిన పదమే తరవాతి వాటిల్లోనూ సరిపోతుంది. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

1. ▢▢ ఏ ఆకారంలో ఉంటుందని ▢▢ జ అడుగుతోంది.
2. అక్కడ పెట్టిన పళ్లెంలోని ఆ ▢▢ మొత్తం తింటే బంగారు ▢▢ బహుమతిగా ఇస్తారట.
3. ▢▢ జావ తాగాలంటే ▢▢ చెంబు మాత్రమే వాడాలా?

జవాబులు: 1.భూమి 2.పళ్లు 3.రాగి



దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు ఈ సంవత్సరం కాత్యాయనిదేవి అలంకారం చేస్తామని ఆలయ ఈవో శీనానాయక్ తెలిపారు. సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించనున్న విశ్వావసు నామ సంవత్సర దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈవో మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన త్వరలో జరగనున్న సమన్వయ సమావేశంలో ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. మూలా నక్షత్రం రోజున సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. విజయదశమి రోజున ఉదయం మహాపూర్ణాహుతి, సాయంత్రం ఆదిదంపతుల జలవిహారం(తెప్పోత్సవం) భక్తుల సమక్షంలో నిర్వహిస్తామని వివరించారు. స్థానాచార్య శివప్రసాద శర్మ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వేదపండితులు ఆంజనేయ ఘనాపాఠి, వీఎస్ మహర్షి ఘనాపాఠి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, వేదపండితులు ఆంజనేయ ఘనాపాఠి

సెప్టెంబరు 22 బాలా త్రిపురసుందరీదేవి
23 గాయత్రీదేవి
24 అన్నపూర్ణాదేవి
25 కాత్యాయనిదేవి
26 మహాలక్ష్మి
27 లలితా త్రిపురసుందరీ
28 మహాచండీదేవి
29 సరస్వతీదేవి
30 దుర్గాదేవి
అక్టోబరు 1 మహిషాసురమర్దిని
2 శ్రీరాజరాజేశ్వరి

ఈనాడు అమరావతి ఎన్టీఆర్
మంగళవారం జులై 29, 2025

ఆత్మలకు ఉపాధి.. అక్రమాలకు హామీ!

★ గంపలగూడెం మండలం 24 పంచాయతీల్లో దాదాపు 100 మందికిపైగా చనిపోయిన వారు పని చేస్తున్నట్లు చూపించారు. వీరు తాజాగా చనిపోయిన వారు కాదు. ఏడాది నుంచి మూడేళ్ల వ్యవధిలో మృతి చెందినా ఇప్పటికీ జాబితాలో ఉన్నారు. వారి పేరుతో వైకాపా పాలనలో రూ.లక్షల్లో వేతనాలు చెల్లించారు.

★ కుటుంబానికి ఒక జాబు కార్డు, ఆ కార్డుకు 100 రోజులు పని చూపిస్తారు. ఇక్కడ చాలా కుటుంబాల్లో రెండు, మూడు కార్డులు ఇచ్చేశారు. పని దినాలు పెంచి భారీగా దోచేశారు. ఒకటి కంటే ఎక్కువ కార్డులున్న కుటుంబాలు మండలంలో 500పైగా ఉన్నాయంటే దోపిడీని అంచనా వేయవచ్చు. ఒక్కో అదనపు కార్డుకు వంద రోజులు పని చేసినట్లు చూపించి అడ్డంగా దోచేశారు. అదనపు కార్డులు ఇచ్చినందుకు శ్రామికుల నుంచి కమీషన్లు వసూలు చేశారు.

★ ఒకే పనిని ఇద్దరు ముగ్గురు క్షేత్ర సహాయకులు చేయించినట్లు చూపించడం.. రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు చేసుకున్న పని విస్తీర్ణానికి.. క్షేత్రంలో చేసిన పనికి పొంతన లేకపోవడం, అసలు పని చేయకుండానే గతంలో చేసిన పనులు చూపి బిల్లులు చేయడం వంటి అక్రమాలు భారీగా జరిగాయి. రూ.3 కోట్లకు పైగా నొక్కేశారు. ఇదంతా క్షేత్ర సహాయకులు, స్థానిక అధికారులు, మండల నాయకులు కుమ్మక్కై చేశారు.

రూ. 3 కోట్లు కొల్లగొట్టిన వైకాపా నేతలు

ఈనాడు, అమరావతి



వైకాపా పాలనలో గంపలగూడెం మండలంలో ఉపాధి పనుల్లో గూడుపుఠాణి జరిగింది. మృతులకు హాజరు వేసి జీతాలు ఇచ్చేశారు. బినామీ, బోగస్ కూలీలతో పనులు చేయించేశారు. పని చేయకుండానే చేసినట్లు చూపించేశారు. అనధికారిక ప్రాంతాల్లో పని చేయించేశారు. ఇలా ఒకటా రెండా లెక్కకు మించిన అక్రమాలతో రూ.3 కోట్లు గోల్‌మాల్ చేశారు.

ఇష్టారాజ్యం: మండలంలో 2024-25 ఏడాదికి రూ.22.86 కోట్ల పనులు చేశారు. అంటే దాదాపు పంచాయతీకి రూ.కోటి మేర కేటాయించారు. ప్రతి పంచాయతీలో అవకతవకలున్నా.. లింగాల, ఊటుకూరు, సత్యాలపాడు, రాజవరం, గాదెవారిగూడెం, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లో భారీగా అక్రమాలు జరిగాయి. గతేడాది ఎన్నికల నేపథ్యం కావడంతో ప్రభుత్వం మారితే దోపిడీకి సాధ్యం కాదని క్షేత్రసహాయకులు, నాయకులు కలిసి మార్చిలోపే 90 శాతం పనులు పూర్తి చేశారు. కొన్నిచోట్ల అసలు ఉపాధి హామీకి సంబంధం లేని పంచాయతీల్లో పారిశుధ్యం, డ్రెయినేజీల నిర్వహణ, చెట్లు నరకడం, కార్యాలయాలు శుభ్రం చేయడం వంటి పనులు ఉపాధి శ్రామికులతో చేయించారు. అటు ఉపాధి హామీలో, పంచాయతీలో రెండుచోట్ల బిల్లులు పెట్టుకున్నారు. పదుల సంఖ్యలో ఉద్యోగులకు జాబ్‌కార్డులు ఇచ్చి వారు పని చేయకుండానే చేసినట్లు చూపి స్వాహా చేశారు. కార్డున్న వారి తరపున బినామీలతో పని చేయించారు. కొన్నిచోట్ల వైకాపా నేతలు, అధికారుల తోటల్లో, ఇళ్లల్లో కూడా కూలీలతో పనులు చేయించారు. వైకాపా నాయకుల అండతో అధికారులు అక్రమాల వైపు కన్నెత్తి చూడలేదు.

శుభ.. సంకల్పం

❖ బెజవాడ మెట్రోకు టెండర్ల ఆహ్వానం..
❖ తొలిదశలో రెండు కారిడార్లుగా పనులు

"విజయవాడ నగర ప్రజారవాణాలో కీలకమైన మెట్రోకు ముందడుగు పడింది. ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఆర్‌సీఎల్) సోమవారం టెండర్లు పిలిచింది. మొత్తం వ్యయంలో 40 శాతం వెచ్చించి తొలుత పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.4,150 కోట్లతో బిడ్లు ఆహ్వానించారు."

"30 నెలల్లో ప్రాజెక్టు పనులు, 24 నెలల్లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి. సీఎంపీ తయారీకి సిస్ట్రా.. 443.43 చదరపు కి.మీ. పరిధిలోని 2.3 మిలియన్ల జనాభా ఉండే ప్రాంతాల్లో అధ్యయనం చేసింది. విజయవాడ, గన్నవరం, రాజధాని నగరం, మంగళగిరిలో అధ్యయనం చేపట్టారు. ట్రాఫిక్ విశ్లేషణకు 179 జోన్లుగా విభజించారు. మెట్రో రైలుకు నగరం అనుకూలమని తేలింది."

ఈనాడు, అమరావతి



మెట్రో రైలు ప్రాజెక్టు తొలిదశలో రెండు కారిడార్లలో నిర్మించనున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఒకటి, పెనమలూరు నుంచి పీఎన్‌బీఎస్ వరకు మరొకటి రానున్నాయి. 38.40 కి.మీ. నిడివితో ఈ రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లు ప్రతిపాదించారు. వీటిలో గన్నవరం విమానాశ్రయం వద్ద ఒక స్టేషన్ భూగర్భంలో రానుంది. స్టేషన్ల వద్ద నగరంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లేలా సిటీ బస్సు సర్వీసులు నడపనున్నారు. గన్నవరం విమానాశ్రయం, విజయవాడ రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌లతో అనుసంధానంతో ప్రయాణికులకు మేలు కలగనుంది.

డబుల్ డెక్కర్ పైవంతెన...

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై రద్దీ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి డీపీఆర్ తయారు చేయిస్తున్నారు. నగర రద్దీని తట్టుకునేలా మహానాడు కూడలి నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారుల సంస్థతో కలిసి మెట్రో రైలు కార్పొరేషన్ భారీ పైవంతెనను నిర్మించనుంది. 4.33 కి.మీ. పొడవున నాలుగు వరుసలతో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మిస్తారు. కింద వాహనాలు వెళ్తాయి. పైన మెట్రో రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఇందుకయ్యే వ్యయాన్ని ఎన్‌హెచ్‌ఏఐ, ఏపీఎంఆర్‌సీఎల్ భరించనున్నాయి.

తొలుత రెండు బోగీలు...

ప్రతి రైలు రెండు బోగీలతో నడపనున్నారు. రెండు బోగీల్లో దాదాపు 500 మంది వరకు ప్రయాణించే వీలుంది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నడవనున్నాయి. రద్దీ ఉంటే ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నడపనున్నారు. ఉదయం 9 నుంచి 11, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. సెలవు రోజులు, ఆదివారాలు డిమాండ్ తక్కువగా ఉంటే సర్వీసులను కుదిస్తారు. ప్రారంభంలో రోజుకు 5 లక్షల మంది ప్రయాణించే వీలుందనీ.. 2055 నాటికి ఈ సంఖ్య 12-15 లక్షలకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ఐఆర్‌సీటీసీ పంచ జ్యోతిర్లింగ దర్శన యాత్ర

రైల్వేస్టేషన్: పంచ జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ప్రత్యేక ప్యాకేజీతో సికింద్రాబాద్ నుంచి భారత గౌరవ్ టూరిస్ట్ రైలును నడుపుతున్నట్లు విజయవాడ ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ అధికారులు తెలిపారు. ఆగస్టు 16 నుంచి 24 వరకు రైలు సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా నాగపూర్, ఉజ్జయిన్, భీమ్ జన్మభూమి, నాసిక్, పుణె, ఔరంగాబాద్ తదితర ప్రాంతాలను సందర్శించనుందని పేర్కొన్నారు. టీ, టిఫిన్, భోజనం, హోటల్ గదులు, రవాణాతో కలిపి టికెట్ ధర ఒక్కొక్కరికి స్లీపర్‌లో రూ.14,700, థర్డ్ ఏసీలో 22,900, సెకండ్ ఏసీలో 29,900 ఉంటుందని తెలిపారు. టికెట్ల బుకింగ్ ఇతర వివరాలకు 9281495848 నంబరును సంప్రదించాలన్నారు.

సంగమం దారి.. చక్కదిద్దితే సరి!



రహదారి మధ్యలో చీలికలు...



ఇబ్రహీంపట్నం నుంచి పవిత్ర సంగమం ఘాట్‌కు వెళ్లే మార్గం దుస్థితి

ఇబ్రహీంపట్నం వద్ద పవిత్ర సంగమం ప్రాంతం ఎంతో ప్రశాంతంగా... సాయంత్రం వేళల్లో సేద తీరేందుకు ఆహ్లాదంగా ఉంటుంది. ఈ చుట్టుపక్కల వారే కాక... జాతీయ రహదారిపై ప్రయాణించే వారూ ఇక్కడకు వస్తుంటారు. అయితే ఇబ్రహీంపట్నం నుంచి పవిత్ర సంగమానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారి చాలా చోట్ల చీలికలు ఏర్పడింది. కొన్నిచోట్ల తారు లేచి కంకర మాత్రమే మిగిలింది. ఇక రక్షణ కోసం వేసిన ఇనుప కంచె కూడా చాలాచోట్ల ధ్వంసమైంది. రహదారి ప్రారంభంలో చెత్తకుప్పలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. - ఈనాడు, అమరావతి

బ్యారేజీలో పూడిక తొలగింపునకు టెండర్ కమిటీ

ఈనాడు, అమరావతి: ప్రకాశం బ్యారేజీలో ఇసుక పూడికలు తొలగించి రాజధాని అమరావతి నిర్మాణ పనుల కోసం వినియోగించేందుకు ప్రభుత్వం సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఛైర్మన్‌గా, చీఫ్ ఇంజినీర్‌ను కన్వీనర్‌గా టెండర్ కమిటీ ఏర్పాటు చేసింది. వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన మరో పది మంది అధికారులను సభ్యులుగా నియమించింది. ప్రకాశం బ్యారేజీ పరిధిలో గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇసుక పూడిక తొలగింపునకు సంబంధించిన పనులు టెండర్ కమిటీ పరిధిలోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గేట్ల మూసివేత ...

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో వరద ప్రవాహం తగ్గడంతో నగరంలోని ప్రకాశం బ్యారేజీ గేట్లను సోమవారం రాత్రి 10 గంటలకు మూసివేశారు. కాల్వలకు నీటి విడుదల పెంచారు. కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు 10,625 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 7,119, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 3,506 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 3,003, బందరు 1,412, ఏలూరు 1,404, కేఈబీ కాలువకు 1,300 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

సుజలాం.. సుఫలాం!



"సురక్షిత నీటిని సమర్థంగా సరఫరా చేస్తూ విజయవాడ నగరం.. ప్రధాని మోదీని ఆకర్షించింది. ప్రజలకు తాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్న అంశాన్ని తాజాగా "మన్ కీ బాత్"లో ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించడం దేశంలోనే నగరానికి ఒక్కసారిగా గుర్తింపు దక్కింది. తాగునీటి సరఫరాలో అనుసరిస్తున్న విధానం, తీసుకుంటున్న సమర్థ చర్యలు ఆయన్ను ఆకట్టుకున్నాయి."

నగరంలో సకల జనులకూ మంచినీరు..
నీటి నిర్వహణ, సమర్థతకు ప్రధాని ప్రశంస

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగర ప్రజలకు నిత్యం సరిపడా నీటిని సరఫరా చేయగలిగితేనే వారి మన్ననలు దక్కుతాయి. అందునా రక్షిత నీటిని 2 పూటలూ అందించడం సాధారణం కాదు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ నిత్యం నీరు సరఫరా కావడంలేదు. భిన్నంగా ఇక్కడి ప్రజలకు రెండు పర్యాయాలు నీరిస్తున్నారు.

అత్యధిక నీటి ప్లాంట్లు..: విద్యాధరపురం హెడ్‌వాటర్ వర్క్సులో 45 మిలియన్ గ్యాలన్ల సామర్థ్య నీటి ప్లాంట్లు ఉన్నాయి. ముడినీటిని ఇన్‌టెక్ వెల్స్ ద్వారా సేకరించి వివిధ ఎంజీడీ ప్లాంట్ల ద్వారా భవానీపురం, పాతబస్తీ, సింగ్‌నగర్, కృష్ణలంక, గవర్నరుపేట, గాంధీనగర్ ప్రాంతాలకు అందిస్తున్నారు. రామలింగేశ్వర నగర్ 10 ఎంజీడీ ప్లాంటు, గంగిరెద్దుల దిబ్బ 47 ఎంఎల్‌డీ ప్లాంటు ద్వారా తూర్పు ప్రాంతాలకు అందిస్తున్నారు.

గణాంకాలు (లక్షల్లో)	
ఆవాసాలు	2.17
కుటుంబాలు	3.13
జనాభా	13.40
కొళాయిలు	1.29
ఒకరికి సగటున	150 లీటర్లు
వ్యయం	రూ. 67 కోట్లు

పాలిక నీరే సురక్షితం..: ప్రైవేటు నీటి ప్లాంట్లు, డబ్బా నీరు కన్నా... నగరపాలిక నీరే సురక్షితమని పరీక్షల్లో తేలింది. 196 మిలియన్ లీటర్ల శుద్ధి నీటిని 98 కిలోమీటర్ల పంపింగ్ మెయిన్ల ద్వారా 72 రిజర్వాయర్లకు పంపి.. 1,050 కిమీ పంపింగ్ నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. నీటి కలుషితం గుర్తించేలా రోజుకు 500-700 నమూనా పరీక్షిస్తున్నారు. విద్యాధరపురం హెడ్‌వాటర్ వర్క్సు పరీక్షా కేంద్రంలో రసాయనాలు, బ్యాక్టీరియా, క్లోరిన్ పరీక్షలు చేశాకే నీరిస్తారు.



హెడ్ వాటర్ వర్క్సు నీటి ప్యూరిఫైయర్

అనేక అంశాలు...

❖ నగరంలో ఉదయం గంట, సాయంత్రం 2 గంటలు నీటిసరఫరా ❖ నీటిలో టర్బిడిటీ, పీహెచ్, కండక్టివిటీ, టీడీఎస్ గుర్తించేలా ప్రత్యేక పరీక్షలు ❖ ఫిల్టరుబెడ్లు రోజుకు రెండుసార్లు శుభ్రం ❖ నీటి సరఫరా ఆడిటింగ్‌కు స్కాడా విధానం ❖ 15 రోజులకు ఒకసారి రిజర్వాయర్లు శుభ్రం ❖ పైపులు, వాల్వుల తరచూ మరమ్మతులు

మురికి ఎక్కువే అయినా..: కృష్ణా నదిలోకి గోదావరి నీరు, క్యాచ్‌మెంట్ ప్రాంతాల నీరు కలవడంతో మట్టి, మురికి ఎక్కువే. వానాకాలంలో 100-300 శాతం ఉంటుంది. దానిని 25 శాతానికి తగ్గించేలా.. సాధారణ రోజుల్లో 4-5 టన్నుల ఆలం (పటిక), వానాకాలంలో 6-8 టన్నులు వాడుతున్నారు. తద్వారా మలినాలు, మట్టి, వ్యర్థాలు, మురికి బాగా తగ్గుతుంది. ఆపై ఫిల్టరుబెడ్లకు పంపి, శుద్ధితోపాటు.. క్లోరినేట్ చేసి తాగేందుకు వదులుతారు. ఈ ప్రక్రియ సమర్థ నిర్వహణే కుళాయి నీరు ప్రజలు నేరుగా తాగేందుకు దోహదమైంది.

శివారు.. కొండ ప్రాంతాలు..: నగరంలో 16 డివిజన్లు కొండ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ 65,500 ఇళ్లు... 2.60 లక్షల జనాభా ఉన్నారు. పలు రిజర్వాయర్లు, 42 బూస్టర్ల ద్వారా కొండలపైకి నీటిని పంపుతున్నారు. మురికివాడల్లో 58 వేల ఇళ్లు... 2.32 లక్షల మంది ఉన్నారు. వీరికి వ్యక్తిగత కుళాయిల ద్వారా, శివారుకు ట్యాంకర్లతో అందిస్తున్నారు.

జగన్ వల్లే సింగపూర్ పారిశ్రామికవేత్తలు వెనక్కి

ఆర్థిక మంత్రి పయ్యావుల

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసానికి జగన్‌మోహన్‌రెడ్డే కారణమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ అవమానించడం వల్లే సింగపూర్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లిపోయారని, తిరిగి రావాలంటేనే భయపడుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లి ఉదయం 8 నుంచి రాత్రి పదిన్నర గంటల వరకు పెట్టుబడులు సాధనే లక్ష్యంగా కష్టపడుతున్నారని పేర్కొన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, అప్పు తెచ్చిన డబ్బు ఏమైపోయిందని ట్వీట్లు పెడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు.. గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడానికే సరిపోతున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రూ.పది లక్షల కోట్లు అప్పులు చేశారని, జగన్ దిగిపోతూ రూ.1.14 లక్షల కోట్లు ఉద్యోగులు, పింఛనుదారులు, గుత్తేదారులు, ఇతరులకు బకాయి పెట్టారని గుర్తు చేశారు. వాటిని దశలవారీగా చెల్లిస్తున్నామని చెప్పారు. గుత్తేదారుల బకాయిలను వెంటనే చెల్లిస్తామని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో కేంద్రానికి రాష్ట్రం వాటా చెల్లించకపోవడం వల్ల 95 కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆగిపోయాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.12 వేల కోట్లు చెల్లించి కేంద్రం నుంచి ఇప్పటి వరకు 60 గ్రాంట్లు తీసుకొచ్చామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి కేశవ్, వేదికపై విప్ సౌమ్య తదితరులు

యూపిక్స్ కుంభకోణం.. త్వరలో కీలక అరెస్టులు!

ఈనాడు, అమరావతి: విజయవాడ కేంద్రంగా సినిమాలకు యాని మేషన్ పేరుతో జరిగిన కుంభకోణంలో దర్యాప్తు చివరి దశకు చేరుకుంది. పోలీసులు కీలక వ్యక్తుల అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో అరెస్టులు ఉండే వీలుంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో యూపిక్స్ సంస్థ నిర్వాహకుడు కిరణ్.. రూ.400 కోట్ల మేర వసూలు చేశాడు. ఇందులో వ్యాపారులు, సామాన్యులు, ఉద్యోగులు పెట్టుబడి పెట్టి మోసపోయిన వారి జాబితాలో ఉన్నారు. విజయవాడకు చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మి కిరణ్ 2015లో యూపిక్స్ (గ్రూప్) పేరుతో విజయవాడలోని బందరు రోడ్డులో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సంస్థలో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఇస్తామని ఆశ చూపాడు. భారీగా ప్రచారం చేసుకున్నాడు. తర్వాత కార్యాలయాన్ని సత్యనారాయణపురానికి మార్చాడు.

ఒక్క వ్యక్తికే రూ. 75 కోట్లు...

ఈ కేసులో కూడా పలువురు ఎక్కువగా లబ్ధి పొందినట్లు తేలింది. 153 మంది రూ.120 కోట్ల మేర ప్రయోజనం పొందారు. 196 మంది రూ.195 కోట్ల మేర నష్టపోయారు. రూ.75 కోట్ల మేర ఏజెంట్లకు కమీషన్ ముట్టజెప్పడం ద్వారా నిందితుడు సొమ్మును దారి మళ్లించాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఒక వ్యక్తికే ఆయాచిత లబ్ధి కలిగింది. అతని బ్యాంకు ఖాతాలను పరిశీలించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. వీటిని ఆమూలాగ్రం విశ్లేషణ చేశారు. ఆ ఖాతాల నుంచి అతని బంధువులు, ఇంకా పలువురికి నగదు బదిలీ అయింది. అదనంగా జమ అయిన ఈ సొమ్మును రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అదనంగా తీసుకున్న డబ్బును వెనక్కి ఇవ్వని నరసరావుపేటకు చెందిన ఐదుగురిని తొలుత.. పోలీసులు అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో రెవెన్యూ శాఖ పరమైన కార్యకలాపాలు ఆశించినంతగా లేవు, గ్రాఫ్ పడిపోతోంది.. శాఖకు చెడ్డ పేరు తెచ్చేలా ఉందని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు దృష్టిలోనూ ఈ అంశం ఉందని ప్రస్తావించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. వీఆర్వోల వ్యవహారశైలి బాగోలేదన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో 1.30 ఎకరాల పొలానికి పట్టాదారు పాసు పుస్తకం కోసం ఏడాది నుంచి తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ దృష్టికి సోమవారం వచ్చింది. దీంతో ఆయన ఒక్కసారిగా ఆగ్రహించారు. వెంటనే జూమ్ కాన్ఫరెన్స్‌లో ఇబ్రహీంపట్నం మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే జేసీ ఇలక్కియా

శాఖకు చెడ్డపేరు వస్తోందని మండిపాటు

మీకు చేతకాకుంటే మాకు పంపండి, మేము ఇక్కడ చూస్తాం. ఎండార్స్‌మెంట్లు ఇస్తూ చేతులు దులిపేసుకుంటే ఎలా అని నిలదీశారు. షోకాజ్ నోటీసు జారీ చేయాలని జేసీ ఎస్.ఇలక్కియాకు సూచించారు. సస్పెండ్ చేయడానికీ వెనుకాడే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

పీజీఆర్ఎస్‌లో 192 అర్జీల స్వీకరణ

నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 192 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 60 వినతులు అందాయి. విద్యాశాఖ 34, పోలీస్ 17, మున్సిపల్ 12, అటవీ 10, పీఆర్ 9, సర్వే 8, పౌరసరఫరాలు 7, వైద్యం 6, బీసీ కార్పొరేషన్, ఉపాధి కల్పన, మార్కెటింగ్ శాఖలకు మూడేసి, ఏపీసీపీడీసీఎల్, డీఆర్డీఏ, మత్స్య, ఇంటర్మీడియట్, రిజిస్ట్రేషన్ల శాఖలకు రెండేసి.. ఇతర శాఖలకు ఒక్కోటి చొప్పున వచ్చాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

ప్రేమికులే దొంగలయ్యారు..!

కుక్కను దోచేసి.. బంగారం కాజేశారు..

విజయవాడ నేరవార్తలు, పటమట, న్యూస్‌టుడే

గేటుకు కట్టేసిన కుక్క పిల్ల పోయిందని ఫిర్యాదు చేస్తే పోలీసులు అంతగా పట్టించుకోలేదు. దీంతో.. దాన్ని దొంగిలించిన దొంగలే.. అదే వీధిలో మరో ఇంట్లో పడి బంగారం, నగదు చోరీ చేసిన ఘటన నగరంలో కలకలం సృష్టించింది. నిందితులు ప్రేమికులు అని తెలియడంతో పోలీసులు అవాక్కయ్యారు.

పటమట న్యూ ఆర్టీసీ కాలనీకి చెందిన చిరుమామిళ్ల ప్రసాద్.. వన్‌టౌన్‌లో గ్యాస్ కంపెనీ నిర్వహిస్తుంటారు. సోమవారం ఉదయం లేచి చూసేసరికి.. బెడ్‌రూంలో ఉన్న బీరువా పగలకొట్టి ఉంది. 280 గ్రాముల బంగారం, రూ.25వేల నగదు మాయమైంది. దొంగలు పడినట్లు గుర్తించి పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు హుటాహుటిన వచ్చి పరిశీలించారు.

అర్ధరాత్రి 1.05కి ఇంట్లో చొరబడి..

ఈ ఘటనతో సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. ఏడీసీపీ రాజారావు, సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్‌కిషోర్ తదితరులు పరిశీలించారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించగా.. ఒక మహిళ, ఒక పురుషుడు కలిసి నేరం చేసినట్లు తేలింది. ఆదివారం అర్ధరాత్రి 1.05 గంటల సమయంలో ఇంటికి ఉన్న చిన్న గేటు తీసి, లోపలకు ప్రవేశించారు. ఇంటి చుట్టూ తిరిగారు. ఒక వైపు కిటికీ తలుపు తెరిచి ఉండడంతో చువ్వలు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. ఒక గదిలో ప్రసాద్ దంపతులు, మరో గదిలో పని మనిషి నిద్రపోతున్నారు. మరో గదిలోని బీరువా తెరిచి బంగారం, నగదు తీసుకుని ఉడాయించారు.



ఈ కిటికీ ఊచలు వంచి దొంగలు లోనికి ప్రవేశించారు..

ముందుగా రెక్కీ చేసి...

పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా.. ఒక ద్విచక్రవాహనంపై ఒక యువతి, యువకుడు తిరగడం గమనించారు. ఆదివారం అర్ధరాత్రి 12.15 గంటలకు అనుమానితులు వీధిలో తిరిగారు. అదే సమయంలో పోలీస్ బీటు రావడంతో వెళ్లిపోయారు. మళ్లీ అర్ధరాత్రి 1 గంట సమయంలో వచ్చారు. 1.05 గంటలకు ఇంట్లోకి చొరబడ్డారు. వీరే నిందితులని పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. దీనికి ముందు రోజు పుటేజీని పరిశీలిస్తే.. ఆసక్తికరమైన విషయం వెలుగుచూసింది. ఆ ఇద్దరూ ఫన్‌టైమ్స్ రోడ్డులోనే ఒక ఇంటి గేటుకు కట్టివేసిన కుక్క పిల్లను చోరీ చేశారు. దీనిపై కుక్క యజమాని పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కానీ దర్యాప్తు చేయలేదు. అదే రోజు సీసీ టీవీ పుటేజీ చూసి ఉంటే.. చోరీని గుర్తించి నిందితులను పట్టుకునేవారు. కుక్కను దొంగిలించిన వారే ఈ నేరానికి పాల్పడ్డారు. పోలీసుల నిర్లిప్తతతో భారీ చోరీకి ఆస్కారం ఏర్పడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

20 గంటల్లోనే సొత్తు స్వాధీనం

మూడు బృందాలు గాలించి.. నిందితులు భవానీపురానికి చెందిన ప్రేమ జంటగా గుర్తించారు. యువకుడు మందా పండు, యువతి పేరు తెలియరాలేదు. గంజాయికి అలవాటు పడి, పనీపాటా లేకుండా తిరుగుతుంటాడని తేలింది. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో భవానీపురంలోని యువకుడు ఇంటికి వెళ్లారు. నిందితుడి తల్లి వద్ద ఉన్న చోరీ సొత్తు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రేమికుల కోసం గాలిస్తున్నారు.

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించారు. అత్యధికంగా 43 ఫిర్యాదులు భూ వివాదాలు, ఆస్తి, నగదు లావాదేవీలవే ఉన్నాయి. మహిళా సంబంధ నేరాలు 5, కొట్లాటలు 5, కుటుంబ కలహాలు 3, మోసాలు 3, దొంగతనాలు 2, చిన్న చిన్న సంఘటనలపై 9 ఫిర్యాదుల చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి సకాలంలో పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.



బాధితుడి సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: నగరంలోని ల్యాబ్స్, సరోగసీ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని.. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్రంలోని ఏఆర్‌టీ క్లినిక్‌లు, సరోగసీ కేంద్రాలు, ముఖ్యంగా ఐవీఎఫ్ శాఖలపై వివిధ ప్రసార మాధ్యమాల్లో వస్తున్న ప్రతికూల వార్తల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నగరంలోని పలు కేంద్రాలపై దృష్టి పెట్టిందని, నిబంధనల విషయంలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు. నగరంలోని 12 ల్యాబ్‌లు, ఏఆర్‌టీ క్లినిక్‌లలో తనిఖీ చేసినట్లు చెప్పారు. ఇక నుంచి క్రమం తప్పకుండా తనిఖీలు ఉంటాయని తెలిపారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్ల నమోదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఇన్‌స్పైర్ అవార్డుల మానక్-2025 ప్రచార పత్రాలను నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలు/విద్యా సంస్థల్లో హైస్కూలు/జూనియర్ కళాశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థులను సైన్స్ ఆవిష్కరణల వైపు ప్రోత్సహించే లక్ష్యంగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ డిపార్టుమెంటు ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. సెప్టెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో నామినేషన్లు నమోదు చేయాల్సి ఉంది. ఎంపికైన ప్రాజెక్టుకు ఒక్కొక్క విద్యార్థికి రూ. 10,000ల చొప్పున వారి ఖాతాలో జమ చేస్తారు. స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, క్లీన్ ఇండియా, సమాజాభివృద్ధి కోసం పరిసరాల్లోని సమస్యలు పరిష్కరించుకునే ప్రాజెక్టులను తయారు చేయాల్సి ఉంది. ప్రతి పాఠశాల నుంచి నామినేషన్లు తప్పక చేయాలని డీఈవో యు.వి.సుబ్బారావు సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కె.పిచ్చేశ్వరరావు ఫోన్ నంబరు 98666 28619లో సంప్రదించాలి. ప్రాజెక్టులను వెబ్‌సైట్ WWW.inspireawards dst.gov.in లో నామినేషన్ చేయాలి.

శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆపద సమయాల్లో ఏ మాత్రం బెదరకుండా కష్టాలను ఎదుర్కొనాలని శక్తి టీం బృందాలు పేర్కొంటున్నాయి. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలోని కళాశాలలు, విద్యాలయాల్లో సెల్ఫ్ డిఫెన్స్, శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం చేశాయి. విద్యార్థులతో సమావేశమై వారికి జాగ్రత్తలు తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోక్సో యాక్ట్, డయల్ 112 తదితర టోల్‌ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. విద్యార్థినుల ఫోన్లలో శక్తి యాప్ డౌన్ లోడ్ చేయించి.. దాని విశిష్టతను తెలియజేశారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

కోర్టుల కూడలిలో ట్రాఫిక్ జామ్

నగరంలోని 5వ నంబరు మార్గంలోని కోర్టుల కూడలిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ట్రాఫిక్ జామ్ అయింది. నక్కలరోడ్డు, 5వ నంబరు రోడ్డులో ఇరువైపులా, రాజ్‌భవన్ రోడ్డు (పుట్ట వైపు)లో మొత్తం నాలుగు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఆసుపత్రికి వెళ్లాల్సిన ఒక అంబులెన్స్ కొన్ని నిమిషాల పాటు పుట్ట వైపు మార్గంలో నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని చక్కదిద్దారు. అంబులెన్స్‌కు దారిచ్చి పంపారు. వాహనాల రద్దీ తగ్గడానికి కొంత సమయం పట్టింది. నాలుగు రోడ్ల కూడలిలో ఎవరి ఇష్టానుసారంగా వారు వెళ్లి పోతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటోంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



5వ నంబరు రోడ్డులో నిలిచిన వాహనాలు

- న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

ప్రధాని ప్రశంస సంతోషదాయకం : మంత్రి నారాయణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నీటి సరఫరా విధానాన్ని ప్రధాని మోదీ అభినందించడం గర్వకారణంగా ఉందని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొండ ప్రాంతాలకు సైతం నీటిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే అమృత్ పథకం కింద రాష్ట్రానికి ఇటీవల కేంద్రం నిధులు మంజూరు చేసిందని, ఆ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లోని ప్రతి ఇంటికి వచ్చే మూడేళ్లలో తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఇటీవలే విజయవాడకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర, ఇతర అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు.

మోదీ అభినందన గర్వకారణం: ఎంపీ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో విజయవాడ నగరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరా పరంగా తీసుకుంటున్న ప్రయోగాత్మక చర్యలను అభినందించడం గర్వకారణంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ ఓ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. నగరానికి గుర్తింపు ఇచ్చినందుకు విజయవాడ పౌరుడిగా, పార్లమెంటు సభ్యుడిగా మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని 16 లక్షల మంది జనాభాకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సురక్షిత కృష్ణా జలాలు అందిస్తున్నారని వివరించారు.

బీసీ మహిళా చట్టానికి సవరణ చేయాల్సిందే

గాంధీనగర్, న్యూస్‌టుడే : బీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ.. మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి అమలు చేయాలని బీసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్. జయశ్రీ, గౌరవ అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు ధర్నాచౌక్‌లో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా కేంద్రంలో ప్రభుత్వాలు మారినా.. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని.. మాజీ ముఖ్యమంత్రులు ములాయం సింగ్ యాదవ్, లాలు ప్రసాద్ యాదవ్‌లు రిజర్వేషన్‌లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా తేల్చాలని పట్టుబడడం వల్లే ఈ బిల్లు అటకెక్కిందని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం జనగణన పూర్తి చేసి, దేశ వ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరుగుతుందని కొర్రీలు వేయడం విచారకరం అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్‌రావు మాట్లాడుతూ.. సబ్ కోటా విషయంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. అందుకే గత 30 ఏళ్లుగా సంఘం పోరాడుతోందని పేర్కొన్నారు. ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.క్రాంతి కుమార్, మేకా వెంకటేశ్వరరావు, చందు, బీసీ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా కార్యక్రమంలో జయశ్రీ, శంకర్‌రావు, బీసీ నాయకులు

అత్యాధునిక పరికరాలతో వినికిడి సంరక్షణ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వినికిడి చికిత్స సంబంధించి డబ్ల్యూఎస్ ఆడియాలజీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత బ్రాండ్ రెక్సటన్‌తో కలిసి అధునాతన హియరింగ్ సెంటర్ 'హియర్ జోన్'ను సోమవారం సూర్యారావుపేటలో ప్రారంభించారు. ఆడియోమెట్రీ, టిమ్పానోమెట్రీ, హియరింగ్ ఎయిడ్ ట్రయల్‌తో పాటు ఫిట్టింగ్, ప్రోగ్రామింగ్, సర్వీసింగ్ వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. అత్యాధునిక రెక్సటన్ స్టోర్.. వినికిడి లోపం ఉన్న వారికి సమగ్ర, అధిక నాణ్యతగల సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. హియర్‌జోన్ ఎండీ ఐ.గణేష్ మాట్లాడుతూ.. తమ వద్దకు వచ్చే ప్రతి వ్యక్తికి వినికిడి ఆనందం, జీవితకాల సేవలు అందించడమే లక్ష్యం అన్నారు. హియరింగ్ కేర్ గ్యాప్స్‌ను నింపాలనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. డబ్ల్యూఎస్ ఆడియాలజీ ఇండియా సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ అవినాష్ పవార్ మాట్లాడుతూ.. నేడు ప్రపంచంలో వినికిడి లోపం సాధారణ ఆరోగ్య లోపంగా మారుతుందన్నారు. చికిత్స చేయని వినికిడి లోపం సామాజిక, శారీరక, మానసిక పరిణామాలకు దారితీస్తుందని వివరించారు. తమ సంస్థ ద్వారా అత్యాధునిక సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గణేష్, అవినాష్ పవార్

పెరిగిన ఇంటర్ ప్రవేశాలు

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయని ప్రిన్సిపల్ ఎస్.కృష్ణకాంత్ సోమవారం తెలిపారు. గత ఏడాది 551 మంది చేరగా.. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 582 మంది ప్రవేశం పొందారన్నారు. ఈ నెలాఖరు వరకు ప్రవేశాల గడువు ఉందని చెప్పారు. వృత్తి విద్యా విభాగాల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు తెలిపారు. ఇందులో భాగంగా.. ఈ ఏడాది నుంచి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు ఈఏపీసెట్, జేఈఈ మెయిన్స్, ఎన్ఈఈటీ వంటి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక తరగతులు ఉన్నాయని చెప్పారు. కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అందుబాటులో ఉంచామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో సమష్టి కృషితో 80 శాతం ఫలితాల లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఐదు కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఐదు కోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (వనాల వృద్ధి, అడవుల పెంపకం) కొమెర అంకారావు అన్నారు. పటమటలోని రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 500 మందికి వివిధ రకాల చెట్ల విత్తనాలు, మొక్కలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అంకారావు మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. అందుకు అనుగుణంగా విత్తన బంతులు, మొక్కల రూపంలో ఐదు కోట్ల మొక్కలను భూమిపై నాటుతామని వెల్లడించారు. ఈ మహా ఉద్యమంలో విద్యార్థులు, స్వచ్ఛంద, సేవా సంస్థలు, వివిధ సంఘాలు భాగస్వాములవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి జి.లక్ష్మి, మాజీ అధ్యక్షుడు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు, విత్తనాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అంకారావు

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రైల్వే శాఖలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళ మోసం చేసిందని పట్టణానికి చెందిన సి.హెచ్.రాఘవేంద్రకుమార్ జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు కథనం ప్రకారం.. అనంతపురానికి చెందిన జక్కా లక్ష్మి రైల్వే టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని పట్టణంలోని సీతారామపురానికి చెందిన చవల రాఘవేంద్రకుమార్ దగ్గర నుంచి రూ.2.50 లక్షలు తీసుకుంది. ఉద్యోగం గురించి అడుగుతుంటే వాయిదాలు వేస్తుండడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీపీ ఏఓకు పదోన్నతి.. బదిలీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీస్ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పదోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సహాయ పరిపాలనాధికారి కె.వి.డి. రామారావుకు పరిపాలనాధికారిగా పదోన్నతి లభించింది. అనంతరం ఆయన్ను ఏపీఎస్పీ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.

? స్థానిక ఉన్నత పాఠశాల పక్కనే బీసీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుపై కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతుంది. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. - టీ కిషోర్, గ్రామస్థుడు ✔ సిబ్బందిని పంపి పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథా అరికడతాం. - నవీన్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ సహాయక ఇంజినీర్ – న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం



◆ స్థానిక పంచాయతీలోని 6 వార్డు డ్రెయినేజీలో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటకంగా మారిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సోమవారం సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



◆ పట్టణంలోని నాగార్జున కళాశాల రోడ్డులో డ్రెయినేజీ పూడికతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం. .మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని డిగ్రీ కళాశాల రోడ్డు డ్రెయినేజీలో పూడిక, పిచ్చి మొక్కలతో మురుగు నీరు పారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికులు చేసిన ఫిర్యాదును కమిషనర్‌కు తెలుపగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని సుగాలీ కాలనీ రహదారిలో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో మొక్కలను తొలగింపజేశారు.

◆ పట్టణంలోని అక్కపాలెం రహదారి చెత్త కుప్పలతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారికి తెలుపగా స్పందించారు. కార్మికులతో తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, తిరువూరు

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

మైలవరం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యం సాధించడం ద్వారానే ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఉప ప్రిన్సిపల్ బి.రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో ఈఈఈ విభాగ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఎంబెడెడ్ ఐఓటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌పై వారం రోజుల కార్యశాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఉత్పత్తులకు గిరాకీ ఉందని, నైపుణ్యం గల ఇంజినీర్ల అవసరం ఉందని తెలిపారు. విభాగాధిపతి పి.శోభారాణి, రిసోర్స్ పర్సన్ మాధవ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విశ్వకర్మ భగవాన్ స్వామి దీక్షాధారణ ప్రత్యేకమైందని తెదేపా సీనియర్ నాయకుడు సీతారామయ్య అన్నారు. భగవాన్ యజ్ఞ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా ఈ దీక్ష కొండపల్లిలోనే కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రామినేని రాజా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

భక్తిశ్రద్ధలతో తిరునక్షత్రం వేడుక



తిరువూరు కోదండ రామాలయంలో మహిళలు

గంపలగూడెం, తిరువూరు: నియోజకవర్గంలోని వైష్ణవాలయాల్లో సోమవారం ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రం(పుట్టినరోజు)వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. తిరువూరు, ఊటుకూరు, గంపలగూడెం ఆలయాల్లో గోదాదేవి అమ్మవారి మూలవిరాట్‌లకు అర్చకులు పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాలు, పుష్పాలు, ఫలాలతో అలంకరణ, ఊంజల్‌సేవ వైభవంగా జరిపించారు. భక్తులు తిరుప్పావై పాశురాలు ఆలపించి గోదా, కృష్ణుల అష్టోత్తర శతనామావళి పఠించి, విశేష పూజలు చేశారు. భాగవతి గోష్ఠి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అపసవ్య ప్రయాణం.. ఆగునా ప్రమాదం..?

గుంటుపల్లి, (ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం గుంటుపల్లి గ్రామ పరిధిలోని జాతీయరహదారి ప్రమాదాల వలయంగా మారింది. ఇటీవల అక్కడ జరిగిన ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. రెండు ప్రదేశాల్లో జాతీయరహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లపైకి వాహనాలు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగాయి.



ఎన్టీఆర్ కూడలి వద్ద రోడ్డు దాటేందుకు వేచి చూస్తున్నారిలా..

23 లో 4 గుంటుపల్లి పరిధిలోనే

ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తించిన 23 బ్లాక్‌స్పాట్లలో నాలుగు స్పాట్లు గుంటుపల్లి గ్రామ పరిధిలోనే ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోవడమే ఈ ప్రమాదాలకు కారణం. జాతీయరహదారి నుంచి గ్రామ అంతర్గత రోడ్లను కలిపే ప్రదేశాల్లో సర్వీసు రోడ్లు లేకపోవడంతో గ్రామం నుంచి వాహనాలు నేరుగా జాతీయరహదారిపైకి చేరుకుంటున్నాయి. దీంతో అటుగా వేగంగా వచ్చే వాహనాలు వీటిని తప్పించే క్రమంలో వేగాన్ని అదుపు చేయలేక ఢీకొట్టడమో లేదా డివైడర్ పైకి దూసుకెళ్లడమో జరుగుతుంది. ఆయా కూడళ్ల వద్దే యూటర్న్ తీసుకునే అవకాశం ఉండడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువ

❑ రద్దీగా ఉండే ఎన్టీఆర్ కూడలి వద్దనే యూటర్న్ ఏర్పాటు చేయడం ప్రమాదాలకు కారణం. గతంలో ఇక్కడే ముగ్గురు ద్విచక్రవాహన చోదకులు గాయపడ్డారు. ❑ గ్రామ శివారు సత్యనారాయణపురం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్లాలంటే దాదాపు 200 మీటర్ల మేర అపసవ్యదిశలో ప్రయాణించి రోడ్డు దాటాల్సిన పరిస్థితి. ఇదే మాదిరి జాతీయరహదారి పక్కనే ఉన్న కల్యాణ మండపం నుంచి ఇబ్రహీంపట్నం వైపు రావాలన్నా అపసవ్య ప్రయాణం తప్పని సరి. ❑ జాతీయరహదారి పక్కన ఉన్న రెండు ప్రైవేటు పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్‌లతోపాటు రహదారి ఇరువైపులా ఎత్తుపల్లాలు ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి డివైడర్లపైకి దూకుపోతున్నాయి. ఇటీవల పెనుగంచిప్రోలు అమ్మవారి దర్శనం కోసం వెళ్తున్న వ్యాన్ డివైడర్ పైకి వెళ్లడంతో ముగ్గురు యాత్రికులు గాయపడ్డారు. ❑ గ్రామ పరిధిలోని సర్వీసు రోడ్లు యూటర్న్‌లపై జాతీయరహదారి భద్రతా అధికారి మాట్లాడుతూ..విజయవాడ - హైదరాబాద్ జాతీయరహదారిని గొల్లపూడి వరకు ఆరు లైన్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని ఆ సందర్భంగా సర్వీసు రోడ్లు, ప్రమాదరహితంగా యూటర్న్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

సర్వీస్ రోడ్లు లేక వాహనదారుల ఇక్కట్లు

మౌలిక వసతులు కల్పించండి

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి, ఈలప్రోలు సెంటు పట్టా భూముల్లో గ్రావెల్ రోడ్లు వేయించాలని అక్కడి నివాసితులు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌ను కోరారు. గొల్లపూడి కార్యాలయంలో సెంటు పట్టాదారులు ఎమ్మెల్యేను సోమవారం కలిసి..తాము పడుతున్న ఇబ్బందులను ఆయనకు తెలియజేశారు. కాలనీ ఏర్పాటులో రహదార్లను విస్తరించి లేఔట్లు వేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ అక్కడ మౌలిక వసతులు కల్పించలేదన్నారు. వర్షం పడినప్పుడు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆయా శాఖలతో సంప్రదించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ప్రసాద్



విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా చందా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో చిన్నరాట్నాలు నెల రోజుల శిక్షణ నిమిత్తం వెళ్లారు. మండల పరిషత్ పరిపాలనాధికారిగా ఉన్న ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమాగౌరీశంకరుడికి విశేష పూజలు



కొత్తపల్లి (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో సోమవారం అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు



మైలవరం, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి జన్మనక్షత్రం సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై కె.సుధాకర్, వేదికపై ప్రిన్సిపల్ ఇల్లా రవి, అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే: మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.సుధాకర్ పేర్కొన్నారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో సోమవారం మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలను మాటలు, సైగలు, చేతల ద్వారా, మారుపేర్లతో వేధిస్తున్నట్లు గుర్తిస్తే ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. విద్యార్థులు పూర్తిగా చదువుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, మహిళలను గౌరవప్రదంగా చూడాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ ఇల్లా రవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సుబ్బారావు, ఇతర ప్రిన్సిపల్ రంగారావు, అధ్యాపకులు జె.రాముడు, ఉమాలక్ష్మి పాల్గొని పలు సూచనలు చేశారు.

గుర్తింపు కార్డుల మంజూరుకు వినతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలు రైతులకు తక్షణమే గుర్తింపు కార్డులు మంజూరు చేసి పంటరుణాలు అందించాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య డిమాండ్ చేశారు. ఆయన కౌలు రైతులతో కలిసి సోమవారం మూలపాడు సచివాలయంలో వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారు. జిల్లాలో 60 వేల మందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఇప్పటి వరకు 30 వేల మందికి కార్డులు ఇచ్చినట్లు చెప్తున్న అధికారుల మాటల్లో వాస్తవం లేదన్నారు. కౌలు దారుల జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలంలోని మూలపాడు, త్రిలోచనపురం, కొటికలపూడి గ్రామాలలో 90 శాతం కౌలుదారులు ఉన్నారని వారిలో నేటి వరకు 40 శాతం మందికి కూడా గుర్తింపు కార్డులు మంజూరు చేయలేదన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. …



వీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బూడిద కాలుష్యంతో తీవ్ర అనారోగ్యాలు



రక్షిత నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ప్రజారోగ్య వేదిక సభ్యులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బూడిద కాలుష్యంతో కొండపల్లి పురపాలిక, ఇబ్రహీంపట్నం గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రజారోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయప్రకాష్ అన్నారు. …

నీటి వృథా.. తప్పని వ్యథ



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రహదారిపైకి నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కృష్ణాజలాల పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు అటుగా ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళుతున్న సమయంలో ఆ మురుగు ప్రజలపై పడుతుండటంతో … అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం శూన్యమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టి రాకపోకలకు అవస్థలు తొలగించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, జి.కొండూరు

అవస్థలు మళ్లీ మొదలు



వినగడప వంతెన వద్ద మళ్లింపు రహదారిపై బారులుదీరిన వాహనాలు

కట్లేరు వంతెన వద్ద ప్రయాణికులకు అవస్థలు మళ్లీ మొదలయ్యాయి. గతవారం కురిసిన వర్షాలకు వినగడప సమీప వంతెన వద్ద మళ్లింపు రహదారిపై నాలుగు రోజులపాటు కట్లేరు వరద నీరు ప్రవహించింది. ఈ క్రమంలో రోడ్డుకి ఇరువైపుల గ్రావెల్ కొట్టుకుపోయింది. దీంతో ఎదురుగా వాహనం వస్తే తప్పుకునే వీలులేక సోమవారం భారీ వాహనాలు నిలిచాయి. … పెద్ద వాహనాలు తిరుగుతుండడంతో సమస్య మరింత తీవ్రమైంది. ఏమైనా అధికారులు, పాలకులు స్పందించి మళ్లింపు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గంపలగూడెం

చూసి నడవాల్సిందే..



కాచవరం గ్రామ పరిధిలోని జాతీయరహదారి … ఉన్న మురుగు కాలువపై పగిలిపోయిన పలకలను తిరిగి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. వర్షాకాలం జాతీయరహదారిపై పడిన వర్షం నీటితో పాటు పరిసర ఇళ్ల నుంచి వచ్చే మురుగు తరలించేందుకు, గ్రామస్థుల రాకపోకలు అనువుగా ఉండేలా ఎన్‌హెచ్ సంస్థ వీటిని ఏర్పాటు చేసింది. నాణ్యత లోపించడంతో పారిశుద్ధ్య సిబ్బంది కాలువలను శుభ్రం చేసి తిరిగి వేసే సమయంలో విరిగిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో రాత్రిళ్లు పడిపోతున్నామని, నడవాలంటే ఇబ్బందిగా ఉందని త్వరితగతిన కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పాము కాటుతో మహిళ మృతి

చాట్రాయి, న్యూస్‌టుడే: చరవాణిలో మాట్లాడుతుండగా ఇంటి పైకప్పు నుంచి పాము పడి కాటు వేయడంతో మహిళ మృతి చెందిన ఘటన చనుబండ శివారు సూరంపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. చాట్రాయి మండలం సూరంపాలెంలో అద్దె గృహంలో ఉంటున్న పచ్చగొళ్ల థెరిసా (42) కుమారుడు జోజ్‌ను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. పాము కాటుకు గురైన వెంటనే చనుబండలో ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో విస్సన్నపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంత కాలంగా ఆమె భర్తకు దూరంగా ఉంటూ ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొర్ల మండలోని పుట్టినింట్లో ఉండేవారు. అదే గ్రామంలో కొత్త ఇంటిని నిర్మించుకునే క్రమంలో సూరంపాలెంలో ఉంటున్నారు. చాట్రాయి ఎస్సై డి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి...

ఊటుకూరు, వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మద్యం తాగొద్దని భార్య మందలించిందన్న కోపంతో గడ్డి మందు తాగిన వ్యక్తి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఊటుకూరుకు చెందిన నాగనబోయిన సురేష్ (39) జీవనోపాధి కోసం భార్య రమణ పుట్టిన ఊరైన వినగడపలో నివసిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతన్ని భార్య మందలించడంతో ఆ కోపంలో ఈ నెల 17న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతన్ని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా..చికిత్స తీసుకుంటూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనపై సోమవారం హెడ్‌కానిస్టేబుల్ ఎ.రాజశేఖర్ కేసు నమోదు చేశారు.

జూద శిబిరంపై దాడి

జి.కొండూరు: కుంటముక్కల శివారులో జూదమాడుతున్నట్లు సోమవారం మధ్యాహ్నం వచ్చిన సమాచారంతో జి.కొండూరు ఎస్సై కే సతీష్‌కుమార్ తన సిబ్బందితో ఆ శిబిరంపై దాడి చేసి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొంత మంది పరారైనట్లు తెలిపారు. వారి నుంచి 24 ద్విచక్ర వాహనాలు, రూ.20,500 నగదు, కోడి పుంజును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అకాడమీలతో క్రీడాకారులకు మేలు



క్రీడాకారులతో కోటగిరి శ్రీధర్

మైలవరం, న్యూస్‌టుడే: క్రీడాకారుల కోసం ఏర్పాటు చేస్తున్న అకాడమీలను ఉపయోగించుకుని మంచి ప్రతిభ చాటాలని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సహకారంతో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 స్టార్స్ ఫుట్‌బాల్ అకాడమీని సోమవారం ఆయన సందర్శించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. అకాడమీ ఏర్పాటుకు సహకరించిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంఘం ఆధ్వర్యంలో అకాడమీని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి శేషగిరిరావు, చక్రవర్తి, బుజ్జి, కళాశాల పీడీ రాజ్‌కుమార్, శిక్షకుడు సాయికిరణ్, పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో భారం మోపొద్దు



మాట్లాడుతున్న పీవీ ఆంజనేయులు

మైలవరం, న్యూస్‌టుడే: స్మార్ట్ విద్యుత్తు మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపొద్దని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దంటూ సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్తు ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఏడాదిలో సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపైనే భారం వేశారన్నారు. పాతమీటర్లను కొనసాగిస్తూ, పాత రీడింగ్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సీహెచ్ సుధాకర్, ఎం.శ్రీనివాస్, సురేష్, సుబ్బారావు, పి.జ్యోతి, పుష్పకుమారి, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తిరువూరు, న్యూస్‌టుడే: నూతనంగా నియమితులైన లయన్స్, సమత, లెజెండ్స్ క్లబ్‌ల ప్రతినిధులు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. తిరువూరు లయన్స్ క్లబ్‌కు పి.వెంకటేశ్వరరావు, సీహెచ్.శంకరరావు, సమత క్లబ్‌కు కె.శశికళ, కె.సహజ, లెజెండ్స్ క్లబ్‌కు డి.జె.నరసింహారావు, వై.రామారావు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ఎం.ఉపేంద్ర, ఎస్వీఎన్.నివృతరావు, వి.భాస్కరరావు, శంకరగుప్త, జోనికుమారి, జి.శేషగిరి, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొని నూతన కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పేదలకు కుట్టుమిషన్లు, వసతిగృహం విద్యార్థులకు దుప్పట్లు, రాతపుస్తకాలు, దివ్యాంగులకు ఊతకర్రలు నూతన కమిటీల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. స్థానిక లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కె.ముత్యప్రసాద్, ఎస్.జనార్దనరావు, కె.రాజేశ్‌ఖన్నా, జి.కృష్ణమోహన్, బి.ప్రకాశరావు, ఎ.సుబ్రహ్మణ్యం, ఎన్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లయన్స్, సమత, లెజెండ్స్ క్లబ్‌ల ప్రతినిధులు

అభివృద్ధి.. సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పైడూరుపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పైడూరుపాడులో సుపరిపాలనలో తొలి అడుగు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం కింద రూ.42లక్షలతో నిర్మించిన రహదారులను ప్రారంభించారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, తెదేపా నాయకులు బొమ్మసాని సుబ్బారావు, శీలంనేని సాంబశివరావు, మందా మురళీ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కొండపల్లి 26వ డివిజన్‌లో వైస్ ఛైర్మన్ సీహెచ్ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజు, కతరయ్య, వినోద్, జమలయ్య, సాంబశివరావులు పాల్గొన్నారు.

కొణిజెర్ల (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొణిజెర్లలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామ అధ్యక్షుడు వి.అనిల్‌కుమార్, సొసైటీ మాజీ అధ్యక్షుడు బి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం: కొణిజెర్లలో కరపత్రాల పంపిణీ

మురుగు వ్యవస్థ..తీరని అవస్థ

కచ్చా డ్రెయిన్లతో తంటాలు

మైలవరం, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ మైలవరంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా తయారైంది. ప్రధాన రహదారి పక్కనే పక్కా డ్రెయిను ఉండగా, గ్రామంలోని 20 వార్డుల్లో అన్ని చోట్లా కచ్చా డ్రెయిన్లే దర్శనమిస్తున్నాయి. దాంతో వర్షాకాలమే కాక సాధారణ రోజుల్లో నివాసాల్లోని వాడుక నీరంతా కాలువల్లోనే నిలిచిపోతోంది.



గౌతమ్ పాఠశాల సమీపంలో నిలిచిన నీరు

పట్టించుకోని అధికారులు

పంచాయతీలో 20 వార్డులు ఉండగా, సుమారు 25 వేల వరకు జనాభా నివసిస్తున్నారు. పేదల కాలనీల నుంచి పెద్ద భవంతులున్న ప్రాంతాల వరకు మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వాన్నస్థితిలోనే ఉంది. ఆయా వార్డుల్లో నిత్యం కాలువల పరిశుభ్రతకు కావాల్సిన కార్మికులను సమకూర్చుకోవడంలో దీర్ఘకాలంగా ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోతున్నారు. దాంతో ఉన్న కొద్దిమందితోనే నిత్యం ఒకట్రెండు ప్రాంతాల్లో పూడికతీతలతో మమ అనిపిస్తున్నారు. ఫలితంగా కచ్చా డ్రెయిన్లు ఎప్పటికప్పుడు ధ్వంసమై, మురికికూపంలా మారిపోతున్నాయి. ఏడాపెడా సీసీ రహదారుల నిర్మాణం చేస్తున్న ప్రభుత్వాలు పక్కా డ్రెయిన్ల నిర్మాణం చేయకపోవడంతో మురుగు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికే వర్షాలతో ఎక్కడికక్కడే డ్రెయిన్లలో నీరు నిలుస్తుండగా, జ్వరాల బారినపడకుండా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని స్థానికులు అంటున్నారు.

ఈ ప్రాంతాల్లో ఎక్కువ

ఎస్వీఆర్‌జీఎన్నార్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురు డ్రెయినేజీ నిత్యం మురికికూపంగానే ఉంటోంది.

◆ పాత పోలీస్ స్టేషన్ ఎదురు రోడ్డు మీదుగా భవానీనగర్‌కు వెళ్లే మార్గంలోని మురుగు కాలువలో ముందుకు పారే అవకాశం లేక తటాకాలను తలపిస్తున్నాయి. * శాంతినగర్ ప్రాంతంలోనూ మురుగు ముందుకు కదలడంలేదు.

డాక్యుమెంట్ పోయినది


నా క్లయింటు, ఎన్.టి.ఆర్. జిల్లా, విస్సన్నపేట మండలం, విస్సన్నపేట కాపురస్తులు నరెడ్ల ముత్తారెడ్డి గారి కుమారుడు నరెడ్ల నర్సిరెడ్డి గారి సంజాయిషీతో ఇందుమూలముగా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..

నా క్లయింటుకు ఎన్.టి.ఆర్. జిల్లా. రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామములో ఆర్.యస్.నెం.429/5 దాఖలా య. 0.26 సెంట్ల మెరక భూమి వున్నది. సదరు భూమి లోగడ నా క్లయింటు నరెడ్ల నరసారెడ్డి గారి వల్ల వ్రాయించుకోబడి విస్సన్నపేట స.రి. ఆలో 1వ పుస్తకము ద.నెం. 3008/2009 రు గా రిజిస్ట్రీ కాబడిన విక్రయ దస్తావేజురీత్యా నా క్లయింటుకు సంక్రమించియున్నది. సదరు దస్తావేజును నా క్లయింటు ది.25.07.2025వ తేదీన విస్సన్నపేట గ్రామములోని ఫొటోస్టాట్ సెంటర్ నందు ఫొటోస్టాట్ తీయించు నిమిత్తము తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎచ్చటనో పోగొట్టుకునియున్నారు. సదరు విక్రయ దస్తావేజు ఒరిజినల్ ఎంత వెతకిననూ ప్రయోజనము కనిపించలేదు. సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు ఇవ్వగలరు.

K.V.R.N. MUTYA PRASAD M.Com., B.L.
అడ్వకేట్ / నోటరీ, తిరువూరు. ✆ 98855 74113

ఈనాడు సినిమా

శాంత కాదు.. కాంత


'కాంత'లో దుల్కర్

ఒకరు నట చక్రవర్తి... మరొకరు దర్శక దిగ్గజం. 'నువ్వు ఎవరన్నది ఈ ప్రపంచానికి తెలియబోతోంది...' అంటూ సగర్వంగా ఆ నటుడిని తెరపై ఆవిష్కరించారు దర్శకుడు. ఆ నటుడికి కూడా తన దర్శకుడంటే అంతే గౌరవం, మర్యాద. కానీ ఆ ఇద్దరి మధ్య ఎక్కడో దూరం పెరిగింది. ఆ దూరం ఎక్కడివరకూ చేరింది? ఇద్దరూ కలిసి చేస్తున్న తొలి హారర్ సినిమా సెట్స్‌లో ఏం జరిగింది? 'శాంత' పేరుతో పట్టాలెక్కిన ఆ చిత్రం 'కాంత'గా ఎందుకు మారింది? తదితర విషయాలు తెలియాలంటే 'కాంత' చిత్రం చూడాల్సిందే. దుల్కర్ సల్మాన్, సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. రానా, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మాతలు. సెప్టెంబరు 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 1950లో మద్రాస్ నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో చంద్రన్ అనే సినీ హీరోగా దుల్కర్ నటిస్తుండగా, అయ్య అనే ఓ సీనియర్ దర్శకుడిగా సముద్రఖని కనిపిస్తారు.

ఆకాశంలో తార

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న మరో చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పిస్తున్నాయి. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ని విడుదల చేశారు.

ఆకాశం అందిందా.. నేలంతా నవ్విందా..

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మల్లిక గంధ...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని సోమవారం విడుదల చేశారు. తమన్ స్వరకల్పనలోని ఈ గీతాన్ని కృష్ణకాంత్ రచించగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు. 'ఆకాశం అందిందా.. నేలంతా నవ్విందా.. . ఉన్నట్టుండి ఏదో మారిందా...' అంటూ మొదలయ్యే ఈ పాట అందరికీ నచ్చేస్తోందని సినీ వర్గాలు తెలిపాయి.


టీజీ విశ్వప్రసాద్, సిద్ధు, రాశీ ఖన్నా, నీరజ కోన, తమన్

'కింగ్డమ్'తో అందరూ కోరుకున్న విజయం ఖాయం!

- విజయ్ దేవరకొండ


సత్యదేవ్, భాగ్యశ్రీ, విజయ్ దేవరకొండ, నాగవంశీ, అనిరుధ్

"ప్రేక్షకులు గౌరవించే సినిమాలే చేస్తా. ఈ విషయంలో వంద శాతం గ్యారెంటీ ఇస్తున్నా" అన్నారు విజయ్ దేవరకొండ. 'కింగ్డమ్' విషయంలో ఓ మంచి సినిమా చేశామన్న తృప్తి ఉందన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'కింగ్డమ్' విడుదలకి ముందస్తు వేడుక సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వేడుకని ఉద్దేశించి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "సినిమా విడుదలకు ఇక రెండు రోజులే మిగిలి ఉంది. లోపల భయంగా ఉన్నా, తృప్తి కూడా ఉంది. మేం చేసిన సినిమా అందరినీ సంతోష పెడుతుందని నమ్ముతున్నా. అభిమానుల్ని కలిసినప్పుడల్లా 'అన్నా.. మనం కొడుతున్నాం' అంటుంటారు. నా సినిమా బాగా ఆడాలని దేవుళ్లని మొక్కుతూ ఉంటారు. ఇంత మంది మన గురించి ఆలోచిస్తున్నారు, ప్రేమని పంచుతున్నారని తెలిసినప్పుడు కలిగే అనుభూతి వేరు. సినిమాతో ఏర్పడిన బంధమే ఇది. అందుకే సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేస్తుంటా. అలాగే నా శక్తి మేరకు నన్ను అభిమానిస్తున్న అందరి కోసం తిరిగి ఏదో ఒకటి చేసే వెళతా. 'కింగ్డమ్'తో నా నుంచి అందరూ కోరుకుంటున్న హిట్ ఖాయంగా వస్తుంది. మావాళ్లకి మంచి సినిమా ఇవ్వాలని నాకు ఎప్పుడూ ఉంటుంది. కానీ ఈసారి గౌతమ్, అనిరుధ్, నాగవంశీ, నవీన్ నూలి... ఇలా వీళ్లంతా తోడయ్యారు. ఇది విజయ్ దేవరకొండ 'కింగ్డమ్' కాదు, వీళ్లందరి సినిమా" అన్నారు. సంగీత దర్శకుడు అనిరుధ్ మాట్లాడుతూ "'కింగ్డమ్' సినిమాని చూసి చెబుతున్న మాట... మా అందరి కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. తెలుగులో మేం చేసిన ఓ కొత్త ప్రయత్నమిది" న్నారు. ఈ కార్యక్రమంలో నటులు సత్యదేవ్, భాగ్యశ్రీ, వెంకటేశ్, అయ్యప్ప, భాను, కసిరెడ్డి, మహేశ్, ఉన్నికృష్ణ, సెంథిల్, ఎడిటర్ నవీన్ నూలి, ఛాయాగ్రాహకులు జోమోన్, గిరీష్, గీత రచయిత కృష్ణకాంత్, స్టైలిస్ట్ నీరజ కోన, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా, ఫైట్ మాస్టర్లు రియల్ సతీశ్, యానిక్ బెన్, చేతన్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.

కూలీ సందడి షురూ


రజనీకాంత్

అగ్ర తారలతో ప్రేక్షకుల్ని ప్రత్యేకంగా ఆకర్షిస్తున్న చిత్రం... 'కూలీ'. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. 2వ తేదీన ట్రైలర్‌ని విడుదల చేస్తున్నట్టు సోమవారం సినీ వర్గాలు ప్రకటించాయి. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని డి.సురేశ్‌బాబు, దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ కలిసి ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

అవతార్ 3 మాయా జాలం

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.net లో

ధర్మ రక్షణకు యముడు


శ్రావణి, జగదీశ్

జగదీశ్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ... స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యముడు'. ధర్మో రక్షతి రక్షితః... అనేది ఉపశీర్షిక. శ్రావణి కథానాయిక. సోమవారం హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. జగదీశ్ ఆమంచి మాట్లాడుతూ "క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. మైథలాజికల్, సస్పెన్స్ అంశాలు కీలకం. ధర్మాన్ని రక్షించడం కోసం ఈ కథలో ఎవరేం చేశారన్నది ఆసక్తికరం" అన్నారు. శ్రావణి శెట్టి మాట్లాడుతూ "మన జీవితాల్లోని ఘటనలు, చోటు చేసుకునే తప్పులే ఇందులో ప్రతిబింబిస్తాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్, ప్రియాంక, మల్లిక, ఆకాశ్, భువనీ రాకేశ్, స్క్రీన్‌ప్లే రచయిత శివ, ఛాయాగ్రాహకుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం ఓ ఆత్మ పోరాటం

సినిమా	: 'యమకాథఘి'
జానర్	: సూపర్ నేచురల్ థ్రిల్లర్
ప్లాట్‌ఫామ్:	ఆహా



సాధారణంగా ఎవరైనా మరణిస్తే.. ఆ సంఘటనకు సంబంధించిన కారణాలు తెలుసుకొని బాధితులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తుంటారు పోలీసులు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ ఎన్నో సినిమాలు రూపొంది ప్రేక్షకుల్ని మెప్పించాయి. కానీ ఇక్కడ ఓ అమ్మాయి తను చనిపోవడానికి వెనకున్న రహస్యాల్ని తనే బయటపెడతానంటోంది. నిజాలు రాబట్టే వరకూ తన శవాన్ని కదలనిచ్చేది లేదంటూ ఓ ఊరినే పరుగులు పెట్టిస్తోంది. ఇలా సరికొత్త కథాంశంతో రూపొందిన చిత్రమే 'యమకాథఘి'.

కథాంశం: తంజావూరు గ్రామ ప్రజలందరూ ఆ ఊరి ఆలయానికి సంబంధించిన ఓ మహోత్సవానికి సిద్ధమవుతుంటారు. వీటికి సంబంధించిన పనుల్ని గ్రామాధికారి అయిన సెల్వరాజ్ (రాజు రాజప్పన్) దగ్గరుండి చూసుకుంటారు. ఆయన గారాల పట్టికే లీలా (రూప కొడువాయూర్). ఓ రోజు ఒక కారణంతో సెల్వరాజ్ తన కూతురు, భార్య మీద చేయి చేసుకుంటాడు. దీంతో లీలా ఇంట్లోకెళ్లి తలుపులేసుకుంటుంది. ఆ తర్వాత గదిలోకి వెళ్లి చూస్తే ఉరివేసుకొని చనిపోయిన స్థితిలో కనిపిస్తుంది. దీంతో ఆమె అంత్యక్రియల కోసం అందరూ ఏర్పాట్లు చేస్తారు. కానీ ఇంట్లో నుంచి లీలా శవాన్ని బయటికి తీసుకురావడం కాదు కదా. . కనీసం కదిలించలేకపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా లీలా ఉరివేసుకొనే చనిపోయిందా? లేదంటే ఎవరైనా చంపేశారా? లాంటి ఆసక్తికర ప్రశ్నలకు సమాధానమే 'యమకాథఘి'. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో పెప్పిన్ జార్జ్ జయశీలన్ దీన్ని రూపొందించారు. రూప కొడువాయూర్, నరేంద్ర ప్రసాద్, రాజు రాజప్పన్, గీతా కైలాసం తదితరులు కీలక పాత్రలు పోషించారు.

◆ చాలా సినిమాల్లో చనిపోయిన వ్యక్తి ఆత్మ వేరే వాళ్లలో ప్రవేశించి న్యాయం కోసం పోరాడడం మనం చూశాం. కానీ ఇది వాటన్నింటికీ పూర్తి భిన్నం. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో తన చావుకు గల కారణాల్ని బయట పెట్టే వరకూ ఇంటిని వదిలి వెళ్లేందుకు నిరాకరించే ఓ అమ్మాయి ఆత్మతో సినిమాను తీర్చిదిద్దిన దర్శకుడి ప్రయత్నం ఆకట్టుకుంటుంది. అసలు శవం కదలకపోవడానికి వెనుక ఉన్న రహస్యాలేంటో ఎక్కడా రివీల్ చేయకుండా చివరి వరకూ సస్పెన్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించారు. కానీ ఆఖర్లో దర్శకుడు ఇచ్చే ట్విస్ట్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సంప్రదాయాల పేరుతో ఎన్నో పిచ్చి పనులు చేస్తున్న సమాజాన్ని ఆలోచింపజేస్తుందీ చిత్రం. ఇందులో తన నటనతో ఆకట్టుకున్న రూప కొడువాయూర్.. ఈ సినిమాతోనే తమిళంలోకి అడుగుపెట్టడం విశేషం. ఇటీవలే తెలుగులో 'సారంగపాణి జాతకం'లో మెరిసిందీ నాయిక.

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!

అర్జున్ చక్రవర్తి ఆట ఎలా సాగింది?



విక్రాంత్ రుద్ర, విజయ రామరాజు, సిజ్జా రోజ్, శ్రీని

దేశం మొత్తం తెలిసేలా ఆడతానని మాటిచ్చిన అర్జున్ చక్రవర్తి ఎవరు? మైదానంలో ఆయన ఆట ఎలా సాగింది? మైదానం బయట ఆయనకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? తదితర విషయాలు తెలియాలంటే 'అర్జున్ చక్రవర్తి' చిత్రం చూడాల్సిందే. విజయ రామరాజు కథానాయకుడిగా విక్రాంత్ రుద్ర రూపొందించిన సినిమా ఇది. శ్రీని గుబ్బల నిర్మాత. ఒక కబడ్డీ క్రీడాకారుడి నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు హను రాఘవపూడి టీజర్‌ని ఆవిష్కరించారు. 'ప్రతిసారీ ఎదుటివాడి గెలుపు మాత్రమే నీ ఓటమి కాదు... ఓడిపోయానన్న నీ ఆలోచనే నీ ఓటమి అవుతుంది. నువ్వు ఆలోచనని గెలువు..' లాంటి సంభాషణలు టీజర్‌కి ఆకర్షణగా నిలిచాయి. వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ "పన్నెండేళ్ల వయసులో కబడ్డీ శిక్షణ కోసమని ఒక వ్యక్తిని కలిశా. ఆయన పేరు... అర్జున్ చక్రవర్తి. అప్పుడు ఆయన చెప్పిన ఓ కథ నా మనసులో అలా నాటుకుపోయింది. అదే ఈ సినిమా చేయడానికి కారణమైంది" అన్నారు. కార్యక్రమంలో సిజ్జా రోజ్, దుర్గేశ్, విఘ్నేశ్ భాస్కరన్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అరటి.. ఆదాయంలో మేటి

రైతేరాజు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే




మార్కెట్‌కు తరలించేందుకు ఆటోలో నింపిన గెలలు

మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు ఆళ్ల గోపిరెడ్డి అరటి సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. 'నాలుగు ఎకరాల సొంత పొలం, ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం 10 ఎకరాల్లో అరటి సాగు చేశాను. కర్పూర రకం అరటి మొక్కలు ఎకరానికి 1000 చొప్పున ఆరు ఎకరాల్లో 6 వేలు నాటాను. ఒక్కో మొక్క రూ.12 చొప్పున కొనుగోలు చేశాను. అందుకు రూ.72 వేలు వెచ్చించాను. ఎకరానికి కౌలు రూ.30 వేల చొప్పున రూ.లక్ష ఎనభై వేలు చెల్లించాను. మిగతా నాలుగు ఎకరాల్లో పిలక తోట సాగు చేశాను. 20 ట్రాక్టర్ల పశువుల ఎరువు, పొటాష్ 40 బస్తాలు, 28:28 నలభై బస్తాలు, 20-20-0-13 ఇరవై బస్తాలు వేశాను. మొక్కలు నాటిన 12 నెలలకు కర్పూర, 10 నెలలకు పిలక తోట పంట చేతికి వచ్చింది. గాలులకు అరటి చెట్లు కింద పడకుండా సర్వే బాదుడు కర్ర టన్ను రూ.8 వేల చొప్పున 2 వేల కర్రలు తెప్పించాను. అరటి గెలలకు వాటిని కూలీలతో కట్టించాను. కౌలు పొలానికి ఎకరానికి రూ.70 వేలు, సొంత పొలానికి ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి అయ్యింది. ఆరు ఎకరాలకు రూ.4.2 లక్షలు, నాలుగు ఎకరాలకు రూ.1.6 లక్షలు.. మొత్తం రూ.5.8 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు.

మార్కెట్ బాగుంది కనుక..

ప్రస్తుతానికి మార్కెట్‌లో కర్పూర రకానికి మంచి ధర లభిస్తోంది కనుక ఆదాయం బాగుంది. రోజూ 60 గెలలు నరికి ఆటోలో విజయవాడ మార్కెట్‌కు తరలిస్తున్నా. ఖర్చులు పోను గెలకు రూ.300 వరకు మిగులుతోంది. 45 రోజుల పాటు మార్కెట్‌కు రోజుకు 60 గెలల చొప్పున 2,700 గెలలు వేశారు. ఖర్చులు పోను ఇప్పటికి రూ.2,30,000 ఆదాయం లభించింది. గతంలో సాధారణ పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను. ఇప్పుడు కర్పూర రకం అరటి వేసి మంచి దిగుబడితో పాటు మెరుగైన ఆదాయం పొందుతున్నాను.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: టమాట పంట సాగు చేయడానికి అనువైన నేలలు, విత్తే కాలం, అంతర కృషి గురించి వివరించండి? – పి.శ్రీనివాస్, రైతు, చిలకలపూడి

సమాధానం: ప్రపంచంలోనే అత్యధికంగా సాగు చేసే కూరగాయల్లో టమాట ముఖ్యమైనది. దీనిని సంవత్సరం పొడవునా ఏ రుతువులోనైనా పండించవచ్చు. బాగా నీరు ఇంకే, బరువైన గరప నేలలు ఈ పంటకు అనుకూలంగా ఉంటాయి.. తేలికపాటి నేలల్లో వర్షాధార పంటగానూ పండించవచ్చు. ఖరీఫ్‌లో అయితే జులై నెల విత్తడానికి అనుకూలం. అంతర కృషి పరంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు గుర్తించి తొలగించి నాశనం చేయాలి. ముఖ్యంగా రసాయన ఎరువులు వేసేటప్పుడు నేలను గుంటుకతో కలియదున్ని మొక్క వైపునకు మట్టి ఎగదోయాలి. మొక్కల చివర్లను తుంచడం వల్ల పక్క కొమ్మలు అధికంగా ఏర్పడి ఎక్కువ దిగుబడి రావడానికి అవకాశం ఉంటుంది. మొక్కలకు కర్రలు పాతి ఊతం ఇవ్వడం వల్ల మంచి పరిమాణం గల కాయలు ఏర్పడడంతో పాటు తడి నేలకు తగిలి చెడిపోకుండా కాపాడవచ్చు. – వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

- ఘంటసాల, న్యూస్‌టుడే


విత్తనశుద్ధి... ప్రాముఖ్యత

ఘంటసాల, చల్లపల్లి – న్యూస్‌టుడే

పంట దిగుబడి విత్తన నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. నాణ్యమైన విత్తనమైతే.. జన్యుపరమైన లక్షణాలు, మొలక శాతం, మొలకెత్తే శక్తిని కలిగి ఉండి పైరు ఏకరీతిగా పెరుగుతుంది. అలాంటి విత్తనాలను ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు. వరిలో విత్తనశుద్ధి ప్రాముఖ్యతను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, శాస్త్రవేత్త కె.రేవతి వివరించారు. వివిధ తెగుళ్ల నుంచి కాపాడడానికి వరి విత్తనాలను శుద్ధి చేయాలి. విత్తనాలకు రసాయన మందులు లేదా జీవ సంబంధమైన మందులతో శుద్ధి చేస్తారు. ఇది ఆరోగ్యకరమైన పంట దిగుబడికి దోహదపడుతుంది. రసాయన మందులతో విత్తనశుద్ధి చేస్తే.. దంప నారుమళ్ల పరంగా.. లీటరు నీటికి 1.0 గ్రాము కార్బండిజమ్ కలుపుకొని కిలో విత్తనాన్ని 24 గంటలు నాన బెట్టాలి. తరువాత 24 గంటలు మండెకట్టి మొలకెత్తిన విత్తనాన్ని దంప నారుమళ్లలో చల్లుకోవాలి. పొడి పద్ధతిలో విత్తనశుద్ధి చేయాలంటే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తరువాత నారు మడిలో వేసుకోవాలి. జీవ సంబంధమైన మందులతో విత్తనశుద్ధి చేస్తే.. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ పొడి మందు 10 గ్రాములు కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేయడం ద్వారా అగ్గి తెగులు, పొడ తెగులు, కాండం కుళ్లు తెగులు కొంతవరకు అదుపు చేయవచ్చు.

పంటల బీమా.. రైతుకు ధీమా

కంచికచర్ల, న్యూస్‌టుడే



ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిని నష్టాల బారిన పడే రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), పునర్నిర్మిత వాతావరణ ఆధారిత పంటల బీమా (ఆర్‌డబ్ల్యూబీఎస్‌ఐ) పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆయా పథకాల కింద పండించిన పంటలకు బీమా చేయడం ద్వారా తక్కువ ప్రీమియంతో రైతులు ఆర్థిక నష్టాలను సమర్థంగా ఎదుర్కోవచ్చు. పంటల బీమా కోసం ప్రభుత్వం ఆయా కంపెనీలతో ఒప్పందం చేసుకుంటుంది. చెల్లించాల్సిన ప్రీమియంలో రైతు వాటాగా 1 - 5 శాతం వరకు (పంట రకాన్ని బట్టి) చెల్లిస్తే సరిపోతుంది. మిగతా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది.

పంటల బీమాలో కొన్ని గ్రామ, మరికొన్ని మండల, జిల్లా కేటగిరిల్లో ఉన్నాయి. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు తమ పంటలకు బీమా చేయించడం మేలని అధికారులు సూచిస్తున్నారు. బీమా నమోదుకు ఆగస్టు - 15 (వరికి), జులై 31 (ఇతర పంటలకు) ఆఖరు తేదీగా నిర్ణయించారు. బీమా నమోదుకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అన్నదాతలు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు (హెక్టారుకు రూ.ల్లో)

పంట	బీమా మొత్తం	రైతు చెల్లించాల్సిన సొమ్ము
ధాన్యం	1,06,250	2,125
మిర్చి	2,25,000	4,500
మొక్క జొన్న	92,500	925
పెసర	45,000	900
పత్తి	95,000	4750

అద్దె గర్భం ముసుగు.. అక్రమాల గొడుగు

ఈనాడు, హైదరాబాద్, రెజిమెంటల్‌బజార్, కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే


ఫెర్టిలిటీ సెంటర్‌లో వైద్య పరికరాలు

వెలుగులోకి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అకృత్యాలు

ఎంతోమంది చిన్నారులను తల్లి ఒడికి దూరం చేశారు. ఎందరో దంపతులను సరోగసీ ఎరవేసి మనోవేదనకు గురిచేశారు. కాసుల కక్కుర్తితో అడ్డదారి తొక్కారు. తల్లీపిల్లల్ని వేరు చేస్తున్నామనే మానవత్వం మరిచారు. తప్పొప్పుల విచక్షణ గాలికొదిలేసి సంతానలేమిని సొమ్ము చేసుకునేందుకు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. ఇదీ సికింద్రాబాద్‌లోని సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో సాగించిన దారుణాలు. పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు ఉలికిపాటుకు గురిచేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో బాధితులు ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేసేందుకు ముందుకొస్తున్నట్టు సమాచారం. రాజస్థాన్ చెందిన దంపతులు సరోగసీ కోసం సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లోని డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.35లక్షలు వసూలు చేసి సరోగసీ విధానంలో బిడ్డ పుట్టాడంటూ అసోంలో కొనుగోలు చేసిన పిల్లాడిని విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో గోపాలపురం పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో సహా 8 మందిని 7 రోజుల పోలీసు కస్టడీకి కోరుతూ సోమవారం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే 30 ఏళ్లుగా సాగించిన అక్రమాల బాగోతం బయటపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. డాక్టర్ నమ్రతతో సహా 8 మంది నిందితులు నాంపల్లి న్యాయస్థానంలో బెయిల్‌పిటీషన్ దాఖలు చేశారు.

విశాఖ కేంద్రంగా దందా

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, కోల్‌కతా, ఒడిశాలో సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల్లో సంతానం లేని దంపతులకు వైద్యచికిత్స అందిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు నాలుగేళ్ల క్రితమే అనుమతి రద్దు చేశారు. దాన్ని నివాస భవనంగా చూపుతూ దందా సాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్‌ల్లో వివరాలు సేకరిస్తూ ఎంతోమంది దంపతులకు అద్దెగర్భంతో సంతానం పొందే వీలుందని నమ్మకం కలిగించి కొత్త నాటకంతో రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులు వివాహమై 18 ఏళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవటంతో 2019లో కేపీహెచ్‌బీ కాలనీలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.13లక్షలు తీసుకొని సరోగసీతో బిడ్డను అందిస్తామంటూ భరోసానిచ్చారు. కోవిడ్ సోకి సరోగసీ చికిత్స అందిస్తున్న మహిళ మృతి చెందినట్టు బురిడీ కొట్టించారు. ఫెర్టిలిటీ కేంద్రం సాగిస్తున్న మోసాల గురించి తెలిసిన బాధితులు కేపీహెచ్‌బీ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస దంపతుల నుంచి రూ.12లక్షలు తీసుకొని సరోగసీ బిడ్డ పేరుతో విశాఖపట్టణంలో కొనుగోలు చేసిన చిన్నారిని చేతికిచ్చారు. డీఎన్ఏ పరీక్షలో అసలు విషయం బయటకు రావటంతో బాధితులు 2015లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్రాలకు వచ్చిన భార్యాభర్తలకు వైద్యపరీక్షలు నిర్వహించి సరోగసీ కోసం విశాఖపట్టణం పంపిస్తున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన నిరుపేద మహిళలు, యువతులను సరోగసీకి సిద్ధంగా ఉన్నట్టు చూపుతారు. దంపతుల నుంచి వీర్యకణాలు, అండాలను సేకరిస్తారు. వాటిని ఏ మహిళ గర్భంలో ప్రవేశపెట్టబోతున్నామనేది వివరిస్తారు. ఏ మాత్రం అనుమానం రాకుండా గర్భంలో ఊపిరిపోసుకుంటున్న బిడ్డకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కాబోయే తల్లిదండ్రులకు తెలియజేస్తుంటారు.

డెలివరీ సమయం ముందుగానే చెప్పి విశాఖపట్టణంలో బిడ్డను అప్పగిస్తారు. పిల్లల రూపురేఖలపై అనుమానం వచ్చిన బాధితులు డీఎన్ఏ పరీక్ష చేసినపుడు అక్రమాలు బయటపడుతున్నాయి. తమ బిడ్డలు కాదని తెలిసినా, విషయం బయటకు పొక్కితే శిశువులను కొనుగోలు చేసినందకు తమపై కేసు నమోదవుతుందనే ఉద్దేశంతో చాలామంది మౌనం వహిస్తున్నట్టు పోలీసు అధికారి తెలిపారు.

ఆరు రాష్ట్రాల్లో నెట్‌వర్క్?

ఏపీ, తెలంగాణ, ఒడిశా, అసోం, పశ్చిమబెంగాల్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో దళారులను ఏర్పాటు చేసుకున్నారు. మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో పేద, నిరుపేద కుటుంబాల్లోని గర్భిణులకు డబ్బు ఆశచూపుతున్నారు. వారికి బిడ్డ పుట్టబోయే సమయాన్ని తెలుసుకుంటున్నారు. అక్కడ పుట్టిన పిల్లల్ని రూ.50వేల నుంచి రూ.లక్ష ధరకు కొనుగోలు చేసి ఇక్కడి దంపతులకు సరోగసీ ద్వారా పుట్టినట్లు చేతికిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల్లో ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లను అక్రమంగా ఏర్పాటు చేసి తమ వద్దకు వచ్చేవారిని తెలివిగా బురిడీ కొట్టిస్తున్నారు. ఇన్నేళ్లుగా సరోగసీ ముసుగులో విక్రయించిన శిశువులను ఎక్కడ నుంచి తీసుకొచ్చారు. ఎంతమందికి ఇచ్చారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దంపతుల నుంచి సేకరించిన వీర్యం, అండాలను ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

'ప్రభుత్వ భూములను కాపాడుకోవాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అత్త సొమ్ము అల్లుడు దానం అన్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారశైలి ఉందని విమర్శించారు. ప్రధాని మోదీ అడుగుజాడల్లో నడుస్తున్నారని దుయ్యబట్టారు. పాలనలో మార్పు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో స్వరాజ్య మైదానాన్ని ప్రైవేటుకు అప్పగించాలని, అభివృద్ధి పేరుతో రాజీవ్‌గాంధీ పార్కును పైనా కంపెనీలకు ఇవ్వాలని చూడగా.. తాను కోర్టులో కేసులు వేశానని గుర్తు చేశారు. కెనాల్ గెస్ట్‌హౌస్ వద్ద నాలుగు ఎకరాలను అభివృద్ధి పేరుతో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుకు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. డీమార్ట్, రిలయన్స్‌కు ప్రభుత్వ స్థలం ఇచ్చారా? అని ప్రశ్నించారు. విజయవాడలో 4.15 ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని లులు కంపెనీకి కట్టబెట్టడం అన్యాయమన్నారు. ఇందులో అవినీతి దాగి ఉందని, ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రాజ్యాంగబద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ చంద్రబాబు సరిగా స్పందించలేదని విమర్శించారు. ఏపీని సింగపూర్ మాదిరిగా చేద్దామంటే జగన్ అడ్డుకోవడం సరికాదన్నారు.

ప్రయాణికుల సౌకర్యాలకు తొలి ప్రాధాన్యం


మోహిత్ సోనాకియా

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యాలకు తొలి ప్రాధాన్యత ఇస్తానని విజయవాడ నూతన డివిజనల్ రైల్వే మేనేజరు(డీఆర్ఎం) మోహిత్ సోనాకియా తెలిపారు. సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో పూర్వ డీఆర్ఎం నరేంద్ర ఆనందరావుపాటిల్ నుంచి ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఐఆర్ఎస్ఈఈకి చెందిన ఆయన 1995లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్, ఎంటెక్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చేశారు. రైల్ వీల్ ఫ్యాక్టరీలో ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ఉత్తరప్రదేశ్ మెట్రో రైల్ ప్రాజెక్టు జీఎంగా, ఆర్‌డీఎస్‌వో డైరెక్టరుగా, రైల్వే సేఫ్టీ డిప్యూటీ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పని చేశారు. రైల్వే సిబ్బంది సంక్షేమంతో పాటు డివిజన్ ఆదాయం పెరిగేందుకు కృషి చేస్తానని డీఆర్ఎం వెల్లడించారు. ఈ సందర్భంగా అన్ని బ్రాంచీల అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

జెన్‌జీ అమ్మాయిలు... వెనక్కి వెళ్తున్నారోచ్..!



గుర్తుందా..! 20ఏళ్ల క్రితం డిజిటల్ తెరలు లేనప్పుడు మన అమ్మ, అమ్మమ్మల జీవనశైలి ఎలా ఉండేదో... ఇప్పుడంటే ఇన్‌స్టాగ్రామ్‌లు, వాట్సాప్‌లు, ఫేస్‌బుక్‌లు వచ్చాయి గానీ వాళ్ల తరానికి ఇవేవీ తెలియవు. కాలక్షేపానికి నైపుణ్యాలకు సాన పెట్టేవారు. ఏ కాస్త సమయం దొరికినా వాటిపైనే దృష్టి. బ్యాగులు, స్వెటర్లు అల్లడం, తోటపని, వివిధ రకాల వంటలు చేసి అందరికీ రుచి చూపించడం, ఇల్లంతా రంగురంగుల ముగ్గులు వేయడం, స్వయంగా తయారుచేసిన వస్తువులతోనే ఇల్లంతా అలంకరించాలని కోరుకునేవారు కూడా. కానీ ఇప్పుడో... సమయం దొరికిందంటే సోఫాపై కూర్చొని రీల్స్ చూడటమే పని. కానీ జెన్‌జీ అమ్మాయిలు ఈ విషయంలో ఓ అడుగు ముందుకేశారు. ఆ పాత మధురాల్ని మళ్లీ స్పృశిస్తూ... బామ్మల కాలం నాటి అలవాట్లని అందిపుచ్చుకుంటున్నారు. బ్యాగులు అల్లడం దగ్గరనుంచి కనుమరుగవుతున్న వంటల్ని వెలికి తీసి తమ పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగానూ పంచుకుంటున్నారు. ఇవన్నీ నచ్చిన మిలీనియల్స్ కూడా వాళ్ల బాటలోనే నడుస్తున్నారు. ఈ వీడియోలన్నీ చూస్తోన్న నెటిజన్లు స్వర్ణ యుగం... మళ్లీ వచ్చిందంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మీరూ చూశారా! నచ్చితే ప్రయత్నించేయండి మరి!

ప్రపంచంలోనే అతి పొడవైన నదుల్లో ఒకటి బ్రహ్మపుత్ర! అత్యంత ప్రమాదకరమైనది కూడా. అలాంటిదానిలో 28 రోజుల సాహసానికి సిద్ధమైంది మన ఆర్మీ! విజయవంతంగా పూర్తిచేసి శభాష్ అనిపించుకుంది. ఆ బృందంలో ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు మేజర్ కవితా వాసుపల్లి. ఈ తెలుగింటి ఆడపడుచును 'వసుంధర' పలకరించింది.





కవిత

నోరు తెరిస్తే... చనిపోయేదాన్నే!

శ్రీకాకుళం జిల్లాలోని మెట్టూరు కవితది. నాన్న వాసుపల్లి రామారావు రైల్వేలో క్లర్క్, అమ్మ రమ్య. వైజాగ్‌లో స్కూలింగ్, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చేశారు. ఆర్థిక కారణాల రీత్యా పీజీ పూర్తిచేయలేని పరిస్థితి. తప్పక ఉద్యోగం సంపాదించాలి. ఏం చేద్దామనుకుంటున్నప్పుడు ఆర్మీ గురించి తెలిసింది. వైద్యులూ ఆర్మీ యూనిఫాం ధరించొచ్చని అప్పటివరకూ ఆమెకు తెలియదు. తెలిశాక చేరాలనుకున్నారు. ఇక్కడా పోటీ తక్కువేమీ కాదు. 550 సీట్లలో 50 మాత్రమే అమ్మాయిలకు ఉండేవి. చాలా కష్టపడి సాధించారు. కవితకు సాహస క్రీడలంటే ఆసక్తి. వైద్యవిద్య చదువుతున్నప్పుడే ట్రెక్కింగ్ చేసేవారు. మౌంటెనీరింగ్‌కి ప్రత్యేకంగా కోర్సులుంటాయని తెలిసి... ఆర్మీలో చేరాక సెలవు పెట్టి మరీ పూర్తిచేశారు. దీంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (ఎన్ఐఎంఏఎస్)లో మెడికల్ ఆఫీసర్‌గా పోస్టింగ్ దక్కింది. ఏడాదిలో అయిదుసార్లు 1800 అడుగులు ఎత్తు వరకూ ఎక్కేవారు. అదీ 15 కేజీల బరువుతో! నెట్‌వర్క్ కూడా ఉండదు. ఆమె పట్టుదల చూసి సంస్థ డైరెక్టర్... రాఫ్టింగ్ కోర్సు చేయమన్నారు.

ఇది రెండోది!

ఆమె తొలి ఎక్స్‌పెడిషన్ అరుణాచల్ ప్రదేశ్‌లోని గోరిచెన్. రెండో అవకాశం... బ్రహ్మపుత్ర నదిలో ఈ సాహసం. ఇండో టిబెటన్ బోర్డరు నుంచి ఇండో



బంగ్లాదేశ్ బోర్డరు వరకు సాగింది. పన్నెండుమంది బృందంలో కవిత ఒక్కరే అమ్మాయి. రోజూ ఎంత దూరం వెళ్లాలి, ఎక్కడ బస చేయాలన్న గ్రౌండ్ వర్క్ అంతా ఈమే చేశారు. 28 రోజుల్లో 1040 కి.మీ. ప్రయాణించారు. 'తెల్లవారుజామున అల్పాహారం చేసి రాఫ్ట్‌లోకి వెళ్తే ఏ సాయంత్రమో ఆపేవాళ్లం. భోజనమూ నీళ్లల్లోనే. అత్యంత ప్రమాదకరమైన సాహసమనే చెప్పాలి. నీటి లోతు ఎక్కువ. 11 అడుగుల ఎత్తువరకూ ఎగిసిపడే అలలు. గ్లేసియర్‌కి దగ్గరగా ఉంటుంది కదా! క్షణక్షణం వాతావరణం మారిపోతుంది. తొలివారం ఊపిరి బిగపట్టి మరీ కొనసాగాం. నిజానికి తొలిరోజే ప్రమాదానికి గురయ్యాం. రాఫ్ట్‌లోంచి అందరం నీళ్లల్లో పడ్డాం. నేనైతే నీటి సుడిగుండంలో చిక్కుకున్నా. కొన్ని క్షణాలేం అర్థం కాలేదు. అర్థమయ్యాక నాకు నేనే 'ఏదేమైనా నోరు తెరవకు. లేదంటే చావు ఖాయం. కాస్త ఓపికపట్టు' అంటూ ధైర్యం చెప్పుకొన్నా. దాన్నుంచి బయటపడేసరికి పెద్ద అల. దాన్నీ తప్పించుకుని, ఈదుకుంటూ రాఫ్ట్‌ను చేరుకున్నా. మరోసారి లైఫ్‌గార్డ్‌లు కాపాడారు' అనే కవితకి ఇలాంటి అనుభవాలు చాలానే ఎదురయ్యాయి. నాలుగుసార్లు రాఫ్ట్ నుంచి పడిపోయినా ధైర్యంగా ముందుకే సాగారు. ఒకరోజులో 70 కి.మీ., ఏకధాటిగా 12గం. రాఫ్టింగ్ చేసిన సందర్భాలూ ఉన్నాయి.

ఒకే జీవితం...

రాఫ్టింగ్ వంటి సాహసక్రీడల్లో ఆర్మీ శిక్షణ తీసుకోవడం తప్పనిసరి. ఇక మనదేశంలో అడ్వెంచర్ టూరిజానికి ఆదరణ పెరుగుతోంది. బ్రహ్మపుత్ర రాఫ్టింగ్ లేదా కయాకింగ్‌కి అత్యుత్తమ ప్రదేశం. పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దితే స్థానికంగా ఉపాధి పెంచడమే కాదు, సంస్కృతినీ బతికించగలుగుతామన్న ఉద్దేశంతో ఈ ప్రయోగం చేశారు. అందరి మన్ననలూ అందుకున్నారు. 'బ్రహ్మపుత్ర ఎక్స్‌పెడిషన్ చేసిన తొలి మహిళగా నిలవడం ఆనందంగా ఉంది. ఏదైనా చేస్తానన్నప్పుడు అమ్మాయిలకు 'వద్దు, నీవల్ల కాదు, చేయలేవు' అన్నమాటలే వినిపిస్తాయి. మా ఇంట్లో తొలి గ్రాడ్యుయేట్, ఆర్మీ వ్యక్తిని. సాహస క్రీడల్లోకి అడుగుపెట్టిందీ నేనే! విశిష్ట సేవా మెడల్‌నీ అందుకున్నా. నిజానికి ఆర్మీలోకి వెళ్తానన్నప్పుడు, ఎన్ఐఎంఏఎస్‌లో చేరతానన్నప్పుడూ అంతా వద్దన్నవారే. పట్టుదలగా సాగా. ఒక్క జీవితం... ఎదుటివారి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చు. కానీ బతకాల్సింది మాత్రం మనమే. అందుకే నచ్చింది ప్రయత్నించాలి, చేయాలి. త్వరలో పీజీలో చేరతా. మౌంట్ గోరిచెన్ మాత్రమే ఎక్కా. మిగతావీ ఎక్కాలి' అంటారు మేజర్ కవిత.

కెరియర్ మధ్య దశలో ఉన్న రోజులవి. హాయిగా పనిచేసుకునేదాన్ని. పదోన్నతులూ వచ్చేవి. ఒకాయన కొత్తగా ఒక బాధ్యత తీసుకున్నారు. ప్రస్తుతం నేనున్న సీట్లోనే కూర్చున్నారు. రెండో రోజే ఆయన్నుంచి మెసేజ్ వచ్చింది... నాకు మెంటార్‌గా ఉంటానన్నారు. ఆ స్థాయి లీడర్ నుంచి ఆ పిలుపు రావడంతో ఆశ్చర్యమేసి... నేరుగా వెళ్లి అడిగా.. 'నువ్వు ఈ కుర్చీలో ఉండాల్సింది. కానీ నీకా ఆలోచన లేనట్టుంది. నువ్వు కోరుకుంటే అది సాధ్యమే'నన్నారు. ఆరోజు తెలిసింది లక్ష్యం పెట్టుకోవడమే కాదు, అది పెద్దగానూ ఉండాలని.



- డైసీ చిట్టిలపిల్లి, ప్రెసిడెంట్, సిస్కో ఇండియా, సార్క్

మా ఊళ్లో నన్ను గుర్తుపట్టరు!

ఒకే గెలుపుతో ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా, గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన 19 ఏళ్ల దివ్యా దేశ్‌ముఖ్ గురించి మీకు ఈ విషయాలు తెలుసా?

1 అమ్మానాన్నలు... జితేంద్ర, నమ్రత వైద్యులు. పిల్లలకు ఆటల్ని పరిచయం చేయాలనుకున్నారు. అక్క బ్యాడ్మింటన్ క్లాసులకు వెళ్తుంటే, తనతోపాటు ఒకరోజు వెళ్లింది దివ్య. అప్పటికి నాలుగైదేళ్లుంటాయేమో! నెట్ అంత పొడవైనా లేకపోవడంతో అదే భవనంలో చెస్ కూడా నేర్పిస్తుంటే, చేర్పించారు. 'చెస్ నచ్చడంతో అప్పట్నుంచీ ఈ ఆటకు అతుక్కుపోయా'నంటోంది దివ్య. గాయాల బెడద లేకపోవడంతో తల్లిదండ్రులూ ప్రోత్సహించారట. అక్క మాత్రం బ్యాడ్మింటన్‌ను కొనసాగించలేదట.



2 'పావులతో ఆడుతున్నా, వ్యక్తులతో కాదు', 'చివరి వరకూ పోరాడు' అనే మంత్రాల్ని పాటిస్తానంటోంది.

3 'ఆమె ప్రయోగాలు చేయడానికి భయపడదు. ఆటలో దూకుడు ప్రదర్శిస్తుంది' అంటారు విశ్వనాథన్ ఆనంద్.

4 పోటీలు లేనప్పుడు ఇంట్లో ఉండటాన్నే ఇష్టపడుతుంది. వర్కవుట్స్, యోగా, ధ్యానం ప్రాక్టీసు చేస్తూ ప్రకృతికి దగ్గరగా ఉండేందుకు ప్రయత్నిస్తుంది.

5 ఫ్యాషన్‌గా ఉండటం నచ్చుతుంది. కానీ తన ఆట గురించి కాకుండా వాటిపైన ఎక్కువగా చర్చిస్తే నచ్చదు.

6 ఏదోక రోజు వరల్డ్ ఛాంపియన్ కావడం ఆమె లక్ష్యమట.

7 సొంతూరు నాగ్‌పూర్‌లో చెస్ ఆడేవాళ్లు తక్కువ. 'చాలా కొద్దిమంది మాత్రమే అక్కడ నన్ను గుర్తుపడతారు' అనే దివ్య... 'అమ్మ నమ్రత మద్దతు లేకుంటే, ఇక్కడవరకూ వచ్చేదాన్ని కాదు, గెలిచినప్పుడే కాదు, ఓటమిలోనూ నావెంట నిలుస్తుంది' అని చెబుతుంది.

8 టోర్నమెంట్‌లో విరామం దొరికితే బాగా నిద్రపోతుందట. వాకింగ్ చేస్తూ, ఇష్టమైనవి తింటూ తర్వాత మ్యాచ్‌కు సిద్ధమవుతుంది. పానీపూరి అంటే ఇష్టం.

9 చెస్‌లోకి రాకపోయుంటే తల్లిదండ్రుల్లా డాక్టర్, లేదంటే వ్యోమగామి అయ్యేదట.

ఆడపడుచు ప్రేమతో... అత్తింటికి దూరమయ్యా!

మా ఆడపడుచు మా అన్నయ్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ విషయం మా అత్తింటివారెవరికీ ఇష్టం లేదు. అందుకు నేనే కారణమని వేధించడం మొదలుపెట్టారు. గట్టిగా ఎదుర్కొన్నానని కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టారు. పుట్టింటికి వచ్చేశా. అయితే, గత కొన్నాళ్లుగా మా ఆడపడుచు తన పుట్టింటివారితో మాట్లాడుతోంది. నా మీద లేనిపోని చాడీలు చెప్పి సమస్యను మరింత క్లిష్టంగా మార్చేసింది. అన్నయ్యకి తెలిసినా... భార్యని ఎదిరించలేకపోతున్నాడు. కేసు పెడదామంటే రెండు కుటుంబాలు రోడ్డున పడతాయని ఆగాను. ఒకవేళ ఆ పనే చేస్తే... ఆమె మీదా కేసు పెట్టొచ్చా? - ఓ సోదరి

మీ కథ సినిమాను తలపిస్తోంది. అందుకే, ఎదురుబొదురు పెళ్లిళ్లు చేసుకోవద్దని పెద్దలు చెబుతారు. మీ ఆడపడుచు పెళ్లి కారణంగా మిమ్మల్ని ఇంటి నుంచి వెళ్లగొట్టడం ఏంటి? ఇక, ఆమె మీ తప్పులేదని చెప్పలేదు. వాళ్ల పుట్టింటివాళ్లతో కలపడం లేదు అంటే... అందులో తన స్వార్థం కనిపిస్తోంది. మీ భర్త ఎందుకు కలవలేకపోతున్నారు. మీరు అత్తింటి వాళ్లపైన కేసు పెట్టి అందులో మీ ఆడపడుచుని కూడా చేర్చండి. గృహహింస చట్టం మీకు ఉపయోగపడుతుంది. ముందుగా మిమ్మల్ని వెళ్లగొట్టినందుకు, తిరిగి తీసుకువెళ్లనందుకు కేసు పెడితే ప్రొటెక్షన్ ఆఫీసర్ కౌన్సెలింగ్‌కి పిలిపిస్తారు. వాళ్లు చెప్పే మాటలు వినకపోతే కోర్టుకి పంపుతారు. మీరు అక్కడ కూడా మళ్లీ మధ్యవర్తిత్వం కోరండి. మీ తప్పులేకుండానే అన్నీ జరుగుతున్నాయని నిరూపించుకోండి. లేదంటే కోర్టు ద్వారా మీకు రావాల్సిన పరిహారాలన్నీ పొందవచ్చు. రెండు కుటుంబాల పరువు పోకూడదంటే మధ్యవర్తిత్వమే పరిష్కారం. అందరికంటే ముందు మీ ఆడపడుచుని ఏదైనా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌కి పిలిపించి కౌన్సెలింగ్ చేయిస్తే సరి. అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి.

రెండో పెళ్లి చేసుకున్నా... న్యాయం జరుగుతుందా?

పదహారేళ్ల క్రితం మాకు పెళ్లైంది. మా ఇద్దరికీ ఇది రెండో వివాహం. నా భర్త నేను చేసే ప్రతి పనినీ తప్పు పడుతూ మానసికంగా హింసిస్తున్నాడు. ఆఖరికి ఉప్పూ పప్పూ కూడా కొలతల ప్రకారమే ఇస్తాడు. ఇదంతా నాకు ఆందోళనగా ఉంది. పిల్లలకోసమే బతుకుతున్నా. విడాకులు తీసుకుంటే అంతా నన్నే తప్పు పడతారనిపిస్తోంది. ఒకవేళ నేను అతడిపై కేసుపెడితే నిలబడుతుందా? నాకూ బిడ్డలకీ న్యాయం జరుగుతుందా? - ఓ సోదరి

మీ ఇద్దరి రెండో వివాహం చట్టబద్ధంగా జరిగిందా? అంటే హిందూ వివాహచట్టంలో చెప్పిన పద్ధతి ప్రకారం జరిగి ఉంటే మీకు భార్యగా ఉండే న్యాయబద్ధమైన హక్కులన్నీ ఉంటాయి. పదహారేళ్ల క్రితం పెళ్లయ్యింది అంటున్నారు. ఇప్పుడు విడాకుల గురించి ఆలోచించే ముందు అతడికోసారి కౌన్సెలింగ్ చేయిస్తే మంచిదేమో! ఇన్నాళ్లూ పిల్లలకోసం భరించానంటున్నారు. వాళ్లతో ఓసారి చర్చించండి. మీ సమస్య పరిష్కారానికి మధ్యవర్తుల సాయం తీసుకోండి. అప్పటికీ అవ్వకపోతే అప్పుడు కోర్టు మెట్లు ఎక్కక తప్పదు. మీ భర్త జీవనోపాధికి ఏం చేస్తారు? పోషించగలిగే స్థోమత ఉంటే... మీకూ పిల్లలకీ ఎంత అవసరమో అతడి సంపాదన బట్టి మెయింటెనెన్స్ నిర్ణయమవుతుంది. సొంత ఇల్లు ఉంటే గృహహింస చట్టం సెక్షన్-19 ప్రకారం- ఇంట్లో నివసించే హక్కు, మీకూ పిల్లలకు కావాల్సిన నెలవారీ భరణం(సెక్షన్-20), పిల్లల కస్టడీ(సెక్షన్-21), ఇన్నేళ్లు పడ్డ మానసిక వేదనకు శాశ్వత పరిహారం (సెక్షన్ -22) పొందొచ్చు. గృహహింస చట్టంలో విడాకుల ప్రసక్తి లేదు కాబట్టి భవిష్యత్తులో... పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు బాధ్యత తీసుకోమని కూడా అడగొచ్చు. ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది







నగా నట్రా





శ్రావణంలో నల్లపూసల వైభవం!

వైవాహిక బంధానికి సూచికగా, సౌభాగ్యానికి ప్రతీకగా భావించే నల్లపూసల్ని మెచ్చని మగువలుంటారా చెప్పండి! అందులోనూ శ్రావణ మాసంలో వీటికిచ్చే ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. నల్లపూసల గొలుసు చేయించుకోవాలన్న ఆలోచన వచ్చిందంటే చాలు... వరలక్ష్మీ వ్రతం నాటికైనా అది తయారైతే బాగుండును అని కోరుకోని మనసుండదు. నిజానికి నలుపు రంగుని అశుభానికి గుర్తుగా భావిస్తాం. కానీ, నల్లపూసల్ని మాత్రం మంగళకరంగా పరిగణిస్తాం. అందుకే ఇవి వివాహితల స్టైల్ స్టేట్‌మెంట్‌లో ఓ భాగంగా మారిపోయాయి. అయితే ఒకప్పుడు వట్టి నల్లపూసల్నే గుచ్చుకుని వేసుకునేవారట. తర్వాత ఓ చిన్నపసిడి గొట్టం, తర్వాత గుండ్లూ, సూత్రాలు... ఇలా ఎప్పటికప్పుడు ఎన్నెన్నో డిజైన్లు వచ్చి చేరుతూనే ఉన్నాయి. ఆ మధ్య కనీకనిపించని బ్లాక్‌బీడ్స్‌ని ఎంచుకుంటే, తర్వాత హారాలు, నెక్లెస్‌లను పోలి ఉండేలా చేయించుకున్నారు. రాళ్లు, ముత్యాలు, పగడాలు, పచ్చలు.. వంటి నవరత్నాలతో జోడించి మురిసిపోయారు. ఇప్పుడు నెట్టెడ్ నల్లపూసల గొలుసులే ఫ్యాషన్ అంటున్నారు. పసిడి గొలుసు చుట్టూ వల అల్లినట్లుగా వస్తుందీ డిజైన్. బంగారు తీగల మధ్యన ముత్యాలు, పగడాలు... వంటివి చేర్చితే మరింత అందంగానూ కనిపిస్తుంది. మెడలో మరే ఆభరణం పెట్టుకోకపోయినా... నిండుగా కనిపించేలా చేస్తుంది. ఓసారి మీరూ చూడండి.





బంగారం - వెండి



28న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,010	92,000	1,16,325
విజయవాడ	98,300	91,700	1,16,400
ప్రొద్దుటూరు	98,900	90,990	1,16,300
రాజమహేంద్రవరం	99,930	91,600	1,26,000
విశాఖపట్నం	99,570	91,600	1,20,000
తమిళనాడు	----	91,600	1,26,000



పాపాయి కోసం ఇలా..!

ఇల్లూ, కారే కాదు, ఇంట్లోని ఫర్నిచర్ కొనాలన్నా ఇరుగు పొరుగు వారిని కనుక్కొని ఎక్కడ బాగుంటుందో తెలుసుకుని మరీ ప్లాన్ చేసుకుంటాం కదా! మరి మన జీవితంలో అత్యంత మధురమైన ఘట్టం తల్లి కావడం. అలాంటిది దీనికోసం ఎంత శ్రద్ధ చూపాలో... తల్లయ్యే ముందు మనమెంత దృఢంగా ఉండాలో తెలుసా!

- అమ్మ కావాలనుకునే ప్రతి అమ్మాయికి గర్భధారణ జీవితంలో మధురానుభవమే. తొమ్మిదినెలల ఈ ప్రయాణంలో ఎక్కడయినా అనుకోని పొరపాటు దొర్లినా జీవితం మొత్తం బాధ పడాల్సి ఉంటుంది. ఈ సమయంలో కొందరిలో గర్భస్రావం జరగొచ్చు. పుట్టే పిల్లలు లోపాలతో పుట్టి బాధ పడాల్సి ఉంటుంది. అందుకే తల్లి అవ్వాలనుకున్నవారు కనీసం 6 వారాల ముందునుంచీ సన్నద్ధం కావడం ఎంతో అవసరం అంటున్నారు నిపుణులు.
- కాబోయే అమ్మలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారు. ఇందుకు ముందునుంచే శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు అందించాలి. ఇందుకు పూర్తిగా మందుల మీదే ఆధారపడకుండా పోషకాలతో కూడిన సమతులాహారాన్ని తీసుకోవాలి.
- భార్యాభర్తలు ఆరోగ్యంగా ఉన్నప్పటికీ పుట్టే పిల్లలకి సుమారు 2శాతం జన్యు లోపాలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గర్భధారణకు ముందునుంచే ఫోలిక్ యాసిడ్ తీసుకోవాలి. ఇది గర్భస్థ శిశువు పెరుగుదలకు సాయపడుతూనే జన్యులోపాలు రాకుండా చాలావరకూ అడ్డుకుంటుంది.
- బరువు... తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా ప్రెగ్నెంట్ అవ్వడం కొందరికి కష్టం. బరువు ఎక్కువగా ఉంటే ఊబకాయంతో గర్భస్రావం జరిగే అవకాశం ఉంది. అందుకే బరువును అదుపులో ఉంచుకుంటే మంచిది అంటున్నారు నిపుణులు.
- రోజూ క్రమం తప్పక వ్యాయామం చేయాలి. దీంతో తొందరగా తల్లయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు వైద్యులు. అంతేకాదు, కాన్పు సజావుగానూ జరుగుతుందట.



విమర్శల్నీ... విందాం!

'పని బాగా చేశారు' అన్నది వినడానికి చాలామంది ఇష్టపడతారు. విమర్శను మాత్రం తట్టుకోలేరు. ముఖ్యంగా ఎంత కష్టపడి పనిచేసినా... అమ్మాయిల విషయంలో మాత్రం ఆఫీసుల్లో ప్రత్యేక లెన్స్‌లు పనిచేస్తాయి. అంటే వారి ప్రవర్తన, దుస్తులు... ఇలా ఎన్నో అంశాల ఆధారంగానూ జడ్జ్ చేస్తుంటారు. అలాంటప్పుడు కోపం, బాధ, అసహనం వంటివి కలగడం సహజమే. అలాగని వాటిని వినడానికి అయిష్టత ప్రదర్శించట్లేదు కదా?

ఎవరైనా ఏదైనా అన్నారనుకోండి వెంటనే సమాధానం ఇవ్వొద్దు. విమర్శ, ఫీడ్‌బ్యాక్... ఏదైతేనేం పూర్తిగా వినండి. మనం వింటేనే అవతలివాళ్లూ తరవాత మనం చెప్పేది వింటారు. ముఖ్యంగా పూర్తిగా వింటేనే దానికి దీటైన సమాధానాన్నీ ఇవ్వగలం. పోనీ అవతలివాళ్ల ఆలోచనలైనా తెలుస్తాయి. ఇదీ మంచిదే. దీన్నో బలహీనతగానూ భావించొద్దు. ఈ క్రమంలో ఓపిగ్గా వినడం, భావోద్వేగాల నియంత్రణ, సహానుభూతి వంటి ఎన్నో నైపుణ్యాలను మీకు తెలియకుండానే చేజిక్కించుకుంటారు. ఇవి మిమ్మల్ని మరింత శక్తిమంతంగా మలుస్తాయి. అయినా అన్నిసార్లూ ప్రశంసలు మేలే చేయవు. వాస్తవానికి దూరంగానూ తీసుకెళ్లగలవు. అప్పుడప్పుడు విమర్శలనీ తీసుకోవాలి. అప్పుడే మనల్ని మనం తీర్చిదిద్దుకోగలం. మార్చుకుంటూ ముందుకు సాగగలం. కాబట్టి...

ఈసారి ఎవరైనా మీ వ్యక్తిత్వం, పనితీరులో లోపాల గురించి చెబుతోంటే వినండి. అలాగని అవి వాస్తవమని భావించి, మిమ్మల్ని మీరు మార్చుకోమని కాదు. కేవలం వినండి. అవసరమైతే ఉదాహరణలతో చెప్పమనండి. వాస్తవమే అనిపించిందా... 'థాంక్స్' చెప్పి పాటించండి. లేదంటారా వదిలేయండి. ఎంతచెప్పినా ఒకరు 'నువ్విది... ఇలా చేశావ్ లేదా చేస్తావ్' అంటోంటే తెలిసీ తెలియక చేసినా అది బాధగానే అనిపిస్తుంది. వ్యక్తిగత దాడిగానూ తోస్తుంది. అయితే వాళ్లముందు బయటపడాల్సిన పనిలేదు కదా! ఇదీ నేర్చుకోవడమే అనుకుని వినండి. కానీ దానికీ ఓ హద్దు ఉంటుంది. మాట తూలినా, అగౌరవంగా మాట్లాడినా ఊరుకోవద్దు. అయితే ఇది ఎదుగుదలలో ఓ భాగం. కాబట్టి, భయపడొద్దు... ప్రశాంతంగా ఎదుర్కోండి!

నిశ్శబ్ద వ్యాపారవేత్త!

అందరిలో ఉన్నా ఒంటరితనం. ఎదుటివాళ్లు చెప్పేది అర్థం చేసుకుని స్పందించేలోపే... టాపిక్ మారిపోయేది. ఇక నోరు విప్పడానికి అవకాశమేది? నలుగురితో కలవలేక, పోటీపడలేక చాలా ఇబ్బందులే పడింది శ్రద్ధా అగర్వాల్. తనలా మరెవరూ ఇబ్బంది పడొద్దనుకున్న ఆమె అంత్రప్రెన్యూర్‌గా మారింది. ఆమెవరు? ఆ వ్యాపారమేంటంటే...

"అసాధ్యం' అన్నమాట నేనెప్పుడూ వినలేదు. ఈ మాట చెబితే నా గురించి తెలిసినవాళ్లు నిజమే అనుకుంటారు. నాకు పుట్టుకతోనే వినికిడిలోపం ఉంది కాబట్టి, అలా అన్నా అనుకుంటారేమో కానీ... ఆ పదాన్నే నేను నమ్మను. ఏ పరిస్థితి ఎదురైనా నా సొంత మార్గాన్ని ఏర్పరచుకోగలనన్న నమ్మకం నాది. పుట్టి పెరిగిందంతా చెన్నై. నా సమస్య కారణంగా వందల మందిలో కూర్చొని కూడా ఒంటరితనాన్ని అనుభవించడం ఎలా ఉంటుందో నాకు బాగా పరిచయమే. అమ్మానాన్నలు నాకెప్పుడూ అండగా నిలిచేవారు. కొందరు టీచర్లూ సాయపడ్డారు. దీంతో సాధారణ విద్యార్థులతోనే చదువుకునే అవకాశం వచ్చింది. పెదాల కదలికను బట్టి, ఎదుటివారి మాటలు, పాఠాలు అర్థం చేసుకోవాలి. ఒక్కోసారి మళ్లీ మళ్లీ చెప్పమని అడగాల్సి వచ్చేది. ఒక రకంగా మిగతావారితో పోలిస్తే నేను ఎన్నో రెట్లు కష్టపడాల్సి వచ్చేది. స్నేహంగా మాట కలుపుదామన్నా కష్టమే. వాళ్లు చెప్పేది అర్థం చేసుకునేలోపే సంభాషణ మారిపోయేది.

ఓసారి ఓ డెఫ్ స్కూలుకి తీసుకెళ్లారు అమ్మానాన్నలు. అక్కడంతా నాలాంటి వాళ్లే కదా ఉండేది. స్నేహితులు దొరుకుతారనుకున్నా. తీరా చూస్తే వాళ్ల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. ఇంటర్ చదివే వయసువాళ్లూ పదాలు రాయడానికి కష్టపడుతున్నారు. అది చూశాక నాలాంటి వాళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నా. డిగ్రీ తర్వాత, యూనివర్సిటీ ఆఫ్ వార్విక్‌లో అంత్రప్రెన్యూర్‌షిప్‌లో మాస్టర్స్ పూర్తిచేశా. తిరిగొచ్చాక నా లక్ష్యంపై దృష్టి పెట్టా'నని శ్రద్ధ 'సైన్‌సేతు' అనే స్టార్టప్‌ని ప్రారంభించింది. వినికిడి లోపం ఉన్నవారికోసమే రూపొందించిన

SIGNSETU



శ్రద్ధ

లర్నింగ్ ప్లాట్‌ఫామ్ ఇది. ఒకాబులరీ, కథల పుస్తకాలు, సైగల భాషతో కూడిన వీడియోలు ఉంటాయి. ప్రాథమికాంశాలు, చదువుకు సంబంధించిన కాన్సెప్ట్‌లను తేలిగ్గా అర్థం చేసుకునేలా దీన్ని తీర్చిదిద్దింది. తన శ్రమకు గుర్తింపుగా యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, అటల్ ఇన్నొవేషన్ మిషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రోగ్రామ్‌లో అవార్డుతోపాటు రూ.2లక్షల్నీ అందుకుంది.

'నా ఆలోచన చెప్పినప్పుడు, పెట్టుబడికోసం ప్రయత్నించినప్పుడు 'ఈమెను సీరియస్‌గా తీసుకోవచ్చా? తను చేయగలదా? నీకు ఇవన్నీ ఎందుకు' లాంటి ఎన్నో ప్రశ్నలు, సందేహాలు. నేనూ డీలా పడిన సందర్భాలున్నాయి. కానీ వెనక్కి మాత్రం తగ్గాలనుకోలేదు. ఫెయిల్ అయిన ప్రతిసారీ మళ్లీ మళ్లీ ప్రయత్నించా. తాజా గుర్తింపు నా శ్రమకు ఫలితం. నాలా ఎంతో మంది రాణించొచ్చు అని నిరూపించేలా మరెన్నో సాధిస్తా'నంటోన్న శ్రద్ధని అభినందించాల్సిందే కదూ!



పుత్రజయలో మలేసియా ప్రధాని అన్వర్(మధ్య)తో కంబోడియా(ఎడమ), థాయ్‌లాండ్(కుడి) ప్రధానులు హన్, ఫుమ్‌థమ్

థాయ్-కంబోడియా కాల్పుల విరమణ

ప్రకటించిన మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం

పుత్రజయ: ఆగ్నేయాసియాలో యుద్ధమేఘాలు తొలగిపోయాయి. ఐదు రోజులుగా సరిహద్దులో కాల్పులతో దద్దరిల్లిపోయిన థాయ్‌లాండ్-కంబోడియాలు ఎట్టకేలకు కాల్పుల విరమణకు అంగీకరించాయి. కంబోడియా ప్రధాని హున్‌మానెట్, థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుమ్‌థమ్ వెచాయాచాయ్‌లు షరతుల్లేని కాల్పుల విరమణకు అంగీకరించారు. ఈ విషయాన్ని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సోమవారం నాడిక్కడ సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. "సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాల సైనికాధికారులు కూడా సమావేశాలు నిర్వహిస్తారు. కాల్పుల విరమణ అమలును, శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు మలేసియా, థాయ్, కంబోడియాల విదేశాంగ, రక్షణ శాఖలు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలని నిర్ణయించాం" అని అన్వర్ వెల్లడించారు. చర్చల అనంతరం జరిగిన విలేకరుల సమావేశాన్ని థాయ్- కంబోడియా నేతలు కరచాలనంతో ముగించారు. రెండు గంటలకు పైగా జరిగిన ఈ చర్చలకు చైనా, అమెరికా రాయబారులు హాజరయ్యారు.

ఫోర్జరీ కాని పత్రమేమైనా ఉందా?

- ఈసీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ఆధార్, ఓటరు కార్డులనూ పరిగణనలోకి తీసుకోవాలని సూచన



దిల్లీ: బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణను నిలిపివేసేలా మధ్యంతర ఆదేశాలిచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం సోమవారం నిరాకరించింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది విచారణను నేరుగా ప్రారంభించనున్నట్లు తెలిపింది. విచారణ షెడ్యూల్‌ను ఈ నెల 29న ఖరారు చేస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం వెల్లడించింది. వాదనలు వినిపించడానికి ఎవరికి ఎంత సమయం కావాలో మంగళవారంలోగా తెలియజేయాలని ఇరుపక్షాల న్యాయవాదులకు సూచించింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కోసం గుర్తింపు పత్రాలుగా ఆధార్, ఓటరు కార్డులనూ పరిగణనలోకి తీసుకోవడాన్ని కొనసాగించాలని ఎన్నికల సంఘాని(ఈసీ)కి మరోసారి స్పష్టం చేసింది. రేషన్ కార్డు కన్నా ఈ రెండు కార్డులు కొంత మెరుగైన విశ్వసనీయతను కలిగి ఉన్నాయని అభిప్రాయపడింది. ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ తన వాదనలు వినిపిస్తూ...'పౌరసత్వ నిరూపణకు ఆధార్ కార్డును సాక్ష్యంగా పరిగణించలేం. ఓటరు కార్డుపైనా పూర్తిగా ఆధారపడలేం' అని తెలిపారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ..'ఈ భూమిపై ఫోర్జరీకి గురికాని పత్రమేమైనా ఉందా. ఏ కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా? ఫోర్జరీ జరిగిందనే అనుమానం ఉంటే విడివిడిగా ఆయా కేసులను పరిశీలించండి. మొత్తంగా అన్నింటినీ నిరాకరిస్తామంటే ఎలా?' అని ప్రశ్నించారు. ఓటరు జాబితా సవరణలో ఆధార్, ఓటరు కార్డుతో పాటు వాటిని బలపరిచే పత్రాలను కూడా ఈసీ పరిశీలిస్తోందని ద్వివేదీ తెలిపారు. బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ నిలిపివేతకు మధ్యంతర ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ధర్మాసనాన్ని కోరారు. పిటిషనర్లు మధ్యంతర ఉపశమన ఆదేశాలు కోరుకోలేదనే విషయాన్ని గత విచారణ సమయంలోనే స్పష్టం చేశామని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రస్తుతం స్టే ఇవ్వలేమని, ఒకేసారి వ్యాజ్యాన్ని తేల్చేస్తామని పేర్కొంది.

మరి కమిటీ ముందుకు ఎందుకు హాజరయ్యారు?

- జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీం ప్రశ్న

దిల్లీ: అంతర్గత కమిటీ విచారణలో ఎందుకు పాల్గొన్నారని, విచారణానంతరం వారిచ్చిన నివేదిక చెల్లదని ఎలా అంటారని జస్టిస్ యశ్వంత్ వర్మను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దర్యాప్తు చేసే అధికారం కమిటీకి లేదని అంటూనే ఆ నివేదికను సమర్పించే వరకు ఎందుకు ఆగారు, అప్పుడే న్యాయస్థానంలో ఎందుకు సవాల్ చేయలేదని నిలదీసింది. తన అధికార నివాసంలో భారీగా నోట్ల కట్టలపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన త్రిసభ్య విచారణ కమిటీ చెల్లుబాటు కాదని, ఆ కమిటీ నివేదికను రద్దు చేయాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం విచారణ నిర్వహించింది. నోట్ల కట్టలు ఎవరివో కమిటీ తెలుసుకుంటుందని భావించి కమిటీ ముందు తన వాదనలు వినిపించేందుకు హాజరయ్యారని వర్మ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేసిన తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కమిటీ ఏర్పాటు ప్రక్రియనే తప్పుపడుతూ... సుప్రీంకోర్టును ప్రతివాదిగా ఎలా చేరుస్తారని ప్రశ్నించింది. పిటిషనును సరి చేసుకోవాలని పేర్కొంటూ తదుపరి విచారణను ఈ నెల 30కి ధర్మాసనం వాయిదా వేసింది.

'విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు?'

దిల్లీ: నొయిడాలోని శారదా విశ్వవిద్యాలయంతో పాటు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యార్థుల ఆత్మహత్యల అంశాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు సోమవారం పలు ప్రశ్నలను లేవనెత్తింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఇటీవల నాలుగో సంవత్సరం విద్యార్థి, శారదా విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. "అసలు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఏం జరుగుతోంది? విద్యార్థులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మీరు దీని గురించి ఏమైనా ఆలోచించారా? వీటిని నివారించేందుకు తీసుకున్న చర్యలేమిటి?" అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. తదుపరి పరిశీలన కోసం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

'క్షమాపణ చెప్పకుండా సహనాన్ని పరీక్షిస్తున్నారు'

దిల్లీ: సైన్యాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా బహిరంగ క్షమాపణ చెప్పకుండా న్యాయస్థానం సహనాన్ని పరీక్షిస్తున్నారని సుప్రీంకోర్టు సోమవారం మండిపడింది. షా ప్రవర్తన ఆయన ఉద్దేశాల పట్ల అనుమానం కలిగించేలా ఉందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీల ధర్మాసనం అభిప్రాయపడింది. షా ఆన్‌లైన్‌లో బహిరంగ క్షమాపణ చెప్పారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దానికి సంబంధించిన వీడియో రికార్డును చూపించాలని కోర్టు కోరింది. మంత్రి వ్యాఖ్యలపై విచారణ కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం వచ్చేనెల 13లోగా తుది నివేదిక సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చేనెల 18కు వాయిదా వేసింది.

బిహార్‌లో ఎస్ఐఆర్‌ను రద్దు చేయండి

- పార్లమెంటు ఆవరణలో విపక్షాల నిరసన
- పాల్గొన్న ఖర్గే, సోనియా, అఖిలేశ్
- రాజ్యసభలోనూ డిమాండ్, వాయిదా



సోమవారం పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక, కనిమొళి, అవదేశ్ ప్రసాద్ తదితరులు

దిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను (ఎస్ఐఆర్) నిరసిస్తూ సోమవారం విపక్షాలు పార్లమెంటు ఆవరణలో ఆందోళన నిర్వహించాయి. లోక్‌సభ సమావేశం ప్రారంభం కావడానికి ముందు జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ నేతలు డెరెక్ ఓబ్రియెన్, సాగరికా ఘోష్, డీఎంకే ఎంపీలు కనిమొళి, ఎ.రాజా, లెఫ్ట్, ఆర్జేడీ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు మకర ద్వారంవద్ద నినాదాలు చేశారు. 'ఎస్ఐఆర్- ప్రజాస్వామ్యంపై దాడి' అనే పెద్ద బ్యానరును ప్రదర్శించారు. విపక్ష ఎంపీలు ఇలా నిరసన తెలపడం వరుసగా ఇది ఐదోరోజు. 'స్టాప్ ఎస్ఐఆర్' ప్లకార్డులను ఎంపీలు ప్రదర్శించారు. ఎస్ఐఆర్ అంశంపై సోమవారమూ రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు నిరసనలను కొనసాగించారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని గత కొన్ని రోజులుగా వారు సభ బయటా, లోపల ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తొలుత వివిధ అంశాలపై 26 వాయిదా తీర్మానాలు వచ్చాయని శూన్య గంటలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తెలిపారు. వాటన్నింటినీ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. మాట్లాడాల్సిందిగా నామినేటెడ్ సభ్యురాలు సుధామూర్తికి సూచించారు. అయితే విపక్ష సభ్యుల ఆందోళనతో రెండుసార్లు వాయిదాపడి మళ్లీ సమావేశమైనా పరిస్థితులు అదుపులో లేకపోవడంతో సభ మంగళవారానికి వాయిదా పడింది.

అవసానేశ్వర్ ఆలయంలో తొక్కిసలాట

ఇద్దరి మృతి, 47 మందికి గాయాలు

బారాబంకీ: హరిద్వార్‌లోని మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట ఘటన మరవకముందే అలాంటి మరో సంఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని హైదర్‌గఢ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. అవసానేశ్వర్ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మృతి చెందగా, 47 మంది గాయపడ్డారు. శ్రావణ మాసం సందర్భంగా గుడిలో నిర్వహించే 'జలాభిషేకం'లో భక్తులు భారీగా పాల్గొన్నారని జిల్లా మెజిస్ట్రేట్ శశాంక్ త్రిపాఠీ తెలిపారు. ఆ సమయంలో విద్యుత్ తీగను కోతులు తెంచడంతో అది అక్కడ ఉన్న మూడు షెడ్లపై పడిందని.. దీంతో భక్తులు భయభ్రాంతులకు గురవడంతో తొక్కిసలాట జరిగిందని వివరించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఇద్దరు మృతి చెందడం బాధాకరమని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసదుపాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నన్‌ల అరెస్టు

- గిరిజన బాలికల మత మార్పిడికి ప్రయత్నించారంటున్న ప్రభుత్వం

దిల్లీ, రాయ్‌పుర్, కొచ్చిన్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పుర్‌లో ఇద్దరు క్రైస్తవ సన్యాసినుల (నన్‌)ల అరెస్టుపై రాజకీయ దుమారం రేగుతోంది. వారు గిరిజన బాలికల మత మార్పిళ్లకు, మహిళల అక్రమ రవాణాకు పాల్పడ్డారని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తుండగా.. నన్‌ల అరెస్టు.. మైనారిటీలపై దాడేనని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. సీపీఎం కూడా అరెస్టును ఖండించింది. ఈ కేసు కోర్టు పరిధిలో ఉందని, దర్యాప్తు జరుగుతోందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్ స్పష్టం చేశారు. నారాయణ్‌పుర్‌కు చెందిన ముగ్గురు గిరిజన బాలికలను స్థానికుడొకరు.. ఈ నెల 25వ తేదీన దుర్గ్ రైల్వే స్టేషన్‌వద్ద ప్రీతి మేరీ, వందనా ఫ్రాన్సిస్ అనే ఇద్దరు నన్‌లకు అప్పగించాడు. ఈ సమాచారం తెలుసుకున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గిరిజన బాలికలను బలవంతపు మత మార్పిళ్లకు ప్రోత్సహిస్తున్నారని, వారికి నర్సు శిక్షణ, ఉద్యోగాల పేరుతో ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆగ్రాకు తరలించేందుకు నన్‌లు ప్రయత్నించారని ఆరోపించారు. బాలికలను మభ్యపెట్టి తరలిస్తున్నారని ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. దీంతో ఇద్దరు నన్‌ల తోపాటు సుకమన్ మాండవీ అనే వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు.

మత మార్పిడుల కుట్రే: సీఎం

ఇదో తీవ్రమైన అంశమని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్ సోమవారం స్పష్టం చేశారు. మహిళల అక్రమ రవాణా, మత మార్పిడుల కుట్రని ఆరోపించారు. పరిస్థితిని తమ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని, మహిళల భద్రతపై దృష్టి సారించిందని తెలిపారు. బస్తర్ ఆడబిడ్డలు.. రాష్ట్ర సంస్కృతికి, గుర్తింపునకు గర్వకారణమని వ్యాఖ్యానించారు.



మీరు బరువు తగ్గాలనుకుంటున్నారా? అయితే ఒత్తిడిని దరిచేరనివ్వకండి. దీర్ఘకాలిక ఒత్తిడి శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ స్థాయిలను పెంచుతుంది. కొవ్వుల నిల్వను (ప్రధానంగా పొట్ట చుట్టూ) ఆ హార్మోన్ ప్రోత్సహిస్తుంది. దానివల్ల- బరువు తగ్గాలన్న మీ లక్ష్యం నీరుగారిపోతుంది. ధ్యానం, నడక, తగినంత నిద్ర వంటివి ఒత్తిడిని జయించేందుకు దోహదపడతాయి.

– వారెన్ ఇంగ్లిష్, ఫిట్‌నెస్ కోచ్

నా జోక్యం లేకుంటే భారత్, పాక్ యుద్ధం కొనసాగేది

- మరోసారి ట్రంప్ వ్యాఖ్య



లండన్, ఎడిన్‌బరో: సరైన సమయంలో తాను జోక్యం చేసుకోకుంటే భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉండేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. యుద్ధ విరమణ కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కిచ్చిన 50 రోజుల గడువును కుదిస్తున్నానని తెలిపారు. గాజాలో ఆకలి కేకల్లేవన్న ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు అభిప్రాయంతో విభేదిస్తున్నాయని స్పష్టం చేశారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి సోమవారం ఆయన స్కాట్లాండ్‌లోని టర్న్‌బెర్రీ గోల్ఫ్ రిసార్టులో మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో తాను 6 యుద్ధాలను ఆపానని ట్రంప్ తెలిపారు. 'వాణిజ్య ఒప్పందం చేసుకోబోనని హెచ్చరించడంతో భారత్-పాక్ దిగివచ్చి కాల్పుల విరమణకు అంగీకరించాయి. రష్యా అధ్యక్షుడికి ఇచ్చిన 50 రోజుల గడువును కుదిస్తున్నా. మూడేళ్ల యుద్ధానికి తెరదించేలా ఒప్పందానికి రావాలని హెచ్చరించా. సెప్టెంబరులోగా దిగివచ్చేలా రెండు వారాల కిందట భారీ సుంకాలను విధించా. సోమవారం నుంచి 10 నుంచి 12 రోజుల సమయమిస్తా. ఆగస్టు 9 కల్లా శాంతి చర్యలు కొలిక్కి రావాలి. లేకుంటే ఆంక్షలు, సుంకాలు మరింత పెరుగుతాయి' అని ట్రంప్ పేర్కొన్నారు.

నిర్ణయాలు తీసుకోగలిగే నాయకులే రావాలి

- అఖిలపక్ష సమావేశాలపై స్పీకర్ సూచన

దిల్లీ: అఖిల పక్ష సమావేశాలకు నిర్ణయాలు తీసుకోగలిగే నాయకులే రావాలని అన్ని పార్టీలకు స్పీకర్ ఓం బిర్లా సూచించారు. అలాగైతేనే పార్లమెంటు ఎజెండాను ఖరారు చేయగలమని స్పష్టం చేశారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై సోమవారం లోక్‌సభలో విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ తర్వాత బిహార్ ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ స్పందించారు. 'గతవారం నా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగాలని అన్ని పార్టీలకు చెందిన సభ్యులు విజ్ఞప్తి చేశారు. దీంతో 16 గంటలపాటు చర్చించాలని నిర్ణయించాం. అప్పుడు అన్ని పార్టీలు అంగీకరించి.. ఇప్పుడు మరో అంశంపై ఆందోళన చేస్తున్నాయి' అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. వెల్‌లో ఉండి ఏ అంశంపైనా చర్చకు డిమాండు చేయలేరని, నిబంధనలకు అనుగుణంగా సభ నడుస్తుందని స్పష్టం చేశారు. నిర్ణయాలు తీసుకోగలిగే నేతలనే అఖిలపక్ష సమావేశానికి పంపాలని సభలో ఆందోళన చేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు సూచించారు.

మా ఆర్థిక వ్యవస్థను మూసేసుకోవాలా

- రష్యా చమురు కొనుగోళ్లపై భారత్

లండన్: రష్యా నుంచి చమురు దిగుమతులపై పశ్చిమ దేశాల అభ్యంతరాలను బ్రిటన్‌లోని భారత్ హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తప్పుబట్టారు. ఓ బ్రిటిష్ రేడియోకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు తప్పనిసరి అని అన్నారు. లేకపోతే ఆర్థిక వ్యవస్థను మూసేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. రష్యా, ఇతర దేశాల నుంచి అరుదైన ఖనిజాలు, ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఐరోపా దేశాలు భారత్‌ను ప్రశ్నించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్కోతో దిల్లీకి ఎప్పటినుంచో రక్షణ సంబంధాలు ఉన్నాయని అన్నారు. "పాశ్చాత్యదేశాలు మాకు ఆయుధాలు అమ్మకుండా మాపై దాడి చేసే పొరుగుదేశాలకు ఇచ్చిన కాలం నుంచి మాకు రష్యా అండగా నిలిచింది" అని తెలిపారు. రష్యాతో ఇంధన సంబంధాలపై మాట్లాడుతూ.. "గతంలో మేం కొనుగోలు చేసిన దేశాల నుంచి అందరూ కొనడం ప్రారంభించారు. దీంతో మాకు ఇబ్బందులు తలెత్తాయి. మా దేశంలో ధరలు పెరిగిపోయాయి. అలాంటి సమయంలో మేం ఏం చేయాలి. రష్యా నుంచి దిగుమతి చేసుకోకుండా మా ఆర్థిక వ్యవస్థను మూసేసుకోవాలా" అని దొరైస్వామి ప్రశ్నించారు.

ట్రంప్‌నకు మెలానియాను ఎప్‌స్టీన్ పరిచయం చేశాడా!

ఇంటర్నెట్‌డెస్క్: సెక్స్ కుంభకోణంలో దోషిగా నిరూపితమై జైలుశిక్ష అనుభవించిన జెఫ్రీ ఎప్‌స్టీనే... మెలానియాను డొనాల్డ్ ట్రంప్‌నకు పరిచయం చేశాడని పాత్రికేయుడు, పుస్తక రచయిత మైఖేల్ వోల్ఫ్ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి. ట్రంప్ జీవిత చరిత్రపై పుస్తకాలు రాసిన వోల్ఫ్.. 'డైలీ బీస్ట్' పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..ఎప్‌స్టీన్ సోషల్ సర్కిల్‌లో మెలానియా ఉన్నారని.. ఆ క్రమంలోనే ట్రంప్‌నకు ఆమెను ఎప్‌స్టీన్ పరిచయం చేశాడని పేర్కొన్నారు. మెలానియా మాత్రం.. 1998లో తాను, ట్రంప్ ఓ పార్టీలో కలిశామని, తర్వాత ఇద్దరం వివాహం చేసుకున్నామని తెలిపారు. మైనర్లతో లైంగిక కార్యకలాపాలు సాగించారన్న కేసులో దోషిగా తేలిన ఎప్‌స్టీన్‌కు న్యాయస్థానం జైలు శిక్ష కూడా విధించింది. ఆయన కారాగారంలోనే ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన దస్త్రాల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు కూడా ఉందన్న వార్తలు ఇటీవల కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో మెలానియాను ట్రంప్‌నకు ఎప్‌స్టీనే పరిచయం చేశాడన్న వోల్ఫ్ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.

పాక్ కుట్రలకు అడ్డుకట్ట పడాలి

- లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గొగొయ్



సోమవారం లోక్‌సభలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

దిల్లీ: మన దేశంపై పాక్ కుట్రలను సాగనివ్వకూడదని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం సభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారో ప్రభుత్వం చెప్పలేదన్నారు. ఆపరేషన్లో మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? సైనిక చర్య నిలిపివేతకు ఎవరి ముందు మోదీ లొంగిపోయారు? పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునేది ఎప్పుడు?.. అనేవి వివరించాలని డిమాండ్ చేశారు. దేశానికి, సైన్యానికి అనుకూలంగానే తాము మాట్లాడుతున్నామని, శత్రువులుగా మాత్రం తమను పరిగణించవద్దని అన్నారు. దాడికి పాల్పడ్డ ఉగ్రవాదుల్ని తందూరీలో కాల్చాలని (ఆపరేషన్ తందూర్‌ని) ప్రజలు కోరుకున్నారే తప్ప 17 రోజుల ఆలస్యంతో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ని కాదని సమాజ్‌వాదీ ఎంపీ రామశంకర్ రాజ్‌భర్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ మరో 20 ఏళ్లు విపక్షంలోనే

మంత్రి జైశంకర్ మాటల్ని విశ్వసించకుండా వేరే దేశంవారిని కాంగ్రెస్ నమ్ముతోందని, ఆ పార్టీ మరో 20 ఏళ్లు విపక్షంలోనే కూర్చొంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎద్దేవా చేశారు. పాక్‌తో క్రికెట్ ఆడటానికి మనదేశం దూరంగా ఉండాలని శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ సూచించారు. కాళ్ల బేరానికి వచ్చిన పాక్‌కు షరతులు ఎందుకు విధించలేదని ప్రశ్నించారు. సెంచరీ సాధించబోతున్న క్రికెటర్ 90 పరుగుల తర్వాత అకస్మాత్తుగా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసినట్లుగా ఆపరేషన్ సిందూర్ మిగిలిందని తృణమూల్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ అన్నారు. అమెరికా అధ్యక్షుడి ప్రకటన తప్పు అని చెప్పే ధైర్యాన్ని ప్రధాని ప్రదర్శించలేకపోయారని విమర్శించారు.

చర్చ నుంచి పారిపోతున్నాయి: రిజిజు

ఉగ్రదాడిపై చర్చను అడ్డుకోవడం ద్వారా విపక్షాలు నమ్మకద్రోహానికి పాల్పడ్డాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ నుంచి అవి పారిపోతున్నాయని ఆయన విలేకరులతో మాట్లాడుతూ విమర్శించారు.

చిదంబరం వ్యాఖ్యలపై వివాదం

పహల్గాం ఉగ్రదాడి వెనక దేశీయ ఉగ్రవాదులు ఉండొచ్చంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. "పహల్గాం ఉగ్రదాడి తర్వాత జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఏం చేసిందన్నది బయటపెట్టేందుకు ప్రభుత్వం విముఖంగా ఉంది. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఎక్కడినుంచి వచ్చారన్న ప్రశ్నలకు సమాధానం లేదు. వారు దేశీయ ఉగ్రవాదులే కావొచ్చన్న సందేహాలూ ఉన్నాయి. అలాంటప్పుడు పాకిస్థాన్ నుంచి వచ్చారనడానికి ఆధారాలున్నాయా? మన వైపు జరిగిన నష్టాన్ని గురించి ప్రశ్నిస్తే ప్రభుత్వం ఎందుకు తప్పుపడుతోంది? ప్రధాని మోదీ దీని గురించి పార్లమెంటులో మాత్రం ఎందుకు మాట్లాడాలనుకోవడం లేదు?" అని నిలదీశారు. దీనిపై భాజపా నేత అమిత్ మాలవీయ మండిపడ్డారు. ''పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని మన భద్రతా దళాలు తిప్పికొట్టిన ప్రతిసారీ.. కాంగ్రెస్ నేతలు ఇస్లామాబాద్ డిఫెన్స్ లాయర్లుగా మాట్లాడతారెందుకో? కాంగ్రెస్‌వారు ఎప్పుడూ శత్రువును రక్షించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు" అని విమర్శించారు.

దేశ ప్రజలపై తలసరి రుణభారం రూ.1,32,059

ఈనాడు, దిల్లీ: కేంద్రం తీసుకున్న అప్పుల కారణంగా దేశ ప్రజలపై ఈ ఏడాది మార్చి 31 నాటికి తలసరి రూ.1,32,059 మేర రుణభారం ఉన్నట్లు తేలిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి సోమవారం తెలిపారు. వడ్డీల కింద 2022-23లో రూ.9.29 లక్షల కోట్లు, 2023-24లో రూ.10.64 లక్షల కోట్లు, 2024-25లో రూ.11.18 లక్షల కోట్లు చెల్లించినట్లు లోక్‌సభలో చెప్పారు. 2025-26 బడ్జెట్ ప్రకారం వడ్డీలకు రూ.12.76 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 2031 నాటికి కేంద్ర రుణాలను జీడీపీలో 50% లోపునకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.



తూర్పు సిక్కింలో సోమవారం 'దివ్య దృష్టి' పేరిట సైన్యం నిర్వహించిన ఆయుధ ప్రదర్శన

బ్యాంకాక్‌లో కాల్పుల కలకలం

ఆరుగురి మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం 12.38 గంటల సమయంలో ఓర్ టోక్ కోర్ మార్కెట్‌లోకి ప్రవేశించిన ఆగంతుకుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఓ మహిళ మృతి చెందారు. అనంతరం కాల్పులు జరిపిన వ్యక్తి కూడా తనను తాను కాల్చుకొని మరణించాడు.

సయోధ్య యత్నాలకు ససేమిరా


ఉభయ కొరియాల ఉద్రిక్తతలు యథాతథం

సియోల్: దక్షిణ కొరియాలో జూన్‌లో అధికారంలోకి వచ్చిన ఉదారవాద ప్రభుత్వం ఉత్తర కొరియాతో సయోధ్యకు ప్రయత్నాలు మొదలుపెట్టినా, అవతలి పక్షం పెడసర వైఖరి కొనసాగిస్తూనే ఉంది. ఉత్తర కొరియా దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జాంగ్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో దక్షిణ కొరియా ఇప్పటికీ అమెరికాతో పొత్తును గుడ్డిగా నమ్ముకొంటోందని అభ్యంతరపెట్టారు. రష్యాతో సహకార బంధాన్ని బలపరచుకుంటున్న ఉత్తర కొరియాకు దక్షిణ కొరియా, అమెరికాలతో సయోధ్య యత్నాలు చేపట్టాల్సిన అవసరం కనిపించడం లేదు. దక్షిణ కొరియా నుంచి ఎలాంటి ప్రతిపాదన వచ్చినా తాము పట్టించుకునేది లేదని కిమ్ సోదరి స్పష్టం చేశారు. త్వరలో అమెరికా, దక్షిణ కొరియాలు సంయుక్తంగా చేపట్టనున్న సైనిక విన్యాసాలను ఉత్తర కొరియాపై దండయాత్రకు రిహార్సల్‌గా ఆమె అభివర్ణించారు. తమ సంయుక్త సైనిక విన్యాసాల స్థాయిని ఒకింత తగ్గించడానికి సిద్ధమని దక్షిణ కొరియా మంత్రి చంగ్ డాంగ్ యంగ్ సూచించినా అసలు అమెరికాతో పొత్తును పూర్తిగా విడనాడాలని ఉత్తర కొరియా ఆశిస్తోంది. అయితే భవిష్యత్తులో ప్రత్యామ్నాయాలతో ముందుకొచ్చే అవకాశం లేకపోలేదు.

పాఠశాల గేటు శ్లాబు కూలి ఆరేళ్ల బాలుడి మృతి

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఘటన

జైపుర్: పాఠశాల భవనం కప్పు కూలిపోయి ఏడుగురు విద్యార్థులు మృతి చెందిన మూడు రోజుల వ్యవధిలోనే రాజస్థాన్‌లోని మరో బడిలో ఘోరం చోటుచేసుకుంది. తరగతులు ముగియడంతో ఇంటికి వెళ్లేందుకు పాఠశాల ప్రధాన గేటు వద్దకు వచ్చిన ఆరేళ్ల బాలుడిపై శ్లాబు విరిగిపడింది. ఈ ఘటనలో అర్బాజ్ ఖాన్ ప్రాణాలు కోల్పోగా ఒక టీచర్‌కు, మరో విద్యార్థికి గాయాలయ్యాయి. జైసల్మేర్‌లోని పూనమ్‌నగర్ సీనియర్ సెకండరీ బాలికల పాఠశాలలో సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన అర్బాజ్ ఖాన్ తన సోదరితో కలిసి ఇంటికి వెళ్లేందుకు అక్కడకు వచ్చినప్పుడు శ్లాబు ఆకస్మికంగా విరిగి పడింది. కొద్ది రోజుల క్రితం ఈ గేటును ఓ వాహనం బలంగా ఢీకొట్టిందని, బలహీనపడిన శ్లాబు కూలిపోయిందని భావిస్తున్నారు.




పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం బోల్‌పుర్‌లో నిర్వహించిన ఆందోళన

బెంగాల్‌లో 'భాషా ఆందోళన'కు నాంది పలికిన మమత

బోల్పుర్(పశ్చిమ బెంగాల్): వచ్చే ఏడాది జరగబోయే పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సమరశంఖం పూరిస్తూ.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం 'భాషా ఆందోళన్'కు నాంది పలుకుతున్నట్లు ప్రకటించారు. భాజపా, ఎన్నికల సంఘం దొడ్డిదారిన ఎన్ఆర్‌సీని అమలుచేసే ప్రయత్నం చేస్తున్నాయని, బెంగాలీ మాట్లాడే ప్రజలపై భాషా పరమైన ఉగ్రవాదాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆమె ఆరోపించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్ స్థాపించిన బోల్‌పుర్‌లో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ ఆమె రాష్ట్రవ్యాప్త బెంగాలీ భాషా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. "నా ప్రాణాలనైనా అర్పిస్తాను కానీ భాషను వీడను" అని స్పష్టంచేశారు. బెంగాలీ ఆత్మగౌరవాన్ని, పేద ప్రజల ఓటు హక్కును హరించి ఓటరు జాబితా సవరణ పేరుతో బెంగాలీ వలసదారుల్ని తరిమివేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తానని స్పష్టంచేశారు. భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మైనారిటీలు, ఓబీసీలపై, పేదలపై, బెంగాలీ మాట్లాడే ఓటర్లపై దాడికి పాల్పడుతోందని, సమగ్ర ఓటరు జాబితా సవరణ పేరుతో సిసలైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నార్సీ తరహా కసరత్తు చేస్తోందని మమత ఆరోపించారు. ఎన్నికల సంఘం అసలైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. "నేను బతికున్నంత వరకూ బెంగాల్‌లో ఎన్నార్సీ అమలు కానివ్వను. ఇక్కడ డిటెన్షన్ క్యాంపులు నిర్మించడానికి నేను అనుమతివ్వను. బెంగాల్‌లో ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పర్యవసానాలు తప్పవు" అని ఆమె హెచ్చరించారు.

బి-కేర్‌ఫుల్!



ఏమిటిది?

బి6 విటమిన్‌ను పైరిడాక్సిన్ అని పిలుస్తారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

ఆహారంలోని ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వుల జీవక్రియలో దీనికి ప్రమేయం ఉంది. విషయగ్రహణ సామర్థ్యానికి బి6 చాలా కీలకం.

మెదడులో న్యూరోట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తిలోనూ ఇది ముఖ్యపాత్ర పోషిస్తుంది. మన భావోద్వేగాలను నియంత్రించడంలో ఈ రసాయన మెసెంజర్లు కీలకం.

యాంటీబాడీల ఉత్పత్తిలో తోడ్పడటం ద్వారా రోగనిరోధక వ్యవస్థకు బి6 కీలకం. రక్తంలోని హిమోగ్లోబిన్ ఉత్పత్తికీ ఈ విటమిన్ అవసరం.

76 ఏళ్ల మేరీ బుచానన్.. దాదాపు 4 దశాబ్దాల పాటు ఎమర్జెన్సీ ఫిజీషియన్‌గా ఉరుకుల పరుగుల జీవితాన్ని గడిపారు. పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా జీవితాన్ని గడుపుదామనుకుంటున్న తరుణంలో ఆమెకు అనూహ్య ఇబ్బంది వచ్చిపడింది. కొద్దిదూరం నడవడానికి కూడా అవస్థ పడుతున్నారు. మెట్లు ఎక్కడం, దిగడం చేయలేకపోతున్నారు. కాళ్లలో విపరీతమైన నొప్పి. కండరాల్లో బలం తగ్గింది. తీవ్ర అలసట ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అది మల్టిపుల్ స్క్లెరోసిస్ లేదా మోటార్ న్యూరాన్ వ్యాధి కావొచ్చని మేరీ ఆందోళన చెందారు. సమస్య నానాటికీ తీవ్రమైంది. ఎట్టకేలకు ఓ న్యూరాలజిస్టు ఆమె సమస్యను గుర్తించగలిగారు. ఆమెకు పెరిఫెరల్ న్యూరోపతి అనే సమస్య ఉన్నట్లు తేల్చారు. ఇది 'బి6 విటమిన్ విషతుల్యత' వల్ల తలెత్తినట్లు గుర్తించారు. ఆమె శరీరంలో సాధారణం కన్నా ఏడు రెట్లు ఎక్కువగా బి6 విటమిన్ ఉన్నట్లు తేలింది. దీనివల్ల ఆమె కాళ్లలోని నాడుల అంచులు దెబ్బతిన్నట్లు వెల్లడైంది. - ఈనాడు ప్రత్యేక విభాగం

అది ప్రమాదం...

- బి6 విటమిన్ సప్లిమెంట్లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల దుకాణాల్లో లభ్యమవుతున్నాయి. వందలాది ఉత్పత్తుల్లో ఈ విటమిన్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు.
- మినరల్ సప్లిమెంట్లు, శక్తినిచ్చే పానీయాలు, బరువు తగ్గడానికి వాడే షేక్‌లు వంటి వందలాది ఉత్పత్తుల్లో బి6 సప్లిమెంట్ ఎక్కువగా ఉంటోంది.
- శరీరంలో ఈ విటమిన్ లోపించినట్లు తేలినవారు మాత్రమే వైద్యుల సలహా మేరకు ఈ సప్లిమెంట్‌ను వాడాలి. అయితే ప్రజలు తెలియకుండానే దీన్ని అధిక మోతాదులో తీసుకుంటున్నారు.
- చాలా కేసుల్లో మిగులు బి6.. మూత్రం ద్వారా వెలుపలికి వెళ్లిపోతుంది. అలాంటివారిలో దుష్ప్రభావాలు కనిపించవు. దీర్ఘకాలం పాటు, అధిక డోసును వాడితే పెరిఫెరల్ న్యూరోపతికి దారితీయవచ్చు.
- దీర్ఘకాలం పాటు బి6 విటమిన్ సప్లిమెంట్‌ను తీసుకున్న అనేకమందిలో న్యూరోపతి సమస్య నేపథ్యంలో ఆస్ట్రేలియా ఔషధ నియంత్రణ సంస్థ ఈ సప్లిమెంట్ విక్రయాలపై ఆంక్షలు విధించింది.

జాగ్రత్తగా వాడాలి



నివారించదగిన న్యూరోపతి వంటి సమస్యల బారినపడకుండా చూడటానికి బి కాంప్లెక్స్ సప్లిమెంట్లను జాగ్రత్తగా వాడాలి. నిజానికి ఎలాంటి సప్లిమెంట్లను తీసుకోవడానికైనా ముందు వైద్య సలహా అవసరం. ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు లేదా ఇతర ఔషధాలు తీసుకుంటున్నప్పుడు ఇది తప్పనిసరి. విటమిన్ సప్లిమెంట్ల ప్యాకెట్లపై లేబుళ్లను జాగ్రత్తగా పరిశీలించాలి. ముఖ్యంగా బి6 స్థాయిని గమనించాలి. వైద్య సలహా ఉంటే తప్పించి.. రోజువారీ సూచించిన మోతాదుకు కన్నా ఎక్కువగా ఉండే ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. కాళ్లు, చేతుల్లో నొప్పి, తిమ్మిర్లు, కండరాల్లో బలహీనత వంటి సమస్యలున్నా, సమన్వయంలో ఇబ్బందులు వంటి న్యూరోపతి లక్షణాలతో అప్రమత్తంగా ఉండాలి. అలాంటివి కనిపిస్తే సప్లిమెంట్ల వాడకాన్ని నిలిపివేయాలి. తృణ ధాన్యాలు, మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తుల ద్వారా సహజసిద్ధంగా బి విటమిన్లు పొందాలి.

- డాక్టర్ రాజేశ్ మద్దిపాటి, ఫ్యామిలీ ఫిజీషియన్, లివర్‌పూల్, యూకే

రోడ్డెక్కిన రెస్టారెంట్






ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని టంగుటూరు వద్ద ఎన్‌హెచ్-16 టోల్‌గేట్‌పై ఓ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. వాహనదారులకు ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంది. టోల్‌ప్లాజా వద్ద విశాలమైన స్థలం వాహనాల పార్కింగ్‌కు వీలుగా ఉంది. లిఫ్ట్ ద్వారా హోటల్‌కు చేరుకుని, హైవేపై దూసుకెళ్లే వాహనాలను చూస్తూ రుచులు ఆస్వాదించొచ్చు. హైదరాబాద్, వైజాగ్, విజయవాడ నుంచి హైవే మీదుగా తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఇది అందుబాటులో ఉంది.

- ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, టంగుటూరు

ఓ నాన్న.. ముగ్గురు బాక్సర్లు..



ఎతేశాముద్దీన్ షంషుద్దీన్ ఎహతేసాముద్దీన్ హుసాముద్దీన్

ఆయన రాష్ట్రస్థాయి బాక్సర్.. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించలేక పోయానే అనే వేదన ఆయనలో ఉండేది. దానిని పూరించాలనే లక్ష్యంతో.. తన నలుగురు కుమారుల్లో ముగ్గురిని బాక్సర్లుగా తీర్చిదిద్దారు. వారిలో ఒకరు అర్జున అవార్డు గ్రహీత కాగా.. మరొకరు భారత మహిళా బాక్సింగ్ జట్టుకు కోచ్‌గా సేవలందిస్తున్నారు. ఆ తండ్రి.. నిజామాబాద్‌కు చెందిన షంషుద్దీన్ కాగా.. కుమారులు 'ఎతేశాముద్దీన్', 'ఎహతేసాముద్దీన్', హుసాముద్దీన్.. తండ్రి బాటలోనే నడిచి గుర్తింపు సాధించారు. షంషుద్దీన్.. చిన్న టీ కొట్టు నడుపుతూనే బాక్సింగ్ సాధన చేసి పతకాలు సాధించారు. - ఈనాడు, నిజామాబాద్

◆ రెండో కుమారుడు 'ఎతేశాముద్దీన్'.. వైఎంసీఏ అంతర్జాతీయ బాక్సింగ్‌తో పాటు రొమేనియా, రష్యాలో జరిగిన పోటీల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచారు. ఇంగ్లాండ్‌లో సెప్టెంబరు 4 నుంచి 15 వరకు జరగనున్న ఎలైట్ మహిళలు, పురుషుల ఛాంపియన్‌షిప్‌కు భారత మహిళా జట్టు శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు. బాక్సింగ్ సంచలనం నిఖత్ జరీన్ ఈయన వద్ద శిక్షణ తీసుకున్నారు.

◆ మూడో కుమారుడు హుసాముద్దీన్ 2019లో ఫిన్‌లాండ్, పోలాండ్, థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో రజతాలు, జర్మనీలో కాంస్యం దక్కించుకున్నారు. 2020లో జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, వైజా ఓపెన్ టోర్నీలో స్వర్ణం గెలిచారు. 2022 కామన్వెల్త్‌లో కాంస్యంతో దేశానికి ఖ్యాతి తెచ్చిపెట్టి అర్జున అవార్డు అందుకున్నారు.

◆ మొదటి కుమారుడు 'ఎహతేసాముద్దీన్'.. వైఎంసీఏ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. జూనియర్ నేషనల్స్‌తో పాటు ఆలిండియా విశ్వవిద్యాలయాల స్థాయి పోటీల్లో రజతంతో ప్రతిభ చాటారు.

ఒక జిల్లాలో 16 నదులు.. 14 ఆనకట్టలు



గోవింద్ సాగర్ ఆనకట్ట

ఏదైనా జిల్లాలో రెండు లేదా మూడు ఆనకట్టలు, కొన్ని నదులు ఉండటం సహజం. కానీ.. ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్ జిల్లా ఏకంగా 16 నదులు, 14 ఆనకట్టలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. అందుకే ఈ జిల్లాను రాష్ట్ర నీటి రాజధానిగా అభివర్ణిస్తారు. శ్రావణ మాసంలో ఈ ఆనకట్టల నుంచి నీరు గలగలా ప్రవహిస్తుంది. లలిత్‌పూర్ తొలుత ఝాన్సీ డివిజన్‌లో ఉండేది. చరిత్రకారుల ప్రకారం.. మహారాజా సుమేర్ సింగ్ భార్య లలితా దేవి పేరు మీద లలిత్‌పూర్ అని పేరు పెట్టారు. 1974లో దీనికి జిల్లా హోదా లభించింది.

-ఈటీవీ భారత్

నదులు.. బేత్వా, ధసన్, జమ్‌నీ వంటి ప్రధాన నదులతో పాటు ముర్రారి, గైరో, గరయా, ఆర్, సజని, సప్రార్, రోహిణి, లఖేరి, వైనర్, పర్నహా, సంజం, సుహాడ్, బీనా బీర్మా వంటి ఉపనదులు ఈ జిల్లాలో ప్రవహిస్తున్నాయి.

ఆనకట్టలు.. గోవింద సాగర్, రాజ్ ఘాట్, సజ్నం, షాజాద్, జామ్ని, మతాటిలా, రోహిణి, ఉత్తరి, కచ్నొండా, దిగువ రోహిణి, జామ్‌దార్, భవానీ, బందాయ్, భౌన్‌రత్

ఇక ఆ దురవస్థకు చెల్లు



మ్యాన్‌హోళ్లలో బ్లాక్ అయిన మురుగును శుభ్రం చేయడానికి ఇప్పటివరకూ పారిశుద్ధ్య కార్మికులే (మాన్యువల్ స్కావెంజర్) అందులోకి దిగాల్సిన దుస్థితి. దీనికి పరిష్కారం చూపుతూ ఐఐటీ మద్రాస్ అభివృద్ధి చేసిన రోబోటిక్ మ్యాన్‌హోల్ క్లీనింగ్ యంత్రం (హోమోసెప్) వారం క్రితమే హైదరాబాద్‌కు వచ్చింది. కృత్రిమ మేధతో పనిచేసే ఈ యంత్రంతో హైదరాబాద్‌లోని పద్మారావునగర్ కాలనీలో సోమవారం ఓ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేశారు. ఇందులో చిన్నపాటి బకెట్ లాంటి పరికరాన్ని మ్యాన్‌హోల్‌కి దించి శుభ్రం చేస్తారు. ఈ యంత్రానికి అమర్చిన కెమెరా సహాయంతో.. లోపలి దృశ్యాలను మానిటర్‌లో పరిశీలిస్తూ నిర్వాహకుడు ఆపరేట్ చేస్తారు. ఈ యంత్రం విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. - ఈనాడు, హైదరాబాద్

ఈ బుజ్జాయి పేరిట ఓ రికార్డు



అరె.. బుజ్జిపాప భలే కూర్చుందే. నడవడమే రాని ఆరు నెలల వయసులో తనేం రికార్డు సాధించిందనుకుంటున్నారా! 44 నిమిషాల ఎనిమిది సెకన్లపాటు ఎవరీ సాయం లేకుండా అలాగే కూర్చుండిపోయింది. కర్ణాటక రాష్ట్రం కంప్లికి చెందిన న్యాయవాది మోహన్‌కుమార్ దానప్ప, సౌమ్యశ్రీ దంపతుల రెండో కుమార్తె ద్వితా మోహన్ జూన్ 28న ఇలా ఎక్కువ సమయం పాటు కూర్చొని వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. పాప కూర్చోవడానికి వీలుగా కుటుంబ సభ్యులు రకరకాల బొమ్మలు చేతికి అందించగా వాటితో చక్కగా ఆడుకుంది. ఈ మొత్తం ప్రక్రియను వీడియో తీశారు. - న్యూస్‌టుడే, కంప్లి

పక్షికి ఆహారం





పక్షులకు ఆహారంగా వరి కంకులను కుంచెలుగా తయారు చేసి ఎక్కడికక్కడ వేలాడదీస్తున్నారు కాకినాడ జిల్లా తునికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పోలుపర్తి దాలినాయుడు. దీనిపై రైతుల్లోనూ అవగాహన కల్పిస్తూ వారికి ఆదాయ మార్గం చూపుతున్నారు. పక్షుల కోసమే నాలుగు ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. తనకు వచ్చే దిగుబడిని మహిళలకు ఇచ్చి వారితో కుంచెలు తయారు చేయిస్తున్నారు. ఆ కుంచెలను గుడులు, బడుల్లో వేలాడదీసి పక్షులపై మమకారాన్ని చాటుకుంటున్నారు. ఆయన మార్గంలో మరికొందరు రైతులు కుంచెలు రూపొందిస్తున్నారు. ఆటోల్లో అలంకరించి అమ్మకాలు చేస్తున్నారు. వాట్సప్‌లో ఆర్డర్లు తీసుకుని దూరప్రాంతాలకు పంపిస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. - ఈనాడు, కాకినాడ

కేరాఫ్ డాగ్ బాబు

బిహార్‌లో శునకానికి నివాస ధ్రువీకరణ



పట్నా: ఓ శునకానికి అధికారులు నివాస ధ్రువీకరణ పత్రం (రెసిడెన్స్ సర్టిఫికెట్) జారీ చేశారు. విచిత్రంగా ఉంది కదూ! ఈ ఘటన బిహార్‌లోని మసౌర్హి డివిజన్‌లో వెలుగుచూసింది. ఈ నెల 24వ తేదీతో ఉన్న నివాస ధ్రువీకరణ పత్రంలో శునకం పేరు 'డాగ్ బాబు' అని.. తండ్రి పేరు 'కుత్త బాబు', తల్లి పేరు 'కుటియా దేవి'గా ఉండటం గమనార్హం. దీనికి సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన బిహార్‌లో రాజకీయ దుమారం రేపింది. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల తీరుపై ప్రతిపక్ష నేతలు ధ్వజమెత్తారు. దీనిపై విమర్శలు రావడంతో స్పందించిన అధికారులు శునకం రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను రద్దు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి దరఖాస్తుదారు, కంప్యూటర్ ఆపరేటర్ సహా సర్టిఫికెట్ జారీ చేసిన అధికారిపైనా కేసు నమోదు చేసినట్లు పట్నా జిల్లా యంత్రాంగం పేర్కొంది. ఈ ఘటనపై 24 గంటల్లోగా నివేదిక సమర్పించాలని మసౌర్హి సబ్-డివిజనల్ అధికారిని ఆదేశించినట్లు తెలిపింది. మరోవైపు.. తనిఖీల్లో ధ్రువీకరణ పత్రంలోని సంతకం రెవెన్యూ అధికారిదేనని తేలింది. ఇందులో ఆర్టీపీఎస్ కౌంటర్‌లో కూర్చున్న డేటా ఉద్యోగుల నిర్లక్ష్యం కూడా ఉందని బయటపడింది. సర్టిఫికెట్ నంబరు పరిశీలించినప్పుడు అది దిల్లీకి చెందిన ఓ మహిళకు సంబంధించినదిగా గుర్తించారు. శునకానికి నివాస ధ్రువీకరణ పత్రం జారీ పట్ల బిహార్ ప్రభుత్వంపై స్వరాజ్ పార్టీ నేత యోగేంద్ర యాదవ్ విమర్శలు గుప్పించారు.

పిల్ల నాగులకు ప్రాణం పోశారు



అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని నల్లరాయి కొండకు ఆనుకుని ఉన్న అచ్చియ్యమ్మకు చెందిన జీడితోట అది. ఓ భారీ గిరినాగు బుసలు కొడుతూ రావడాన్ని పశువుల కాపరులు గుర్తించారు. ఈ విషయాన్ని తూర్పు కనుమల వన్యప్రాణి సంరక్షణ సంస్థ వ్యవస్థాపకుడు మూర్తి కంఠి మహంతికి సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని చూడగా, ఆ గిరినాగు గుంతలో గుడ్లు పొదుగుతోంది. దానికి హాని తలపెట్టకుండా కదలికల్ని గమనించాలని స్థానిక రైతులకు సూచించారు. 15 రోజుల తర్వాత ఆ పాము గుడ్లు వదిలేసి వెళ్లిపోగానే.. వాటికి రక్షణగా ఓ వలను ఏర్పాటు చేయించారు. నెల తర్వాత ఆ గుడ్లన్నీ పిల్లలుగా మారాయి. సోమవారం అటవీ అధికారులతో కలిసి గుంతలో ఉన్న 30 గిరినాగు పిల్లల్ని శంకరం రక్షిత అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. - న్యూస్‌టుడే, దేవరాపల్లి

లోన్ తీసుకొని కారు కొనుక్కోవాలనుకుంటే..!



మీరు రుణం తీసుకొని కారు కొనుక్కోవాలనుకుంటున్నారా? అయితే '20-4-10' నియమాన్ని మరువకండి. అదేంటంటే-

✦ కారు ధరలో కనీసం 20 శాతాన్ని డౌన్‌పేమెంట్ కింద చెల్లించండి.

✦ లోన్ మొత్తాన్ని నాలుగేళ్లలోపే చెల్లించేయండి.

✦ మీ వేతనంలో 10 శాతం కంటే ఎక్కువ డబ్బును కారుపై ఏ నెలలోనూ ఖర్చు పెట్టకండి.


- కెన్నీ, పర్సనల్ ఫైనాన్స్ కోచ్

ఈ రక్తం బంగారమే



ఇంటర్నెట్ డెస్క్: బ్లడ్ గ్రూపుల్లో అరుదైన 'గోల్డెన్ బ్లడ్' ఉందని తెలుసా? ప్రపంచవ్యాప్తంగా 50 కన్నా తక్కువ మంది మాత్రమే ఈ గ్రూపు పరిధిలోకి వస్తారు. ఎర్రరక్త కణాల్లో ఆర్‌హెచ్ యాంటీజెన్‌లు లేకపోతే దాన్ని 'ఆర్‌హెచ్ నల్' రకం లేదా 'గోల్డెన్ బ్లడ్' గ్రూపు అని పేర్కొంటున్నారు. 1961లో ఆస్ట్రేలియాకు చెందిన ఓ ఆదివాసీ మహిళ రక్తంలో ఏ, బీ లేదా ఆర్‌హెచ్ యాంటీజెన్‌లు లేవని తేలడంతో తొలిసారి 'గోల్డెన్ బ్లడ్' గ్రూపు నమోదైంది. 2022లో గుజరాత్‌కు చెందిన 65 ఏళ్ల వ్యక్తిది గోల్డెన్ బ్లడ్ గ్రూపుగా నిర్ధారించారు. ఈ గ్రూపును ప్రాణప్రదాయినిగా చెప్పొచ్చు. 'ఆర్‌హెచ్ నల్' బ్లడ్ గ్రూపు ఉన్న వ్యక్తులు అదే రకమైన దాతల నుంచి మాత్రమే రక్తం పొందాల్సి ఉంటుంది. అందువల్ల ఇది అత్యంత అరుదు, ఖరీదైనదిగా మారింది.

పుల్లా? పురుగా?



చిత్రంలో ఉన్నది ఏదో ఎండిపోయిన పుల్ల అనుకుంటే పొరబడినట్లే. ప్రకృతి తయారుచేసిన అనేక జీవరాశుల్లో ఇదీ ఒకటి. వాకింగ్ స్టిక్, స్టిక్ ఇన్‌సెక్ట్ అనే పిలుచుకునే ఈ కీటకం ఫాస్మాటోడియా క్రమానికి చెందినది. సాధారణంగా ఒకటి నుంచి 12 అంగుళాల పరిమాణం ఉండే ఈ జీవి ఆకులను తింటూ జీవిస్తుంది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పి.ఎన్.పల్లి గ్రామంలో ఓ ఇంటి గోడపై పాకుతూ కనిపించింది.

-న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)

ఈ ఆచరణ.. కావాలి ప్రేరణ



ముందు మనం ఆచరించాకే మంచి విషయాన్ని ఇతరులకు చెప్పాలంటారు పెద్దలు. కాకినాడ జిల్లా అధికారులు ప్లాస్టిక్ నిషేధం విషయంలో ఇదే సూత్రాన్ని పాటిస్తూ మన్ననలు పొందుతున్నారు. కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఇచ్చిన ఆదేశాలను ప్రతి ఉద్యోగి తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. వారంతా స్టీలు బాటిళ్లలోనే నీరు తెచ్చుకుంటున్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలోనూ అధికారులకు స్టీలు సీసాలతోనే నీళ్లు ఇచ్చారు. కలెక్టరేట్ ఆవరణలోనూ 'ఇది ప్లాస్టిక్ నిషేధిత ప్రాంతం' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. - ఈనాడు, కాకినాడ

మిరియాలు, బొండాలు సాగుతున్నాయి కలిసిమెలిసి!



వక్క, కొబ్బరి చెట్లపైకి అల్లుకున్న నల్లమిరియాల పాదులను చూపిస్తున్న చక్రపాణి వక్క చెట్టు

నాలుగైదు పంటలను ఒకే పొలంలో సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు ఏలూరుకు చెందిన ఉప్పలపాటి చక్రపాణి. పెదవేగి మండలం లక్ష్మీపురంలోని తన 6 ఎకరాల్లో కొబ్బరి తోటను ప్రధాన పంటగా వేశారు. అంతర పంటలుగా వక్క, మిరియాలు, పసుపు, దాల్చిన చెక్కలనూ సాగు చేస్తూ ఆయా ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా విక్రయిస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తుండటంతో ఉత్పత్తులకు డిమాండ్ బాగానే ఉంటోందని చక్రపాణి తెలిపారు. ఏడేళ్లుగా ఎకరానికి సగటున ఏటా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఆదాయం వస్తోందన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు తన వ్యవసాయ క్షేత్రంలో సాగు విధానాలనూ నేర్పుతున్నానని వివరించారు. - ఈనాడు, ఏలూరు

హతవిధీ.. ప్లాస్టిక్కే 'ఎర'



చెరువులు, కుంటల్లో చేపలు పట్టేందుకు గాలానికి వానపాములు, కప్పలు, చిన్న చేపలు వంటి వాటిని ఎరగా కడతారు. ప్రస్తుతం ఈ సహజ ఎరల స్థానంలో ప్లాస్టిక్‌తో చేసిన కప్పలు, కీటకాల బొమ్మలు అందుబాటులోకి వచ్చాయి. కరీంనగర్‌కు చెందిన పలువురు వ్యక్తులు ఆన్‌లైన్‌లో గాలాలు, ప్లాస్టిక్ ఎరలు కొనుగోలు చేసి తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ జలాశయం సమీప కాకతీయ కాలువలో చేపలు పడుతున్నారు. సహజ ఎరల కోసం పంట పొలాల వెంబడి తిరగడం తప్పిందని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, తిమ్మాపూర్

రాతలతో.. తలరాతలు మార్చాలని..



మంచి మాటలు వింటుంటే.. మంచి మాటలు చదువుతుంటే.. ఏదో ఒక రోజు వాటిని ఆచరించాలని మనసుకు కుతూహలం పుట్టక మానదు. ఇదే ఆయనను ఆలోచింపజేసింది. మంచి మాటలను వ్యాప్తి చేయాలని.. బహిరంగ ప్రదేశాల్లో వాటిని రాస్తూ.. తనవంతు ప్రయత్నం చేస్తున్నారు హైదరాబాద్ అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ దాదే శ్రీనివాస్ (55). చదివింది పదోతరగతి అయినా... వివేకానందుడి సూక్తుల నుంచి తాను పొందిన స్ఫూర్తిని ఇతరులకు అందించాలని.. 'చేతికి కలాన్నే' కట్టుకున్నారు. "నా ఇంట్లోనే మార్పు రావాలనే లక్ష్యంతో ఓ బోర్డు ఏర్పాటు చేసి.. పిల్లలకు తెలియజేసేందుకు రోజూ రెండు నీతి వాక్యాలు రాసేవాడిని. అవి ప్రభావం చూపించి వారు ప్రయోజకులై ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఈ సంతోషంతో సమాజంలోనూ మార్పు రావాలనే సంకల్పంతో మూడేళ్లుగా కుంచెపట్టి బహిరంగ ప్రదేశాల్లో సందేశం పంచే అక్షరాలు రాస్తున్నా" అని వివరించారు శ్రీనివాస్. - ఈనాడు, హైదరాబాద్



సింగపూర్ ప్రభుత్వం నిర్మిస్తున్న టువాస్ పోర్టులో సీఎం చంద్రబాబు

సింగపూర్ మోడల్‌లో ఏపీ పోర్టుల అభివృద్ధి

- పోర్టుల నిర్వహణకు ఏఐ సాంకేతికత
- టువాస్ పోర్టును సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆసియాలో రెండో అతిపెద్ద కంటెయినర్ టెర్మినల్ పోర్టుగా సింగపూర్ ప్రభుత్వం నిర్మిస్తున్న టువాస్ పోర్టును ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సందర్శించారు. రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నందున పోర్టుల అభివృద్ధి, పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు ఆకర్షించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సింగపూర్ పర్యటన రెండో రోజు టువాస్ పోర్టును సీఎం ఆధ్వర్యంలోని మంత్రుల బృందం సందర్శించింది. రెండు గంటలపాటు అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేసింది. పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీ రీజనల్ సీఈవో విన్సెంట్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. పోర్టు నిర్మాణం, నిర్వహణ, కార్యకలాపాలపై చర్చించారు. పోర్టు కార్యకలాపాల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఎలా వినియోగిస్తున్నారో ఆరా తీశారు. ఏఐతో కూడిన ఆటోమేషన్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. రూ.1.70 లక్షల కోట్లతో పోర్టు నిర్మిస్తున్నామని, నాలుగు విడతల్లో నిర్మించాలన్నది తమ ప్రభుత్వ ప్రణాళిక అని విన్సెంట్ వివరించారు. రాష్ట్రంలో ప్రతి 50 కి.మీ. తీర ప్రాంతంలో ఓ పోర్టు నిర్మించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లతో ఏపీని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సింగపూర్‌లోని టువాస్ పోర్టు అనుసరిస్తున్న విధానాలు ఎంతవరకు ఉపకరిస్తాయన్న అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల బృందం అధ్యయనం చేస్తోంది. రాష్ట్రంలోని పోర్టులను సింగపూర్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే అవకాశాలపై అక్కడి అధికారులతో చర్చించింది. మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, ఉన్నతాధికారులు ఈ బృందంలో ఉన్నారు.

సింగపూర్, ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఫెస్టివల్ నిర్వహిస్తాం

అంకురాల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పిస్తాం

ఏపీ, సింగపూర్ బిజినెస్ ఫోరం సమావేశంలో చంద్రబాబు



ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం, సీఐఐ భాగస్వామ్య సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: యువ పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కల్పించేలా ఆంధ్రప్రదేశ్, సింగపూర్ స్టార్టప్ ఫెస్టివల్ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పిస్తామని.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నామని వివరించారు. ఏపీ, సింగపూర్ బిజినెస్ ఫోరం రోడ్ షోలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. పలువురు పారిశ్రామికవేత్తలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. '2014-15లో విశాఖపట్నంలో స్టార్టప్ ప్రారంభించాం. అప్పుడు ప్రభుత్వం ఎంతో సహకరించింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. ఒక కుటుంబం- ఒక వ్యాపారవేత్త విజన్‌లో మెంటార్‌ను కూడా జోడించి యువ పారిశ్రామికవేత్తలకు దిశానిర్దేశం చేయాలి. ఏపీ, సింగపూర్ స్టార్టప్ ఫెస్టివల్ నిర్వహించాలి' అని పారిశ్రామికవేత్త ఆనంద్ చేసిన సూచనకు చంద్రబాబు పైవిధంగా సమాధానమిచ్చారు.

మహిళల భద్రతకు కట్టుబడి ఉన్నాం

'తెలుగుదేశం నిరంతరం మహిళా సాధికారత కోసం కృషి చేస్తుంది. డ్వాక్రా సంఘాలను మేమే ప్రారంభించాం. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ల కల్పన ఇవన్నీ ఎన్టీఆర్ హయాంలోనే జరిగాయి' అని యాక్సిస్ బ్యాంకు ప్రతినిధి టీనా ప్రశ్నకు చంద్రబాబు సమాధానం చెప్పారు.

ఆహారోత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసింగ్

'వ్యవసాయంలో పరిమితికి మించి ఎరువులు, పురుగుమందుల వాడకం క్యాన్సర్‌కు కారణమవుతోంది. అందుకే మేం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ అమలు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏ ఉత్పత్తి వచ్చినా.. దానికి సర్టిఫికేషన్ ఉంటుంది. ఏ రైతు, ఏ ప్రాంతంలో పండించారో తెలుసుకోవచ్చు. అందుకు వీలుగా ప్రైవేటు అక్రిడిటేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఆగ్రో ప్రాసెసింగ్‌కు అనువైన విధానాలు అమలు చేస్తున్నాం' అని మరో పారిశ్రామికవేత్త ప్రశ్నకు చంద్రబాబు సమాధానమిచ్చారు. 'కృష్ణపట్నంలో ఎల్పీజీ ప్రాజెక్టు కొనసాగుతోంది. ఎగుమతులకు అనుమతుల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కేంద్రం నుంచి సమస్యలున్నాయి. వీటిని పరిష్కరించడానికి ఏం చేస్తారు?' అని కెప్టెన్ రామన్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వీలైతే పరిష్కరిస్తామని.. అవసరమైతే కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని చంద్రబాబు జవాబిచ్చారు.

గ్లోబల్ మార్కెట్‌లోకి వెళ్లేందుకు సహకరిస్తాం

'జంతు వ్యాధి నిర్ధారణ కిట్స్‌ను ప్రపంచ మార్కెట్‌లోకి తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. సహాయం చేయండి' అని విజయవాడకు చెందిన మహిళా వ్యాపారవేత్త సీఎంను కోరారు. వివరాలివ్వండి.. ప్రపంచ మార్కెట్లో మీ ఉత్పత్తులు తీసుకెళ్లేందుకు మా బృందం మీకు సహాయం చేస్తుందని సీఎం హామీ ఇచ్చారు.

స్టార్టప్ ఎకోసిస్టమ్ ప్రారంభించాలి

'ఏపీలో స్టార్టప్ ఎకో సిస్టమ్ ప్రారంభించాలి. సింగపూర్ స్టార్టప్‌లు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించేలా ఒక టూర్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం దీన్ని స్పాన్సర్ చేయాలి' అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎడ్యుటెక్ స్టార్టప్ సీఈఓ దేవికా ప్రకృతి విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ఆమెను ప్రశంసించారు.



సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు. చిత్రంలో సీఐఐ ఏపీ ఛైర్మన్ మురళీకృష్ణ, మంత్రులు టీజీ భరత్, నారా లోకేశ్, సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి నారాయణ, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ యాక్షన్ కమిటీ వైస్ ఛైర్మన్ ప్రసూన్ ముఖర్జీ

సింగపూర్ నుంచి అమరావతికి రావాలని ఉంది

'స్మార్ట్‌సిటీస్ ప్రాజెక్టుపై సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. అమరావతి స్మార్ట్ సిటీగా తయారు చేయడంలో సహకారం అందిస్తాం. మా అనుభవాలు అందిస్తాం' అని డెల్ టెక్నాలజీస్ గ్లోబల్ హెడ్ అజాజ్ మున్సిఫ్ చెప్పారు. '1989లో ఇండియా నుంచి సింగపూర్ వచ్చాను. మీ విజన్, నాయకత్వం, దార్శనికత అద్భుతంగా ఉన్నాయి. మీ ప్రజంటేషన్ చూశాక అమరావతికి రావాలని ఉంది' అని వివరించారు. 'చాలా సంతోషం.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మీకు అందుబాటులో ఉంటారు. కలిసి పనిచేద్దాం. మీ దగ్గరున్న సాంకేతికతలు, అనుభవాలను మేమూ అందిపుచ్చుకుంటాం. రేపటి నుంచే ఆచరణలో పెడదాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఏపీ సురక్షిత పెట్టుబడులకు గమ్యస్థానం

సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం

ఈనాడు-అమరావతి: విశాఖలో నవంబరులో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆయన సోమవారం 'ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం' తరఫున సీఐఐ భాగస్వామ్య సమ్మిట్ రోడ్‌షోలో పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. 'ఏపీ పెట్టుబడులకు సురక్షిత గమ్యస్థానం. మీతో గతంలో ఉన్న సంబంధాల కారణంగా వచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నా. పారిశ్రామికవేత్తలు ఏపీకి రండి. ఏఏ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకోడానికి అవకాశాలు ఉన్నాయో పరిశీలించండి. ప్రపంచ పోటీలో నిలిచేలా.. అత్యుత్తమ, నవకల్పనల సమాజాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగస్వాములు కండి' అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్ పాల్గొన్నారు.

అమరావతి.. సంపద సృష్టించే నగరం

అమరావతిని గొప్ప నగరంగా తీర్చిదిద్దబోతున్నామని సీఎం పేర్కొన్నారు. 'సైబరాబాద్, అమరావతి వంటి రెండు గొప్ప నగరాలను అభివృద్ధి చేసే అవకాశం నాకు వచ్చింది. అమరావతి నిర్మాణానికి ఇప్పటికే రూ.50,000 కోట్లతో టెండర్లు పిలిచాం. రైతులు ల్యాండ్ పూలింగ్ కింద 33,000 ఎకరాలు ఇచ్చారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించే సమయంలో అక్కడ ఎకరా రూ.లక్ష. ఇప్పుడు ఎకరా రూ.100 కోట్లు. ఇదే రీతిలో అమరావతి సంపద సృష్టించే నగరంగా మారబోతోంది. దక్షిణాదిలోని అమరావతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలను అనుసంధానం చేసేలా బుల్లెట్ రైలు వస్తుంది. అది గేమ్ ఛేంజర్ కానుంది' అని వివరించారు.

సింగపూర్‌తో సంబంధాల పునరుద్ధరణ

సింగపూర్ ప్రభుత్వంతో సంబంధాలు పునరుద్ధరించినట్లు సీఎం పేర్కొన్నారు. 'ఆ దేశ మంత్రిని కలిసి మాట్లాడిన తర్వాత సానుకూలత లభించింది. రేపు మరికొందరు మంత్రులను కలిసి మాట్లాడతాం. సింగపూర్‌తో మూడు దశాబ్దాలుగా నాకు అనుబంధం ఉంది. అందుకే 2014లో అడిగిన వెంటనే అమరావతి మాస్టర్ ప్లాన్ ఉచితంగా ఇచ్చింది' అని తెలిపారు.



సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టాన్ సీ లాంగ్‌తో సీఎం చంద్రబాబు

ఒప్పందంపై సంతకం చేశాక పూర్తి బాధ్యత మాదే

ఏపీ-సింగపూర్ బిజినెస్ సమాఖ్య రోడ్ షోలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలు ఒకసారి ఒప్పందంపై సంతకం చేశాక ఆ ప్రాజెక్టు పూర్తి బాధ్యత తమదేనని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆ ప్రాజెక్టును తమదిగా భావించి అన్ని అనుమతులు, సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ - సింగపూర్ బిజినెస్ ఫోరం, సీఐఐ భాగస్వామ్య సమ్మిట్ రోడ్ షోలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. "పట్టణ ప్లానింగ్ గవర్నెన్స్, పట్టణ మౌలిక సదుపాయాల్లో సింగపూర్ సహకారాన్ని ఏపీ ప్రభుత్వం కోరుకుంటోంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో చంద్రబాబు విజ్ఞప్తి మేరకు.. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా సింగపూర్ ప్రభుత్వం అమరావతికి మాస్టర్ ప్లాన్ అందించింది. 974 కి.మీ. సువిశాల తీర ప్రాంతం ఉన్న ఏపీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డాటా సెంటర్స్, గ్రీన్ ఎనర్జీ, ఫిన్‌టెక్, బయో టెక్నాలజీ వంటి రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. ఆదిత్య మిత్తల్‌తో కేవలం ఒక్క జూమ్ కాల్ సంభాషణతో భారత దేశంలోనే అతిపెద్దదైన ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించారు. మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి ఇదొక నిదర్శనం. రెన్యూ పవర్ సంస్థ ఇండియాలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్ పనులను అనంతపురం జిల్లాలో ప్రారంభించింది. ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ఇటీవల ప్రకటించిన ఎలక్ట్రానిక్స్ పాలసీ-4.0తో ఏపీ ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారబోతోంది. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు మా వద్ద సిద్ధంగా ఉన్నాయి. హైటెక్ ఉత్పత్తి యూనిట్లకు అవసరమైన ఆర్ అండ్ డీ, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. సింగపూర్ నుంచి ఏపీలో పరిశ్రమల స్థాపనకు వచ్చే పెట్టుబడిదారులకు అవసరమైన పూర్తిస్థాయి మద్దతు అందిస్తాం. ఇన్నోవేషన్, ఇన్వెస్ట్‌మెంట్, ఇంపాక్ట్ సహకారాన్ని సింగపూర్ నుంచి కోరుకుంటున్నాం" అని తెలిపారు.

రాష్ట్రంలో ఎవర్‌వోల్ట్ నైపుణ్య శిక్షణ కేంద్రం

ఎంఆర్‌వో కేంద్రం ఏర్పాటుపై ఎయిర్‌బస్‌తో చర్చ

ఆయా సంస్థల ప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం



ఎవర్‌వోల్ట్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ సైమన్ టాన్‌తో చర్చిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఏపీ అధికారులు, ఆ సంస్థ ప్రతినిధులు

ఈనాడు-అమరావతి: మంత్రి లోకేశ్ సింగపూర్‌లో రెండోరోజు పర్యటనలో భాగంగా పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి.. రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీల గురించి వారికి వివరించారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో నైపుణ్య శిక్షణ అందించేందుకు ఎవర్‌వోల్ట్ గ్రీన్ ఎనర్జీ సంస్థ అంగీకరించింది. ఆ సంస్థ ఛైర్మన్ సైమన్ టాన్‌తో మంత్రి లోకేశ్ సింగపూర్‌లో సోమవారం సమావేశమయ్యారు. 'ఏపీలో సోలార్ సెల్స్, మాడ్యూల్, బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలించాలి. సౌర శక్తి నిల్వ ఆవిష్కరణలకు పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. ఐటీఐలలో పునరుత్పాదక విద్యుత్ నైపుణ్య శిక్షణకు సహకారం అందించాలి. 2029 నాటికి ఏపీలో 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం ఉండాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. దీనికోసం ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2024 తీసుకొచ్చాం. రెన్యూ, సుజలాన్ వంటి ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి' అని వివరించారు. సంస్థాగతంగా చర్చించాక ఏపీలో యూనిట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని సైమన్ బదులిచ్చారు. ఒక ఐటీఐలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఆయన అంగీకరించారు. ఈ ఏడాది మార్చి నాటికి తమ సంస్థ గిగావాట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిందని.. 2026 నాటికి 3 గిగావాట్లను ఎవర్‌వోల్ట్ లక్ష్యంగా నిర్దేశించుకుందని పేర్కొన్నారు.

ఎయిర్‌బస్ ప్రతినిధులతో చర్చ

రాష్ట్రంలో విమానాల నిర్వహణ.. మరమ్మతులు.. ఓవర్ హాలింగ్ (ఎంఆర్‌వో) సెంటర్ ఏర్పాటు చేయాలని ఎయిర్ బస్ సంస్థ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీని మంత్రి లోకేశ్ కోరారు. 'భారత్‌లో విమానాల సంఖ్య ఎక్కువ. పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, ఆగ్నేయాసియా మార్కెట్ల నుంచీ డిమాండ్ పెరుగుతోంది. భారత్‌లో 850 కంటే ఎక్కువ ఎయిర్‌బస్ విమానాలు సేవలు అందిస్తున్నాయి. దేశ వాణిజ్యంలో 65-70 శాతం వాటిదే. భారతదేశం ఎయిర్‌బస్‌కు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏకైక మార్కెట్. రాబోయే 20 ఏళ్లలో భారత్‌కు 1,750 విమానాలు అవసరమని అంచనా. దక్షిణాసియాలో ఎయిర్‌బస్‌కు ఏపీని ఎంఆర్‌వో హబ్‌గా చేసుకునే అవకాశం ఉంది. దీనికోసం సింగపూర్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దీనివల్ల దేశంలోని విమానయాన సంస్థలకు ఫెర్రీ సమయం.. ఖర్చులు తగ్గడమే కాకుండా విమాన సేవలు మెరుగవుతాయి. ఏపీలో ఏర్పాటు చేసే కేంద్రం ద్వారా పొరుగు దేశాలకూ సేవలు అందించవచ్చు. ఏపీలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు.

ప్రధాని పర్యటన విజయవంతం చేయండి

సింగపూర్‌లో తెలుగు ప్రజలకు లోకేశ్ విజ్ఞప్తి

ఈనాడు-అమరావతి: ప్రధాని మోదీ త్వరలో సింగపూర్ పర్యటనకు రానున్నారని.. తెలుగు ప్రజలంతా ఆయన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ కోరారు. తెలుగు డయాస్పోరాను విజయవంతం చేసిన వాలంటీర్లతో మంత్రి సోమవారం సమావేశమై.. వారితో ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రాభివృద్ధిలో సింగపూర్‌లోని తెలుగువారు భాగస్వాములు కావాలి. ఈ దేశం అభివృద్ధి చెందిన తీరు మనకు స్ఫూర్తి. వైకాపా ఐదేళ్ల విధ్వంస పాలన చూసి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు తెలుగు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఏ దేశానికి వెళ్లినా మొదట తెలుగు ప్రజలను కలవాలని సీఎం చంద్రబాబు, నేను నిర్ణయించుకున్నాం' అని పేర్కొన్నారు.

సింగపూర్ విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తాం

- ఏపీలో 'పారిశ్రామిక-విద్యారంగ కన్సార్షియం ఏర్పాటు
- విద్యావేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్

ఈనాడు-అమరావతి: విశ్వవిద్యాలయాలు.. పరిశ్రమలు సంయుక్తంగా పాఠ్యాంశాలు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన ప్రాజెక్టులు రూపొందించేలా 'పారిశ్రామిక-విద్యారంగ కన్సార్షియం' ఏర్పాటు చేసే ఆలోచన ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. సింగపూర్‌లో విద్యావేత్తలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'ఏపీని ఆవిష్కరణలు.. నైపుణ్య మానవ వనరుల కేంద్రంగా తీర్చిదిద్దుతాం. యువతను భవిష్యత్తు నైపుణ్యాలకు అనుగుణంగా తయారు చేస్తున్నాం. నాలుగో పారిశ్రామిక విప్లవంలో సంక్లిష్ట సమస్యలకు పరిష్కారాలు చూపించే సామర్థ్యం ఉండాలి. అంతర్జాతీయంగా సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీలోని విశ్వవిద్యాలయాల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశపెడుతున్నాం. పరిశోధన.. నవకల్పనలు.. విద్యార్థుల మధ్య చర్చలు.. వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడంలో సింగపూర్ విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సింగపూర్ నమూనాలతో ఏపీలో నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడి విద్యావ్యవస్థ నుంచి అత్యుత్తమ విధానాలను అనుసరించేందుకు వివిధ సంస్థల సహకారం కోరుతున్నాం' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సింగపూర్‌కు చెందిన పలు సంస్థల నిపుణులు పాల్గొన్నారు.

కలిసి ముందుకు వెళదాం..

- నిరంతరం విద్యా ప్రమాణాలు పెంచే నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (ఎన్‌టీయూ), సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ (ఎస్‌యూఎస్ఎస్)తో కలిసి పనిచేస్తాం
- పారిశ్రామిక అవసరాలను పాఠ్యాంశాల్లో చేర్చిన సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీ (ఎస్ఎంయూ), సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (ఎస్‌యూటీడీ)లతో కలిసి ఏఐ, పరిశోధనలపై కలిసి పనిచేయాలన్న ఆసక్తి ఉంది.
- స్కిల్స్ ఎస్‌జీ వెంచర్స్ సహకారంతో ఏపీలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాల అభివృద్ధి.


కృష్ణా జలాలు వృథా కాకుండా ఏం చేద్దాం?

సింగపూర్ నుంచి సీఎం సంప్రదింపులు

ఈనాడు, అమరావతి: రాబోయే రెండు, మూడు రోజుల్లో ప్రకాశం బ్యారేజి నుంచి దాదాపు 2.50 లక్షల క్యూసెక్కుల జలాలను సముద్రంలోకి వదిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంటే దాదాపు 22 టీఎంసీల నీటిని వదులుకోవాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వీలైనంతగా జలాలు ఎలా సద్వినియోగం చేసుకోవాలని సోమవారం రోజంతా జలవనరులశాఖ అధికారులు కసరత్తు చేస్తూ ఎక్కడికక్కడ కాలువల్లోకి ప్రవాహాలు పెంచుతూ రిజర్వాయర్లు వీలైనంతగా నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ నుంచి ఈ విషయంపై పదే పదే జలవనరులశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతూనే ఉన్నారు. సముద్రంలోకి నీళ్లు వృథాగా వదలొద్దని, సాధ్యమైనంత మేర నిల్వ చేయాలని ఆయన నిర్దేశించారు. ఎక్కడెక్కడ ఎంత నిల్వకు అవకాశం ఉందో, ఎక్కడ కాలువలకు ప్రవాహాలు పెంచేందుకు ఆస్కారం ఉందో ఆ చర్యలన్నీ తీసుకోవాలని నిర్దేశించారు.



టువాస్ పోర్టును సందర్శించిన చంద్రబాబుకు జ్ఞాపిక అందిస్తున్న పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీ రీజనల్ సీఈవో విన్సెంట్



'సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్'లో ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు టీజీ భరత్, పి.నారాయణ, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, మంత్రి నారా లోకేశ్ తదితరులు



బిడదారి ఎస్టేట్‌లో నడుస్తూ అక్కడి విశేషాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నారాయణ, టీజీ భరత్, ఏపీ, సింగపూర్ అధికారులు



సింగపూర్ పర్యటన సందర్భంగా ఎయిర్ బస్ సంస్థ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీతో భేటీ అయిన మంత్రి లోకేశ్

ఛాంపియన్





ఈ చరిత్రాత్మక ఫైనల్లో ఇద్దరు మేటి భారత క్రీడాకారిణులు తలపడ్డారు. దివ్య ఫిడే మహిళల ప్రపంచకప్ విజేత అయినందుకు గర్వంగా ఉంది. ఈ గొప్ప ఘనత సాధించిన ఆమెకు అభినందనలు. దివ్య విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుంది. కోనేరు హంపి కూడా టోర్నీ ఆసాంతం బాగా ఆడింది. ఇద్దరికీ శుభాకాంక్షలు" – ప్రధాని నరేంద్ర మోదీ

హేమాహేమీలు తలపడ్డ టోర్నీ అది. ఆమె ఫేవరెట్ కాదు.. ఆ మాటకొస్తే గట్టి పోటీదారుగా కూడా ఎవరూ పరిగణించలేదు. ఆమె కనీసం గ్రాండ్‌మాస్టర్ కాదు. అనేక మందిలో ఒక అమ్మాయి. సీడింగ్స్‌లో చాలా మంది గ్రాండ్‌మాస్టర్ల వెనుక ఎక్కడో 15వ స్థానం. ప్రతిభావంతురాలే అయినా, ఇటీవల ప్రదర్శనతో ఆకట్టుకున్నా.. హంపి, లీ టింగ్‌జీ వంటి స్టార్లుండగా తన గురించి ఎవరు ఆలోచిస్తారు? ఆమె ఇంటర్నేషనల్ మాస్టర్.. అంతే! తనపై ఎలాంటి అంచనాలు లేవు. కానీ భారత యువ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ అద్భుతమే చేసింది. అసాధారణ ప్రదర్శనతో మేటి క్రీడాకారిణులను తోసిరాజంటూ 19 ఏళ్ల ప్రాయంలో ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా నిలిచింది. ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలు దివ్యనే. టైబ్రేక్‌లో ఫలితం తేలిన ఫైనల్లో ఆమె.. అనుభవజ్ఞురాలైన కోనేరు హంపిని ఓడించింది. గ్రాండ్‌మాస్టర్ హోదానూ సాధించుకుంది.

దివ్యమైన విజయం

దేశ్‌ముఖ్‌దే మహిళల ప్రపంచకప్

ఫైనల్లో హంపి ఓటమి

బాటుమి (జార్జియా)

చదరంగ ప్రపంచానికి కొత్త రాణి. భారత యువ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ కెరీర్‌లోనే అతి పెద్ద విజయాన్నందుకుంది. చిన్న వయసులోనే ఫిడే మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకుంది. ఫైనల్ చేరే క్రమంలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న దివ్య.. టైటిల్ పోరులోనూ అదరగొట్టింది. ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో ఆమె టైబ్రేక్‌లో 1.5-0.5తో గ్రాండ్‌మాస్టర్, తెలుగమ్మాయి కోనేరు హంపిపై విజయం సాధించింది. శని, ఆదివారాల్లో రెండు క్లాసికల్ గేమ్స్ డ్రాగా ముగియడంతో పోరు టైబ్రేక్‌కు దారితీసింది. సోమవారం టైబ్రేక్‌లో దివ్య పైచేయి సాధించింది. తొలి ర్యాపిడ్ టైబ్రేకర్‌ను హంపి, దివ్య డ్రాగా ముగించారు. రెండో టైబ్రేకర్‌లో నెగ్గడం ద్వారా దివ్య విజేతగా నిలిచింది. పట్టుదల ప్రదర్శించిన ఆమెకు బోనస్‌గా గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా లభించింది. హంపి, హారిక, వైశాలి తర్వాత జీఎం అయిన భారత నాలుగో మహిళగా దివ్య ఘనత సాధించింది. 38 ఏళ్ల హంపి 2002లో గ్రాండ్‌మాస్టర్ అయింది. అప్పటికి దివ్య పుట్టలేదు. తొలి టైబ్రేకర్‌లో హంపిపై దివ్య ఒత్తిడి తెచ్చింది. అది డ్రాగా ముగిసినా.. రెండో గేమ్‌లో దివ్య ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఎండ్ గేమ్‌లో హంపి తప్పిదంతో దివ్య విజయాన్నందుకుంది.

గ్రాండ్‌మాస్టర్ ఇలా..: దివ్య సంప్రదాయానికి భిన్న రీతిలో గ్రాండ్‌మాస్టర్ హోదాను దక్కించుకుంది. సాధారణంగా జీఎం కావాలంటే మూడు గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌లు సంపాదించడంతో పాటు 2500 లేదా అంతకన్నా ఎక్కువ ఫిడే రేటింగ్ కలిగి ఉండాలి. టోర్నీకి ముందు వరకు దివ్యకు ఒక్క గ్రాండ్‌మాస్టర్ నార్మ్ కూడా లేదు. అయితే నిబంధనల ప్రకారం ఫిడే మహిళల ప్రపంచకప్ వంటి అగ్రశ్రేణి టోర్నీల్లో నెగ్గడం ద్వారా కూడా జీఎం కావొచ్చు. ఇప్పుడు దివ్య అలాగే అయింది. భారత్ నుంచి ఆమె 88వ గ్రాండ్‌మాస్టర్. దివ్య, హంపి మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు కూడా అర్హత సాధించారు.

దివ్య ప్రపంచ ఛాంపియనా?: దివ్యది గొప్ప విజయమే అయినా ఆమెను ప్రపంచ చెస్ ఛాంపియన్ అనలేం. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలిచిన వాళ్లు ప్రపంచ ఛాంపియన్ అవుతారు. చైనాకు చెందిన జు వెంజున్ ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్. అంతర్జాతీయ చదరంగంలో ఫిడే మహిళల ప్రపంచకప్, ఫిడే మహిళల ప్రపంచ ఛాంపియన్‌షిప్ పూర్తిగా వేరు వేరు. ప్రపంచకప్ 100 మందికి పైగా క్రీడాకారిణులు పోటీపడే నాకౌట్ టోర్నమెంట్. అదే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇద్దరు క్రీడాకారిణులు తలపడతారు. ప్రస్తుత ఛాంపియన్‌ను ఛాలెంజర్ ఢీకొంటుంది. క్యాండిడేట్స్ టోర్నమెంట్ విజేతే ఈ ఛాలెంజర్. ప్రపంచకప్ విజేత దివ్య ఇక క్యాండిడేట్స్ టోర్నీలో ఎలా ఆడుతుందో చూడాలి.

ఈ విజయాన్ని జీర్ణించుకోవడానికి నాకు సమయం పడుతుంది. నాకు గ్రాండ్‌మాస్టర్ హోదా ఇలా రావాలని రాసుంది. ఒక్క జీఎం నార్మ్ లేకుండానే ఈ టోర్నీకి వచ్చా. నాకు ఎప్పుడు ఒక నార్మ్ వస్తుందో అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు నేను గ్రాండ్‌మాస్టర్‌నయ్యా. ఇప్పుడు మాట్లాడడం నాకు కష్టంగా ఉంది. ఈ విజయం కచ్చితంగా నాకు గొప్పగా అనిపిస్తోంది. కానీ సాధించాల్సింది ఇంకెంతో ఉంది. ఇది ఆరంభం మాత్రమేనని ఆశిస్తున్నా. - దివ్య దేశ్‌ముఖ్



ప్రపంచకప్ గెలిచినందుకు, జీఎం అయినందుకు నీకు శుభాకాంక్షలు దివ్య. ఫైనల్ గొప్పగా సాగింది. హంపి కూడా బాగా ఆడింది. పోరాట పటిమను ప్రదర్శించింది" – ఆనంద్

దివ్య ఘనతలు

2025: ఫిడే ప్రపంచకప్ టైటిల్

2024: ప్రపంచ అండర్-20 టోర్నీలో విజేత

2023: ఆసియా కాంటినెంటల్ ఛాంపియన్

2022: ఇండియన్ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత కాంస్యం

2021: మహిళా గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సొంతం

2020: ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో పసిడి

చదరంగం చిరుకత్తి

చెస్‌లో ఎన్ని పావులు ఉన్నా.. రాజు, రాణి, ఏనుగు, గుర్రం లాంటి పెద్ద పావులకు ఉన్న విలువే వేరు. మరి ఒక భటుడు వచ్చి పెద్ద పావులను కొట్టేసి తానే రాజైపోతే! దివ్య దేశ్‌ముఖ్ చేసింది అదే! మాజీ ఛాంపియన్లు, దిగ్గజ ప్లేయర్లు మోహరించిన ప్రపంచకప్‌లో ఏమాత్రం అంచనాలు లేకుండా దిగి అదిరే ఆటతో ఈ చిన్నది ప్రపంచకప్ పట్టేసి చరిత్ర సృష్టించింది. భారత మహిళల చెస్‌లో ఒక కొత్త అధ్యాయానికి తెర తీసింది 19 ఏళ్ల దివ్య.

ఈనాడు క్రీడావిభాగం

భారత్‌లో మహిళల చెస్ అనగానే కొన్నేళ్లుగా కోనేరు హంపి, ద్రోణవల్లి హారికనే కనిపించారు. వీరి తర్వాత వైశాలి వెలుగులోకి రాగా.. ఇప్పుడు దివ్య వంతు వచ్చింది. అయితే మిగిలిన యువ ప్లేయర్ల కంటే దివ్య భిన్నం. తక్కువ వయసులోనే ఊహించని విజయాలతో దూసుకెళ్తోందీ అమ్మాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్య ఉన్నత కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తల్లిదండ్రులు నమ్రత, జితేంద్ర దేశ్‌ముఖ్ ఇద్దరూ వైద్యులే. ఆమె తండ్రికి చెస్ ఇష్టం. దివ్యకు అమ్మ నమ్రతనే పెద్ద బలం. ఏ టోర్నీలోనైనా ఆమె తోడుగానే వెళ్తుంది. ప్రపంచకప్ గెలవగానే అమ్మను కౌగిలించుకుని ఆనందాన్ని వ్యక్తం చేసింది. కానీ దివ్య చెస్ ప్లేయర్ కావడం యాదృచ్ఛికమే. సోదరి బ్యాడ్మింటన్ ఆడుతుంటే తానూ వెంట వెళ్లేది. అదే స్టేడియంలో చెస్ కోచింగ్ ఉండడంతో సరదాగా నేర్చుకుంది. ఆ సరదానే తర్వాత కెరీర్‌గా మారింది. కొన్ని నెలల్లోనే వయసు విభాగాల టోర్నీల్లో సత్తా చాటింది. నెమ్మదిగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. 2020లో చెస్ ఒలింపియాడ్‌లో పసిడి గెలిచిన భారత జట్టులో దివ్య సభ్యురాలు. 2021లో ఉమన్ గ్రాండ్‌మాస్టర్ హోదాను దక్కించుకున్న దివ్య.. 2022 చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత కాంస్యం నెగ్గి సత్తా చాటింది. తర్వాతి ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్‌ను గెలిచి దూకుడు మరింత పెంచింది. టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్లో హంపి, హారిక లాంటి స్టార్లను ఓడించి ర్యాపిడ్‌లో టైటిల్ నెగ్గడం ఈ అమ్మాయి ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచింది. ఆ ఏడాదిలోనే ఆమె ఇంటర్నేషనల్ మాస్టర్ అయింది. 2024 ఒలింపియాడ్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు దివ్యను విలువైన క్రీడాకారిణిగా మార్చాయి.


విజయానంతరం తల్లితో దివ్య

గాలివాటం కాదు

ప్రపంచకప్‌లో దివ్య ప్రయాణం గాలివాటం కాదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ మెరుగైన ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ దూసుకుపోయింది. ఆమె జోరు ముందు మాజీ ఛాంపియన్లు నిలవలేకపోయారు. సీడెడ్ ప్లేయర్లు చిన్నబోయారు. ఎంతో అనుభవం ఉన్న వాళ్లూ తేలిపోయారు. దివ్య ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. రెండో రౌండ్లో మాజీ టాప్-10 ప్లేయర్ ననా జాగ్నిడ్జ్‌ను కంగుతినిపించడం ఆమె ప్రయాణంలో కీలక మలుపు. అక్కడ నుంచి దివ్య ఒక్కో గండాన్నే అధిగమిస్తూ వెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో చైనా స్టార్ జు జినర్‌కు షాక్ ఇవ్వడం అందులో హైలైట్. జినర్‌ను క్వీన్స్ గాంబిట్ ఓపెనింగ్‌తో చుట్టేసిన దివ్య.. క్వార్టర్స్‌లో హారిక జోరుకు అడ్డుకట్ట వేసింది. ఆపై సెమీస్‌లో టాన్ చైనా స్టార్ టాన్ జాంగ్ యీను ఎండ్ గేమ్‌లో ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రత్యర్థి ఒత్తిడికి గురి చేసినా క్వీన్‌ను కాపాడుకుంటూ దాడి చేసిన వైనం అద్భుతం. కోనేరు హంపితో ఫైనల్లోనూ దివ్య అదే జోరు ప్రదర్శించింది. తొలి రెండు గేమ్‌లలో అంత తేలిగ్గా లొంగలేదు. హంపి దాడిని బలమైన డిఫెన్స్‌తో అడ్డుకుంది. కానీ ఆమె అసలు ఆట బయటకు తీసింది టైబ్రేక్‌లోనే! రెండుసార్లు ర్యాపిడ్ ప్రపంచ ఛాంపియన్ అయిన హంపిని అదే ఫార్మాట్లో ఓడించి ఔరా అనిపించింది. టోర్నీ ఆసాంతం కొత్త ఓపెనింగ్‌లు, పటిష్టమైన ఎండ్ గేమ్‌తో దివ్య ఆకట్టుకుంది. పెద్ద టోర్నీల్లో సాధారణంగా జూనియర్ ఆటగాళ్లు తడబడే ఎండ్ గేమ్‌లో దివ్య మాత్రం బలంగా నిలబడింది. ప్రపంచకప్‌లో కనీసం మూడు మ్యాచ్‌ల్లో ఇలా ఎండ్ గేమ్‌లలో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆటలో మాత్రమే కాదు మానసిక బలాన్ని చూపిస్తూ ఒత్తిడిలో స్థిరచిత్తాన్ని ప్రదర్శించి ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. ఈ గెలుపుతో గ్రాండ్‌మాస్టర్ హోదానూ దక్కించుకున్న ఈ టీనేజర్.. భారత మహిళల చెస్ భవిష్యత్ దివ్యంగా ఉండబోతుందని చాటింది.


దూకుడు.. ప్రశాంతం

దూకుడు.. ప్రశాంతం ఈ రెండూ భిన్నమైన మాటలు. ఈ రెండింటిని కలిపితే దివ్య. ఆటలో దూకుడు చూపిస్తూనే.. ఒత్తిడిలో ప్రశాంతంగా తన పని తాను చేసుకుపోతుంటుందీ అమ్మాయి. ఎంత ఒత్తిడి ఉన్నా అంత కూల్‌గా, మరింత పట్టుదలగా ఆడుతుంది. ప్రపంచకప్‌లో ఆమె ఈ లక్షణాలనే ప్రదర్శించింది. ముఖ్యంగా సెమీస్, ఫైనల్లో దృఢంగా నిలిచింది. తనపై ఒత్తిడిని ప్రత్యర్థిపై మళ్లించి పైచేయి సాధించింది. ముఖ్యంగా చెస్‌లో ఎత్తులు వేసేటప్పుడు టైమ్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యం. ఒక్కోసారి సమయం మించిపోతుందన్న తొందరలో తప్పులు చేస్తుంటారు. దివ్య మాత్రం ఇలాంటి తప్పులు చాలా అరుదుగా చేస్తుంటుంది. 'క్రికెట్లో ధోని లాంటిది దివ్య. ఎంత ఒత్తిడి ఉన్నా దరి చేరనీయదు. క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఏ ఫార్మాట్ అయినా ఒకే స్థిరత్వంతో, దూకుడుతో ఆడుతుంది. ఎంత పోటీ ఉంటే అంత బాగా ఆడడం ఆమెలో ప్రత్యేకత. ప్రపంచ అండర్-16 టోర్నీ, 2018లో ఒలింపియాడ్‌లో ఆమె ఆట చాలా ప్రత్యేకంగా అనిపించింది" అని భారత చెస్ కోచ్ శ్రీనాథ్ నారాయణ్ అన్నాడు.

దివ్యకు రూ.43 లక్షల ప్రైజ్‌మనీ

ప్రపంచకప్ నెగ్గిన దివ్య దేశ్‌ముఖ్‌కు ట్రోఫీతో పాటు రూ.43 లక్షల నగదు బహుమతి దక్కింది. రన్నరప్‌గా నిలిచిన కోనేరు హంపికి రూ.30 లక్షల ప్రైజ్‌మనీ లభించింది.

శార్దూల్, కాంబోజ్‌లపై వేటు?


శార్దూల్


కాంబోజ్

మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో చివరి టెస్టుకు ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్, కొత్త పేసర్ అన్షుల్ కాంబోజ్‌లను భారత తుది జట్టు నుంచి తప్పించనున్నట్లు తెలుస్తోంది. తొలి టెస్టులో పేలవ ప్రదర్శన చేశాక తర్వాతి రెండు మ్యాచ్‌లకు శార్దూల్‌ను పక్కన పెట్టిన జట్టు యాజమాన్యం.. నితీశ్, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్‌ల గాయాల నేపథ్యంలో అతణ్ని నాలుగో టెస్టులో ఆడించింది. బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించినప్పటికీ.. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి శార్దూల్ ఒక్క వికెట్టూ తీయలేకపోయాడు. ఎప్పట్లాగే ధారాళంగా పరుగులిచ్చేశాడు. ఇక ఈ మ్యాచ్‌తోనే టెస్టు అరంగేట్రం చేసిన కాంబోజ్ సైతం తీవ్రంగా నిరాశ పరిచాడు. ఒక్క వికెట్టే పడగొట్టాడు. అతడి బౌలింగ్‌లో పెద్దగా వేగం లేకపోవడంతో ఇంగ్లాండ్ బ్యాటర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. దీంతో ఈ ఇద్దరినీ చివరి టెస్టుకు పక్కన పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ ఫిట్‌నెస్ సాధించడం.. ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్‌ల రూపంలో మెరుగైన ప్రత్యామ్నాయాలు ఉండడంతో శార్దూల్, కాంబోజ్‌లపై వేటు పడడం లాంఛనమే.

మీరు చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తే తప్పా?

ఇంగ్లాండ్‌కు గావస్కర్ చురకలు


గావస్కర్

మాంచెస్టర్: భారత్‌తో నాలుగో టెస్టులో చివరి రోజు మాండేటరీ ఓవర్లు ఆరంభం కావడానికి ముందు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ డ్రా కోసం ప్రతిపాదించినా.. భారత బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అంగీకరించకపోవడం.. దీంతో ఇంగ్లిష్ ఆటగాళ్లు భారత బ్యాటర్లతో అమర్యాదకరంగా వ్యవహరించడం పెద్ద చర్చకే దారి తీసింది. నాసిర్ హుస్సేన్ సహా ఇంగ్లాండ్ మాజీ ఆటగాళ్లే.. స్టోక్స్ బృందం తీరును తప్పుబట్టారు. ఇక భారత దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ అయితే.. ఇంగ్లాండ్ జట్టు వ్యవహార శైలిని తూర్పారబట్టాడు. "ఫలితం తేలే అవకాశం లేదు కాబట్టి భారత్ డ్రాకు అంగీకరించాలని ఇంగ్లాండ్ జట్టు అనుకుంది. అయితే ఇక్కడ ఆడుతున్నది రెండు జట్లు అనే విషయం ఇంగ్లాండ్ మరిచిపోయింది. ఒకరు ఈ ప్రతిపాదనను నిరాకరిస్తే ఆటను కొనసాగించాల్సిందే. 80ల్లో ఉన్న ఆటగాళ్లను ఉద్దేశించి వ్యంగ్యంగా ఒక బ్యాటర్‌తో బౌలింగ్ చేయమంటారా అని కూడా అడిగారు. కానీ ఆ ఇద్దరూ వాళ్ల ప్రధాన బౌలర్లను ఎదుర్కొనే 80ల్లోకి వచ్చారని మరిచిపోయారు. వాళ్లిద్దరూ సెంచరీలు చేయకూడదని భావిస్తే.. ప్రధాన బౌలర్లనే దించి వాళ్లను ఔట్ చేయాల్సింది. టెస్టు సెంచరీ అన్నది ప్రతి మ్యాచ్‌లో సాధ్యమయ్యేది కాదు. ఆ మైలురాయిని అందుకోవడానికి వాళ్లిద్దరూ అర్హులు. నేను ప్రత్యర్థి జట్టు కెప్టెన్‌గా ఉంటే.. మీరు ఎంతసేపు ఆడతారో ఆడండి అనేవాడిని. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జెంటిల్‌మన్ కాబట్టి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 600కు పైగా పరుగులు, 300కు పైగా ఆధిక్యం సాధించినా అంత స్కోరు ఎందుకు అని అడగలేదు. ఆధిక్యం 250కి పరిమితమైతే, ఎక్కడ భారత్ 500కు పైగా పరుగులు చేసి నాలుగో ఇన్నింగ్స్‌లో తమను ఆలౌట్ చేస్తుందేమో అని ఇంగ్లాండ్ భయపడిందేమో! స్టోక్స్ సెంచరీ పూర్తయ్యాక కూడా బ్యాటింగ్ కొనసాగించాడు. తమ బౌలర్లకు ప్రత్యర్థిని ఆలౌట్ చేయడానికి చాలినంత సమయం ఇవ్వలేదు. ఆటలో అన్నీ ఇంగ్లాండ్ అనుకున్నట్లుగా జరగవు. 'మేం ఏం చేసినా సరైందే, అదే పని అవతలి జట్టు చేస్తే తప్పు' అనే బూజుపట్టిన ఆలోచనకు ఇది రుజువు. ఆ రోజులు ఎప్పుడో పోయాయి. ఇలాంటి వాటిని ఇప్పుడు ఎవరూ, ముఖ్యంగా భారత ఆటగాళ్లు అంగీకరించరు" అని సన్నీ పేర్కొన్నాడు.

విజేత ఇనియన్

దిల్లీ: భారత గ్రాండ్‌మాస్టర్ పి.ఇనియన్.. డోలె ఓపెన్ అంతర్జాతీయ చెస్ టైటిల్ గెలిచాడు. తొమ్మిది రౌండ్లలో 7.5 పాయింట్లతో అతడు అగ్రస్థానంలో నిలిచాడు. జాన్ మాలెక్ (పోలెండ్) కూడా ఇన్నే పాయింట్లు సాధించినా.. టైబ్రేక్‌లో జాన్‌పై ఇనియన్ పైచేయి సాధించాడు. టైబ్రేక్‌లో తొలి గేమ్ డ్రా కాగా.. రెండో గేమ్‌లో నెగ్గిన ఇనియన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో చివరిదాకా ఆధిక్యంలో నిలిచిన పావెల్ (ఉక్రెయిన్, 7) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

సాత్విక్ జోడీ టైటిల్ సాధించేనా


సాత్విక్, చిరాగ్

మకావు: భారత అగ్రశ్రేణి జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీపై దృష్టి సారించింది. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో సాత్విక్-చిరాగ్ జోడీ రెండో సీడ్‌గా బరిలో దిగుతోంది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న సాత్విక్- చిరాగ్ జోడీకి టైటిల్ మాత్రం అందని ద్రాక్షలా మారింది. ఇండియా, సింగపూర్, మలేసియా, చైనా ఓపెన్‌లలో సెమీస్ చేరుకున్న భారత జోడీ.. మకావులో విజేతగా నిలిచి టైటిల్ కరవుకు తెరదించాలని భావిస్తోంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో వాంగ్ యీ- ఇంగ్ చియాంగ్ (మలేసియా) జంటతో సాత్విక్- చిరాగ్ జోడీ తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో జియోన్ జిన్ (కొరియా)తో లక్ష్యసేన్, క్వాలిఫయర్‌తో హెచ్.ఎస్.ప్రణయ్, మహిళల సింగిల్స్‌లో నొజొమి ఒకుహర (జపాన్)తో ఆకర్షి కశ్యప్, జూలీ జాకబ్సన్ (డెన్మార్క్)తో ఉన్నతి హుడా తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో లిన్ షియావో- పెంగ్ వీ (చైనీస్ తైపీ)తో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ.. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో జువాన్ షున్- చియా సిన్ (చైనీస్ తైపీ)తో రోహన్ - రుత్విక శివాని పోటీపడనున్నారు.

మహిళల యూరో ఛాంప్ ఇంగ్లాండ్



బాసెల్: ఇంగ్లాండ్ మహిళల ఫుట్‌బాల్ జట్టు యూరో ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఫైనల్లో పెనాల్టీ షూటౌట్లో 1-1 (3-1)తో స్పెయిన్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి స్కోరు 1-1తో సమమైంది. స్పెయిన్ తరఫున మారియోనా (25వ), ఇంగ్లాండ్ జట్టులో అలీసియా (57వ) గోల్స్ చేశారు. షూటౌట్లో ఇంగ్లాండ్ మూడు ప్రయత్నాల్లో సఫలం కాగా.. స్పెయిన్ ఒక్క గోలే కొట్టడంతో ఇంగ్లిష్ జట్టు విజేతగా నిలిచింది.

ఇంగ్లాండ్ జట్టులో ఒవర్టన్

లండన్: భారత్‌తో అయిదో టెస్టు కోసం ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ జేమీ ఒవర్టన్‌ను జట్టులోకి తీసుకుంది. ఇప్పటికే జట్టులో ఉన్న 14 మందికి అతను తోడవుతాడు. 31 ఏళ్ల ఈ బౌలింగ్ ఆల్‌రౌండర్ 2022లో ఒకే ఒక టెస్టు మ్యాచ్ ఆడాడు. అందులో 2 వికెట్లు తీసి, 97 పరుగులు సాధించాడు. ఒవర్టన్ ఈ ఏడాది ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.


సమ్మర్‌కు రెండు స్వర్ణాలు


సమ్మర్ మెకింటోష్

సింగపూర్: అగ్రశ్రేణి స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌ను ఘనంగా ఆరంభించింది. ఆమె రెండు రోజుల్లో రెండు స్వర్ణాలు ఖాతాలో వేసుకుంది. 18 ఏళ్ల ఈ కెనడా అమ్మాయి సోమవారం 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ రేసును 2 నిమిషాల 6.69 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. అంతకుముందు ఆమె 400 మీటర్ల ఫ్రీస్టైల్ రేసునూ నెగ్గింది. ఒక ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అయిదు స్వర్ణాలు సాధించిన అమెరికా దిగ్గజం మైకేల్ ఫెల్ప్స్ రికార్డుపై సమ్మర్ గురి పెట్టింది. ఆమె 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ, 800 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లలోనూ పోటీ పడనుంది.

సాజన్ ప్రకాష్ విఫలం: ప్రపంచ స్విమ్మింగ్‌లో భారత క్రీడాకారుల పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. తొలి రోజు ఆర్యన్, లిఖిత్ నిరాశపరచగా.. రెండో రోజు సాజన్ ప్రకాష్ విఫలమయ్యాడు. 200 మీటర్ల ఫ్రీస్టైల్‌ను 1 నిమిషం 51.57 సెకన్లలో పూర్తి చేసిన ప్రకాష్ 43వ స్థానానికి పరిమితమయ్యాడు.

అత్యంత ఖరీదు.. అమూల్య సేవలు!



విపత్తులపై విస్పష్ట హెచ్చరికలు చేయనున్న నైసార్

అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో) సింథటిక్ ఎపెర్చర్ (నైసార్) సింథటిక్ ఎపెర్చర్ రాడార్ (సార్) ఉపగ్రహం. ఇది రేడియో ఫ్రీక్వెన్సీ సంకేతాలను భూమిపై నిర్దిష్ట ప్రదేశంపైకి పంపుతుంది. అవి నేలను తాకి, పరావర్తనం చెంది, తిరిగి ఉపగ్రహాన్ని చేరుతాయి. వీటిని విశ్లేషించడం ద్వారా సంబంధిత ప్రాంత చిత్రాన్ని ఈ ఉపగ్రహం ఆవిష్కరిస్తుంది.

ఇస్రో సత్తాను గుర్తించి..

నాసా గతంలో అనేక సార్ ఉపగ్రహాలను ప్రయోగించింది. భూమిపై విపత్తులు, ఇతర మార్పులను నిశితంగా పరిశీలించడానికి విస్పష్ట చిత్రీకరణలు చేపట్టగల శాటిలైట్ అవసరమని సంస్థ భావించింది. దాని రూపకల్పనకు జర్మన్ ఏరోస్పేస్ సంస్థ డీఎల్ఆర్‌తో భాగస్వామ్యం వహించాలనుకుంది. అయితే జర్మన్ సంస్థ స్వీయ ప్రాజెక్టులతో తీరికలేకుండా ఉంది. దీంతో ఈ ఉపగ్రహాన్ని సొంతంగానే రూపొందించుకోవాలని నాసా నిర్ణయించుకుంది. ఈలోగా సంస్థ బడ్జెట్‌కు అమెరికా ప్రభుత్వం కోత పెట్టడంతో పునరాలోచనలో పడింది. ఈ దశలో.. తక్కువ ఖర్చుతో ప్రయోగాలు చేస్తూ సత్తా చాటుతున్న ఇస్రో.. ఆ సంస్థ కంట్లో పడింది. ఇస్రో 2008లో చంద్రయాన్-1, 2009లో రీశాట్-2 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఈ రెండింటిలోనూ 'సార్' పరికరాలు ఉన్నాయి. దీన్ని గమనించిన నాసా.. ఇస్రో వైపు మొగ్గింది. అలా 2014లో నైసార్ మిషన్ పురుడుపోసుకుంది.

ఉపగ్రహ రూపకల్పన, ప్రయోగంలో సమాన భాగస్వామ్యం ప్రాతిపదికన ఆ ప్రాజెక్టును నాసా, ఇస్రో చేపట్టాయి. ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.11,200 కోట్లు కాగా.. ఇస్రో వాటా కింద చేపట్టాల్సిన పనులకు రూ.800 కోట్లే ఖర్చయ్యాయి. సంస్థ అనుసరించిన చౌకైన ఇంజినీరింగ్ విధానాల ద్వారా ఇది సాధ్యమైంది.

నైసార్‌లో ఏముంటాయి?

ఎల్-బ్యాండ్ రాడార్:

దీన్ని నాసా రూపొందించింది. దీని తరంగ దైర్ఘ్యం పెద్దగా (24 సెంటీమీటర్లు) ఉంటుంది. ఈ తరంగాలు దట్టమైన అడవులు, నేల, మంచు గుండా చొచ్చుకెళతాయి. నేలలో తేమ, అటవీ తీరుతెన్నులు, మంచు ఫలకం మందం, నేల కింద పరిస్థితులను పరిశీలిస్తాయి.

ఎస్-బ్యాండ్ రాడార్:

ఈ సాధనాన్ని ఇస్రో అభివృద్ధి చేసింది. దీని తరంగ దైర్ఘ్యం చిన్నగా (12 సెంటీమీటర్లు) ఉంటుంది. ఇది భూ ఉపరితలంపై చిన్నపాటి వివరాలనూ పరిశీలిస్తుంది. పంటల ఎదుగుదల, మంచు విస్తీర్ణం, ఉపరితలంపై ఆకృతుల్లో వచ్చే స్వల్ప మార్పుల వంటి వాటిని విశ్లేషిస్తుంది.

మెష్ రిఫ్లెక్టర్:

12 మీటర్ల వెడల్పు కలిగిన ఈ సాధనాన్ని నాసా అభివృద్ధి చేసింది. దీనికి బంగారు పూత ఉంటుంది. రోదసిలోకి వెళ్లాక పూర్తిగా విచ్చుకుంటుంది. అప్పుడు ఇది బ్యాడ్మింటన్ కోర్టు అంత ఉంటుంది. ఒక ఉపగ్రహానికి ఇంతపెద్ద రిఫ్లెక్టర్‌ను అమర్చడం ఇదే మొదటిసారి.

- డేటాను పంపడం, అందుకోవడం ఈ పరికరం విధి. ఉపగ్రహంలోని రెండు రాడార్లకూ సేవలు అందిస్తుంది.

ఎలా పనిచేస్తుంది?

2,392 కిలోల బరువున్న నైసార్‌ను 747 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య అనువర్తిత కక్ష్యలోకి పంపుతారు. 90 రోజుల తర్వాత పని ప్రారంభిస్తుంది. రాత్రి, పగలు తేడా లేకుండా, అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో పుడమిని తన జంట రాడార్లతో నైసార్ స్కాన్ చేస్తుంది. ఇందులో తొలిసారిగా అధునాతన 'స్వీప్‌సార్' పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. దీనివల్ల సంబంధిత ప్రాంతం మొత్తాన్నీ వేగంగా త్రీడీలో పరిశీలించడం సాధ్యమవుతుంది.

- ప్రాంతాలవారీగా ఇది పరిశీలనలు సాగిస్తుంది. ఒకసారి 240 కిలోమీటర్ల వెడల్పున్న ప్రదేశాన్ని నైసార్ పరిశీలిస్తుంది. దాని చిత్రాల స్పష్టత 10 మీటర్లుగా ఉంది.
- ఈ ఉపగ్రహం పుడమిపైనున్న అన్ని ప్రాంతాలను 12 రోజులకోసారి పరిశీలిస్తుంది. రెండు సందర్శనల మధ్య కాలంలో చోటుచేసుకున్న చిన్నపాటి మార్పును కూడా గుర్తించగలదు. 97 నిమిషాలకోసారి భూమిని చుట్టేస్తుంది.


భారీ డేటా..

నైసార్.. రోజుకు 80 టెరాబైట్ల డేటాను వెలువరిస్తుంది. ఈ లెక్కన ఒక రోజులో.. 512 గిగాబైట్ల సామర్థ్యమున్న 150 హార్డ్ డ్రైవ్‌లను ఇది నింపుతుంది. ఈ డేటా ప్రాసెసింగ్, నిల్వ, పంపిణీ మొత్తం క్లౌడ్ ద్వారా సాగుతుంది. దీన్ని ఉచితంగా ఎవరైనా పొందొచ్చు.

మానవాళికి ఎలా మేలు చేస్తుంది?

- భూమి ఎగువ పొరలో సెంటీమీటరు స్థాయిలో మార్పులను పసిగట్టడం ద్వారా అగ్నిపర్వత విస్ఫోటాలు, కొండ చరియలు విరిగి పడటం వంటి విపత్తులను నైసార్ పర్యవేక్షించగలదు.
- ధ్రువ ప్రాంతాల్లో మంచు ఫలకాల కదలికలు, కరుగుదలను పరిశీలించగలదు.
- అటవీ విస్తీర్ణం, పచ్చదనంలో మార్పులు, పంటల ఎదుగుదల, నేలలో తేమ పరిశీలన ద్వారా ఉపరితల జలాలు, చిత్తడి నేలల్లో మార్పులను పసిగడుతుంది. నీటి వనరుల నిర్వహణకు దోహదపడుతుంది. రైతులు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పిస్తుంది.
- తుపాన్లు, సునామీలు, వరదలు, కార్చిచ్చు వంటి విపత్తుల సమయంలో సహాయ చర్యలకు సాయపడుతుంది.
- నిర్దిష్ట ప్రాంతంలో నేల ఒక అంగుళం కుంగినా గుర్తించగలదు. వంతెనలు, డ్యామ్‌లలో లోపాలనూ పసిగడుతుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం, న్యూస్‌టుడే, శ్రీహరికోట



పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

భారత్ శాంతమూర్తుల ఆలయం... పాక్ ఉగ్రవాదుల నిలయం

లోక్‌సభలో తెదేపా నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు



ఈనాడు, దిల్లీ: 'భారత్ శాంతమూర్తుల నిలయం. దలైలామా లాంటి వారికి మన దేశం ఆశ్రయమిస్తే, ఒసామా బిన్ లాడెన్ సహా ఎందరో ఉగ్రవాదులకు పాకిస్థాన్ డెన్‌లా మారింది. ఈ విషయాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయి' అని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం ప్రారంభమైన చర్చలో తెదేపా తరఫున ఆయన మాట్లాడారు. 'పహల్గాం ఘటనకు పది రోజుల ముందు నేను కశ్మీర్‌లో పర్యటించాను. ఎక్కడ చూసినా పర్యాటకులతో రాష్ట్రం కళకళలాడుతోంది. రద్దీ కారణంగా నాకు 30 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నర సమయం పట్టింది. దాని గురించి ట్యాక్సీ డ్రైవర్‌ను అడిగితే నాలుగేళ్లుగా రాష్ట్రానికి పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారని, ఆర్థికంగా మెరుగవుతున్నామని చెప్పారు. పహల్గాం దాడి పరిస్థితుల్ని మార్చేసింది. మే 7న అర్ధరాత్రి చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం. శత్రుదేశానికి గుణపాఠం నేర్పిన త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తున్నా. ప్రధాని మోదీ సాహసోపేత నాయకత్వం వల్లే ఇంతటి కార్యాచరణను, నైతికస్థైర్యాన్ని ప్రదర్శించడం సాధ్యమైంది. కేంద్రం ఆపరేషన్ సిందూర్ తర్వాత 7 అఖిల పక్ష బృందాలను 32 దేశాలకు పంపింది. ఆ బృందాలు పాక్ నిజస్వరూపం గురించి వివరిస్తూ.. ప్రపంచం ముందు ఆ దేశాన్ని దోషిగా నిలబెట్టగలిగాయి. బృందాల్లో అన్ని పార్టీల సభ్యులున్నప్పటికీ ఒకే స్వరం వినిపించాం. ఓ బృందంలో నేనూ సభ్యుడిగా ఉన్నందుకు గర్వపడుతున్నా. పహల్గాం దాడి తర్వాత భారత్ చేపట్టిన దౌత్య కార్యాచరణతో మూడు వాస్తవాలు వెలుగుచూశాయి. అవి.. 1. ఉగ్రవాదానికి ఐక్యరాజ్యసమితి నిర్వచనం చెప్పాల్సిన సమయం వచ్చింది. 2. పాక్ పేరును ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్‌లో మళ్లీ చేర్చేందుకు మనం మిత్రదేశాలతో కలిసి పనిచేయాలి. 3. సాంకేతికంగానూ బలోపేతం కావాలి. రక్షణ పరికరాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించాలి' అని శ్రీకృష్ణదేవరాయలు వివరించారు.

పాకిస్థాన్‌కు వారి భాషలోనే సమాధానమిచ్చాం

జనసేన ఎంపీ బాలశౌరి



ఈనాడు, దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్ సాధారణ విషయం కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో మన సైనిక దళాలు అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించి శత్రువులకు వారి భాషలోనే సమాధానం చెప్పారు' అని జనసేన లోక్‌సభా పక్ష నాయకుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన జనసేన తరఫున మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్‌కే పరిమితం కాకుండా అఖిలపక్ష బృందాలను విదేశాలకు పంపి, పాకిస్థాన్‌ను ప్రపంచవ్యాప్తంగా ఒంటరిని చేయడానికి ప్రధాని మోదీ ప్రయత్నించారు. ఇది మనం సాధించిన మరో వ్యూహాత్మక విజయం' అని బాలశౌరి అన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో తీసుకొనే చర్యలకు తమ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని ప్రకటించారు.

ఏపీ ప్రభుత్వం 'బనకచర్ల' పీఎఫ్ఆర్ సమర్పించింది

కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి

ఈనాడు, దిల్లీ: ఏపీ ప్రభుత్వం పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టు (పీబీఎల్‌పీ)కు అవసరమైన టెక్నో- ఎకనమిక్ అప్రైజల్ కోసం కేంద్ర జల సంఘానికి ప్రిలిమినరీ ఫీజిబిలిటీ రిపోర్ట్ (పీఎఫ్ఆర్) సమర్పించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఏపీ ప్రభుత్వం నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఆ రాష్ట్రం ఇంకా ఈ ప్రాజెక్టు పనులు చేపట్టలేదని, అందువల్ల నిలిపివేయాలని ఉత్తర్వులివ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో సంబంధిత అధీకృత వ్యవస్థలు, సహ నదీ పరీవాహక రాష్ట్రాలను సంప్రదించి, పీఎఫ్ఆర్ విషయంలో నిబంధనల ప్రకారం తదుపరి కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పోలవరం నిధులను ఏపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించలేదు

ఈనాడు, దిల్లీ: పోలవరం నిధులను ఏపీ ప్రభుత్వం ఇతరత్రా అవసరాలకు మళ్లించిందా? అన్న వైకాపా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి 'లేదు' అని సమాధానమిచ్చారు. "2024 మే నుంచి 2025 జులై మధ్య కాలంలో కేంద్రం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఏపీ ప్రభుత్వానికి రూ.5,512.40 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.2,807.69 కోట్లు 2024 అక్టోబరు 9న ఇచ్చింది. ఇందులో ఇదివరకే ఖర్చుచేసిన రూ.459.69 కోట్ల రీయింబర్స్‌మెంట్ మొత్తం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ కింద తొలి విడత ఇచ్చిన రూ.2,348 కోట్లు ఉన్నాయి. తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత అడ్వాన్స్ కింద ఈ ఏడాది మార్చి 11న రూ.2,704.71 కోట్లు విడుదల చేసింది. దీనిలో రూ.569.36 కోట్లను ఏపీ ప్రభుత్వం సింగిల్ నోడల్ ఏజెన్సీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేసింది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉంది. ఇతరత్రా అవసరాల కోసం పైసా కూడా బదిలీ చేయలేదు" అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

నేటి నుంచి జీఎస్ఎల్‌వీ కౌంట్‌డౌన్

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి చేపట్టనున్న జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాసా, ఇస్రో సంయుక్తంగా నైసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపుతున్నాయి. మంగళవారం కౌంట్‌డౌన్ ప్రారంభమై.. బుధవారం సాయంత్రం జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లనుంది. దీనికి సంబంధించి సోమవారం షార్‌లోని డైరెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో రాకెట్ సన్నద్ధత, లాంచ్ ఆథరైజేషన్ సమావేశాలు వేర్వేరుగా జరిగాయి.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మాజీ సీఎం జగన్ భేటీ

ఈనాడు, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ సోమవారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిశారు. జగన్ దంపతులు రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ దంపతులను కలిసి మాట్లాడారు. సుమారు గంటపాటు వారి భేటీ కొనసాగింది. గవర్నర్‌ను జగన్ మర్యాదపూర్వకంగా కలిశారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

మద్యం కేసులో బాధ్యుల్ని శిక్షించాలని గవర్నర్‌ను కోరారా..?

- భేటీ అధికారికమా.. వ్యక్తిగతమా?
- తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: 'మద్యం కుంభకోణం కేసును సిట్ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి ఎంతటివారినైనా చట్టానికి పట్టించాలని గవర్నర్‌ను కోరారా? గవర్నర్‌ను కలిసిన విషయం బయటి ప్రపంచానికి తెలియకుండా గోప్యంగా ఉంచడంలో ఆంతర్యం ఏమిటి?' అని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రశ్నించారు. గవర్నర్‌ను కలవడం అధికారికమా.. వ్యక్తిగతమో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'మీడియా కేకలు వేస్తున్నా వారికి ఏం చెప్పకుండా ఎందుకు వెళ్లిపోయారు? జగన్ నిజాలు బహిర్గతం చేయడానికి ఎందుకు భయపడుతున్నారు' అని ప్రశ్నించారు. 'మీ హయాంలో సరఫరా చేసిన జె బ్రాండ్ మద్యంలో విష పదార్థాలు ఉన్నట్లు చెన్నైలోని ఎస్జీఎస్ ల్యాబ్ నిర్ధారించిన విషయం నిజం కాదా? అలాంటి మద్యాన్ని తాగి వేలమంది ప్రాణాలు కోల్పోయారు. మీ ఐదేళ్ల పాలనలో 90,385 మంది కిడ్నీ రోగాలు, 29,369 మంది కాలేయ సమస్యలు, 12,663 మంది నరాల వ్యాధుల బారిన పడి బాధపడుతున్నారు. కల్తీ మద్యంతో చావులకు కారణమైన జగన్ అండ్ కోపై డీజీపీ ప్రత్యేక కేసు నమోదుచేసి, సమర్థులైన అధికారులతో దర్యాప్తు చేయించాలి' అని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

విదేశాల్లో ఉన్న నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్లు

మద్యం కుంభకోణం కేసులో... 12 మందికి జారీ చేసిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో విదేశాల్లో ఉన్న 12 మంది నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు సోమవారం నాన్ బెయిలబుల్ వారెంట్లు(ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటూ.. విచారణకు రాకుండా తప్పించుకుంటున్న వీరిని భారత్ రప్పించేందుకు వీలుగా సిట్ గత వారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై కోర్టులో ఇరుపక్షాల వాదనలు సాయంత్రం వరకు జరిగాయి. ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవిస్తూ న్యాయాధికారి భాస్కరరావు.. ఎన్‌బీడబ్ల్యూలు జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో సిట్ అధికారులు... ఇంటర్‌పోల్ ద్వారా నిందితులను భారత్ రప్పించేందుకు వీలుగా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించేందుకు మార్గం సుగమమైంది.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత: మద్యం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి(ఏ 38) బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై గత వారం వాదనలు పూర్తి అయ్యాయి. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది.

ప్రజల అంగీకారం లేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



విద్యుత్తు శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ఈనాడు, విశాఖపట్నం: 'ప్రజల అంగీకారం లేకుండా విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు. వాటి వినియోగం వల్ల కలిగే బహుళ ప్రయోజనాలను వివరించి, ప్రజలను ఒప్పించిన తర్వాతే అమర్చాలి' అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించేది లేదని స్పష్టం చేశారు. పారిశ్రామిక, వ్యాపార వర్గాలకు మాత్రమే ప్రస్తుతం స్మార్ట్‌మీటర్ల ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) అధికారులతో సోమవారం విశాఖపట్నంలో మంత్రి సమీక్షించారు. స్మార్ట్ మీటర్లను ముందుగా విద్యుత్‌శాఖ అధికారులు, రాజకీయ నాయకుల ఇళ్లకు బిగించి వారిని రోల్‌మోడల్‌గా చూపించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రజామోదం లేని ఏ అంశంపైనా కూటమి ప్రభుత్వం ముందుకెళ్లదని స్పష్టం చేశారు. కొందరు సామాజిక మాధ్యమాల్లో లేనిపోని అపోహలు సృష్టించి ప్రచారం చేస్తుండటంపై మండిపడ్డారు. ప్రజలపై ఎటువంటి భారం పడకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో ప్రత్యేక విద్యుత్తు లైన్లకు సంబంధించిన ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని సీఎండీ పృథ్వీతేజ్‌ను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో లోఓల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని నిర్దేశించారు. ఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లోనూ వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విద్యుత్‌శాఖ సీజీఎంలు, ఎస్ఈలు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఇది ఉపాధ్యాయులకు అంకితం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల మెగా సమావేశం (పీటీఎం) నిర్వహించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గిన్నిస్ రికార్డును నెలకొల్పిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ రికార్డు ఉపాధ్యాయులకే అంకితమని ప్రకటించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం మెగా పీటీఎంలో 53.40 లక్షల మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు, ప్రత్యక్షంగా పాల్గొన్న వారు సహా మొత్తం 1.5 కోట్ల మంది ఈ సమావేశాల్లో భాగస్వాములయ్యారు. జులై 29న జరగనున్న జాతీయ విద్యా విధానం ఐదో వార్షికోత్సవానికి ఒక రోజు ముందు మెగా పీటీఎం గిన్నిస్ రికార్డు సాధించడం చాలా ఆనందంగా ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహకంగా నిలిచిందన్నారు.

అనంతలో జ్ఞానసీమ!

- సిద్ధమైన సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణం
- నేడు లాంఛనంగా ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన పరిపాలనా భవనం



వర్సిటీ ప్రధాన ముఖద్వారం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన తర్వాత అనంతపురం జిల్లా జంతులూరు వద్ద 492 ఎకరాల్లో సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. భవన సముదాయాలు, వసతుల కల్పనకు రూ.711 కోట్లతో అంచనాలు రూపొందించింది. తాత్కాలికంగా అనంతపురం నగర శివారులో అద్దె భవనాల్లో తరగతులు ఏర్పాటు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా వర్సిటీ అభివృద్ధిని విస్మరించి... పనులను పట్టించుకోలేదు. మొదటి విడతగా విడుదల చేసిన రూ.350 కోట్లతో 2023లో చేపట్టిన రెండు అకడమిక్ భవనాలు, మూడు వసతిగృహాలు, పరిపాలనా భవనం, అంతర్గత రహదారులు, విద్యుత్తు, తాగునీరు, సౌర విద్యుత్తు ప్లాంటు పనులు నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని రెండు భవనాలను వేగంగా పూర్తి చేయించారు. గతేడాది ఆగస్టు నుంచి 1,100 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు వసతినీ కల్పించారు. శాశ్వత ప్రాతిపదికన నిర్మించిన భవనాలన్నీ సిద్ధమయ్యాయి. 2,200 మంది విద్యార్థులు చదువుకునేలా వర్సిటీలో ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాలకు చెందిన 1,600 మంది విద్యార్థులు, విదేశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఉన్నారు. వర్సిటీ ప్రాంగణానికి 'జ్ఞానసీమ' అని పేరు పెట్టారు. భవన సముదాయాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఉపకులపతి కోరి తెలిపారు.

సీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



శోభాయాత్రలో పాల్గొన్న పీవీఎన్ మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు

ఈనాడు డిజిటల్, నంద్యాల, పాత పట్టణం, న్యూస్‌టుడే: రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా సోమవారం నంద్యాల వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. పద్మావతినగర్ నుంచి సౌజన్య కన్వెన్షన్ హాల్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా సత్తా చాటాలని సూచించారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను తప్పకుండా తెస్తామని పేర్కొన్నారు. రాయలసీమకు స్టీల్ ప్లాంటును తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాయలసీమలో నీటి సమస్యలు తీరుస్తామని.. పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ప్రసంగించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పంచాయతీలకు 10న, పరిషత్‌లకు 12న ఎన్నికలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు జడ్పీటీసీ, మూడు ఎంపీటీసీ, రెండు సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ ఇచ్చింది. అక్కడి నుంచి గతంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పదవులకు రాజీనామా చేయడం, మరణించడం ఇతరత్రా కారణాలతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ ఎన్నికలకు ఈనెల 30 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

- ప్రకాశం జిల్లా కొండపల్లి పంచాయతీ సర్పంచ్ సహా అన్ని వార్డు సభ్యుల స్థానాలకు, తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఆగస్టు 10న ఎన్నికలు జరుగుతాయి.
- వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుల స్థానాలకు, చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో మనేంద్రం, నెల్లూరు జిల్లా విడవలూరు, పల్నాడు జిల్లా కారంపూడి మండలం వేపకంపల్లె ఎంపీటీసీ స్థానాలకు ఆగస్టు 12న ఎన్నికలు నిర్వహిస్తారు.

నా కుమారుడు తప్పు చేశారని రుజువు కాలేదు

మిథున్‌రెడ్డి తల్లి స్వర్ణలత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో ఆయన తల్లి స్వర్ణలత, సోదరి శక్తిరెడ్డి సోమవారం ములాఖత్ అయ్యారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ భరత్‌రామ్ జైలు బయట వారిని కలిశారు. అనంతరం స్వర్ణలత విలేకరులతో మాట్లాడారు. మిథున్‌రెడ్డి ఆరోగ్యం కొంచెం సమస్యగా ఉందన్నారు. సౌకర్యాలు కల్పిస్తున్నారా? అని విలేకరుల అడిగిన ప్రశ్నకు వాటి కోసం పిటిషన్ వేశామని.. ఎంతవరకు కల్పిస్తారో తెలియదని సమాధానమిచ్చారు. మిథున్‌రెడ్డి నేలపైనే పడుకుంటున్నారా? అని ప్రశ్నించగా ఆ విషయం అడగలేదని భావోద్వేగానికి గురయ్యారు. మిథున్‌రెడ్డి తప్పు చేశారని ఇంకా తేలలేదు కాబట్టి ఉగ్రవాది మాదిరిగా కాకుండా బాగా చూసుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అడిగిన సౌకర్యాల్లో కొన్ని అయినా కల్పిస్తే బాగుంటుందన్నారు.



కేంద్ర కారాగారం వద్ద వేణుగోపాలకృష్ణ, భరత్‌రామ్‌లతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి తల్లి స్వర్ణలత, సోదరి శక్తిరెడ్డి

మహిళల ఉచిత ప్రయాణానికి 74% బస్సులు

- త్వరలో ఉద్యోగులకు పదోన్నతులు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

వెంకటగిరి, వాకాడు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలకు 1,350 కొత్త బస్సులు కేటాయించనున్నట్లు ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. సోమవారం తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, వాకాడు డిపోలు, బస్టాండ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే 750 నూతన బస్సులు మంజూరయ్యాయని, మరో 600 బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. వచ్చేనెల నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించినందున మొత్తం 11,000 బస్సుల్లో 74 శాతం బస్సులను అందుకు కేటాయిస్తున్నామని చెప్పారు. ఉచిత సౌకర్యాన్ని ప్రస్తుత జిల్లాలకే పరిమితం కాకుండా ఉమ్మడి జిల్లాలకు విస్తరించడంపైనా కసరత్తు చేస్తున్నామని వివరించారు. వచ్చే రెండు నెలల్లో ప్రతి బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి పల్లెవెలుగు బస్సుల పెంపు ఉంటుందని చెప్పారు. ఆర్టీసీలోని అన్ని ర్యాంకుల ఉద్యోగులకు వచ్చే నెలాఖరులోగా పదోన్నతులు కల్పిస్తామని ఎండీ తెలిపారు.

'ఉచితం' విధివిధానాలపై సమీక్ష నేడు

తిరుపతి (ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఆగస్టు 15 నుంచి అమలు కానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విధివిధానాలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావులు మంగళవారం సమీక్షించనున్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లోని అధికారులు, డిపోల మేనేజర్లు పాల్గొంటారు. మహిళా ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల ఏర్పాటు, రద్దీ మార్గాల్లో బస్సుల సంఖ్య పెంపు తదితర అంశాలపై సమీక్ష జరుగనుంది.

EENADU Vol: 51, Issue: 350 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కొన్ని ప్రాంతాల్లోనే అధిక వర్షాలు

- మొత్తంగా సాధారణం కంటే ఎక్కువే: ఐఎండీ

దిల్లీ: వర్షాల సీజన్ మొదలైన జూన్ 1 నుంచి సాధారణం కంటే 7 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదు కాగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతానికి సంబంధించి వైరుధ్యం ఎక్కువగా ఉంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) డేటా ప్రకారం.. ఇప్పటి వరకు 418.9 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 447.8 మి.మీ.గా రికార్డయింది. రాజస్థాన్ (384.7 మి.మీ.), లద్దాఖ్, నాగాలాండ్, మణిపుర్, సిక్కింలలో చాలా అత్యధికంగా వర్షాలు కురిశాయి. అధిక వర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, గుజరాత్, దాద్రానగర్ హవేలీ, దమణ్ దీవ్, ఝార్ఖండ్, అస్సాం ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్, బిహార్, దిల్లీ, మహారాష్ట్ర, లక్షద్వీప్‌లలో లోటు వర్షపాతం నమోదైంది. మిగిలిన రాష్ట్రాల్లో సాధారణ స్థాయిలోనే వర్షాలు కురిశాయి.

'చినార్ కోర్' ధైర్యసాహసాలు నిరుపమానం

- లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ ప్రశంస

ఇంటర్నెట్ డెస్క్: జమ్మూ కశ్మీర్‌లో సోమవారం జరిగిన 'ఆపరేషన్ మహదేవ్'లో శౌర్య పరాక్రమాలు ప్రదర్శించిన చినార్ కోర్‌ను (మిలిటరీ యూనిట్) డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అభినందించారు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు ప్రాణాలకు తెగించిన వారి పోరాటపటిమ నిరుపమానమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. శ్రీనగర్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే. వారిలో పహల్గాం ఉగ్ర దాడి వ్యూహకర్త సులేమాన్ షా ఉన్నాడు. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు చేపట్టినప్పుడు భద్రతా బలగాలు ఎదుర్కొనే కఠిన సవాళ్లను ఈ సందర్భంగా రాజీవ్ ఘాయ్ ప్రస్తావించారు. 'కొన్నిసార్లు పరిస్థితులు శత్రువులకు అనుకూలంగా మారతాయి. అలాగని వెనకడుగు వేయలేం. ప్రాణాలకు తెగించి పోరాడాల్సి వస్తుంది. ఈ విషయంలో చినార్ కోర్ ధైర్యసాహసాలు అమోఘం. ఉగ్రవాదులను మట్టికరిపించడంలో వీళ్లకు వీళ్లే సాటి అని ఎప్పటికీ మర్చిపోవద్దు. భారత సైన్యంలోని పరాక్రమ యోధులకు శాల్యూట్' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

పేగు బ్యాక్టీరియా నియంత్రణకు 'క్యాప్సూల్'

దిల్లీ: పేగు బ్యాక్టీరియా నియంత్రణకు చైనా శాస్త్రవేత్తలు ఒక అద్భుత క్యాప్సూల్‌ను అభివృద్ధి చేశారు. స్మార్ట్ ఫోన్ యాప్ సాయంతో బ్యాక్టీరియా నియంత్రణకు ఇది దోహదపడుతుంది. ఇది డిజిటల్‌గా ఆరోగ్యాన్ని పర్యవేక్షించే సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో పాటు రిమోట్‌గా బ్యాక్టీరియాను నియంత్రించే మధ్యవర్తిత్వ పాత్రను పోషిస్తుంది. పేగులో ఇన్‌ఫ్లమేషన్ ఉన్న పందులపై దీనిని టియాంజిన్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా సంస్థలు పరీక్షించి చూశాయి. నేచర్ మైక్రోబయాలజీ జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసంలో శాస్త్రవేత్తలు.. పేగు బ్యాక్టీరియాను నియంత్రించడంలో, రెండు మార్గాల్లో కమ్యూనికేషన్‌ను అనుమతించడంలో ఈ క్యాప్సూల్ ఎలా పనిచేస్తుందో వివరించారు. పొట్టలోని ఈ-కొలి బ్యాక్టీరియా ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని మనకు తెలుసు. ఆ బ్యాక్టీరియాను మోడిఫైడ్ చేయడంద్వారా జంతువుల్లోని నిర్దేశిత ప్రాంతానికి ఔషధాలను పంపవచ్చని తెలిపారు. ఈ-కొలితో ఒక లైట్‌ద్వారా స్మార్ట్ క్యాప్సూల్ కమ్యూనికేట్ అయ్యేలా ఏర్పాటు చేశారు. బ్యాటరీలతో నడిచే ఒక సర్క్యూట్ బోర్డునూ క్యాప్సూల్‌లో అమర్చారు. దీనిని నోటిద్వారా పంపేలా అభివృద్ధి చేశారు.

రష్యా వైమానిక సంస్థపై సైబర్‌దాడి

- 100కి పైగా విమాన సర్వీసుల్ని రద్దుచేసిన 'ఏరోఫ్లోట్'

మాస్కో: రష్యా ప్రభుత్వ వైమానిక సంస్థ 'ఏరోఫ్లోట్'కు చెందిన కంప్యూటర్ వ్యవస్థలపై సోమవారం సైబర్ దాడి జరిగింది. దీంతో 100కి పైగా విమాన సర్వీసులను ఆ సంస్థ రద్దు చేయాల్సి వచ్చింది. మరికొన్నింటిని నిర్దేశిత సమయం కన్నా ఆలస్యంగా నడిపింది. ఫలితంగా వేల మంది దేశీయ ప్రయాణికులు, విదేశాలకు వెళ్లాల్సిన వారు పలు విమానాశ్రయాల్లో నిరీక్షించాల్సి వచ్చింది. ఏరోఫ్లోట్ అనుబంధ వైమానిక సంస్థల సర్వీసులూ ఆలస్యంగా నడిచాయి. సైబర్ దాడి తమ పనేనని ఉక్రెయిన్ హ్యాకర్ గ్రూప్ సైలెంట్ క్రో, బెలారస్‌కు చెందిన హ్యాకర్ గ్రూప్ 'బెలారస్ సైబర్-పార్టిసాన్స్' ప్రకటించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభమైన 2022 ఫిబ్రవరి తర్వాత రష్యాపై జరిగిన అతిపెద్ద సైబర్‌దాడిగా దీనిని పరిగణిస్తున్నారు.

విమానాన్ని పేల్చేస్తా..

- గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడి బెదిరింపు



లండన్: విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడు అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. తన వద్ద బాంబు ఉందని, దాన్ని పేల్చేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. బ్రిటన్‌లోని స్కాట్లండ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లూటన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈజీజెట్ విమానం ఆదివారం స్కాట్లాండ్‌లోని గ్లాస్గోకు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొంతసేపటి తర్వాత ఓ ప్రయాణికుడు తన సీటులో నుంచి లేచి గట్టిగా కేకలు వేయడం మొదలుపెట్టాడు. 'నా దగ్గర బాంబు ఉంది. ఈ విమానాన్ని పేల్చేస్తా. అమెరికాకు మరణం.. ట్రంప్‌కు మరణం' అంటూ అరిచాడు. అప్రమత్తమైన సిబ్బంది అతడిని పట్టుకొని బంధించారు. సమీపంలోని ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని అత్యవసరంగా దించేశారు. ల్యాండ్ అవగానే నిందితుడిని పోలీసులకు అప్పగించారు. బెదిరింపులకు పాల్పడిన ప్రయాణికుడి వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు స్కాట్లాండ్ పోలీసులు వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్కాట్లాండ్‌లో పర్యటిస్తున్న సమయంలోనే ఈ బెదిరింపుల ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

కాంపా నిధులతో అటవీకరణలో ముందడుగు

- రాష్ట్రాల వారీగా మిశ్రమ ఫలితాలు
- సుప్రీంకోర్టు నియమిత సాధికార కమిటీ నివేదిక

దిల్లీ: అభివృద్ధి ప్రాజెక్టులు, కబ్జాల వల్ల హరించుకుపోతున్న అడవులకు పరిహారంగా చేపడుతున్న అటవీకరణ యత్నాలు మిశ్రమ ఫలితాలనిస్తున్నాయి. పరిహార అటవీకరణ నిధి వినియోగంలో కొన్ని రాష్ట్రాలు పూర్తిస్థాయిలో, మరికొన్ని నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ముందడుగు వేస్తున్నాయి. ఇంకొన్ని రాష్ట్రాలు బాగా వెనుకబడి ఉన్నాయి. మొత్తంగా పరిహార అటవీకరణ నెమ్మదిగానైనా పురోగతిని సాధిస్తోందని తెలుస్తోంది.

✦ అటవీయేతర అవసరాలకు అటవీ భూములను వినియోగించినపుడు కొత్త అడవులు పెంచడానికి సంబంధిత సంస్థలు నష్టపరిహార నిధులు కేటాయించాలని సుప్రీంకోర్టు 1995లో తీర్పు ఇచ్చింది. దీనికోసం పరిహార అటవీకరణ నిధి నిర్వహణ, ప్రణాళికా ప్రాధికార సంస్థ (కాంపా) ఏర్పాటైంది. 2016లో పార్లమెంటు పరిహార అటవీకరణ నిధి చట్టాన్ని ఆమోదించింది. జాతీయ, రాష్ట్రాల స్థాయిలో అటవీకరణ నిధుల వినియోగానికి ఆ చట్టం నియమావళిని విధించింది.



✦ 2019-20 నుంచి 2023-24 వరకు 2,09,297 హెక్టార్లలో పరిహార అడవులు పెంచాల్సి ఉండగా, వాస్తవంలో 1,78,000 హెక్టార్లలోనే పెంచారని సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం ఈ నెలారంభంలో నివేదించింది. అంటే 85 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లయింది.

✦ గుజరాత్, మధ్యప్రదేశ్, చండీగఢ్, మిజోరం రాష్ట్రాలు నిర్దేశిత లక్ష్యం మేరకు అటవీకరణ సాధించాయి. కర్ణాటక 2,761.26 హెక్టార్లలో కొత్త అడవులను పెంచాల్సి ఉండగా 2,775.12 హెక్టార్లలో అటవీకరణ సాధించింది.

✦ ఆంధ్రప్రదేశ్ కొత్తగా 8,663.46 హెక్టార్లలో అడవులను పెంచాల్సి ఉండగా 3,471.88 హెక్టార్లలో మాత్రమే చేపట్టగలిగింది.

✦ జాతీయ కాంపా కింద 2019-20 నుంచి 2023-24 వరకు రాష్ట్రాల వార్షిక ప్రణాళికలకు రూ.38,516 కోట్లను కేటాయించారు. రాష్ట్రాలు తమ అటవీ శాఖలకు రూ.29,311 కోట్లు కేటాయించాయి. ఈ నిధులలో 67.5 శాతాన్ని మాత్రమే ఖర్చుచేశారు. ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించిన నిధులను పూర్తిగా వెచ్చించగా, తెలంగాణ 60.4 శాతమే ఖర్చుచేసింది.

✦ పెద్ద రాష్ట్రాలలో ఉత్తర్‌ప్రదేశ్ 96.4 శాతం అటవీకరణ లక్ష్యాన్ని చేరుకోగా, చిన్న రాష్ట్రాలలో అరుణాచల్‌ప్రదేశ్ 96.6 శాతం మేర అందుకుంది. తమిళనాడు 262.39 హెక్టార్లలో కొత్త అడవులను పెంచాల్సివుంటే 84.76 హెక్టార్లలో మాత్రమే చేపట్టగలిగింది. కేరళ 433.06 హెక్టార్లకు గాను 171.80 హెక్టార్లను మాత్రమే పెంచింది. కొత్తగా పెంచిన అడవుల్లో కొన్ని రాష్ట్రాలలో 40-45 శాతం మేరకు మాత్రమే నిలిచివుండగా మరికొన్ని రాష్ట్రాలలో 80-90 శాతానికిపైగా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఝార్ఖండ్‌లో వేసిన కొత్త చెట్లలో 78-98 శాతం బతికాయి. నవ్య అటవీకరణ యత్నానికి ఆదిలో ఆటంకాలు కలిగినా, కొవిడ్ వల్ల తాత్కాలిక విఘాతం కలిగినా మొత్తం మీద పురోగతి కనిపిస్తోంది.

విద్యా వైజ్ఞానిక అవసరాలకే శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రసారాలు

- జాతీయ వైద్య మండలి మార్గదర్శకాలు

దిల్లీ: 'శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రసారాలను విద్యావిజ్ఞానాల కోసమే నిర్వహించాలి. వ్యాపారం కోసమో, శస్త్రచికిత్సకునికి, ఆస్పత్రికి, వైద్య పరికరాలను సరఫరా చేసిన కంపెనీకి పేరుతెచ్చిపెట్టడం కోసమో చేయకూడద'ని జాతీయ వైద్య మండలి (ఎన్.ఎం.సి) ఇటీవల నిర్దేశించింది. ప్రత్యక్ష ప్రసారానికి రోగి ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొంది. శస్త్రచికిత్సకు వాడిన పరికరాలకు సంబంధించి ఎలాంటి వ్యాపార, ఆర్థిక ప్రయోజనాలు ఉండకూడదని స్పష్టం చేసింది. ప్రత్యక్ష ప్రసార సమయంలో రోగికి ఎటువంటి అపాయం కలగకుండా కచ్చితమైన నియమనిబంధనలను పాటించాలనీ, రోగికి బీమా సౌకర్యమూ ఉండాలని ఎన్.ఎం.సి సిఫార్సు చేసింది. స్వయంగా శస్త్రచికిత్స చేయడం ద్వారా వచ్చే ప్రయోజనం ప్రత్యక్ష ప్రసారం వల్ల కలగదని స్పష్టం చేసింది. మృతకళేబరాలతో బోధన అభిలషణీయమని అభిప్రాయపడింది. 'ప్రత్యక్ష ప్రసార సమయంలో శస్త్రచికిత్సకుని ఏకాగ్రత సడలవచ్చు. లైట్లు, కెమెరాలు, వీక్షకులు.. వైద్యునితోపాటు రోగిలోనూ ఆదుర్దా పెంచవచ్చు. ప్రత్యక్ష ప్రసారాలలో వాణిజ్య ప్రకటనలు, ప్రాయోజకత్వం, నైపుణ్య ప్రదర్శన వ్యవహారాన్ని గాడితప్పిస్తాయ'ని ఎన్.ఎం.సి హెచ్చరించింది. వైద్యుల సమావేశాలలో, సభల్లో శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రసారం సర్జన్‌పై ఒత్తిడి పెంచవచ్చనే కారణంపై దేశవిదేశాల్లో ఈ ప్రసారాలపై వైద్యుల సంఘాలు నిషేధం విధించాయి. ఆధునిక కాలంలో కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చినందున శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలనే వాదమూ వినిపిస్తోంది. అందువల్ల ముందే రికార్డు చేసిన శస్త్రచికిత్స వీడియోలు, మృత కళేబరాలు, సిమ్యులేషన్‌లతో ప్రత్యక్ష ప్రసారాలు నిర్వహించడం నైతికంగా ఆమోదనీయమవుతుందని ఎన్.ఎం.సి సూచించింది.

అందరినీ అక్కున చేర్చుకోవడమే హిందూ మత సారం

- ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్

కొచ్చిన్: నిఖార్సయిన హిందువు అంటే అర్థం ఇతర మతాలను వ్యతిరేకించేవాడు అని కాదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ అన్నారు. ప్రతి ఒక్కరినీ అక్కున చేర్చుకోవడమే హిందూ మత సారమని ఆయన ఉద్బోధించారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ అయిన సంస్కృతి ఉత్థాన్ న్యాస్ నిర్వహించిన జాతీయ విద్యా సదస్సులో "జ్ఞానసభ"ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. "నిఖార్సయిన హిందువు అంటే ఇతరుల్ని దూషించేవాడన్న అపప్రథ ఉంది. నిజమైన హిందువు అంటే ఇతర మతాల్ని వ్యతిరేకంచేవాడని కాదు. మనం హిందువులమే. హిందువు అంటేనే అందరినీ ఆమోదించేవాడని అర్థం" అని ఆయన అన్నారు. హిందువుల్ని ఐక్యం చేస్తామని అంటున్నవారు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి, అని పేర్కొన్నారు. భారత్‌ను ఆధ్యాత్మిక భూమిగా పేర్కొంటూ, మన జాతీయతా భావన స్వచ్ఛమైనదన్నారు.

అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని తిరిగిచ్చేశా

- బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ వెల్లడి



ముంబయి: తనకు గతంలో ఓ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని తాను తిరిగి వారి కుటుంబానికే ఇచ్చేసినట్లు బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 2018లో వార్తల్లో నిలిచిన ఈ విషయం గురించి ఆయన మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోన్న నిషా పాటిల్ అనే అభిమాని అప్పట్లో తన ఎస్టేట్ మొత్తాన్ని సంజయ్ దత్ పేరిట రాశారు. ఆమె తన తదనంతరం సంపదనంతా సంజయ్‌కు బదిలీ చేయాలని బ్యాంకుకు కూడా సూచించినట్లు సమాచారం. అయితే సంజయ్ దత్ ఈ విషయం మీద స్పష్టత ఇచ్చారు. 'నేను ఆ ఆస్తిని ఆమె కుటుంబ సభ్యులకే ఇచ్చేశా' అని తేల్చి చెప్పారు.

సునీల్ శెట్టిపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు



ముంబయి: బాలీవుడ్ హీరో సునీల్ శెట్టి ఓ వివాదంలో చిక్కుకున్నారు. భార్యాభర్తల మధ్య బాధ్యతల విభజన గురించి ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలే దీనికి కారణమయ్యాయి. భర్త తన కెరీర్ మీద దృష్టిపెడితే, పిల్లల ఆలనాపాలన బాధ్యతను భార్య తీసుకోవాలని సునీల్ శెట్టి సూచించాడు. నటుడు ఈ అభిప్రాయం వెల్లడించిన నేపథ్యంలో, అతడిపై సోషల్‌మీడియాలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'ఈ రోజుల్లో యువతలో ఓపిక ఉండటం లేదు. పెళ్లైన తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. కొన్ని విషయాల్లో రాజీ పడాలి. పరస్పరం మద్దతుగా నిలవాలి. వారి జీవితంలోకి పిల్లలు వచ్చాక.. వారి ఆలనాపాలనా బాధ్యతలను భార్య తీసుకోవాలి. అప్పుడు భర్త తన కెరీర్ మీద దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. అలాగే భర్త కూడా ఈ విషయంలో కాస్త బాధ్యత తీసుకోవాలి. కానీ ప్రస్తుత కాలంలో అన్ని విషయాల్లోనూ తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది' అని సునీల్ శెట్టి ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యల మీద సోషల్ మీడియా వేదికగా చాలామంది భిన్నాభిప్రాయాలు, వ్యతిరేకతను వ్యక్తంచేశారు. 'ఆయన మాట్లాడటం ఆపేయాలి' అని ఒకరంటే, 'తన ఇమేజ్‌ను తానే డ్యామేజ్ చేసుకుంటున్నాడు' అని మరో యూజర్ కామెంట్ చేశాడు. 'కొన్నిసార్లు మౌనంగా ఉండటం మంచిది. ఈ విషయమై ఆయన చుట్టూ ఉండేవారు సలహాలు, సూచనలు ఇవ్వరా?' అని ఇంకో వ్యక్తి కామెంట్ చేశాడు.

కృత్రిమ మేధ ముప్పును తేలిగ్గా తీసుకుంటున్నారు

- ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ ఆందోళన



ఇంటర్నెట్‌డెస్క్: టెక్ దిగ్గజాలు కృత్రిమమేధ ముప్పును తక్కువగా అంచనా వేస్తున్నాయని ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ పేర్కొన్నారు. ఏఐతో తలెత్తే ప్రమాదాలను టెక్నాలజీ కంపెనీలు పట్టించుకోవడం లేదంటూ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. తొలినాళ్లలో ఈ ప్రమాదాన్ని గుర్తించనందుకు చింతిస్తున్నానని జెఫ్రీ హింటన్ తెలిపారు. దశాబ్దం పాటు సేవలు అందించి 2023లో హింటన్ గూగుల్‌ను వీడారు. ఏఐని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలన్న గూగుల్ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆయన వెళ్లిపోయారని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అయితే, అందులో వాస్తవం లేదని తాజాగా ఆయన వెల్లడించారు. 'అప్పటికి నా వయసు 75 ఏళ్లు. ఆశించినమేర పనిచేయలేకపోవడం వల్లే గూగుల్‌ను వీడాను. అయితే ఇప్పుడు ఏఐ ముప్పు గురించి స్వేచ్ఛగా మాట్లాడగలన'ని వ్యాఖ్యానించారు. ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్‌లో కృషికిగానూ హింటన్‌కు 2024లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ వరించింది. ఆ రంగంలో దశాబ్దకాలంపాటు ఆయన కృషి ఫలితమే ఇప్పుడు ఏఐ విప్లవానికి దోహదం చేసింది.

మెరుపు వేగమే రుద్ర, భైరవ బలం



ఇంటర్నెట్‌డెస్క్: రుద్ర ఆల్‌ఆర్మ్స్ బ్రిగేడ్, భైరవ లైట్ కమాండో బెటాలియన్లు భారత సైన్యంలో భారీ మార్పులకు బలమైన సంకేతాలు. ఒకే రకమైన ఆయుధాలతో వేల మంది యుద్ధం చేయడం కంటే.. తక్కువ మంది సైనికులు విభిన్న ఆయుధాలు, టెక్నాలజీలతో ఏకకాలంలో సమష్టిగా శత్రువుపై విరుచుకుపడేలా వీటిని రూపొందించారు. చైనా, పాక్‌తో ఘర్షణల అనంతరం భారత సైన్యంలో శరవేగంగా చోటు చేసుకొంటున్న మార్పులకు ఇవి చిహ్నం. దివంగత సీడీఎస్ బిపిన్ రావత్ హయాంలో సైనిక సంస్కరణలు మొదలయ్యాయి. అప్పుడే ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్ గ్రూప్ (ఐబీజీ)లను ఏర్పాటు చేయాలనే ఆలోచన రూపొందింది. దీనిలో ఇన్‌ఫాంట్రీతో పాటు.. శతఘ్ని, రాకెట్, సాయుధ కవచ, ఎయిర్ డిఫెన్స్, సిగ్నల్స్ తదితర బలగాలు మొత్తం ఉంటాయి. ఇది బ్రిగేడ్ సైజ్(3,000) కంటే పెద్దదిగా.. డివిజన్ (10,000)సైజు కంటే చిన్నదిగా ఉంచాలని నిర్దేశించారు. మేజర్ జనరల్ స్థాయి అధికారి వీటికి నాయకత్వం వహిస్తారు. నిర్ణయాలు కూడా వేగంగా తీసుకొంటారు. కేవలం 12 నుంచి బ్రిగేడ్ స్థాయిలో అన్ని రకాల వనరులతో సైన్యం సిద్ధంగా ఉండేందుకు వీలుగా వీటిని ప్రతిపాదించారు.

ఏమిటీ రుద్ర బ్రిగేడ్..?

ప్రస్తుతం ఉన్న రెండు ఇన్‌ఫాంట్రీ(పదాతి దళ) బ్రిగేడ్లను 'రుద్ర'గా మార్చాలని నిర్ణయించారు. వీటిల్లో మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీ, ట్యాంకులు, శతఘ్నులు, ప్రత్యేక దళాలు, మానవ రహిత విమానాలు, ప్రత్యేకమైన లాజిస్టిక్స్ వ్యవస్థలు, కాంబాట్ సపోర్ట్‌తో వీటిని సిద్ధం చేస్తున్నారు. రుద్ర బ్రిగేడ్‌లు మోహరించే ప్రదేశాల భౌగోళిక పరిస్థితులు, ఆపరేషన్ల ఆధారంగా.. వీటిల్లో వచ్చే బలగాల సమ్మేళనం మారుతుంటుంది. సాధారణంగా వీటిల్లో శతఘ్నులు, డ్రోన్ల నిఘా ఉండటంతో.. ఇవి మన సేనలకు ఆధిపత్యాన్ని ఇస్తాయి. తీవ్ర స్థాయిలో జరిగే స్వల్పకాలిక ఘర్షణలు ఎదుర్కోవడంలో ఇటువంటి బ్రిగేడ్లు ప్రభావవంతంగా ఉంటాయి. ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు పంచుకొనే పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో వీటిని మోహరించవచ్చు.

భైరవ లైట్ కమాండో బెటాలియన్లు ఏమిటీ..?

చురుగ్గా సరిహద్దుల్లో మోహరించడానికి.. మెరుపు వేగంతో దాడులు చేయడానికి వీలుగా భైరవ కమాండో బెటాలియన్లు ఏర్పాటు చేసింది. తక్షణమే చేపట్టే టాక్టికల్ ఆపరేషన్స్‌పై భైరవ బెటాలియన్స్ దృష్టిపెడతాయి. సైనిక చర్యకు సర్వసన్నద్ధంగా ఉంటాయి.

గాజా ప్రజలకు ఆహారం అందాలి: ట్రంప్



లండన్, ఎడిన్‌బరో: గాజాలో దారుణ పరిస్థితుల పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలకు ఆహారం అందాలని స్పష్టం చేశారు. దీనికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతోపాటు ప్రజలు సహకరించాలని కోరారు. గాజాలో పిల్లలు ఆకలితో ఉన్నట్లు టీవీల్లో చూశా అని ట్రంప్ పేర్కొన్నారు. 'అమెరికాతోపాటు పలు దేశాలు.. గాజాకు డబ్బు, ఆహారం పంపుతున్నాయి. వాటిని ప్రజలకు చేరేలా చూడాలి. గాజాలో అమెరికా ఆహార కౌంటర్లను ఏర్పాటు చేస్తుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

మరో 78 మంది మృతి

డెయిర్ అల్-బలా: గాజాలో ఆదివారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 78 మంది మరణించారు. చనిపోయిన వారిలో అప్పుడే పుట్టిన బిడ్డా ఉన్నారు.

ఆ నౌకలే మా టార్గెట్: హూతీలు

ఏథెన్స్: యెమెన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రెబల్ గ్రూప్ హూతీ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌తో వ్యాపారం చేసే వాణిజ్య నౌకలన్నింటినీ లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. అవి ఏ దేశానికి చెందిన నౌకలైనా, ఏ సంస్థవైనా వెనకాడబోమని హూతీలు స్పష్టం చేశారు. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణ హోమానికి నిరసనగా.. హూతీలు పాలస్తీనియన్లకు మద్దతిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఎర్ర సముద్రం మీదుగా ఇజ్రాయెల్ పోర్టులకు వెళ్తున్న వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా దాడులను మరింత ఉద్ధృతం చేయాలని, ఆ దేశంవైపు వెళ్లే నౌకలను పూర్తిగా దిగ్బంధించాలని నిర్ణయించినట్లు హూతీలు తాజాగా ప్రకటన విడుదల చేశారు.

అమెరికా క్యాసినో రిసార్టులో కాల్పులు

- ఇద్దరి మృతి.. మరో ముగ్గురికి గాయాలు

రెనో: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. నెవడా రాష్ట్రంలోని రెనో నగరంలో ఓ క్యాసినో రిసార్టులో జరిగిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. సోమవారం ఉదయం రిసార్టులోకి తుపాకీతో వెళ్లిన దుండగుడు కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. రిసార్టులో కాల్పుల నేపథ్యంలో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లు విడిచి బయటకు రావొద్దని పోలీసులు సూచించారు.



పార్లమెంటు ఆవరణలో ఎన్డీయే మహిళా ఎంపీల ప్రదర్శన

ఎంపీ డింపుల్ యాదవ్‌పై మతాధికారి వ్యాఖ్యలు

- నిరసిస్తూ.. ఎన్డీయే మహిళా ఎంపీల ఆందోళన

దిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్‌పై ఓ మతాధికారి చేసిన స్త్రీ ద్వేషపూరిత వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని పార్లమెంటు ఆవరణలో ఎన్డీయే మహిళా ఎంపీలు సోమవారం ఆందోళన చేశారు. ఓ టీవీ చర్చ సందర్భంగా డింపుల్ యాదవ్ చీర ధరించడంపై మౌలానా సాజిద్ అనే మతాధికారి అనుచిత వ్యాఖ్యలు చేశారు. చర్చలో భాగంగా తల వరకు దుస్తులు వేసుకున్న మరో ఎంపీ ఇక్రా హసన్‌తో డింపుల్ యాదవ్‌ను పోల్చారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన ఎన్డీయే నేతలు.. స్త్రీ శక్తిని అవమానిస్తే భారత్ ఊరుకోదంటూ హెచ్చరించారు. దీనిపై సమాజ్‌వాదీ పార్టీ, అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మౌనం వహించడాన్ని ప్రశ్నించారు. డింపుల్ మాట్లాడుతూ.. మణిపుర్‌లో చెలరేగుతున్న హింస ఘటనల్లో కూడా ఎన్డీయే నేతల నుంచి ఇదే సంఘీభావం వ్యక్తమైతే ఈ ఆగ్రహం మరింత అర్థవంతంగా ఉండేదన్నారు.

శునకాల బెడదపై సుప్రీంకోర్టు ఆందోళన

- సుమోటోగా విచారణకు స్వీకరణ

దిల్లీ: దేశంలో వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దేశ రాజధాని దిల్లీలో శునకాల దాడిలో ఆరేళ్ల బాలిక మృతిపై మీడియాలో వచ్చిన కథనంపై వెంటనే స్పందించింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం ఈ అంశాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. ప్రతి రోజూ వందల మంది కుక్క కాటుకు గురవుతున్నారని, ఇది తీవ్రంగా కలవరపరిచే అంశమని పేర్కొంది. చిన్నారులు, పెద్దలు ప్రాణాంతక రేబిస్ వ్యాధిబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి సంబంధించిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. తదుపరి ఆదేశాల కోసం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ముందు ఈ అంశాన్ని ఉంచాలని కోర్టు రిజిస్ట్రీకి సూచించింది. పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం తెలిపిన సమాచారం ప్రకారం.. గతేడాది దేశవ్యాప్తంగా 37 లక్షల మంది కుక్కకాటుకు గురికాగా రేబిస్ వ్యాధి సోకి 54 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఆ ఆదేశం భవిష్యత్తు నియామక నోటీసులకే..

- న్యాయాధికారులకు మూడేళ్ల లా ప్రాక్టీసు ఉండాలన్న తీర్పుపై సుప్రీంకోర్టు స్పష్టత

దిల్లీ: న్యాయాధికారుల నియామక పరీక్ష రాసే అభ్యర్థులకు కనీసం మూడేళ్ల లా ప్రాక్టీసు అనుభవం ఉండాలన్న షరతుపై సుప్రీంకోర్టు సోమవారం స్పష్టత ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మే 20న ఈ తీర్పు వెలువరించింది. తీర్పు వచ్చిన తర్వాత వెలువడే న్యాయాధికారుల నియామక నోటీసులకు మాత్రమే ఇది వర్తిస్తుందని, అంతకు ముందు వాటికి కాదనే విషయాన్ని అందులో వివరంగానే పేర్కొన్నారని జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం తెలిపింది. జమ్మూకశ్మీర్‌లో మే 14న వెలువడిన నోటిఫికేషన్‌కు కూడా ఈ తీర్పును వర్తింపజేయాలన్న ఆరుగురు న్యాయవాదుల పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ విషయం వెల్లడించింది.

మహువా మొయిత్రాపై ముగిసిన సీబీఐ దర్యాప్తు

- లోక్‌పాల్‌కు నివేదిక అందజేత

దిల్లీ: డబ్బు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగారనే ఆరోపణ ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటు సభ్యురాలు మహువా మొయిత్రా కేసుకు సంబంధించిన వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) లోక్‌పాల్‌కు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. దుబాయ్‌కి చెందిన వ్యాపారి దర్శన్ హీరానందానీ దగ్గర మహువా డబ్బు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగారనీ, ప్రధాని మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీలపై విమర్శలు గుప్పించారనీ భాజపా ఎం.పి. నిశికాంత్ దుబే ఆరోపించారు. లోక్‌పాల్ ఆదేశాలతో మహువా, హీరానందానీలపై మార్చి 21న సీబీఐ ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేసింది. దర్యాప్తు పూర్తిచేసిన తరవాత తన నివేదికను లోక్‌పాల్‌కు సమర్పించింది. మహువా తన లోక్‌సభ లాగిన్ వివరాలను ఇతరులకు ఇచ్చి జాతీయ భద్రతకు, పార్లమెంటు హక్కులకు భంగం కలిగించారనీ ఆరోపణలు వచ్చాయి.

నన్‌లను విడుదల చేయాలి

- రాహుల్ గాంధీ డిమాండ్

దిల్లీ, రాయ్‌పుర్, కొచ్చిన్: ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన క్యాథలిక్ నన్‌లను వెంటనే విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండు చేశారు. మైనారిటీలపై భాజపా ప్రభుత్వ మత ద్వేషానికి ఇదో నిదర్శనమని అభిప్రాయపడ్డారు. మత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కని స్పష్టం చేశారు. నన్‌ల అరెస్టుకు వ్యతిరేకంగా సోమవారం పార్లమెంటు ఆవరణలో కేరళ యూడీఎఫ్ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. కేరళకు చెందిన నన్‌ల అరెస్టు మైనారిటీలపై దాడేనని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాఖ్యానించారు. బజరంగ్‌దళ్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు కేరళలోని నన్‌ల కుటుంబాలను మంత్రులు పరామర్శించారు. లెఫ్ట్ ప్రభుత్వం వారికి పూర్తి మద్దతుగా నిలుస్తుందని ముఖ్యమంత్రి విజయన్ తరఫున హామీ ఇచ్చారు.

✦ నన్‌ల అరెస్టును కేరళ క్యాథలిక్ బిషప్స్ కౌన్సిల్ ఖండించింది. అది ఆమోదయోగ్యం కాని ఘటనని అభిప్రాయపడింది. కేంద్రం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరింది. కేరళ బిషప్స్ క్యాథలిక్స్ ఆఫ్ ఇండియా నన్‌ల అరెస్టును నిరసించింది. ఇది మైనారిటీలపై దాడేనని వ్యాఖ్యానించింది.

నన్‌లకు సాయం: కేరళ భాజపా

తిరువనంతపురం: ఛత్తీస్‌గఢ్‌లో నన్‌ల అరెస్టుపై కేరళ భాజపా ఆచితూచి స్పందించింది. 2026లో కేరళ ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ సైరో మలబార్ క్యాథలిక్ చర్చిపై వచ్చిన ఆరోపణలపట్ల రక్షణాత్మకంగా వ్యవహరించింది. నన్‌లకు ఇబ్బందికలగకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నామని కేరళ భాజపా ఉపాధ్యక్షుడు షాన్ జార్జ్ తెలిపారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి కార్యాయాలు ఈ అంశంలో జోక్యం చేసుకున్నాయని, నన్‌ల కుటుంబ సభ్యులతో సంప్రదిస్తున్నామని వెల్లడించారు. వారికి త్వరలోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. అనూప్ ఆంటోనీ నేతృత్వంలోని భాజపా బృందం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తోందని వివరించారు.



శ్రావణ సోమవారం సందర్భంగా వారణాసిలో శివలింగాలకు వేదార్చన చేస్తున్న వేదాభ్యాసకులు


పాపకెందుకీ వేదన?

డాక్టర్ సలహా

సమస్య: మా అమ్మాయికి నాలుగున్నరేళ్లు. ఇటీవల తరచూ మూత్ర విసర్జన చేస్తోంది. గుర్తున్నప్పుడు ప్రతి 15 నిమిషాలకోసారి బాత్రూమ్‌కు వెళ్తుంది. ఏవైనా ఆటలాడుతున్నప్పుడు మాత్రం అరగంట, గంట సమయం తీసుకుంటుంది. తనకి ఎలాంటి ఆరోగ్య సమస్య లేదు. కాకపోతే కొద్దిగా బరువు తక్కువగా ఉంటుంది. తన సమస్యకి పరిష్కారమేంటో చెప్పండి.

– ఆవుల గణేశ్

సలహా: మీ అమ్మాయికి తరచూ మూత్రం రావటానికి రకరకాల సమస్యలు కారణం కావొచ్చు. అందువల్ల ఇతరత్రా లక్షణాలేవైనా ఉన్నాయేమో కూడా చూడాల్సి ఉంటుంది. ఇది చాలా ముఖ్యం. పొత్తికడుపు నొప్పి, జ్వరం, మూత్రం పోస్తున్నప్పుడు నొప్పి, చెడు వాసన వస్తుంటే మూత్ర ఇన్‌ఫెక్షన్ కారణమై ఉండొచ్చు. మూత్రం పరీక్ష (సీయూఇ, కల్చర్, సెన్సిటివిటీ) చేస్తే ఇన్‌ఫెక్షన్ కారక బ్యాక్టీరియా తెలుస్తుంది. వారం పాటు దీనికి సరిపోయే యాంటీబయాటిక్ మందు వాడుకుంటే తగ్గిపోతుంది. దాహం ఎక్కువగా వేయటం, ఆకలి ఎక్కువ కావటం, బలహీనం కావటం, బరువు తగ్గటం వంటివి ఉన్నట్టయితే మధుమేహం ఉండొచ్చేమోనని అనుమానించాలి. రక్తంలో, మూత్రంలో గ్లూకోజు పరీక్షలతో దీన్ని నిర్ధరించొచ్చు. అరుదే అయినా డయాబిటీస్ ఇన్సిపిడిస్ అనే జబ్బులోనూ దాహం ఎక్కువగా వేయటం, బరువు తగ్గటంతో పాటు మూత్రం చాలా ఎక్కువగా, పలుచగా రావటం చూస్తుంటాం. యూరిన్ ఆస్మొలిటిస్, రక్తంలో సోడియం మోతాదుల పరీక్షలతో దీన్ని గుర్తించొచ్చు. మలబద్ధకం కూడా అతి మూత్రానికి దారితీయొచ్చు. మలాశయంలో మలం నిండిపోయి, మూత్రాశయాన్ని నొక్కటం మూలంగా ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు వెళ్తుంటారు. కొన్నిసార్లు మూత్రాశయం అతిగా స్పందించటమూ కారణం కావొచ్చు. ఇందులో మూత్రం వస్తున్నట్టు అనిపించగానే విసర్జన చేయటం, మూత్రం ఆపలేకపోవటం వంటి లక్షణాలు ఉంటాయి. దీనికి నాడులు గానీ ప్రవర్తన గానీ కారణం కావొచ్చు. కొందరు మానసిక భావనలతోనూ తక్కువ తక్కువగా ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయొచ్చు. ముఖ్యంగా ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇతరుల దృష్టిని ఆకర్షించటానికీ ఎక్కువసార్లు విసర్జనకు వెళ్తుంటారు. జననాంగ భాగంలో ఇన్‌ఫెక్షన్ ఉన్నా తరచూ మూత్రం రావొచ్చు. కాబట్టి మీరు పాపను చిన్నపిల్లల డాక్టర్‌కు చూపించండి. పరీక్షలు చేసి, సమస్యను నిర్ధరించి తగు చికిత్స సూచిస్తారు. నిర్లక్ష్యం చేస్తే ముమ్ముందు బడికి సరిగా వెళ్లకపోవటం, తరచూ మూత్ర విసర్జన చేస్తుంటే తోటి పిల్లలు గేలి చేయటం వంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు. ఇది మానసికంగా కుంగిపోయేలా చేయొచ్చు. మధుమేహాన్ని త్వరగా గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది.



-డా॥ శ్రీనివాస్ కల్యాణి, ప్రొఫెసర్, పీడియాట్రిక్స్

మీ సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

యోగాతో మధుమేహ కట్టడి!

మధుమేహం దీర్ఘకాల సమస్య. ఒకసారి వచ్చిందంటే నయమయ్యేది కాదు. అదుపులో ఉంచుకోవటం తప్ప చేయగలిగిందేమీ లేదు. అందుకే దీని నివారణ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇందుకు యోగా ఎంతగానో తోడ్పడుతున్నట్టు రిసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబిటీస్ ఇన్ ఇండియా (ఆర్ఎస్ఎస్‌డీఐ) తాజా నివేదిక పేర్కొంటోంది. దీన్ని ఇటీవలే కేంద్ర ఆరోగ్యశాఖకు సమర్పించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, ఆర్ఎస్ఎస్‌డీ పూర్వ అధ్యక్షులు డా॥ ఎస్.వి.మధు ఆధ్వర్యంలో మనదేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. మూడేళ్ల క్రితం ప్రాథమిక ఫలితాల్లోనే బయటపడ్డ యోగా గొప్పతనం తుది నివేదికతో మరింత సుస్పష్టమైంది.

మధుమేహ ముప్పు కారకాలనగానే ఆహారం, జన్యువులు, తగినంత శ్రమ చేయకపోవటం, అధిక బరువే గుర్తుకొస్తాయి. కానీ మానసిక ఒత్తిడీ తక్కువదేమీ కాదు. దీంతో సింపథెటిక్ నాడీ వ్యవస్థ, అడ్రినల్ గ్రంథి ఉత్తేజితమై రక్తంలోకి గ్లూకోజు ఎక్కువగా విడుదలవుతుంది. కణాల్లోకి గ్లూకోజు వెళ్లేలా చేసే ఇన్సులిన్ హార్మోన్ పనితీరు అస్తవ్యస్తమవుతుంది. అలాగే కార్టిజోల్ హార్మోన్ అధిక బరువుకు.. ముఖ్యంగా బొజ్జకు దోహదం చేస్తుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు ఎక్కువై.. క్రమంగా మధుమేహం ముప్పు పెరుగుతుంది. ఇక్కడే యోగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది. యోగాతో కార్టిజోల్ మోతాదులు తగ్గటంతో పాటు ఇన్సులిన్ కూడా సమర్థంగా పనిచేస్తుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజూ బాగా అదుపులో ఉంటుంది. నెమ్మదిగా, లయబద్ధంగా వేసే ఆసనాలతో కండరాలకు రక్త సరఫరా పెరుగుతుంది. కండరాల్లో ఇన్సులిన్ గ్రాహకాల వ్యక్తీకరణ ఇనుమడించటం వల్ల గ్లూకోజును బాగా స్వీకరిస్తాయి. ఆసనాలతో నడుం, తుంటి చుట్టుకొలత నిష్పత్తి గణనీయంగా తగ్గుతుంది. క్లోమంలో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలు ఉత్తేజితమవుతాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. నాడులు, జీవక్రియ వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. ఇవన్నీ మధుమేహ నివారణకు ఉపయోగపడేవే. ఆర్ఎస్ఎస్‌డీఐ అధ్యయన ఫలితాలు ఇదే సూచిస్తున్నాయి. మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నవారికీ యోగాతో 40% వరకూ ముప్పు తగ్గుతున్నట్టు తేలటం గమనార్హం.



సాధన ఇలా..

ఆర్ఎస్ఎస్‌డీఐ అధ్యయనంలో పాటించిన యోగా ప్రణాళిక ఇదీ. ఆసనాలు వేయటం ముందు కష్టంగా అనిపించినా అలవాటైన కొద్దీ తేలికగా అవుతుంది. కొన్ని ఆసనాలను గర్భిణులు, అధిక రక్తపోటు గలవారు చేయరాదు. మెడ, మోకాళ్ల నొప్పుల వంటి సమస్యలు గలవారికి.. వయసు మీరినవారికీ జాగ్రత్త అవసరమే. కాబట్టి నిపుణుల సమక్షంలో నేర్చుకున్నాకే యోగా సాధన చేయాలి. ఆసనాలు వేస్తున్నప్పుడు మరీ కష్టంగా అనిపిస్తే వీలైనంత వరకూ ఆ భంగిమలో శరీరాన్ని వంచేలా చూసుకోవాలి. వయసు మీరినవారికి ఇది మరింత ముఖ్యం.





సూర్య నమస్కారాలు– 9 సార్లు

ఇది 12 దశల్లో సాగుతుంది. ఇందులో ప్రణామ, హస్తోత్థాన, హస్తపాద, అశ్వసంచాలన, దండ, అష్టాంగ నమస్కార, భుజంగ, అదోముఖశ్వాన, అశ్వ సంచాలన, హస్తపాద, హస్తోత్థాన, ప్రణామ ఆసనాలను ఒక క్రమంలో చేయాల్సి ఉంటుంది.


ధ్యానం– నిమిషం సేపు

● సుఖాసనం లేదా పద్మాసనంలో కూర్చొని ఓంకారాన్ని జపించాలి.

త్రికోణాసనం– 6 సార్లు

పాదాలను ఎడంగా పెట్టి నిల్చొని, చేతులను రెండు వైపులకు చాచాలి. నడుమును పక్కకు వంచి ఎడమ చేత్తో కుడి పాదం వేళ్లను తాకి, కుడి చేతిని పైకి తిన్నగా చాచాలి. శ్వాస వదులుతూ తల పైకెత్తి కుడి చేయి చూడాలి. తర్వాత కుడి చేత్తో ఎడమ పాదం వేళ్లను తాకాలి. ఎడమ చేయిని పైకి తిన్నగా చాచాలి. శ్వాస వదులుతూ తలను పైకెత్తి ఎడమ చేయిని చూడాలి.

కటి చక్రాసనం– 6 సార్లు



పాదాలు దగ్గరగా పెట్టి, తిన్నగా నిల్చోవాలి. అరచేతులు ఒకదాంతో మరొటి చూసుకునేలా చేతులను తిన్నగా ముందుకు చాచాలి. శ్వాస వదులుతూ, నడుమును తిప్పుతూ నెమ్మదిగా కుడివైపునకు తిరగాలి. కుడి భుజం మీదుగా వెనకకు చూడాలి. చేతులను తాకించకుండా ఎడంగానే ఉండేలా చూసుకోవాలి. కాసేపు అలాగే ఉండి, శ్వాసను తీసుకుంటూ యథాస్థితికి రావాలి. ఇప్పుడు శ్వాస వదులుతూ, నడుమును తిప్పుతూ ఎడమవైపునకు తిరగాలి. ఎడమ భుజం మీదుగా వెనకకు చూడాలి. మళ్లీ యథాస్థితికి రావాలి.

అర్ధమత్స్యేంద్రాసనం– ఒకవైపున ఒకోసారి



వజ్రాసనంలో కూర్చోవాలి. తర్వాత పిరుదులను కాస్త లేపి, ఎడమ వైపునకు జరిపి కూర్చోవాలి. కుడి పాదాన్ని ఎడమ మోకాలుకు అటువైపునకు తీసుకురావాలి. కుడి అరచేతిని వీపు వెనకగా నేలకు తాకించాలి. ఎడమ చేతిని కుడి మోకాలికి ఇటువైపు నుంచి తిప్పుతూ వేళ్లతో కుడి పాదం వేళ్లను పట్టుకోవాలి. శ్వాస వదులుతూ నడుము, భుజాలను కుడివైపునకు తిప్పాలి. తలను తిప్పి వెనక్కి చూడటానికి ప్రయత్నించాలి. శ్వాస తీసుకుంటూ యథాస్థితికి రావాలి.

పవన ముక్తాసనం– 4 సార్లు



వెల్లకిలా పడుకొని, కాళ్లు తిన్నగా చాచాలి. ఎడమ కాలు అలాగే ఉంచి, కుడి మోకాలును వంచి, తొడను పొట్టకు ఆనించాలి. చేతులతో కుడి మోకాలును పట్టుకొని, పొట్టకు అదమాలి. తల పైకెత్తి, శ్వాస వదులుతూ చుబుకంతో మోకాలును తాకటానికి ప్రయత్నించాలి. శ్వాస తీసుకుంటూ కుడి కాలును తిన్నగా చాచాలి. తర్వాత ఎడమ కాలుతోనూ ఇలాగే చేయాలి. తర్వాత రెండు మోకాళ్లను ఒకేసారి ఎత్తి, చేతులతో చుట్టేసి పొట్టను అదమాలి. తల పైకెత్తి చుబుకాన్ని మోకాళ్లను తాకించటానికి ప్రయత్నించాలి.

భుజంగాసనం– రెండు సార్లు



బోర్లా పడుకొని తలను నేలకు తాకించాలి. చేతులను భుజాల పక్కన ఉంచాలి. అర చేతులతో నేలను నొక్కుతూ తల, ఛాతీ, మొండాన్ని పైకి లేపాలి. కాళ్లు, కటి భాగం నేలకు తాకించి ఉంచాలి.

ధనురాసనం– రెండు సార్లు



బోర్లా పడుకొని కాళ్లు తిన్నగా చాచాలి. మోకాళ్లు వెనక్కు మడవాలి. రెండు చేతులతో రెండు మడమలను పట్టుకొని, శ్వాస తీసుకుంటూ తల, ఛాతీ, తొడలు, మోకాళ్లు, కాళ్లు, చేతులు పైకెత్తాలి. కాసేపు అలాగే ఉండి, శ్వాస వదులుతూ యథాస్థితికి రావాలి.

పాదచక్రాసనం– సవ్య, అపసవ్య దిశలో ఒక్కొక్కసారి



వెల్లకిలా పడుకొని, కాళ్లను తిన్నగా చాచాలి. అరచేతులను నేలకు తాకించాలి. మోకాలు వంచకుండా కుడి కాలును పైకి లేపి, సవ్య దిశలో గుండ్రంగా తిప్పాలి. తర్వాత అపసవ్య దిశలో గుండ్రంగా తిప్పాలి. ఎడమ కాలుతోనూ ఇలాగే చేయాలి.



ప్రాణాయామం

రేచకం, పూరకం- 20 సార్లు

☛ పద్మాసనంలో లేదా సుఖాసనంలో కూర్చొని, కళ్లు మూసుకొని నెమ్మదిగా గాఢంగా శ్వాస తీసుకోవాలి. కొద్దిసేపు శ్వాసను ఆపి, నెమ్మదిగా వదలాలి.

భస్త్రిక- 5 సార్లు

☛ నాలుగు సార్లు శ్వాసను వీలైనంత వేగంగా తీసుకొని, వదలాలి. తర్వాత ఒకసారి గాఢంగా శ్వాస తీసుకోవాలి.

అనులోమ విలోమ- 90 సెకండ్లు

☛ ముక్కు కుడి రంధ్రాన్ని కుడి బొటన వేలితో మూసి ఎడమ రంధ్రంతో నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. మధ్య వేలితో ముక్కు ఎడమ రంధ్రాన్ని మూసి, కుడి రంధ్రంతో శ్వాస వదలాలి. అదే రంధ్రంతో శ్వాస తీసుకొని, కుడి బొటన వేలితో కుడి రంధ్రాన్ని మూసి ఎడమ రంధ్రంతో శ్వాస వదలాలి.



శవాసనం– 10 నిమిషాలు

ప్రశాంతంగా వెల్లకిలా పడుకోవాలి. కళ్లు మూసుకొని పాదాల దగ్గర్నుంచి తల వరకూ ఒకో అవయవం మీద దృష్టి సారిస్తూ అవన్నీ బాగా విశ్రాంతి పొందుతున్నట్టు భావించాలి.

వినికిడి లోపాన్ని పట్టుకోండి!

పెద్దవారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు వినికిడిలోపంతో బాధపడుతున్నారని అంచనా. వయసు మీద పడుతున్నకొద్దీ ఇది వచ్చే అవకాశమూ ఎక్కువవుతూ వస్తుంది. కొన్ని లక్షణాలతో దీన్ని తేలికగానే గుర్తించొచ్చు.

- ఫోన్‌లో అవతలివారు మాట్లాడేది అర్థం కాకపోవటం
- ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది మాట్లాడుతున్నప్పుడు విషయాన్ని గ్రహించలేకపోవటం
- మాటిమాటికీ మరోసారి చెప్పమని అడగటం



- ఇతరుల కన్నా టీవీ వాల్యూమ్ ఎక్కువగా పెంచుకోవటం
- చుట్టుపక్కల రణగొణధ్వనులు ఉన్నప్పుడు ఇతరుల మాటలు అర్థం కాకపోవటం
- ఇతరులు అస్పష్టంగా మాట్లాడుతున్నారని, నీళ్లు నములుతున్నారని అనిపించటం

ఏడు వేల అడుగులు నడిచినా..

రోజూ పది వేల అడుగులు నడవలేకపోతున్నామని చింతిస్తున్నారా? కనీసం ఏడు వేల అడుగులైనా వేయండి. దీంతోనూ గుండెజబ్బు, దీర్ఘకాల జబ్బుల ముప్పు గణనీయంగా తగ్గుతున్నట్టు ప్రపంచవ్యాప్త పరిశోధనల సమీక్షలో తేలింది. అంటే పది వేల అడుగుల కన్నా ముందే నడక ప్రయోజనాలు మొదలవుతున్నాయన్నమాట. రోజుకు రెండు వేల అడుగులు నడిచేవారితో పోలిస్తే- ఏడు వేల అడుగులు నడిచేవారికి ఏ కారణంతోనైనా సంభవించే అకాల మరణం ముప్పు 47%.. గుండెజబ్బు, మతిమరుపు, మధుమేహం ముప్పు 25% నుంచి 38% తగ్గుతున్నట్టు 'ద లాన్సెట్ పబ్లిక్ హెల్త్'లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. అలాగని పది వేల అడుగులు నడవొద్దని కాదు. దీన్ని అలాగే కొనసాగించటమే మంచిది. ఎందుకంటే ఏడు వేల అడుగుల కన్నా ఎక్కువ నడిచినవారికి అదనపు ప్రయోజనాలూ లభిస్తున్నాయి మరి. గతంలో 1.6 లక్షల కన్నా ఎక్కువ మందిపై నిర్వహించిన 31 అధ్యయనాలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. ఒక మాదిరిగా.. అంటే నాలుగు వేల అడుగులు నడిచినా మంచి ఫలితమే కనిపిస్తుండటం విశేషం. అయితే మనదగ్గర చాలామంది 2,500 నుంచి 3,500 అడుగుల దూరమే నడుస్తున్నట్టు అధ్యయనాలు చెబుతుండటం గమనించదగ్గ విషయం. నడకతో రక్తపోటు.. రక్తంలో గ్లూకోజు, కొవ్వు మోతాదులు అదుపులో ఉంటాయి. ఫలితంగా గుండెజబ్బు, క్యాన్సర్ల ముప్పూ తగ్గుతుంది. కాబట్టి నడకను తేలికగా తీసుకోకుండా రోజూ కాళ్లకు పని చెప్పటం మంచిది.


పార్కిన్సన్స్‌తోనే కాదు..

చేతులు వణుకుతున్నాయనగానే పార్కిన్సన్స్ జబ్బేనని భయపడిపోవాల్సిన పనేమీ లేదు. ఇందుకు నిద్రలేమి, కెఫీన్ అతిగా తీసుకోవటం, కొన్నిరకాల మందులు, మానసిక ఒత్తిడి, మద్యపాన వ్యసనం, పొగ తాగటం వంటివీ కారణం కావొచ్చు. సాధారణంగా పార్కిన్సన్స్‌లో చేతులు వణకటమనేది విశ్రాంతిగా ఉన్నప్పుడే ఎక్కువ. కదులుతున్నప్పుడు అంతగా ఉండదు. ఇందులో శరీరం బిగువు, కదలికలు నెమ్మదించటం, తూలటం వంటివీ ఉంటాయి.

దోమలు కుట్టకుండా..

వానాకాలంలో దోమల సంత విజృంభిస్తుంటుంది. ఇవి కుట్టకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. లేకపోతే మలేరియా, డెంగీ, గన్యా వంటి జబ్బుల బారినపడే ప్రమాదముంది.

- దోమలను తరిమే మలాములను చర్మానికి రాసుకోవాలి. ఇవి కళ్లు, నోటికి తగలకుండా చూసుకోవాలి.
- వదులైన, పొడవైన చేతుల చొక్కా, ప్యాంట్లు ధరించాలి.
- సాయంత్ర వేళలో దోమలు చాలా చురుకుగా ఉంటాయి. ఈ సమయంలో మరింత జాగ్రత్త అవసరం.
- ఇంట్లో, చుట్టుపక్కల నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. నీటి తొట్టిలపై మూత పెట్టుకోవాలి. కూలర్ల వంటివి ఖాళీ చేసుకోవాలి. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాల వంటి వాటిని దూరంగా పారెయ్యాలి.
- చెమటలోని ల్యాక్టిక్ ఆమ్లానికి దోమలు బాగా ఆకర్షితమవుతాయి. కాబట్టి శరీరం శుభ్రంగా ఉంచుకోవాలి.
- పర్ఫ్యూమ్స్ వంటి పరిమళ ద్రవ్యాలకు దూరంగా ఉండటమే మంచిది. ఇవంటే దోమలకూ ఇష్టమే మరి.
- ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలు మూసేయాలి. జాలీలు బిగించుకున్నా మంచిదే.
- రాత్రిపూట మంచానికి దోమ తెరలు కట్టుకోవాలి. ఫ్యాన్ వేసుకున్నా మేలే.
- చెత్తకుండీల మీద గట్టిగా మూత పెట్టుకోవాలి.



మెదడు ఆరోగ్యం జీవితాంత ప్రక్రియ

మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటమనేది ఏదో ఒక్క రోజుకో, నిమిషానికో పరిమితం కాదు. ఇది జీవితాంత ప్రక్రియ.

గర్భధారణకు ముందు: తల్లిదండ్రుల ఆరోగ్యం, అలవాట్లు పిల్లల మెదడును తీర్చిదిద్దుతాయి. అదీ గర్భం ధరించటానికి ముందు నుంచే. తల్లిదండ్రులు మంచి పోషకాహారం తినటం, వ్యాయామం చేయటం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం, జీవనశైలి గాడి తప్పకుండా చూసుకోవటం పిల్లల మెదడుకు బలమైన పునాది వేస్తాయి.





గర్భధారణ, పుట్టిన తర్వాత: తల్లి శారీరక, భావోద్వేగ నియంత్రణ గర్భస్థ శిశువు మెదడు ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయి. గర్భం ధరించినప్పుడు తగు పోషకాహారం తినటం, మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవటం తల్లీ, బిడ్డ ఇద్దరినీ కాపాడతాయి.

బాల్యం, యుక్తవయసు: గ్రహణశక్తి, భావోద్వేగ ఎదుగుదల, సామాజిక సంబంధాల మీద చిన్ననాటి అనుభవాలూ ప్రభావం చూపుతాయి. సురక్షితమైన వాతావరణం, టీకాలు, సానుకూల పెంపకం దీర్ఘకాలంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడతాయి.





పెద్దయ్యాక: ఆరోగ్యకరమైన ఆహారం తినటం, కంటి నిండా నిద్రపోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవటం వంటి మంచి జీవనశైలి అలవాట్లు నాడీ సమస్యల ముప్పును తగ్గిస్తాయి.




వృద్ధాప్యంలో: నలుగురితో కలివిడిగా ఉండటం.. బంధువులు, స్నేహితులతో మంచి సంబంధాలు కలిగుండటం.. స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనటం వంటివి వృద్ధాప్యంలో స్వతంత్రంగా, హాయిగా జీవించటానికి పునాది వేస్తాయి. విషయ గ్రహణ సామర్థ్యం తగ్గటం, తీవ్ర మతిమరుపు వంటి నాడీ సమస్యలను ముందుగా గుర్తించటానికి తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటమూ ముఖ్యమే.

సీఆర్‌పీ పరీక్ష సంగతేంటి?

డాక్టర్ దగ్గరికి వెళ్లినప్పుడు కొన్నిసార్లు సీఆర్‌పీ పరీక్ష చేయించుకోవాలని చెబుతుంటారు. దీని ఉద్దేశం రక్తంలో సి-రియాక్టివ్ ప్రొటీన్ (సీఆర్‌పీ) మోతాదులను తెలుసుకోవటం. వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రతిస్పందనలో భాగంగా కాలేయం దీన్ని తయారు చేస్తుంటుంది. గాయాలు, ఇన్‌ఫెక్షన్లు, జబ్బుల వంటి వాటి నుంచి కాపాడుకోవటానికి, కోలుకోవటానికి శరీరం చేసే ప్రయత్నమే వాపు ప్రక్రియ. ఇది అప్పటికప్పుడు తలెత్తటం లేదా స్వల్పకాలం ఉండటం మేలు చేస్తుంది. ఉదాహరణకు- చర్మం కోసుకుపోతే అక్కడ ఎర్రబడటం, ఉబ్బటం దీని లక్షణాలే. ఇది ఇన్‌ఫెక్షన్‌ను నిలువరించే ప్రయత్నమే. శరీరంలో హానికారక క్రిములు, విషతుల్యాలను ఎదుర్కొనే క్రమంలోనూ ఇలాంటి ప్రతిస్పందనే తలెత్తుతుంది. అయితే వాపు ప్రక్రియ దీర్ఘకాలం కొనసాగుతూ వస్తుంటే ఆరోగ్యంగా ఉన్న కణజాలాన్నీ దెబ్బతీస్తుంది. ఇలాంటి రకం వాపు ప్రక్రియ సాధారణంగా స్వీయ రోగనిరోధక జబ్బుల్లో కనిపిస్తుంటుంది. కణజాలాలు అదేపనిగా గాయపడటం లేదా చిరాకుకు గురికావటంతోనూ దీర్ఘకాల వాపు ప్రక్రియ ప్రేరేపితం కావొచ్చు.

ఏం తెలుస్తుంది?

రక్తంలో సీఆర్‌పీ మోతాదులను బట్టి ఒంట్లో ఎంతవరకూ వాపు ప్రక్రియ ఉందో బయటపడుతుంది. తక్షణ, దీర్ఘకాల సమస్యలకిది సూచిక. సీఆర్‌పీ ఎక్కువగా ఉంటే బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్‌ఫెక్షన్.. క్రాన్స్, అల్సరేటివ్ కొలైటిస్ వంటి పేగుపూత జబ్బులు.. ల్యూపస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ వంటి స్వీయ రోగనిరోధక సమస్యలు.. ఉబ్బసం వంటి ఊపిరితిత్తుల జబ్బులు ఉండొచ్చని అర్థం. పొగ తాగటం లేదా పర్యావరణ రసాయనాల మూలంగానూ సీఆర్‌పీ మోతాదులు పెరగొచ్చు.



అతి విచారంతో ఆయు క్షీణం



ఆత్మీయులు మరణిస్తే ఎవరికైనా బాధే. అదృష్టం కొద్దీ ఇది క్రమంగా తగ్గుతూ వస్తుంటుంది. తిరిగి తమ పనుల్లో తాము పడతారు. కానీ కొందరు అదేపనిగా మరీ ఎక్కువగా బాధ పడుతుంటారు. ఈ ధోరణి జీవనకాలానికి విఘాతం కలిగిస్తున్నట్టు తాజాగా బయటపడింది. దీర్ఘకాలం విచారంతో గడిపేవారికి ఆత్మీయులు మరణించిన పదేళ్లలోపు మరణించే ముప్పు 88% ఎక్కువగా ఉంటున్నట్టు తేలటమే దీనికి నిదర్శనం. వీరికి మానసిక జబ్బుల ముప్పూ దాదాపు మూడు రెట్లు అధికమనీ వెల్లడైంది. అయితే దీనికి కచ్చితమైన కారణమంటనేది మాత్రం తెలియరాలేదు. ఆత్మీయుల మరణంతో అతిగా విచారించేవారికి గుండెజబ్బులు, మానసిక సమస్యలు, ఆత్మహత్యల ముప్పు ఎక్కువగా ఉంటున్నట్టు గత అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో అకాల మరణమూ సంభవిస్తుండటం ఆలోచించాల్సిన విషయమని, దీనిపై మరింత పరిశోధన చేయాల్సి ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. సాధారణంగా ఎక్కువగా బాధపడేవారు మానసిక జబ్బుల కోసమూ ఆసుపత్రులకు వస్తుంటారు. అందువల్ల డాక్టర్లు ఇలాంటివారి మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచిస్తున్నారు. వీరిలో ఇంతకుముందే కుంగుబాటు, ఇతర మానసిక సమస్యల లక్షణాలేవైనా ఉన్నాయేమో గమనించటం మంచిదని, దీంతో అకాల మరణాన్ని తప్పించే అవకాశముందని వివరిస్తున్నారు.

ఈనాడు బిజినెస్

గృహ రుణమా.. ప్రభుత్వ బ్యాంకుల్లోనే ప్రయత్నిద్దాం



- మారుతున్న గృహ రుణగ్రహీతల వైఖరి
- రేట్ల కోత ప్రయోజనాన్ని సత్వరం బదిలీ చేయడం వల్లే
- ఈ విభాగంలో తగ్గుతున్న ప్రైవేటు బ్యాంకుల వాటా

ఒకప్పుడు ప్రభుత్వ బ్యాంకుల నుంచి గృహ రుణం తీసుకోవడం అంటే పెద్ద ప్రహసనం.. నిబంధనల మాట ఎలా ఉన్నా, రుణం మంజూరులో కాలయాపన, అధికారుల నిర్లక్ష్య ధోరణి అడుగడుగునా కనిపించేది. అదే సమయంలో రుణగ్రహీతల అవసరాలను వేగంగా తీర్చేందుకు ప్రైవేటు బ్యాంకులు పోటీ పడేవి. ఫలితంగా రిటెయిల్ రుణ రంగంలో ఇవి ఆధిపత్యం చెలాయించాయి. కానీ, మూడేళ్లుగా ఈ పరిస్థితి మారింది. ప్రభుత్వ బ్యాంకులు గృహరుణ మార్కెట్లో తమ శక్తిని చాటేందుకు ప్రయత్నిస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ తదితరాలు.. ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజాలను సైతం వెనక్కి నెట్టేస్తున్నాయి.

ఇదే ప్రధాన కారణం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపోను తగ్గించడంతో, ఆమేరకు గృహరుణ వడ్డీ రేట్లు దిగి వస్తున్నాయి. ఈ విషయంలో ప్రైవేటు బ్యాంకులతో పోలిస్తే.. ప్రభుత్వ బ్యాంకులు వేగంగా స్పందిస్తున్నాయి. ఎస్‌బీఐ గృహరుణ వడ్డీ రేటు 7.50% నుంచి 8.45 శాతంగా ఉంది. అదే ప్రైవేటు బ్యాంకుల్లో ఈ వడ్డీ రేటు ఇప్పటికీ 8.45% నుంచి ప్రారంభమవుతోంది. దీంతో చాలా మంది కొత్త రుణగ్రహీతలు ప్రభుత్వ బ్యాంకులనే ఆశ్రయిస్తున్నారు. క్రిఫ్ హైమార్క్ నివేదిక ప్రకారం 2022-24 ఆర్థిక సంవత్సరాల మధ్య ప్రభుత్వ బ్యాంకుల రిటెయిల్ రుణాల మార్కెట్ వాటా 36.6% నుంచి 40.4 శాతానికి పెరిగింది. అదే సమయంలో ప్రైవేటు బ్యాంకుల వాటా 42.2% నుంచి 36 శాతానికి తగ్గింది.

- గృహరుణాల సంఖ్యలో పీఎస్‌యూల వాటా 38.5% వద్ద స్థిరంగా ఉండగా, ప్రైవేటు బ్యాంకుల వాటా 27.9% నుంచి 22.6 శాతానికి పడిపోయింది. ఈ గణాంకాలు ప్రభుత్వ రంగ బ్యాంకులు గృహరుణంలో ఎలా ఆధిపత్యం చెలాయిస్తున్నాయో స్పష్టం చేస్తున్నాయి.
- ఎస్‌బీఐ ఒక్కటే 2024లో రూ.7.61 లక్షల కోట్ల గృహరుణ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

డిజిటలీకరణ తెచ్చిన మార్పు

డిజిటలీకరణ కోసం ఒకప్పటితో పోలిస్తే ప్రభుత్వ బ్యాంకులు ఇప్పుడు సాంకేతికతపై అధికంగా ఖర్చు చేస్తున్నాయి. కొత్త తరం రుణగ్రహీతలను ఆకట్టుకునే విధంగా మొబైల్ యాప్‌లూ తీసుకొస్తున్నాయి. డెలాయిట్ గ్లోబల్ డిజిటల్ బ్యాంకింగ్ మెచ్యూరిటీ సర్వే ప్రకారం, భారత బ్యాంకులు డిజిటలీకరణలో గణనీయ పురోగతి సాధించాయి. 2022లో 43 శాతంగా ఉన్న డిజిటల్ బ్యాంకింగ్ ఇండెక్స్, 2025 నాటికి 50 శాతానికి చేరింది. ఖాతాల ప్రారంభం, రోజువారీ బ్యాంకింగ్ లావాదేవీలు, వినియోగదారుడికి మెరుగైన అనుభవాన్ని ఇవ్వడంలో ప్రపంచ సగటు కంటే 20% ఎక్కువ స్కోరును సాధించాయి.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

డిజిటల్ పద్ధతిలోనే గృహరుణం కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రక్రియను సులభతరం చేశాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాల పరిశీలనతో పాటు దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు తమ రుణ దరఖాస్తు పరిస్థితి తెలుసుకునే వీలు కల్పిస్తున్నాయి. ప్రైవేటు బ్యాంకులూ ఈ పద్ధతులు పాటిస్తున్నా, తక్కువ వడ్డీరేట్ల వల్ల రుణగ్రహీతలు ప్రభుత్వ రంగ బ్యాంకులను ఇష్టపడుతున్నారు.

వడ్డీ రాయితీలు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలు, గృహరుణాలకు గిరాకీని పెంచాయి. అందుబాటు ధరలో ఇళ్లు కొనేవాళ్లకు ప్రైవేటు బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వరంగ బ్యాంకులు సులభంగా రుణాలు ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీ విషయంలోనూ సాయం చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రుణగ్రహీతలను ఆకర్షిస్తున్నాయి.

మార్చుకోండి అంటూ..

ఇంతకుముందు ప్రైవేటు బ్యాంకులు, గృహరుణ సంస్థల్లో రుణాలు తీసుకున్న వారికి ప్రభుత్వ బ్యాంకుల నుంచీ ఫోన్లు, సందేశాలు వెళ్తున్నాయి. తమ దగ్గర ఖాతాలున్న వారికి ఆయా శాఖల మేనేజర్లు ఫోన్లు చేస్తున్నారు. తక్కువ ధరకే గృహరుణాన్ని అందిస్తామని, వీలైతే ప్రస్తుత రుణాన్ని తమ బ్యాంకుకు మార్చుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

కైనెటిక్ డీఎక్స్ విద్యుత్ స్కూటర్



ధరల శ్రేణి రూ.1,11,499–1,17,499

దిల్లీ: కైనెటిక్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (కేఈఎల్) తన విద్యుత్ స్కూటర్ 'కైనెటిక్ డీఎక్స్'ను సోమవారం ఆవిష్కరించింది. డీఎక్స్ ధర రూ.1,11,499 (ఎక్స్‌షోరూమ్, పుణె) కాగా, డీఎక్స్+ ధర రూ.1,17,499గా ఉంది. ఈ విద్యుత్ స్కూటర్లు గంటకు 90 కిలోమీటర్ల వేగంతో నడుస్తాయి. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 116 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. 'దశల వారీగా ఉత్పత్తి, సేల్స్ నెట్‌వర్క్‌ను పెంచుకుంటాం. వచ్చే 3-4 ఏళ్లలో 1.5 లక్షల స్కూటర్లను విక్రయించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నాం. దీన్ని చేరుకోవడానికి సుమారు 300 డీలర్లు అవసరమవుతారు. అందుకు తగ్గట్లుగా వచ్చే మార్చికల్లా రూ.177 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాం. 2026 ఆగస్టు నాటికి 40,000 స్కూటర్లను ఉత్పత్తి చేయాలనుకుంటున్నాం. తర్వాత క్రమంగా ఉత్పత్తిని పెంచుతాం. ప్రస్తుతం 20 మంది డీలర్లను నియమించుకున్నాం. తొలి ఏడాదిలో 160 మంది డీలర్లను చేరుకోవాలనుకుంటున్నామ'ని కైనెటిక్ ఇంజినీరింగ్ వైస్ ఛైర్మన్, ఎండీ అజింక్య ఫిరోదియా వెల్లడించారు.

మన దేశంలో స్టార్‌లింక్ కనెక్షన్లు 20 లక్షలే

కేంద్ర టెలికాం సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

దిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల సంస్థ స్టార్‌లింక్, మన దేశంలో 20 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇవ్వగలదని కేంద్ర టెలికాం శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్, ఇతర టెలికాం సంస్థలకు ఇబ్బంది కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'స్టార్‌లింక్ మన దేశంలో కేవలం 20 లక్షల వినియోగదార్లకు 200 ఎంబీపీఎస్ వేగంతో కనెక్షన్లు ఇవ్వనుంది. ఇవి టెలికాం సేవలను ప్రభావితం చేయవ'ని మంత్రి వివరించారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు ముందస్తు చెల్లింపుతో పాటు నెలవారీ వ్యయం సుమారు రూ.3,000 వరకు ఉండొచ్చని తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయని, ప్రస్తుతం టారిఫ్‌లు పెంచే యోచన లేదని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఆదాయం 20-30 శాతం పెరిగిందన్నారు. రూ.600-700 కోట్ల వ్యయంతో 30,000 పవర్ స్టేషన్లను మార్చడంతో, అక్కడి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

అదానీ గ్రీన్ ఎనర్జీ లాభం రూ.824 కోట్లు

దిల్లీ: అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.824 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలం లాభం రూ.629 కోట్లతో పోలిస్తే ఇది 31 శాతం అధికం. కంపెనీ మొత్తం ఆదాయం రూ.3,112 కోట్ల నుంచి రూ.4,006 కోట్లకు చేరింది. '2025-26 జూన్ త్రైమాసికంలో 1.6 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకున్నాం. కొత్త ప్రాజెక్టుల ద్వారా గత ఏడాది 3,763 మెగావాట్ల సౌర విద్యుత్‌ను జత చేసుకున్నాం. ఇందులో ఖావ్డాలో 2,463 మెగావాట్లు, రాజస్థాన్‌లో 1,050 మెగావాట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 250 మెగావాట్లు ఉన్నాయ'ని కంపెనీ తెలిపింది.

కోడి గుడ్డు

29న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	400
వరంగల్	402
విజయవాడ	475
గోదావరి	445
విశాఖపట్నం	450
చిత్తూరు	463

55% పెరిగిన ప్రీమియర్ ఎనర్జీస్ లాభం

ఈనాడు, హైదరాబాద్: సౌర విద్యుత్ రంగంలోని ప్రీమియం ఎనర్జీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.1,869.6 కోట్ల ఆదాయంపై రూ.307.8 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1,668.7 కోట్లు, నికర లాభం రూ.198.1 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఆదాయం 12 శాతం, నికర లాభం 55 శాతం పెరిగాయి. దేశంలో తొలి టాప్‌కాన్ సెల్ తయారీ ప్లాంటులో ఒకటిగా తమ కొత్త సెల్ లైన్ నిలిచిందని ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీస్ ఎండీ, సీఈఓ చిరంజీవ్ సలుజా తెలిపారు. సౌర విద్యుత్ సాంకేతికతలో తరువాతి తరంలోకి కంపెనీ ప్రవేశించిందని తెలిపారు. ఈ త్రైమాసికంలో 1.4 గిగావాట్ మాడ్యూల్, 1.2 గిగావాట్ టాప్‌కాన్ సెల్ లైన్లను విజయవంతంగా ప్రారంభించింది. దీంతో మొత్తం తయారీ సామర్థ్యం వరుసగా 5.1 గిగా వాట్, 3.2 గిగావాట్‌కు చేరుకుంది. కొత్త ప్లాంట్లలో వాణిజ్య ఉత్పాదన త్వరలో ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది జూన్ నాటికి వీటి సామర్థ్యం మరింత విస్తరించే లక్ష్యంతో కంపెనీ ఉంది.

అపోలో మైక్రో సిస్టమ్స్ లాభం రూ.17.68 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రక్షణ ఉత్పత్తుల సంస్థ అపోలో మైక్రో సిస్టమ్స్ రెట్టింపు నికర లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.134.45 కోట్ల ఆదాయాన్ని, రూ.17.68 కోట్ల నికర లాభాన్ని ఈ సంస్థ నమోదు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.91.78 కోట్లు, నికరలాభం రూ.8.42 కోట్లు మాత్రమే. దీంతో పోల్చితే ప్రస్తుత ఆదాయం 46.49 శాతం పెరిగినట్లు అవుతోంది.

'స్టార్‌డోర్' హైడ్రోజన్- ఆక్సిజన్ ప్రొపల్షన్ ఇంజన్ పరీక్ష విజయవంతం



ఈనాడు, హైదరాబాద్: అంతరిక్ష రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థ 'స్టార్‌డోర్', హైడ్రోజన్- ఆక్సిజన్ ప్రొపల్షన్ ఇంజన్‌ను విజయవంతంగా పరీక్షించింది. మనదేశంలో ఇలాంటి ప్రయోగం ఇదే తొలిసారి కావటం ప్రత్యేకత. హైదరాబాద్‌కు చెందిన ఈ అంకుర సంస్థ బెంగుళూరులోని ఐఐఎస్‌సీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్) లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. ఈ పరీక్ష విజయవంతం కావటంతో భవిష్యత్తులో రాకెట్ ప్రయోగాల్లో స్థిరమైన, అత్యంత సమర్థమైన ప్రొపల్షన్ సిస్టమ్స్‌ను ఆవిష్కరించే అవకాశం కలుగుతుందని స్టార్‌డోర్ డైరెక్టర్ రామారావు వివరించారు. తిరిగి వాడుకునే అవకాశం ఉన్న రాకెట్లను రూపొందించటానికి హైడ్రోజన్- ఆక్సిజన్ ప్రొపల్షన్ సిస్టమ్ ఉపయోగపడుతుందని ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ ప్రతీకాష్ పాండ తెలిపారు. 'స్టార్‌డోర్' ఇప్పటికే లూకాస్ అనే రాకెట్‌ను (ఓటీవీ- ఆర్బిటల్ ట్రాన్స్‌ఫర్ వెహికల్) అభివృద్ధి చేస్తోంది. లో ఎర్త్ ఆర్బిట్, జియో స్టేషనరీ ఆర్బిట్ ప్రయోగాలకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని అంచనా. లూకాస్ రాకెట్‌ను 2027 చివరి నాటికి ప్రయోగించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్‌కు రూ.22.40 కోట్ల లాభం

ఈనాడు, హైదరాబాద్: మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్, ప్రస్తుత మొదటి త్రైమాసికానికి రూ.240.55 కోట్ల నికర అమ్మకాలను, రూ.22.40 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నికర అమ్మకాలు రూ.196.72 కోట్లు, నికర లాభం రూ.16.53 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే నికర అమ్మకాలు 15 శాతం, నికర లాభం 35.50 శాతం పెరిగినట్లు అవుతోంది. పరిశోధన- ఆవిష్కరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవటం వల్ల ఆకర్షణీయమైన ఫలితాలు సాధించినట్లు కంపెనీ సీఎండీ జె.లక్ష్మణరావు వివరించారు. తమకు కొత్త క్లయింట్లు లభించినట్లు మారికో, వీడాల్ కార్పొరేషన్, పల్స్ ఫార్మా... తదితర సంస్థలు ఇందులో ఉన్నట్లు వెల్లడించారు.

10 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి వృద్ధి



దిల్లీ: భారత పారిశ్రామికోత్పత్తి వృద్ధి జూన్‌లో నెమ్మదించి 1.5 శాతానికి పరిమితమైంది. ఇది 10 నెలల కనిష్ఠ స్థాయి. గనులు, విద్యుత్ రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణం. జూన్ రెండో అర్ధభాగంలో అధిక వర్షాలు ఈ రంగాలపై ప్రభావం చూపించాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పారిశ్రామికోత్పత్తి సూచీ ఆధారంగా పారిశ్రామికోత్పత్తిని లెక్కిస్తారు. 2024 జూన్‌లో ఇది 4.9 శాతంగా ఉంది. ఈ ఏడాది మే నెలకు పారిశ్రామికోత్పత్తి వృద్ధిని ఇంతకుముందు అంచనా వేసిన 1.2 శాతం నుంచి 1.9 శాతానికి జాతీయ గణాంకాల కార్యాలయం సవరించింది. జూన్‌లో తయారీ రంగ వృద్ధి స్వల్పంగా పెరిగి 3.9 శాతంగా నమోదైంది. కిందటేడాది ఇదే నెలలో ఇది 3.5 శాతంగా ఉంది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభంలో 72% క్షీణత

ముంబయి: ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర లాభం ఏకీకృత ప్రాతిపదికన 72 శాతం తగ్గి రూ.604 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం రూ.2,171 కోట్లుగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికమైన 2025 జనవరి- మార్చిలో ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు రూ.2,329 కోట్ల నష్టాన్ని చవిచూసిన సంగతి తెలిసిందే. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.14,988.38 కోట్ల నుంచి రూ.14,420.80 కోట్లకు తగ్గింది. నికర వడ్డీ ఆదాయమూ రూ.5,408 కోట్ల నుంచి తగ్గి రూ.4,640 కోట్లుగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 3.13 శాతం నుంచి 3.64 శాతానికి పెరిగింది. అయితే కేటాయింపులు మాత్రం రూ.2,522 కోట్ల నుంచి రూ.1,760 కోట్లకు తగ్గాయి. జూన్ 30 నాటికి బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 16.63 శాతంగా ఉంది. జనవరి- మార్చి త్రైమాసికంతో పోలిస్తే బ్యాంకు పనితీరు గణనీయంగా పుంజుకుందని, జూన్ త్రైమాసికంలో మంచి లాభాన్ని నమోదు చేసిందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఛైర్మన్ సునీల్ మెహతా తెలిపారు. పాలనా విధానాలు, పటిష్ఠత, కార్యకలాపాల సామర్థ్యం మెరుగుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

30% తగ్గిన గెయిల్ లాభం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గెయిల్ ఇండియా రూ.1,886.34 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.2,723.98 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 30 శాతం తక్కువ. పెట్రోరసాయనాల వ్యాపార నష్టాలు పెరగడం, గ్యాస్ మార్కెటింగ్ మార్జిన్లు తగ్గడం ఇందుకు కారణమయ్యాయి. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.33,961.63 కోట్ల నుంచి రూ.34,792.45 కోట్లకు పెరిగింది. పెట్రోరసాయనాల వ్యాపార నష్టాల నుంచి రూ.42 కోట్ల నుంచి రూ.249 కోట్లకు చేరాయి. సహజ వాయువు మార్కెటింగ్ సగానికి తగ్గి రూ.1,071.6 కోట్లకు పరిమితమైంది.

బీమా రంగంలో 7.1 శాతం వృద్ధి

దిల్లీ: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం ద్వారా రాబోయే అయిదేళ్ల కాలంలో 7.1 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో తెలిపారు. ఇది ప్రపంచ వృద్ధి రేటును అధిగమిస్తుందని వివరించారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఈ పరిమితిని పెంచడం వల్ల విదేశీ పెట్టుబడిదారులు మిగిలిన 26 శాతం కోసం భారతీయ భాగస్వాములను వెతకాల్సిన అవసరం తప్పుతుందని తెలిపారు.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ధంపూర్ బయో ఆర్గానిక్స్	(22)	0.12	785.26	638.62
ఎంసీఎఫ్ఎల్	61.63	43.90	862.15	814.04
ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్	124.2	104.7	1,033.8	984
టోరంట్ ఫార్మా	548	457	3,178	2,859
అజంతా ఫార్మా	255	246	1,303	1,145
నిప్పన్ లైఫ్ ఇండియా	396.1	332.3	606.6	505
ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ	220.48	138.61	751.69	607.43
వారీ ఎనర్జీస్	773	401.13	4,597.18	3,496.41
అదానీ టోటల్ గ్యాస్	162	177	1,491	----
మదర్సన్ సుమీ వైరింగ్	143.1	148.87	2,494.03	2,184.84
జేకే పేపర్	85.43	140.79	1,674.16	1,713.65
టీటీకే ప్రెస్టీజ్	25.62	40.79	609.30	587.93
మజ్‌గావ్ డాక్	452.15	696	2,625.59	2,357.02

టీసీఎస్‌లో ఉద్యోగాల కోతపై ఐటీ మంత్రిత్వ శాఖ దృష్టి



దిల్లీ: ఐటీ సేవల సంస్థ టీసీఎస్‌లో 12,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించాలనే నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో సంబంధిత వర్గాలు మాట్లాడుతున్నట్లు పేర్కొన్నాయి. ఉపాధి వృద్ధి అనేది కేంద్ర ప్రభుత్వ కీలక ప్రాధాన్యంగా ఉందని, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం వంటి కార్యక్రమాలతో ఉద్యోగావకాశాలను ఎలా పెంచవచ్చనే అంశంపైనా దృష్టి సారించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను ఐటీ మంత్రిత్వ శాఖ గమనిస్తోందని, టీసీఎస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను గుర్తించేందుకు లోతుగా అధ్యయనం చేయనున్నట్లు సమాచారం.

కార్మిక మంత్రిని సంప్రదించిన నైట్స్

టీసీఎస్‌లో ఉద్యోగుల కోతపై నాస్సెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (నైట్స్).. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్సుఖ్ మాండవీయను సంప్రదించింది. ఈ విషయంలో టీసీఎస్‌ను వివరణ కోరుతూ ప్రభుత్వం నుంచి నోటీసు జారీ చేయాలని కోరింది. టీసీఎస్ తాజా చర్య అనైతికమని, అమానవీయమని, చట్టవిరుద్ధమని ఐటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆరోపించింది. ఒక ఏడాది పాటు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగిని ఒక నెల నోటీసు లేదా వేతనాలు చెల్లించకుండా తొలగించడం చట్టప్రకారం కుదరదని గుర్తు చేసింది.

భయాలు మొదలయ్యాయ్

టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలో ఉద్యోగులను తొలగించడంతో మిగతా కంపెనీల్లోని చాలా మంది ఉద్యోగులు భయపడుతున్నారని పరిశ్రమ నిపుణులు వెల్లడించారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్‌తో రాబోయే కాలంలో మరింత మంది ఉద్యోగులపై వేటు పడే అవకాశం కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ సంస్థ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ పాఠక్, ఇండస్ట్రీ రీసెర్చ్ గ్రూప్ (ఐఆర్‌జీ), సైబర్‌మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) వైస్ ప్రెసిడెంట్ ప్రభు రామ్, టీమ్‌లీజ్ డిజిటల్ సీఈఓ నీతి శర్మ, టెక్‌ఆర్క్ వ్యవస్థాపకుడు, ముఖ్య విశ్లేషకుడు ఫైసల్ కవూసా తదితర ప్రముఖులు టెక్ పరిశ్రమలో రాబోయే కాలంలో ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు.

ఉద్యోగాల కోత ప్రకటన నేపథ్యంలో, టీసీఎస్ షేరు బీఎస్ఈలో సోమవారం 1.76 శాతం తగ్గి, రూ.3,079.05 వద్ద ముగిసింది.

పేటెండ్ గడువు పొడిగింపులు, డేటా ప్రత్యేకత భారత్- యూకే వర్తక ఒప్పందంలో లేవు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టీకరణ



దిల్లీ: పేటెండ్ గడువు పొడిగింపులు, డేటా ప్రత్యేకత... భారత్- యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ప్రకారం తప్పనిసరి కాదని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం మన దేశంలో జనరిక్ ఔషధాల పరిశ్రమకు మేలు చేస్తుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక పత్రంలో పేర్కొంది. 'డేటా ప్రత్యేకత' కోసం యూకే ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది. అయినప్పటికీ మన ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఈ వర్తక ఒప్పందంపై రెండు దేశాలు ఈ నెల 24న సంతకాలు చేసిన విషయం విదితమే. ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి రావటానికి ఒక ఏడాది కాలం అయినా పడుతుందని అంచనా.

భారత పేటెంట్స్ చట్టం, 1970 లోని సెక్షన్ 3(డి) ప్రకారం ఇప్పటికే తెలిసిన మందులపై కొత్త పేటెంట్లు జారీ కుదరదు. ఆ మందులకు సంబంధించి ఇంకేమైనా మార్పులు, పూర్తి కొత్తదనం ఉంటేనే పేటెంట్లు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తారు. అదే విధంగా ప్రజలకు తప్పనిసరి అవసరం ఎదురైన సందర్భాల్లో పేటెంట్లు జారీ చేయరాదని సెక్షన్ 3(బి) స్పష్టం చేస్తోంది. ఈ నిబంధనలను సవరించాలని బహుళ జాతి కంపెనీలు ఎన్నో ఏళ్లుగా భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అయినా ప్రభుత్వం ఒప్పుకోలేదు. 'డేటా ప్రత్యేకత' సౌకర్యం కల్పిస్తే ఫార్మా కంపెనీలు, పరిశోధనలు చేపట్టిన ఇతర సాంకేతిక రంగాలకు చెందిన కంపెనీలకు అవి క్రోడీకరించిన 'టెక్నికల్ డేటా'పై రక్షణ లభిస్తుంది. ఫార్మా కంపెనీలు కొత్త మందులపై క్లినికల్ పరీక్షలు నిర్వహించి ఆ మందు ఎంతమేరకు పనిచేస్తుంది, సైడ్ ఎఫెక్ట్‌లు ఏమైనా ఉన్నాయి... అనే అంశాలపై సమాచారాన్ని సేకరిస్తాయనేది తెలిసిన విషయమే. ఈ సమాచారాన్ని 'టెక్నికల్ డేటా' గా పరిగణిస్తారు. దీనిపై సంబంధిత కంపెనీకే హక్కులు ఉంటాయి. ఇతర కంపెనీలు దీన్ని చూపించి మందులకు అనుమతులు పొందటం సాధ్యం కాదు. తక్కువ ఖర్చులో మందులు అందించే జనరిక్ కంపెనీల నుంచి పోటీ ఎదురుకాకుండా ఉండటానికి బహుళ జాతి కంపెనీలు 'డేటా ప్రత్యేకత'ను కోరుకుంటున్నాయి. దీన్ని మన దేశం వ్యతిరేకిస్తోంది. గతంలో యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సమయంలోనూ ఈ డిమాండ్ వచ్చింది. కానీ మనదేశం అంగీకరించలేదు. ఈఎఫ్‌టీఏలో ఐస్‌ల్యాండ్, లీచెన్‌స్టెయిన్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

వరుసగా మూడో రోజూ నష్టాలే

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.6,082 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.6,765 కోట్లు

సెన్సెక్స్ ▼ 572 **80891**

నిఫ్టీ ▼ 156 **24681**



సమీక్ష

వరుసగా మూడో రోజూ దేశీయ సూచీలు నేలచూపులు చూశాయి. కోటక్ మహీంద్రా షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడం, అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కారణంగా సెన్సెక్స్ దాదాపు రెండు నెలల కనిష్ఠానికి చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 18 పైసలు తగ్గి 86.70 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడి చమురు 0.91% లాభంతో 69.05 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.3.8 లక్షల కోట్లు తగ్గి రూ.447.87 లక్షల కోట్లు (5.17 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. గత మూడు రోజుల్లో మదుపర్ల సంపద రూ.12.47 లక్షల కోట్లు ఆవిరైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 163 పాయింట్ల (క్రితం ముగింపు 81,463.09) నష్టంతో 81,299.97 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రాడేలో 81,557.41 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అమ్మకాలతో మళ్లీ నష్టాలకు జారుకుంది. ఒక దశలో 80,776.44 వద్ద కనిష్ఠాన్ని తాకి, చివరకు 572.07 పాయింట్ల నష్టంతో 80,891.02 వద్ద ముగిసింది. నిఫ్టీ 156.10 పాయింట్లు కోల్పోయి 24,680.90 దగ్గర స్థిరపడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 23 డీలాపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్ 3.64%, భారతీ ఎయిర్‌టెల్ 2.35%, టైటన్ 2.17%, టీసీఎస్ 1.76%, హెచ్‌సీఎల్ టెక్ 1.47%, యాక్సిస్ బ్యాంక్ 1.25%, అదానీ పోర్ట్స్ 1.21%, ఎం అండ్ ఎం 1.17%, ఎస్‌బీఐ 1.16% నష్టపోయాయి. హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ 1.23% వరకు లాభపడ్డాయి.

✦ **కోటక్ షేర్లు ఢమాల్:** త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు 7.50% కుదేలై రూ.1,965.60 వద్ద ముగిసింది.

✦ హై-పెర్ఫార్మెన్స్ కండక్టర్స్ సరఫరా కోసం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ నుంచి రూ.1,349.11 కోట్ల ఆర్డరు లభించినట్లు డైమండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెలిపింది.

✦ ప్రస్తుత ప్రాజెక్టుల అభివృద్ధి, భవిష్యత్ వృద్ధి కోసం ఓక్‌ట్రీ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ నుంచి రూ.500 కోట్లు సమీకరించినట్లు ఒమాక్సే గ్రూప్ ప్రకటించింది.

✦ **నయారాకు మైక్రోసాఫ్ట్ సేవలు నిలిపివేత:** ఐరోపా సమాఖ్య ఆంక్షల నేపథ్యంలో రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీకి సేవలు అందించడాన్ని మైక్రోసాఫ్ట్ నిలిపివేసింది. దీంతో దిల్లీ హైకోర్టులో మైక్రోసాఫ్ట్‌పై నయారా ఎనర్జీ దావా వేసింది.

✦ రెనో నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియాలో నిస్సాన్‌కు ఉన్న మిగతా 51 శాతం వాటా కొనుగోలు నిమిత్తం రెనో గ్రూపు చేసిన ప్రతిపాదనకు కాంపిటీషన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది.

✦ జీ బిజినెస్ ఛానెల్‌లో షేర్ల సిఫారసులపై విశ్లేషకులు ఇచ్చిన ముందస్తు సమాచారం ఆధారంగా ట్రేడింగ్ నిర్వహించాయనే కేసులో నాలుగు సంస్థలపై రెండేళ్ల పాటు స్టాక్ మార్కెట్లలో పాల్గొనకుండా సెబీ నిషేధం విధించింది. రూ.4 కోట్ల జరిమానానూ విధించింది.

✦ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) ముందు యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్ల జారీ ద్వారా రూ.582 కోట్లను **ఆదిత్యా ఇన్ఫోటెక్** సమీకరించింది. ఈ రోజు (29న) ప్రారంభం కానున్న ఈ ఇష్యూ 31న ముగియనుంది.

ఐపీఓ సమాచారం

✦ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఐపీఓ రెండో రోజు 4.93 రెట్ల స్పందన లభించింది.

✦ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఐపీఓ చివరి రోజు 4.48 రెట్ల స్పందన వచ్చింది. ఇష్యూలో భాగంగా 5,11,93,987 షేర్లను ఆఫర్ చేయగా, 22,95,01,142 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగంలో 6.40 రెట్లు, క్యూఐబీ విభాగంలో 5.42 రెట్లు, ఎన్ఐఐల నుంచి 1.92 రెట్ల స్పందన కనిపించింది.

✦ ఐపీఓకు ముందు యాంకర్ మదుపర్ల నుంచి రూ.75.51 కోట్లను ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ సమీకరించింది.

✦ తొలి పబ్లిక్ ఆఫర్ కోసం సెబీకి **అమాగీ మీడియా ల్యాబ్స్** ముసాయిదా పత్రాలను సమర్పించింది. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1,020 కోట్లను సమీకరించాలని అనుకుంటోంది. ఇష్యూలో భాగంగా తాజా షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్‌లో ప్రస్తుత వాటాదార్లు 3.41 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని 21 ఐఐఎంలలో, ఇతర ప్రముఖ సంస్థల్లో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్). ఈ ప్రకటన వెలువడింది. నవంబర్ 30న దేశవ్యాప్తంగా 170 నగరాల్లో పరీక్ష జరుగుతుంది. ఆగస్టు 1 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలవుతోంది. పరీక్ష సరళి, కీలకాంశాలు, మెరుగ్గా ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకుందాం!

మేటి స్కోరుతో మెరిసేదెలా?



క్యాట్ స్కోరు ద్వారా ఐఐఎంలలో దాదాపు 5500 ఎంబీఏ (పీజీ ప్రోగ్రాం) సీట్లలో ప్రవేశానికి పోటీ పడవచ్చు. ఇంకా ఫ్యాకల్టీ మేనేజ్‌మెంట్ స్టడీస్ (దిల్లీ యూనివర్సిటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (దిల్లీ, కోల్‌కతా), ఐఐటీల్లో ఎంబీఏ డిపార్ట్‌మెంట్లు, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో రెండేళ్ల ఎంబీఏ ప్రవేశాలకు క్యాట్ అర్హత తప్పనిసరి. క్యాట్- 2024కు దేశవ్యాప్తంగా 2.93 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం ప్రశ్నల సంఖ్య 66 నుంచి 68కి పెరిగింది.

క్యాట్ ముఖ్య వివరాలు

అర్హత: కనీసం 50% మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45% ఉన్నా అర్హులే). డిగ్రీ చివరి సంవత్సరం కోర్సుల్లో ఉన్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2600. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.1300.

దరఖాస్తు తేదీలు: 01.08.2025 నుంచి 13.09.2025 సాయంత్రం 5 గంటల వరకు.

పరీక్ష తేదీ: 30.11.2025.

ఫలితాల ప్రకటన: 2026, జనవరి మొదటి వారం.

ఆన్‌లైన్ పరీక్ష స్వరూపం

(2024 క్యాట్ ప్రకారం):

మొత్తం ప్రశ్నలు: 68. మార్కులు 204.

1. వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ (VARC) - 24 ప్రశ్నలు
2. డేటా ఇంటర్ ప్రిటేషన్ & లాజికల్ రీజనింగ్ (DI & LR)- 22 ప్రశ్నలు
3. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (QA) - 22 ప్రశ్నలు

ఎంసీక్యూలు (మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు): 48

నాన్ ఎంసీక్యూలు: 20. వీటికి స్క్రీన్‌పైనే సమాధానాలు టైపు చేయాలి.

పరీక్ష వ్యవధి: 2 గంటలు (సెక్షనల్ టైమింగ్: ప్రతి విభాగానికీ 40 నిమిషాలు).

ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ 1 మార్కు తగ్గిస్తారు. నాన్ ఎంసీక్యూలకు ఈ నెగటివ్ మార్కింగ్ లేదు.

సబ్జెక్టు వారీగా సిలబస్

(2024 క్యాట్ పేపర్ ప్రకారం)

వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ (VARC)

సన్నద్ధత కోసం రోజూ కనీసం 3 RC ప్యాసేజీలను సాధన చేస్తే మంచిది. క్యాట్ ఆధారిత RCలతో పాటు ఇంగ్లిష్ పఠనం అవసరం. ఆన్‌లైన్‌లో లభించే అంతర్జాతీయ ఇంగ్లిష్ దినపత్రికలు, మ్యాగజీన్లు చదవాలి. రోజూ కొన్ని కొత్త ఆంగ్ల పదాలను నేర్చుకుంటూ పద జాలం పెంపొందించుకోవాలి. 2024 ప్రశ్నపత్రంలో ఈ విభాగంలో కనిపించిన మార్పు ఏంటంటే- ప్యారా జంబుల్స్‌పై ప్రశ్నలు ఇవ్వలేదు.

డేటా ఇంటర్ ప్రిటేషన్ & లాజికల్ రీజనింగ్ (DI & LR)

2024 ప్రశ్నపత్రంలో ఈ విభాగంలో ప్రశ్నల సంఖ్య 20 నుంచి 22 కి పెరిగింది. అంటే ప్రశ్నల సెట్స్ 4 నుంచి 5కి పెంచారు. దీనిపై పట్టు కోసం క్రమం తప్పకుండా LR ప్రశ్నలు, DI సెట్స్ గత సంవత్సరపు ప్రశ్నల సరళితో సాధన చెయ్యాలి. DI లో మంచి స్కోరు కోసం అరిథ్‌మెటిక్‌పై పట్టు పెంచుకోవాలి. నిత్యం కాల్‌క్యులేషన్స్, కంపారిజన్స్, లాజికల్ డిడక్షన్స్ సాధన చెయ్యాలి.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ (QA)

ఈ విభాగంలో ఎక్కువ ప్రశ్నలు అరిథ్‌మెటిక్, ఆల్జీబ్రాల నుంచే వస్తున్నాయి. మొదట ఈ రెండు చాప్టర్లనూ పూర్తి చేయాలి. ఫార్ములాలను బట్టీ పట్టకుండా తార్కిక పరిజ్ఞానం ఉపయోగించి జవాబులు కనుగొనేలా సాధన ఉండాలి.

దరఖాస్తులో జాగ్రత్తలు

స్పెలింగ్: పేరు, మిగతా వివరాలు నమోదు చేసేటప్పుడు పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం స్పెలింగ్ తప్పులు లేకుండా నమోదు చేయాలి.

కోర్సుల ఎంపిక: ఐఐఎంలు మేనేజ్‌మెంట్‌లో సాధారణ పీజీతో పాటు కొన్ని అదనపు ప్రోగ్రామ్స్/ కోర్సులు (బిజినెస్ అనలిటిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ -హెచ్ఆర్ఎం లాంటివి) అందిస్తున్నాయి. దరఖాస్తులో వీటిని ఎంచుకోవాలి. ఈ అదనపు కోర్సులకు కూడా చాలామందికి అర్హత ఉంటుంది. జనరల్ ఎంబీఏ సీటు రాకపోతే వీటిలో వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి, వీటిని టిక్ చెయ్యడం మంచిది. FPM (ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్) అనేది - పీహెచ్‌డీ కోర్సు. 'ఎగ్జిక్యూటివ్' అనే పదంతో ఉన్నవి... పని అనుభవం సూచించే కోర్సులు. వీటికి అర్హత ఉన్నవారు ఎంచుకొంటే సరిపోతుంది.

రిజర్వేషన్: ఐఐఎంలూ, ఎంబీఏలు అందించే ఐఐటీలూ, ఇతర ప్రముఖ ప్రభుత్వ కాలేజీలు/ సెంట్రల్ యూనివర్సిటీలు సీట్ల కేటాయింపులో రిజర్వేషన్ పాటిస్తున్నాయి. అభ్యర్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను దరఖాస్తు సమయానికి అందుబాటులో ఉంచుకోవాలి. ఈ కోటాలను సద్వినియోగం చేసుకోవడానికి.. ఈ రిజర్వేషన్ సర్టిఫికెట్లు ఒకవేళ తీసుకోకపోయినట్లయితే వెంటనే దరఖాస్తు చెయ్యాలి. అభ్యర్థులు ఒకసారి క్యాటగిరీ ఎంపిక చేసిన తర్వాత మార్చే అవకాశం ఉండదు.

అకడమిక్ స్కోర్ల గణన: దరఖాస్తులో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అకడమిక్ స్కోర్ల వివరాలు నమోదు చేయాలి. క్యాట్ దరఖాస్తులో సాధారణంగా అగ్రిగేట్ పర్సెంటేజ్‌ను అడుగుతారు. చాలామందికి సర్టిఫికెట్లలో స్కోర్లు సి.జి.పి.ఎ.లలో (క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్) ఉండవచ్చు. అప్పుడు రాష్ట్ర బోర్డులు /యూనివర్సిటీల మార్గదర్శకాల ప్రకారం 'స్కోర్ కన్వర్షన్ ఫార్ములా'తో ఈ సి.జి.పి.ఎ.ను అగ్రిగేట్ పర్సెంటేజ్‌గా మార్చి క్యాట్ దరఖాస్తులో నింపాలి.

ఈ-మెయిల్: చాలామంది క్యాట్‌తో పాటు ఇతర బీ స్కూల్ ఎంట్రన్స్ టెస్టులు కూడా రాస్తారు. ఎంబీఏ అడ్మిషన్ వచ్చేవరకూ దాదాపు ఏడాది పాటు ఈ కాలేజీలన్నీ ఈ-మెయిల్‌తోనే ప్రధానంగా సమాచారం అందిస్తుంటాయి. అవసరమైతే ఒక కొత్త ఈ-మెయిల్ రూపొందించి, అన్ని పరీక్షలకూ దాన్ని వాడితే సరిపోతుంది.



– శ్రీధర్, డైరెక్టర్, కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్

ఎలా సన్నద్ధం కావాలి?

మొదట అన్ని సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలు నేర్చుకోవాలి. సిలబస్ పూర్తి చేయడం, ప్రాక్టీస్ టెస్టుల సాధన రెండూ ఏక కాలంలో జరగాలి. ఆన్-లైన్ టెస్టుల సాధన క్రమం తప్పకుండా చేయాలి. ఒక టాపిక్ పూర్తి అయ్యాక దానిపై వెంటనే కొన్ని టెస్టులు, తర్వాత సెక్షన్ వారీగా, మొత్తం సిలబస్‌పై రెగ్యులర్‌గా ఆన్‌లైన్ మాక్ టెస్టులు రాయాలి. వాటిని విశ్లేషించుకోవాలి. క్యాట్ గత పరీక్షల పేపర్ల సాధన తప్పనిసరి.

ప్రణాళికతో చదివి, వారాంతపు సమీక్షలతో పాటు సానుకూల దృక్పథంతో నిత్యం సాధన చేస్తే క్యాట్‌లో మంచి స్కోరు సులభంగా సాధించవచ్చు. క్యాట్ పరీక్ష సరళిలో కొన్ని చిన్నచిన్న మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. వాటికి సిద్ధపడాలి కూడా!

విదేశాల్లో పీజీ చేస్తే?

బీబీఏ (ఫైనాన్స్ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్) చదివి.. సప్లయి చెయిన్ అనలిస్ట్‌గా పని చేస్తున్నాను. విదేశాల్లో పీజీ చేస్తే ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - సరిత



■ మీకు ఇప్పటికే సప్లయి చెయిన్ అనలిస్టుగా ఉద్యోగానుభవం ఉంది కాబట్టి పీజీని విదేశాల్లో పూర్తిచేస్తే అంతర్జాతీయ కార్పొరేట్ రంగంలో ఉన్నతోద్యోగాలకు అర్హత సాధించవచ్చు. కానీ ప్రముఖ విదేశీ విద్యాసంస్థల్లో ఎంబీఏలో ప్రవేశం పొందాలంటే విపరీతమైన పోటీ ఉంటుంది. పోటీతో పాటు ప్రోగ్రాం ఫీజు కూడా లక్షల రూపాయల్లో ఉంటాయి. మీరు విదేశాల్లో ఎంబీఏ కానీ, సప్లయి చెయిన్ మేనేజ్‌మెంట్ సంబంధిత కోర్సుల్లో పీజీ కానీ చేయవచ్చు. సప్లయి చెయిన్ మేనేజ్‌మెంట్/ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్/ బిజినెస్ అనలిటిక్స్/ సప్లయి చెయిన్ అనలిటిక్స్/ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్/ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్/ గ్లోబల్ బిజినెస్/ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో పీజీ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.



ఈ కోర్సులు అమెరికా, కెనడా, యూకే, జర్మనీ, సింగపూర్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో ఉన్నాయి. విదేశాల్లో పీజీ చేశాక సప్లయి చెయిన్ అనలిస్ట్, ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్, లాజిస్టిక్స్ కోఆర్డినేటర్, ఆపరేషన్స్ మేనేజర్, ఇన్వెంటరీ అనలిస్ట్..ఈ హోదాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. సాధారణంగా విదేశీ విశ్వవిద్యాలయాల పీజీ ప్రవేశాల్లో ఉద్యోగానుభవం ఉన్నవారికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఆండ్రాయిడ్ యాప్ అండ్ పీహెచ్‌పీ డెవలపర్

సంస్థ: హాష్ఏఐ టెక్నాలజీ
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, జావా, మై ఎస్‌క్యూఎల్, పీహెచ్‌పీ స్టైపెండ్: రూ.6,000- 8,000
☛ https://shorturl.at/wON4X

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సంస్థ: వెర్లింక్ నైపుణ్యాలు: సీఎస్ఎస్, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, నోడ్.జేఎస్, రియాక్ట్ స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/VOkpK

మెడికో జర్నలిజం

సంస్థ: ద రైట్ డాక్టర్స్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్
స్టైపెండ్: రూ.5,000- 10,000
☛ https://shorturl.at/KFSE0

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 8

బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (ఇంక్యుబేషన్ అలయన్సెస్)


సంస్థ: ఇన్‌స్టావెబ్ ల్యాబ్స్ ప్రైవేట్
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, సీఆర్ఎం, నెగోషియేషన్స్ స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 21
☛ https://shorturl.at/foE3Y

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: హాప్లీ, ఇంక్ నైపుణ్యాలు: అమెరికన్ ఇంగ్లిష్, క్రియేటివ్ కమ్యూనికేషన్, ఎంఎస్ ఎక్సెల్ స్టైపెండ్: రూ.18,000- 20,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 15
☛ https://shorturl.at/TjkLa

కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తోన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లతో పాటు ఇతర జాతీయ వైద్య సంస్థల్లో సేవలందించే అవకాశం వచ్చింది. 3500 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. నర్సింగ్ ఆఫీసర్స్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నార్‌సెట్)తో నియామకాలుంటాయి. నర్సింగ్ కోర్సులు పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షల్లో మెరిసినవారు లెవెల్-7 వేతనాలు అందుకోవచ్చు.

ఎయిమ్స్‌ల్లో నర్సింగ్ ఆఫీసర్లు



బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల సిలబస్ ఆపోశన పట్టినవారు ఎయిమ్స్‌లో నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని పొందడం సులువే. పోస్టుల్లో 80 శాతం మహిళలకే దక్కుతాయి. మిగిలిన 20 శాతం పురుషులతో నింపుతారు. పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్ ఉంటాయి.

ప్రిలిమ్స్: వంద మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. ఇందులో 80 సబ్జెక్టుకు సంబంధించినవే ఉంటాయి. మిగిలిన 20 జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 4 ఆప్షన్లు ఇస్తారు. వాటిలో సరైనదాన్ని గుర్తించాలి. ప్రతి సరైన జవాబుకు ఒక మార్కు. తప్పు సమాధానానికి మార్కులో మూడో వంతు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. దీన్ని 5 సెక్షన్లుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లో 20 చొప్పున ప్రశ్నలు వస్తాయి. 18 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో అర్హతకు.. జనరల్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఓబీసీలు 45, ఎస్సీ, ఎస్టీలు 40 శాతం మార్కులు పొందాలి. దివ్యాంగులైతే వారి కేటగిరీ అనుసరించి అదనంగా మరో 5 శాతం సడలింపు వర్తిస్తుంది.

సబ్జెక్టు విభాగంలో అడిగే ప్రశ్నలు బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల సిలబస్ నుంచే ఉంటాయి. అందువల్ల ఆ పాఠ్యపుస్తకాలు బాగా చదివితే ఎక్కువ మార్కులు పొందవచ్చు. గతంలో నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలు, ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షల్లోని ప్రశ్నలు బాగా సాధన చేసినవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు. ప్రిలిమినరీ అర్హత కోసమే. తుది ఎంపికలో ఈ మార్కులు పరిగణనలోకి తీసుకోరు.

మెయిన్స్: ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినవారి జాబితా నుంచి కేటగిరీల వారీ ఉన్న ఖాళీలకు 5 రెట్ల మందికి మెయిన్స్‌కు అవకాశం కల్పిస్తారు. 160 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ఇవన్నీ నర్సింగ్ సిలబస్ నుంచే ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి 1/3 మార్కు తగ్గిస్తారు. ఈ పరీక్ష వ్యవధి 3 గంటలు. దీన్ని 4 సెక్షన్లుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లోనూ 40 ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 45 నిమిషాలు. ఇందులో అర్హతకు.. జనరల్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఓబీసీలు 45, ఎస్సీ, ఎస్టీలు 40 శాతం మార్కులు పొందాలి. దివ్యాంగులైతే వారి కేటగిరీ అనుసరించి అదనంగా మరో 5 శాతం సడలింపు వర్తిస్తుంది.

నియామకాలు

పరీక్షలో అర్హత సాధించినవారి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. అనంతరం మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఖాళీలకు అనుగుణంగా అభ్యర్థుల ప్రాధాన్యం ప్రకారం పోస్టులు కేటాయిస్తారు. ఇలా అవకాశం వచ్చినవారిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తారు. వీరికి పే స్కేల్ లెవెల్ 7 ప్రకారం రూ.44,900 మూలవేతనం అందిస్తారు. దీనికి డీఏ, హెచ్ఆర్ఏ అదనం. అన్నీ కలిపి మొదటి నెల నుంచే సుమారు రూ.85,000 వేతనం అందుకోవచ్చు. నోటిఫికేషన్‌లో 3500 పోస్టులు ప్రకటించినప్పటికీ కొన్ని ఎయిమ్స్‌ల్లో ఖాళీల వివరాలు పేర్కొనలేదు. అందువల్ల నియామకాల సమయానికి పోస్టుల సంఖ్య పెరగొచ్చు.

ఎయిమ్స్ కేంద్రాలు: బఠిండా, భోపాల్, భువనేశ్వర్, బీబీనగర్, బిలాస్‌పుర్, దియోఘర్, గోరఖ్‌పుర్, జోధ్‌పుర్, కల్యాణి, మంగళగిరి, నాగ్‌పుర్, న్యూదిల్లీ, పట్నా, రాయ్‌బరేలీ, రాయ్‌పుర్, రాజ్‌కోట్, రిషికేష్, విజయ్‌పుర్ (జమ్మూ), అవంతిపుర. ఈ స్కోరుతో ఎయిమ్స్‌లతోపాటు జిప్మర్, ఈఎస్ఐసీల్లోని ఖాళీలనూ నింపుతారు.

ముఖ్య వివరాలు

అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం తోపాటు కనీసం 50 పడకల ఆసుపత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయసు: 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం పది నుంచి పదిహేనేళ్ల సడలింపులు వర్తిస్తాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులు: 11.08.2025 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.3000. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రూ.2400. దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.

ఆన్‌లైన్ పరీక్ష తేదీ:
స్టేజ్-1: 14.09.2025,
స్టేజ్-2: 27.09.2025

వెబ్‌సైట్: https://rrp.aiimsexams.ac.in/

Wordwise-36


ఆహ్లాదకరంగా ఇంగ్లిష్ పదజాలం పెంచుకుందామా? ఇక్కడ ఇచ్చిన Wordwise ను పూర్తిచేయండి. పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుంది!

ACROSS

1. It has no corners, no end, and goes round and round
6. They protect the nation from high above — two-letter winged warriors!
7. These are two indefinite articles written together — no space, no punctuation!
8. A famous British music journalism magazine
9. One who traces something
11. An old-fashioned word that means 'look!'
12. A short form of the word 'English' or 'Engineer.'
13. Short ending added to verbs to show past time
14. The word 'TRY' is reshuffled.

DOWN

1. A big strong building where kings and queens once lived
2. A small word used to talk about possibilities or conditions
3. A zodiac sign and also a serious disease
4. To express deep sorrow or sadness
5. We need it to run, jump, and light up the world
10. A long, thin stick — sometimes used to catch fish!



ANSWERS

DOWN: 1. CASTLE 2. IF 3. CANCER 4. LAMENT 5. ENERGY 10. ROD

ACROSS: 1. CIRCLE 6. AF (Air Force) 7. AN 8. NME (New Musical Express) 9. TRACER 11. LO 12. ENG 13. ED 14. RTY

- డా. వంగీపురం శ్రీనాథాచారి

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

బీఎస్ఎఫ్‌లో 3,588 పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) వివిధ సెక్టార్లలో 3,588 కానిస్టేబుల్/ట్రేడ్స్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ కానిస్టేబుల్(ట్రేడ్స్‌మెన్)- మేల్: 3,406
✦ కానిస్టేబుల్(ట్రేడ్స్‌మెన్)- ఫీమేల్: 182

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతితో పాటు, సంబంధిత ట్రేడ్‌లో ఏదైనా ఐటీఐ నుంచి 2 ఏళ్ల సర్టిఫికెట్ కోర్సు.
వయసు: 24.08.2025 నాటికి 18 - 25 ఏళ్లు నిండి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.21,700 - రూ.69,100.
శారీరక ప్రమాణాలు: పురుషులకు ఎత్తు కనీసం 165 సెం.మీ., ఛాతీ 75-80 సెం.మీ, మహిళలకు ఎత్తు 155 సెం.మీ.
ఎంపిక: ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ట్రేడ్ టెస్ట్, రాత పరీక్ష, డీటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్‌తో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.08.2025
దరఖాస్తు ఫీజు: రూ.150. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

బీఎస్ఎఫ్‌లో 241 కానిస్టేబుల్స్

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్).. స్పోర్ట్స్ కోటాలో సంబంధిత విభాగాల్లో 241 కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) గ్రూప్-సి నాన్-గెజిటెడ్ అండ్ నాన్ మినిస్టీరియల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
అర్హత: మెట్రిక్యులేషన్‌తో పాటు నేషనల్/ ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌లో సంబంధిత క్రీడాంశాల్లో పాల్గొని ఉండాలి/విజయాలు సాధించి ఉండాలి.
వయసు: 01.08.2025 నాటికి 18- 23 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: అప్లికేషన్స్ షార్ట్‌లిస్టింగ్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌తో.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.147.20. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.08.2025.
వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

ఈఎస్ఐసీలో 243 అసిస్టెంట్ ప్రొఫెసర్లు

దిల్లీలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 243 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: అనాటమీ, అనస్థీషియాలజీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ (ఎఫ్ఎంటీ), జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఓబీజీవై, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్. **అర్హత:** పోస్టును అనుసరించి ఎంఎస్, ఎండీ, డీఎన్‌బీ, ఎండీఎస్‌తో పాటు పని అనుభవం. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు రూ.67,700 - రూ.2,08,700.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 15.09.2025
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/మహిళలకు ఫీజు లేదు.
చిరునామా: ది రీజనల్ డైరెక్టర్, ఈఎస్ఐ కార్పొరేషన్, పంచదీప్ భవన్, సెక్టార్-16, (లక్ష్మీనారాయణ మందిర్ వద్ద), ఫరీదాబాద్-121002.
వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

టీఎఫ్ఆర్ఐలో గ్రూప్-సీ కొలువులు

జబల్‌పూర్‌లోని ఐసీఎఫ్ఆర్ఈ- ట్రాపికల్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎఫ్ఆర్ఐ) 14 గ్రూప్-సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ టెక్నికల్ అసిస్టెంట్: 10 ✦ ఫారెస్ట్ గార్డ్: 03 ✦ డ్రైవర్: 01
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీతో పాటు పని అనుభవం. **వయసు:** 10.08.2025 నాటికి 18- 30 ఏళ్లు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.08.2025
ఎంపిక: రాత పరీక్ష, పీఎస్‌టీ, ట్రేడ్ టెస్టులతో
వెబ్‌సైట్: https://tfri.icfre.gov.in/

ఐఐఐటీ చిత్తూరులో ఫ్యాకల్టీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీ సిటీ చిత్తూరు వివిధ విభాగాల్లో 46 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సీఎస్ఈ, ఈసీఈ, మ్యాథమెటిక్స్, డేటా సైన్స్, ఇంగ్లిష్
✦ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, 2, 3 ✦ అసోసియేట్ ప్రొఫెసర్ ✦ ప్రొఫెసర్
అర్హత: పోస్టును అనుసరించి బీటెక్/ బీఈ, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంఫిల్/పీహెచ్‌డీ, ఎండీఈఎస్‌తో పాటు పని అనుభవం.
వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, 2, 3కి 45 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, ప్రొఫెసర్‌కు 55 ఏళ్లు ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.08.2025
వెబ్‌సైట్: https://www.iiits.ac.in/careersiiits/faculty/

ఐఐటీ తిరుపతిలో నాన్-టీచింగ్ ఖాళీలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 42 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ అసిస్టెంట్ రిజిస్ట్రార్: 01 ✦ టెక్నికల్ ఆఫీసర్: 01 ✦ సెక్యూరిటీ ఆఫీసర్: 01 ✦ సెక్షన్ ఆఫీసర్: 02 ✦ జూనియర్ సూపరింటెండెంట్: 07 ✦ జూనియర్ ఇంజినీర్ సివిల్: 01 ✦ జూనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్: 01 ✦ జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్: 06 ✦ జూనియర్ అసిస్టెంట్: 12 ✦ జూనియర్ టెక్నీషియన్: 10
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, బీఈ/బీటెక్, డిగ్రీ, ఎంసీఏ, ఎమ్మెస్సీ (సీఎస్)తో పాటు పని అనుభవం.
వయసు: అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు 56 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్‌కు 45 ఏళ్లు, సెక్షన్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ ఇంజినీర్, జూనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్‌లకు 35 ఏళ్లు, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్‌లకు 32 ఏళ్లు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 13.08.2025
దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ, బీ, సీ పోస్టులకు వరుసగా రూ.500, రూ.300, రూ.200. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎంకు ఫీజు లేదు.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్, టెస్ట్, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://www.iittp.ac.in/recruitment

హిందుస్థాన్ మెషిన్ టూల్స్‌లో..

హిందుస్థాన్ మెషిన్ టూల్స్, బెంగళూరు ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ డిప్యూటీ మేనేజర్: 09 ✦ ఆఫీసర్ (కంపెనీ సెక్రటరీ): 01 ✦ ఆఫీసర్ (లీగల్): 01 ✦ హిందీ ఆఫీసర్: 01
అర్హత: పోస్టును అనుసరించి పీజీ, డిగ్రీ (ఎల్ఎల్‌బీ), డిగ్రీ, సీఏ/సీఎంఏ/ఐసీడబ్ల్యూఏతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 01.07.2025 నాటికి డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, ఆఫీసర్‌కు 30 ఏళ్లు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 11.08.2025
వెబ్‌సైట్: https://www.hmtindia.com/careers/

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

■ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత న్యూస్ యాంకర్ 'అంకిత'ను ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది?



(భారతదేశ మొదటి ప్రాంతీయ భాషా ఏఐ న్యూస్ యాంకర్‌గా అంకిత గుర్తింపు పొందింది.)

జ: అస్సాం

■ బ్రిక్స్ దేశాలు స్థాపించిన ఆర్థిక సంస్థ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ)లో ఇటీవల చేరిన 10, 11 సభ్యదేశాలు ఏవి? (బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్‌ఆఫ్రికాలతోపాటు బంగ్లాదేశ్, యూఏఈ, ఈజిప్ట్, అల్జీరియాలు ఇప్పటికే ఎన్‌డీబీలో సభ్యత్వం కలిగి ఉన్నాయి.)

జ: కొలంబియా, ఉజ్బెకిస్థాన్

■ చారిత్రాత్మక ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం డియెగో గార్సియాతో సహా చాగోస్ దీవుల సార్వభౌమత్వాన్ని ఏ దేశానికి బదిలీ చేయడానికి ఇటీవల యునైటెడ్ కింగ్‌డమ్ అంగీకరించింది?

జ: మారిషస్

■ ఏ రాష్ట్రానికి చెందిన న్యాయవాది వర్ష దేశ్‌పాండేకు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో, గర్భస్రావాలను నిరోధించడంలో చేసిన కృషికి 2025 సంవత్సరానికి 'యూఎన్‌పీఓ జనాభా అవార్డు' వచ్చింది?

జ: మహారాష్ట్ర

మరింత సమాచారం

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

విశిష్ట లక్షణాల ఉపఖండం!

ప్రపంచంలోని అన్ని రకాల భూస్వరూపాలు, వాతావరణ పరిస్థితులు కలగలిసి ఒకేచోట ఉన్న ద్వీపకల్పం భారతదేశం. ఈ ఉపఖండానికి ఉత్తరాన హిమాలయాలు పెట్టని కోటగా, జీవ నదీవ్యవస్థలకు ఆధారంగా నిలవగా, ఆ పర్వతాలకు దిగువన ఏర్పడిన సారవంతమైన మైదానాలు దేశ జనాభాలో అధిక శాతానికి జీవనాధారాన్ని అందిస్తున్నాయి. దేశంలోని ఈ కీలక భౌగోళిక భాగాల స్వరూప స్వభావాల గురించి పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి. హిమాలయాల విస్తరణ తీరు, విశిష్ట లక్షణాల ప్రకారం చేసిన విభజన, నదుల వల్ల ఏర్పడిన వివిధ రకాల మైదానాలు, ప్రాంతాల వారీగా వాటి ప్రత్యేకతలనూ తెలుసుకోవాలి.


జమ్మూ-కశ్మీర్‌లోని హిమాలయాలు

భారత భౌగోళిక స్వరూపం

భూగోళంలో ప్రత్యేక లక్షణాలతో భారత భూభాగం ఉంది. ఇప్పుడు ఉన్న దేశ ఉపరితల భౌగోళిక స్వరూపం లక్షల సంవత్సరాల సుదీర్ఘ భూచలన చర్యల ఫలితంగా ఏర్పడింది. ఈ ఉపరితలం దేశం మొత్తం మీద ఒకేలా, సమానంగా ఉండదు. పర్వతాలు, మైదానాలు, పీఠభూములు, ఎడారి ప్రాంతం, తీరప్రాంతం, దీవులు మొదలైన ప్రపంచంలోని అన్ని రకాల భౌగోళిక స్వరూపాలు, లక్షణాలతో కూడి ఉంటుంది.

ఉన్నత పర్వతాలు/ హిమాలయాలు

ఇవి భారతదేశానికి ఉత్తరాన ఉండటంతో ఉత్తర పర్వతాలు అని, చాలా ఎత్తుగా మంచు కప్పుతో ఉండటంతో ఉన్నత హిమాలయాలని అంటారు. ఇవి నవీన ముడుత పర్వతాలు. పడమర నుంచి తూర్పునకు సుమారు 2400 కి.మీ.లు విస్తరించి ఉన్నాయి. పలక విరూపక సిద్ధాంతం ప్రకారం భారత భూభాగ పలక, యూరోపియన్ పలకలోకి చొచ్చుకుపోవడంతో మధ్యలోని భాగం ముడతలుగా ఏర్పడి పర్వతాలుగా మారాయి. భౌగోళిక లక్షణాల ఆధారంగా ఇవి ఉన్నత, మధ్య, బాహ్య హిమాలయాలని మూడు రకాలుగా ఉన్నాయి.

1) ఉన్నత హిమాలయాలు/ హిమాద్రి పర్వతాలు: ఇవి దేశానికి ఉత్తరం చివరన ఉంటాయి. వీటిని 'హిమాద్రి'గా పిలుస్తారు. సరాసరి ఎత్తు 6100 మీటర్లు. ఈ పర్వతాల్లో కొన్ని 8000 మీటర్లకు మించి ఉంటాయి. అవి..


ఎవరెస్ట్ శిఖరం

ఎవరెస్ట్ శిఖరం (8,848 మీ.), కాంచనజంగా (8,598 మీ.), ధౌలగిరి (8,172 మీ.), నంగపర్బత్ (8,126 మీ.), మకాలు (8,481 మీ.), మన్సాలు (8,156 మీ.), అన్నపూర్ణ (8,078 మీ.) మొదలైనవి.

2) మధ్య హిమాలయాలు: ఇవి ఉన్నత హిమాలయాలకు - శివాలిక్ కొండలకు మధ్య ప్రాంతంలో ఉన్నాయి. సగటు ఎత్తు 3,500 మీ. నుంచి 4,500 మీ. మధ్య ఉంటుంది. ఇక్కడి ముఖ్యమైన శ్రేణులు దౌలధర్, పీర్‌పంజాల్, నాగ్ టిబా, మహాభారత్, ముస్సోరి మొదలైనవి. ఇవి మానవ రాకపోకలకు కొంత అనుకూలంగా ఉంటాయి. ఇక్కడి ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాలు సిమ్లా, రాణిఖేట్, నైనిటాల్, అల్‌మోరా, ముస్సోరీ, డార్జీలింగ్. ఇక్కడి కోనిఫెరస్ చెట్లు ఎప్పుడూ పచ్చగా ఉంటాయి.



3) బాహ్య హిమాలయాలు/ శివాలిక్ కొండలు: ఇవి హిమాలయాలకు దక్షిణంగా పోత్వార్ పీఠభూమి నుంచి బ్రహ్మపుత్ర లోయ వరకు ఉంటాయి. వీటిని జమ్మూలో జమ్మూ కొండలని, అరుణాచల్ ప్రదేశ్‌లో దఫ్లా, మిరి, మిష్మి కొండలు అని పిలుస్తారు. ఇక్కడ ప్రవహించే నదులు శివాలిక్ కొండల్లో కోతకు గురైన మట్టి, రాళ్లు, ఇసుకను కింద ఉన్న సరస్సుల్లో నిక్షిప్తం చేస్తాయి. వీటినే 'డూన్స్ మైదానాలు' అంటారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ ఆ విధంగా ఏర్పడిందే.

> **1951 సెన్సస్ కమిషన్ అంచనా ప్రకారం దేశ మొత్తం భూభాగంలో 10.7% పర్వత ప్రాంతం, 18.6% కొండ ప్రాంతం, 27.7% పీఠభూమి, 43.3% మైదాన ప్రాంతం.**

ప్రాంతీయంగా..

హిమాలయాలను ఎత్తు, రేఖాంశాల పరంగానే కాకుండా ప్రాంతీయంగా పలు రకాలుగా వ్యవహరిస్తారు.

కశ్మీర్/పంజాబ్ హిమాలయాలు: సింధూ నది నుంచి సట్లెజ్ నది వరకు ఉన్న హిమాలయాలను పంజాబ్ హిమాలయాలు అంటారు. ఇందులో జమ్మూ-కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ కూడా ఉంటాయి. ఇక్కడి కశ్మీర్ లోయలోని హిమానీనదాల నిక్షేపాలతో ఏర్పడిన కరేవా నేలలు కుంకుమపువ్వు సాగుకు అనుకూలం. ఇక్కడే డ్రాస్ సెక్టార్ ఉంది.

కుమయూన్ హిమాలయాలు: ఇది సట్లెజ్ - కాళీ నదుల మధ్య ప్రాంతం. నందాదేవి, కామెట్, బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఇక్కడి ముఖ్య శిఖరాలు. గంగా, యమునా నదుల జన్మస్థానం ఇక్కడే ఉంది. నైనిటాల్, భీమ్‌టాల్ ముఖ్యమైన సరస్సులు.

నేపాల్ హిమాలయాలు: కాళీ - తీస్తా నదుల మధ్యగా విస్తరించిన ప్రాంతం. హిమాలయాల్లో ఎత్తయిన ఎవరెస్ట్, కాంచనజంగా, మకాలు, అన్నపూర్ణ లాంటి శిఖరాలు ఇక్కడ ఉన్నాయి. ఖాట్మండ్ లోయ హిమాద్రి, మహాభారత్ పర్వత పంక్తుల మధ్యన ఉంది.

అస్సాం హిమాలయాలు: తీస్తా - బ్రహ్మపుత్ర నదుల మధ్య ప్రాంతమిది. సిక్కిం, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ ఇందులో భాగం. నామ్చాబార్వా, కులకంగ్రి, చోమోలహ్రి ఇక్కడి ముఖ్య శిఖరాలు. ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయం ఉంది.

ఉత్తర మైదానాలు: ఇవి హిమాలయ పర్వతాలకు దక్షిణంగా, ద్వీపకల్ప పీఠభూమికి ఉత్తరంగా విశాలంగా ఉంటాయి. సింధూ, గంగా, బ్రహ్మపుత్ర నదులు వాటి ఉపనదుల ద్వారా నిక్షేపించిన ఒండ్రు మట్టి ప్రాంతం. దీనినే 'గంగా - సింధూ మైదానం' అంటారు. సముద్ర మట్టానికి 200 మీ.ఎత్తులో ఉన్న సమతల మైదానం. ఇక్కడి భూ ఉపరితల స్వరూపం, లక్షణాలు, నేల నిర్మాణం ఆధారంగా ఈ మైదానాన్ని పలు రకాలుగా విభజించారు. **1) భంగర్:** పురాతన ఒండ్రు మట్టితో నిండి, వరద మైదానాల కంటే కొంచెం ఎత్తులో టెర్రస్‌లను ఏర్పరుస్తుంది. ఇవి సారవంతమైన నేలలు. ముదురు రంగులో ఉంటాయి. ఉత్తర భారత మైదానాల్లో అధిక విస్తీర్ణంలో ఉన్నాయి. **2) ఖాదర్:** కొత్త ఒండ్రు మట్టితో ఏర్పడిన నదీ మైదానాలు. ఏటా నది వరదలో కొట్టుకొచ్చే ఒండ్రుమట్టితో ఏర్పడతాయి. నదీతీరాలకు దగ్గరగా ఉంటాయి. ఇవి వ్యవసాయానికి బాగా అనుకూలమైనవి. **3) భాబర్:** శివాలిక్ కొండల పర్వత పాదాల వద్ద తూర్పు - పడమరగా ఏర్పడిన ప్రాంతం. నదీ ప్రవాహంలో కొట్టుకొచ్చిన గులకరాళ్లు ఈ ప్రాంతంలో నిక్షేపితమవుతాయి. సుమారు 8 నుంచి 16 కి.మీ. వెడల్పుతో ఉంటాయి. హిమాలయాల నుంచి వచ్చే నదులు ఇక్కడ గులకరాళ్ల మధ్య అదృశ్యమవుతాయి. **4) టెరాయ్:** ఇది చిత్తడి ప్రాంతం. భాబర్ ప్రాంతంలో అదృశ్యమైన నదులు ఇక్కడ పునఃప్రత్యక్షమవుతాయి. ఇది 15-30 కి.మీ.ల వెడల్పుతో ఉంటుంది. వరి, గోధుమ, చెరకు బాగా పండుతాయి. ఈ ప్రాంతం తూర్పు భాగంలో వర్షపాతం ఎక్కువ.

ట్రాన్స్/టిబెట్ హిమాలయాలు


ఉన్నత హిమాలయాల ఉత్తర భాగాన ఉంటాయి. కారకోరం, లద్దాఖ్, జస్కర్, కైలాష్ పర్వత శ్రేణులు, మానస సరోవరం ఈ ప్రాంతంలో భాగమే. ఈ శ్రేణిలోని ఉన్నత శిఖరాలు కె2 (8,611 మీ.), బ్రాడ్‌పీక్ (8,047 మీ.), గషెర్‌బ్రమ్ (8,035 మీ.), రాకపోషి (7,788 మీ.), హర్మోష్ (7,397 మీ.)


మానస సరోవరం

మైదానాలు

ప్రాంతాల పరంగా చూస్తే మైదానాలను పలు విధాలుగా పేర్కొంటారు.

రాజస్థాన్ మైదానాలు: దేశానికి పశ్చిమంలో ఉన్న ప్రాంతం. థార్ ఎడారి కూడా ఇక్కడే ఉంది. సాంబార్, దిద్వానా, దేగానా, కుచమన్, పచ్‌పద్రా లాంటి ఉప్పునీటి సరస్సులు ఉన్నాయి. ఈ ప్రాంతం తూర్పుభాగాన రాళ్లతో ఉండి, పశ్చిమ భాగాన 'దరియన్' అనే పేరున్న ఇసుక దిబ్బలు ఉంటాయి. ఆరావళీ పర్వతాల నుంచి ప్రవహించే చిన్ననీటి ప్రవాహాల ద్వారా కొంత వ్యవసాయం జరుగుతుంది. వీటిని 'రోహి' అంటారు.



పంజాబ్, హరియాణా మైదానాలు: ఇవి ఉత్తర మైదానాల్లో పశ్చిమ దిక్కుగా ఉంటాయి. సింధూ, దాని ఉపనదుల ఒండ్రుమట్టి మేట వేయగా ఇక్కడ మైదానాలు ఏర్పడి వ్యవసాయానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది. రెండు నదుల మధ్య సారవంతమైన నేలలను 'దోబ్స్' అని, పల్లపు ప్రాంతంలో ఉండే వరద మైదానాలను 'బెట్స్' అని అంటారు.

గంగా మైదానం: గంగా నదితోపాటు దాని ఉపనదులైన గోమతి, ఘాఘ్రు, గండక్, కోసి, యమున మొదలైన హిమాలయ నదుల నుంచి వచ్చిన మట్టి మేటతో అల్లూవియల్ నేలలు ఏర్పడ్డాయి.

బ్రహ్మపుత్రా మైదానాలు: ఇది ఉత్తర మైదాన తూర్పు అంచున ఉంది. ఎక్కువగా అస్సాంలో ఉంటుంది. ఇందులోనే బ్రహ్మపుత్ర, దాని ఉప నదుల ద్వారా కొట్టుకొచ్చిన ఇసుక, మట్టి నిక్షేపంతో రివరైన్ ద్వీపాలు, ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. ఇక్కడి 'మజులీ' ప్రపంచంలోనే అతిపెద్ద నదీ ఆధారిత ద్వీపం. ఇది బ్రహ్మపుత్ర నది మధ్యలో 352 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. మన దేశ భూభాగంలో మైదాన ప్రాంతం?
   1) 23.3% 2) 43.3% 3) 63.3% 4) 13%
2. కింది వాటిలో నవీన ముడుత పర్వతాలు?
   1) ఆరావళి 2) తూర్పుకనుమలు 3) హిమాలయాలు 4) వైవస్నీ
3. బాహ్య హిమాలయాలకు ఉన్న మరో పేరు?
   1) శివాలిక్ కొండలు 2) కారకోరం శ్రేణి 3) హిమాద్రి 4) ఏదీకాదు
4. ఎవరెస్ట్ శిఖరం ఉన్న ప్రాంతం?
   1) ఉన్నత హిమాలయాలు
   2) మధ్య హిమాలయాలు
   3) బాహ్య హిమాలయాలు
   4) ఆరావళి పర్వతాలు
5. కింది వాటిలో శివాలిక్ కొండల నుంచి నదీ ప్రవాహ కోత కారణంగా ఏర్పడిన మైదానం?
   1) సిమ్లా 2) దాల్‌లేక్ 3) డెహ్రాడూన్ 4) ఊటీ
6. టిబెట్ హిమాలయాల్లో ఎత్తయిన శిఖరం?
   1) ఏ2 2) ధౌలగిరి 3) బ్రాడ్‌పీక్ 4) కే2
7. గంగా, సింధూ మైదానం సముద్ర మట్టం నుంచి ఉన్న సరాసరి ఎత్తు?
   1) 100 మీ. 2) 200 మీ. 3) 300 మీ. 4) 900 మీ.
8. పురాతన ఒండ్రు మట్టిలో ఏర్పడిన నేల?
   1) భాబర్ 2) భంగర్ 3) ఖాదర్ 4) టెరాయ్
9. కుమాయూన్ హిమాలయాలున్న ప్రాంతం ఏ నదుల మధ్య విస్తరించి ఉంది?
   1) తీస్తా-బ్రహ్మపుత్ర 2) కాళీ-తీస్తా
   3) సట్లెజ్-కాళీ
   4) సింధూ-సట్లెజ్
10. 'మజూలీ' ప్రత్యేకత?
    1) ఎత్తయిన పర్వత ప్రాంతం
    2) లోతయిన అఖాతం
    3) తీవ్ర ఎడారి ప్రాంతం
    4) నదీ ఆధారిత ద్వీపం
11. కింది వాటిలో ఉత్తర భారతదేశ ఉప్పు నీటి సరస్సు కానిది?
    1) దాల్ సరస్సు 2) సాంబార్ 3) దేగానా 4) కుచ్‌మన్

సమాధానాలు

1-2; 2-3; 3-1; 4-1; 5-3; 6-4; 7-2; 8-2; 9-3; 10-4; 11-1.



రచయిత: డాక్టర్ గోవగోని ఆనంద్

అందుకే అక్కడ అందమైన ధ్రువకాంతులు!

అయస్కాంతత్వం అయస్కాంత పదార్థాలు

అందరూ రోజూ ఉపయోగించే మొబైళ్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, మిక్సర్లు, గ్రైండర్లు, లౌడ్ స్పీకర్లు, క్రెడిట్, డెబిట్ కార్డులు తదితరాలన్నీ భౌతిక శాస్త్రంలోని అయస్కాంత ధర్మంపై ఆధారపడి పనిచేస్తాయి. అయస్కాంతత్వం అనేది ఒక ప్రాథమిక భౌతిక శక్తి. అది కొన్ని పదార్థాలపై ఆకర్షణ లేదా వికర్షణ కలిగి ఉంటుంది. పదార్థాల్లో అణువుల అమరిక లేదా విద్యుత్తు ప్రవాహం వల్ల ఆ శక్తి ఉత్పన్నమవుతుంది. అయస్కాంతత్వం కలిగి ఉండే పదార్థాలనే అయస్కాంత పదార్థాలు అంటారు. అయస్కాంతత్వం, దాని ప్రాముఖ్యత, ఉపయోగాలు, వినియోగిస్తున్న రంగాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వివిధ రకాల అయస్కాంతాలు, అయస్కాంత పదార్థాలు, వాటి స్వభావాలు, శాస్త్రీయ ప్రమాణాలను అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

పదార్థంలో పరమాణు ఎలక్ట్రాన్లు ఒక క్రమపద్ధతిలో అమరి ఉండటం వల్ల కలిగే ఆకర్షణ శక్తినే 'అయస్కాంతత్వం' అంటారు. ఇది పదార్థ గుణం. వేరొక వస్తువును ఆకర్షించగలిగే వస్తువే అయస్కాంతం. 4000 సంవత్సరాలకు పూర్వమే ఉత్తర గ్రీసులోని మెగ్నీషియా ప్రాంతంలో ఇనుమును ఆకర్షించే రాళ్లను 'మాగ్నస్' అనే గొర్రెల కాపరి కనుక్కున్నాడు. వీటినే చైనా దేశస్థులు పూర్వకాలంలో 'లోడ్ స్టోన్స్' అని పిలిచేవారు. ఇది మాగ్నటైట్ (Fe_3O_4)గా పేర్కొనే ఒక ఇనుప ఖనిజం. తర్వాత కాలంలో కృత్రిమ అయస్కాంతాలను తయారుచేసి అనేక ప్రక్రియల్లో ఉపయోగిస్తున్నారు. వైద్యరంగంలో ఎంఆర్ఐ, ఎన్ఎంఆర్ స్కాన్లు తదితరాలు అయస్కాంత ధర్మం ఆధారంగానే పనిచేస్తాయి.


1. మాగ్నస్ అనే గొర్రెల కాపరి ఉత్తర గ్రీసు ప్రాంతంలో మొదటిసారిగా ఇనుమును ఆకర్షించే రాళ్లను ఎక్కడ కనుక్కున్నాడు?
   1) లోడ్ స్టోన్ ప్రాంతం
   2) మాగ్నటైట్ ప్రాంతం
   3) మెగ్నీషియా ప్రాంతం
   4) చుంబకం ప్రాంతం



2. భూమి పెద్ద అయస్కాంతమని 1600 సంవత్సరంలో ఏ శాస్త్రవేత్త తను రచించిన 'డి మాగ్నెట్' అనే గ్రంథంలో పొందుపరిచారు?
   1) మాగ్నస్ 2) వెబర్ 3) గిల్‌బర్ట్ 4) ఆయిర్ స్టెడ్
3. మొదటి దిక్సూచిని క్రీ.పూ.2000 సంవత్సరాలకే కనుక్కుని, అయస్కాంత ధర్మాల ఆధారంగా సముద్రయానం చేసినవారు?
   1) గ్రీకులు 2) చైనీయులు 3) బ్రిటిషర్లు 4) డచ్ వారు
4. ఒక పదార్థం అయస్కాంత శక్తిని ప్రదర్శించడానికి కారణం?
   1) పదార్థంలో ఎలక్ట్రాన్‌ల సంఖ్య తక్కువ ఉండటం.
   2) పదార్థంలో ఎలక్ట్రాన్‌ల సంఖ్య ఎక్కువ ఉండటం.
   3) పదార్థంలో పరమాణు ఎలక్ట్రాన్‌లు క్రమపద్ధతిలో అమరి ఉండటం.
   4) పదార్థంలో ఎలక్ట్రాన్‌లు వేరొక ఎలక్ట్రాన్‌లను ఆకర్షించడం.
5. కింది వాటిలో సరిగా లేని జతను గుర్తించండి.
   1) అయస్కాంత పదార్థం - గెడల్లోనియం
   2) అనయస్కాంత పదార్థం - అల్యూమినియం
   3) సహజ అయస్కాంతం - సూదంటు రాయి
   4) కృత్రిమ అయస్కాంతం - మాగ్నటైట్
6. కృత్రిమ అయస్కాంతాలు తయారుచేసే అనేక పద్ధతుల్లో శాశ్వత, శక్తిమంతమైనవి తయారుచేసే పద్ధతి?
   1) విద్యుత్ పద్ధతి 2) ఏకస్పర్శ పద్ధతి
   3) అయస్కాంత ప్రేరణ పద్ధతి
   4) ద్విస్పర్శ పద్ధతి
7. సహజ అయస్కాంతాలను లోడ్ స్టోన్స్‌గా పిలిచిన చైనా దేశస్థులు లోడి పేరును వారి దేశంలో దేంతో పోల్చారు?
   1) దిక్కులు సూచించే రాయి
   2) దిక్కులు సూచించే నక్షత్రం
   3) శక్తిమంతమైన రాయి 4) శక్తిమంతమైన ఖనిజం




8. అయస్కాంత నావికా దిక్సూచిని చైనీయులు ఏ ధర్మం ఆధారంగా తయారుచేశారు?
   1) అయస్కాంత దిశా ధర్మం
   2) ధ్రువాల సిద్ధాంతం
   3) ధ్రువాల జంట నియమం
   4) అయస్కాంత ఆకర్షణ ధర్మం
9. కృత్రిమ అయస్కాంతాల తయారీకి వాడే అయస్కాంత పదార్థాల మిశ్రమం?
   1) ఆల్నికో 2) నిక్రోమ్ 3) గెడల్లోనియం 4) బ్రాంజ్
10. కింది వాటిలో సరైంది గుర్తించండి.
    ఎ) శాశ్వత అయస్కాంతాల తయారీకి విద్యుత్తు పద్ధతిలో డీసీ కరెంటు పంపిస్తారు.
    బి) అయస్కాంతాల తయారీకి విద్యుత్ పద్ధతిలో ఏసీ కరెంటు పంపుతారు.
    సి) అయస్కాంతానికి ఏకాంక ధ్రువం ఉంటుంది.
    డి) ఒకే అయస్కాంత ధ్రువాలు పక్కపక్కన ఉంచితే వాటి శక్తి పెరుగుతుంది.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి 3) ఎ, బి, డి 4) ఎ
11. ఒక యానకం ద్వారా అయస్కాంత బలరేఖలు ప్రయాణించే స్వభావాన్ని లేదా తాను అయస్కాంత క్షేత్ర ప్రభావానికి లోనయ్యే స్వభావాన్ని ఏమంటారు?
    1) ప్రేరణ క్షేత్ర తీవ్రత
    2) అయస్కాంత అభివాహం
    3) అయస్కాంత క్షేత్రం
    4) యానకపు ప్రవేశ్యశీలత
12. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
    ఎ) μ_0 శూన్యంలో ప్రవేశ్యశీలత విలువ $= 4\pi \times 10^{-7}$ హెన్రీ/మీటర్
    బి) అయస్కాంత విలోమ వర్గ నియమం $F = \frac{\mu_0}{4\pi} \times \frac{m_1 m_2}{d^2}$
    సి) అయస్కాంత ప్రేరణ క్షేత్రం $B = \frac{\mu_0}{4\pi} \times \frac{m_1 m_2}{d^2}$
    1) ఎ, బి, సి 2) ఎ, బి 3) ఎ 4) సి
13. కింది ప్రమాణాలను జతపరచండి.
    1) అయస్కాంత ప్రేరణ క్షేత్రం (B) ఎ) న్యూటన్ /వెబర్
    2) అయస్కాంత ధ్రువసత్వం (m) బి) వెబర్
    3) అయస్కాంత క్షేత్ర తీవ్రత (H) సి) టెస్లా
    4) అయస్కాంతీకరణ తీవ్రత (I) డి) ఆంపియర్/ మీటర్
    1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి
    3) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి 4) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
14. కింది వాటిలో సరైంది గుర్తించండి.
    ఎ) అయస్కాంత పొడవు దాని జ్యామితీయ పొడవులో 5/6వ వంతు ఉంటుంది.
    బి) అయస్కాంత ససెప్టబిలిటీకి ప్రమాణాలు లేవు.
    సి) అయస్కాంత ప్రవేశ్యశీలతకు ప్రమాణాలు లేవు.
    డి) అయస్కాంత ధ్రువాల మధ్య పొడవును అయస్కాంత పొడవు (2l)గా నిర్ణయిస్తారు.
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి, డి 3) బి, సి 4) ఎ, బి, సి
15. 'ప్రతి అణువు ఒక అయస్కాంతం' అని ఎవరు ప్రతిపాదించారు?
    1) వెబర్ 2) ఈవింగ్ 3) ఆయిర్ స్టెడ్ 4) టెస్లా



16. కింది వాటిలో సరైంది గుర్తించండి.
    ఎ) దండాయస్కాంత కేంద్రం వద్ద అయస్కాంతత్వం - శూన్యం
    బి) విద్యుదయస్కాంతాల తయారీకి వాడేది - మెత్తని ఇనుము
    సి) శాశ్వత అయస్కాంతాల తయారీకి వాడేది - మెత్తని ఇనుము
    డి) అయస్కాంత బలరేఖలు - వక్రరేఖలు
    1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) ఎ, సి, డి 4) సి, డి
17. కింది వాటిలో సరికానిది?
    ఎ) భూ అయస్కాంతత్వాన్ని నిర్ణయించే రాశులు - భూ అయస్కాంత మూలరాశులు.
    బి) ఈ మూలరాశుల విలువలను విమానయానం, నౌకాయానానికి ఉపయోగిస్తారు.
    సి) భూఅయస్కాంత బలరేఖల ఆకారాలు - సమాంతర రేఖలు
    డి) భూ అయస్కాంత భూమధ్య రేఖ వెళ్లే నగరం - ముంబయి
    1) సి, డి 2) బి, సి 3) డి 4) సి
18. కింది వాటిలో భూ అయస్కాంతత్వాన్ని ఉపయోగించుకునే వాటిలో లేనిది?
    1) క్షిపణులు 2) వలస పక్షులు 3) సముద్రపు తాబేళ్లు 4) దిక్సూచి
19. భూమి ఉత్తర, దక్షిణ ధ్రువాల వద్ద అందమైన ధ్రువకాంతులకు కారణం?
    1) భూ అయస్కాంత క్షేత్రం 2) దిక్పాతం 3) సౌర కిరణాలు 4) మాగ్నిటోస్ట్రిక్షన్
20. భారతదేశంలో అయస్కాంత భూమధ్యరేఖ ఈ ప్రదేశం ద్వారా వెళుతుంది. అందువల్ల అక్కడ మొదటి స్టాండింగ్ రాకెట్ రేంజ్‌ను ఏర్పాటు చేశారు.
    1) అలహాబాద్ 2) శ్రీహరికోట 3) శ్రీనగర్ 4) తిరువనంతపురం
21. ఏ పదార్థాల ఫలిత అయస్కాంత భ్రామకం శూన్యమవుతుందో ఆ పదార్థాలు...
    1) ఫెర్రో అయస్కాంత పదార్థాలు
    2) డయా అయస్కాంత పద్థారాలు
    3) పారా అయస్కాంత పదార్థాలు 4) 1, 2
22. కింది వాటిలో స్వచ్ఛంద అయస్కాంతీకరణం ప్రదర్శించే పదార్థాలు?
    1) ఫెర్రో 2) పారా 3) డయా 4) 1, 2
23. కింది వాటిలో డయా అయస్కాంత పదార్థం కానిది?
    1) బిస్మత్ 2) అల్యూమినియం 3) బంగారం 4) హైడ్రోజన్
24. కింది వాటిలో ఫెర్రో అయస్కాంత పదార్థం కానిది?
    1) కోబాల్ట్ 2) క్రోమియం 3) ఉక్కు 4) డిస్ప్రోషియం
25. కింది వాటిలో క్యూరీ ఉష్ణోగ్రత అంటే?
    1) ఫెర్రో - పారా అయస్కాంత పదార్థాలుగా మారే ఉష్ణోగ్రత
    2) పారా - డయా అయస్కాంత పదార్థాలుగా మారే ఉష్ణోగ్రత
    3) డయా - పారా అయస్కాంత పదార్థాలుగా మారే ఉష్ణోగ్రత
    4) పారా - ఫెర్రో అయస్కాంత పదార్థాలుగా మారే ఉష్ణోగ్రత
26. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
    ఎ) ఫెర్రో అయస్కాంత పదార్థం - గెడల్లోనియం
    బి) పారా అయస్కాంత పదార్థం - గాలి
    సి) డయా అయస్కాంత పదార్థం - నీరు
    1) ఎ 2) బి 3) సి 4) ఎ, సి
27. టేప్‌రికార్డర్ టేపు పైన ఫెర్రిక్ ఆక్సైడ్ అనే పూత ఉంటుంది. ఈ పదార్థం ఏ రకమైంది?
    1) ఫెర్రో 2) పారా
    3) డయా
    4) అనయస్కాంత పదార్థం
28. పెద్ద పెద్ద బరువులను ఎత్తడానికి వేటిని ఉపయోగిస్తారు?



    1) లోడ్ స్టోన్స్ 2) సాధారణ క్రేన్లు 3) విద్యుదయస్కాంతాలు 4) ఏదీకాదు
29. అయస్కాంత ప్రవేశ్యశీలత వ్యుత్క్రమం?
    1) రిలక్టివిటీ 2) ససెప్టబిలిటీ 3) రిటెంటివిటీ 4) మెలేబులిటీ
30. కింది వాటిలో సరైన వివరణలు...
    ఎ) అయస్కాంత బలం పనిచేయదు.
    బి) స్థిర ఆవేశాల వల్ల అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది.
    సి) అయస్కాంత బలరేఖలు సమాంతర అయస్కాంత క్షేత్రంలో ఏకరీతిగా ఉంటాయి.
    1) ఎ 2) ఎ, బి, సి 3) ఎ, సి 4) బి, సి



రచయిత: ఎస్.వై. నాయుడు

సమాధానాలు

1-3; 2-3; 3-2; 4-3; 5-4; 6-1; 7-2; 8-1; 9-1; 10-4; 11-4; 12-2; 13-2; 14-1; 15-2; 16-2; 17-3; 18-1; 19-1; 20-4; 21-2; 22-1; 23-2; 24-2; 25-1; 26-2; 27-1; 28-3; 29-1; 30-3.



వస్తువులపై ఉండే బలం ప్రభావాన్ని అధ్యయనం చేసే భౌతికశాస్త్ర విభాగాన్ని యాంత్రికశాస్త్రం (మెకానిక్స్) అంటారు. ఈ శాస్త్రాన్ని స్థితి (స్టాటిక్స్), గతి (డైనమిక్స్) శాస్త్రాలుగా వర్గీకరించారు. స్థితి శాస్త్రం బలం ప్రభావం వల్ల నిశ్చల స్థితిలో ఉండే వస్తువుల గురించి అధ్యయనం చేస్తుంది. గతిశాస్త్రం చలనంలో ఉన్న వస్తువుల గురించి అధ్యయనం చేస్తుంది. దీన్ని కైనటిక్స్, కైనమాటిక్స్ అని రెండు రకాలుగా వర్గీకరించారు. పోటీపరీక్షార్థులు చలనం, అదిశ, సదిశ రాశులు, వడి, వేగం, ఘర్షణ, బలం, వాటి రకాలు, చలన సమీకరణాలు తదితరాలపై అవగాహన కలిగి ఉండాలి.

అదిశ.. దూరం
సదిశ.. స్థానభ్రంశం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

యాంత్రికశాస్త్రం

పరిశీలకుడితో పోల్చినప్పుడు ఒక వస్తువు స్థానంలో మార్పు లేనట్లైతే అది నిశ్చల స్థితిలో ఉందని అర్థం. స్థానంలో నిరంతరం మార్పు ఉన్నట్లైతే చలనంలో ఉన్నట్లు. కాబట్టి చలనం సాపేక్షమైంది.

- చలనాన్ని రేఖీయ, భ్రమణ, సరళ హరాత్మక చలనాలుగా వర్గీకరించవచ్చు. చలనాన్ని అర్థం చేసుకునేందుకు దూరం, స్థానభ్రంశం అనే పదాలను వినియోగిస్తారు.
- చలనంలో ఉన్న వస్తువు ప్రయాణించే మార్గం మొత్తం పొడవును దూరం అంటారు. ఇది ఒక అదిశ రాశి.
- ఒక వస్తువు తొలి, తుది స్థానాల మధ్య ఉండే అత్యల్ప (సరళ రేఖ) దూరాన్ని స్థానభ్రంశం అంటారు. ఇది సదిశ రాశి.
- దూరం, స్థానభ్రంశం రెండింటికీ ప్రమాణాలు ఒకటే. CGS పద్ధతిలో సెంటీమీటర్, SI పద్ధతిలో మీటర్.
- సాధారణంగా దూరం స్థానభ్రంశం కంటే ఎక్కువ లేదా సమానంగా ఉంటుంది. తక్కువ అయ్యే అవకాశం లేదు.
- కొన్నిసార్లు వస్తువు కొంత దూరం ప్రయాణించినప్పటికీ దాని స్థానభ్రంశం శూన్యం అయ్యే అవకాశం ఉంది.

ఉదా: ఒక వ్యక్తి ఇంటి నుంచి బయలుదేరి బజారుకి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అతడు కొంత దూరం ప్రయాణించినప్పటికీ స్థానభ్రంశం 0 అవుతుంది. ఎందుకంటే అతడి స్థానం మారలేదు.

- ఒక వస్తువును పైకి విసిరితే, అది పైకి, మరల కిందకి కొంత దూరం ప్రయాణిస్తుంది. అయినప్పటికీ దాని స్థానభ్రంశం 0 అవుతుంది.



వడి (స్పీడ్)

ఒక వస్తువు ప్రమాణ కాలంలో ప్రయాణించిన దూరాన్ని వడి అంటారు. ఇది అదిశ రాశి.

$$\text{వడి} = \frac{\text{ప్రయాణించిన దూరం}}{\text{కాలం}}$$

- వడికి CGS పద్ధతిలో ప్రమాణం సెంటీమీటర్/సెకన్, SI పద్ధతిలో మీటర్/సెకన్.
- వడికి సంబంధించిన పదజాలాలు...

తక్షణ వడి: ఒక వస్తువును పరిశీలిస్తున్న క్షణంలో అది ప్రయాణించే వడిని తక్షణ వడి అంటారు.

ఉదా: స్పీడోమీటర్ ప్రయాణిస్తున్న వాహనం తక్షణ వడిని తెలియజేయడం.

సమవడి: సమాన కాలవ్యవధిలో సమాన దూరం ప్రయాణిస్తే, దాన్ని సమవడి అంటారు.

అసమ వడి: సమాన కాలవ్యవధిలో అసమాన దూరం ప్రయాణించడాన్ని అసమ వడి అంటారు.

సగటు వడి: పూర్తి ప్రయాణంలో వస్తువు ప్రయాణించిన మొత్తం దూరానికి, మొత్తం కాలానికి మధ్య ఉండే నిష్పత్తిని సగటు వడి అంటారు.

వేగం

ప్రమాణ కాలంలో వస్తువు పొందే స్థానభ్రంశాన్ని వేగం అంటారు. ఇది సదిశ రాశి.

- వేగానికి CGS ప్రమాణం సెంటీమీటర్/సెకన్, SI పద్ధతిలో మీటర్/సెకన్.

త్వరణం: వేగంలో వచ్చే మార్పు రేటును త్వరణం అంటారు. ఇది సదిశ రాశి.

ప్రమాణాలు: సెంటిమీటర్/సెకన్^{2} లేదా మీటర్/సెకన్^{2}.

- గమనంలో ఉన్న వస్తువు వేగం కాలంతో పాటు పెరుగుతూ ఉంటే దాన్ని ధన త్వరణం అంటారు.

ఉదా: రైల్వేస్టేషన్‌ను వదిలి వెళ్తున్న రైలు ధన త్వరణాన్ని కలిగి ఉంటుంది.

- ఒకవేళ వస్తువు వేగం కాలంతో తగ్గుతూ ఉంటే దాన్ని రుణ త్వరణం అంటారు.

ఉదా: ఒక వాహనానికి బ్రేకులు వేస్తే, అది రుణ త్వరణాన్ని పొందుతుంది.

- ఒకవేళ వస్తువు సమవేగంతో ప్రయాణిస్తున్నట్లైతే దాని త్వరణం శూన్యం.

చలన సమీకరణాలు:

$$v = u + at; \qquad S = ut + \frac{1}{2}at^2; \qquad v^2 - u^2 = 2aS$$

పై సమీకరణాల్లో u, vలు తొలి, తుది వేగాలను, a త్వరణాన్ని, S స్థానభ్రంశాన్ని, t ప్రయాణించిన కాలాన్ని సూచిస్తాయి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

ఘర్షణ

స్పర్శలో ఉన్న రెండు వస్తువుల ఉపరితలాల మధ్య ఉండే సాపేక్ష చలనాన్ని వ్యతిరేకించే బలాన్ని ఘర్షణ అంటారు. ఇది ఉపరితలాల స్వభావం, వాటి నునుపుదనంపై ఆధారపడి ఉంటుంది. ఘర్షణను తిరిగి మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

స్థైతిక ఘర్షణ: ఒక వస్తువును నిశ్చల స్థితి నుంచి కదిలించడానికి ప్రయత్నించినప్పుడు ఈ ఘర్షణ పని చేస్తుంది.

జారుడు ఘర్షణ: ఒక వస్తువు మరొక ఉపరితలంపై జారుతున్నప్పుడు జారుడు ఘర్షణ పని చేస్తుంది.

దొర్లుడు ఘర్షణ: ఒక వస్తువు మరొకదానిపై దొర్లినప్పుడు దొర్లుడు ఘర్షణ పనిచేస్తుంది. బరువైన వస్తువులు, సూట్‌కేసులకు చక్రాలు బిగించడం ద్వారా వాటిని సులభంగా కదిలించవచ్చు.

- ఘర్షణ వల్ల ఉపయోగాలతో పాటు నష్టాలూ ఉంటాయి. రాయడం, నడవటం, పరిగెత్తడం, వాహనాలను రోడ్లపై నడపటం ఘర్షణ ద్వారానే సాధ్యమవుతోంది. ఉపరితలాన్ని గరుకుగా చేయడం ద్వారా ఘర్షణను పెంచవచ్చు.

ఉదా: వాహనం టైర్లకు గాడులు, బూట్ల అడుగు భాగంలో బుడిపెలు ఏర్పర్చడం ద్వారా జారిపడకుండా చేయడం.

- కొన్నిసార్లు ఘర్షణ వల్ల వాహనాలకు ఇంధనం ఎక్కువగా అవసరమవుతుంది. యంత్రాల విడిభాగాలు అరిగిపోతుంటాయి. ఈ ఘర్షణను తగ్గించడానికి కందెనలు ఉపయోగించడం, బాల్ బేరింగులు అమర్చడం, ఉపరితలాలను నునుపు చేయడం లాంటివి చేయవచ్చు.
- ద్రవాలు, వాయువుల లాంటి ప్రవాహిలు కూడా ఘర్షణను కలిగిస్తాయి. దీన్ని అధిగమించడానికి ప్రవాహిల్లో కదిలే వస్తువులకు తగిన ఆకృతులు కల్పిస్తారు.

ఉదా: జెట్ విమానాలు, స్పోర్ట్స్ కార్లు ప్రత్యేక ఆకృతిని కలిగి ఉండటం వల్లే ఘర్షణను అధిగమించి అధిక వేగంతో ప్రయాణిస్తాయి.

బలం

ఒక వస్తువు నిశ్చలస్థితిని లేదా సమచలనాన్ని మార్చేది, మార్చడానికి ప్రయత్నించే దాన్ని బలం అంటారు. గతిశాస్త్రంలో వస్తువుల చలనంతో పాటు దానికి కారణమైన బలాన్ని (నెట్టడం, లాగడం లాంటి ప్రక్రియలు) కూడా అధ్యయనం చేస్తారు.

- బలానికి CGS ప్రమాణం డైన్, SI ప్రమాణం న్యూటన్ (N).

1 న్యూటన్ = 10^5 డైన్

- న్యూటన్ బలాలను రెండు రకాలుగా వర్గీకరించాడు. అవి:

1. **అంతర్గత బలం:** ఒక వస్తువుకు అంతర్గతంగా ఉండే బలాలను అంతర్గత బలాలు అంటారు. వీటి ద్వారా వస్తువు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదు.

ఉదా: బస్సులో కూర్చున్న ప్రయాణికులు ముందు సీట్లను ఎంత గట్టిగా నెట్టినా బస్సు స్థితిలో ఏ మార్పు ఉండదు. అదేవిధంగా రేడియోధార్మిక కిరణాలు బయటకు విడుదలవడం, అణుబాంబు విస్ఫోటనం మొదలైనవి.

2. **బాహ్యబలం:** ఒక వస్తువు మరొక వస్తువుపై ప్రయోగించే బలాన్ని బాహ్యబలం అంటారు. దీంతో ఒక వస్తువు స్థితిని మార్చవచ్చు లేదా మార్చడానికి ప్రయత్నించవచ్చు లేదా దాని ఆకృతిని మార్చవచ్చు. బాహ్యబలం స్వభావం ఆధారంగా బలాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

స్పర్శ బలాలు: ఒక వస్తువును తాకినప్పుడు మాత్రమే పనిచేసే బలాలు.

ఉదా: కండర బలం, ఘర్షణ బలం, తన్యత, అభిలంబ బలం.

క్షేత్ర బలాలు: వస్తువును తాకకుండా పనిచేసే బలాలు.

ఉదా: అయస్కాంత బలం, గురుత్వాకర్షణ బలం, స్థావర విద్యుత్ బలం, కేంద్రక బలం మొదలైనవి.

- ఒక వ్యక్తి తన కండరాల్లోని శక్తిని ఉపయోగించి బరువులు ఎత్తేందుకు బలాన్ని ప్రయోగిస్తే దాన్ని కండర బలానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

అంతర్జాతీయ పులుల దినోత్సవం

జులై 29
చరిత్రలో ఈనాడు

అంతరించిపోయే దశలో ఉన్న పెద్ద పులుల సంరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా జులై 29న 'అంతర్జాతీయ పులుల దినోత్సవం' (International Tiger Day) నిర్వహిస్తారు. అటవీ ఆవరణ వ్యవస్థలో పెద్దపులి పాత్ర కీలకం. అక్రమ రవాణా, వేట కారణంగా పులుల జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) 1986లో పెద్దపులిని అంతరించే స్థితిలో ఉన్న జాతిగా ప్రకటించింది. పులుల సహజ ఆవాసాలను రక్షించేలా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టడం, వాటి రక్షణ పద్ధతులపై అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



- ప్రపంచంలో పులుల జనాభా అత్యధికంగా భారతదేశంలోనే ఉంది. 1972 వరకు మన జాతీయ జంతువుగా సింహం ఉండేది. ఆ సమయంలో దేశంలో పులుల సంఖ్య గణనీయంగా తగ్గింది. వీటిని సంరక్షించేందుకు 1973లో నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించింది. అదే ఏడాది నుంచి పులి (పాంథెరా టైగ్రిస్) మన జాతీయ జంతువుగా మారింది.
- దేశంలో 1900 సంవత్సరం నాటికి 40,000 ఉన్న పులుల సంఖ్య 1972కి 1800కు తగ్గిపోయింది. దీంతో పులులను వేట నుంచి రక్షించి, వాటి జనాభా పెంపొందించడం కోసం భారత ప్రభుత్వం 1973, ఏప్రిల్ 1న 'ప్రాజెక్ట్ టైగర్'ను జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో చేపట్టింది. 2025, జులై నాటికి దేశంలో 58 టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయి.
- మన దేశంలో పులుల గణనను మొదటిసారి 2006లో చేపట్టారు. అప్పుడు 1411 పులులు ఉన్నాయి. అప్పటి నుంచి ప్రతి నాలుగేళ్లకోసారి వీటిని లెక్కిస్తున్నారు. 2010లో పులుల సంఖ్య 1706 ఉండగా, 2014లో 2226, 2018లో 2967, 2022లో 3167 ఉన్నాయి.
- దేశంలో పులుల సంఖ్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు మధ్యప్రదేశ్ - 785, కర్ణాటక - 563, ఉత్తరాఖండ్ - 560, మహారాష్ట్ర - 444.
- **ఆంధ్రప్రదేశ్, తెలంగాణ:** నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్.

తెలంగాణ: కవ్వాల్, అమ్రాబాద్‌లో టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయి.

చారిత్రక నేపథ్యం:

2010 రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో టైగర్ సమ్మిట్ జరిగింది. ఇందులో పెద్దపులులు ఉన్న 13 దేశాల నాయకులు (భారత్, రష్యా, ఇండోనేసియా, నేపాల్, థాయ్‌లాండ్, భూటాన్, బంగ్లాదేశ్, మలేసియా, చైనా, బర్మా, కాంబోడియా, లావోస్, వియత్నాం) పాల్గొన్నారు. 20 శతాబ్దం నాటికి అడవుల్లో 97% పులులు మరణించాయని వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి ఉన్న 3200 పులుల సంఖ్యను 2022 నాటికి రెట్టింపు చేసే ఉద్దేశంతో కార్యాచరణ రూపొందించారు.

- అదే సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా ఏటా జులై 29న 'అంతర్జాతీయ పులుల దినోత్సవం'గా నిర్వహించాలని తీర్మానించారు.

725 Word of the Day

Fallacy

Telugu meaning: అవాస్తవం, దురభిప్రాయం

English meaning: The word fallacy (ఫ్యాలసీ) is a noun that describes a mistaken belief or idea based on unsound reasoning or logic.

Synonyms: Misconception, Delusion

Antonyms: Truth, Fact

Usage: 1. Believing that wealth always leads to happiness is a common fallacy in modern society.

2. The argument was based on a logical fallacy that weakened the entire debate.

Latest Updates

Forest Section Officer Jobs in AP

Andhra Pradesh Public Service Commission (APPSC) has released a notification for the recruitment of Forest Section Officer (FSO) posts in AP Forest Subordinate Service on direct recruitment basis. No.of posts is 100. Application fee is Rs. 250. Last date for online applications 17th August 2025.

Non-Faculty Posts

Indian Institute of Information Technology, Design and Manufacturing (IIITDM) Kanchipuram is inviting applications for the filling of Non-Faculty Posts in various departments. No. of posts is 27. Application fee is Rs.500. Last date of applications is 14th August 2025.

Did You Apply..?


Today (July 29) is the last date for the following jobs

- Medical Consultant Posts in RBI. ***Eligibility:*** MBBS.
- Senior Project Associate Vacancies in NII. ***Eligibility:*** M.Sc., Ph.D.
- Young Professional Vacancies at ICMR Delhi. ***Eligibility:*** PG.

For more information and other notifications - scan QR code

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

కాగ్, యూపీఎస్సీ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలను తనిఖీ చేసి, నివేదికలు సమర్పించేది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్. దేశంలో అఖిల భారత సర్వీసులు, గ్రూప్-ఎ, గ్రూప్-బి, కేంద్ర సర్వీసులకు సంబంధించిన నియామకాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహిస్తుంటుంది. కాగ్, యూపీఎస్సీ నిర్మాణం, నియామక అర్హతలు, తొలగింపు, విధులు, అధికారాలు, తదితరాలపై పరీక్షార్థులు దృష్టి సారించాలి.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవి గురించి భారత రాజ్యాంగంలోని 148 - 151 ఆర్టికల్స్ వివరిస్తున్నాయి. కాగ్ అనేది రాజ్యాంగబద్ధమైన పదవి. దీన్ని మన దేశం బ్రిటిష్ వ్యవస్థ నుంచి స్వీకరించింది.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

దేశంలోని అత్యున్నత నియామక సంస్థ కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ). ఇది ఒక రాజ్యాంగబద్ధమైన, స్వయంప్రతిపత్తి గల సంస్థ. యూపీఎస్సీ దేశంలో మెరిట్‌ను పరిరక్షించే కాపలాదారుడు. భారత ప్రభుత్వ చట్టం 1919లో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును ప్రస్తావించింది.

కాగ్ అధికారాలు - విధులు; యూపీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామకానికి కావాల్సిన అర్హతలు - పదవీకాలం, ఇతర అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Indian Space Research Organisation (ISRO) Chairman and Secretary of the Department of Space, Dr. V.Narayanan has been honoured with the prestigious GP Birla Memorial Award in 2025. This accolade recognizes his outstanding contribution to India's space programme and his leadership in advancing cutting-edge space technologies.

- The award, formerly known as the Lifetime Achievement Award, the honour is a tribute to the enduring legacy of GP Birla, a visionary industrialist and philanthropist.



Indian Railways has achieved a major milestone by successfully testing the nation's first Hydrogen-powered train coach at the Integral Coach Factory (ICF) in Chennai. It was confirmed by Railway Minister Ashwini Vaishnaw on July 25.

- He stated that "India is developing a 1,200 HP hydrogen-powered train. This will place India among the leaders in hydrogen - powered train technology."



Indian Squash player, Anahat Singh wins Bronze at the World Junior Squash Championships 2025 in Cairo, Egypt. She claimed a bronze medal in the women's singles event, the country's first in 15 years. She lost in the semi-final against Nadien Elhammamy on 25 July.

For more Current Affairs: Scan QR code

Geometry

1. If the graph of $2x - 3y = -1$ and $5x + 2y = 45$ intersects at the point (a, b), then the value of (a + b) is...

A) 7 B) 12 C) 44
D) 10 E) 15

2. In xy - plane, A and B are two points having coordinates (3, –1) and (5, 2) respectively. Then the numerical value of the area of the circle with radius AB is.

A) 16 π square units
B) 15 π square units
C) 25 π square units
D) 13 π square units
E) None of the above

3. The area of triangle formed by the graph of ax + by = c (where 'a' and 'b' are two positive real numbers) and the coordinate axis is...

A) $\frac{c^2}{2ab}$ sq units B) $\frac{b^2}{2ac}$ sq units
C) $\frac{a^2}{2bc}$ sq units D) $\frac{2ab}{c^2}$ sq units
E) None of the above

4. A vertical stick 15 cm long casts a shadow of 9 cm long on the ground. At the same time a tower casts the shadow of 56 m long on the ground. Find the height of the tower.

Bank Exams


Quantitative Aptitude

A) $91\frac{1}{3}$ m B) $91\frac{2}{3}$ m
C) $93\frac{1}{3}$ m D) $93\frac{2}{3}$ m
E) $95\frac{2}{3}$ m

5. The area of two similar triangles are 125 cm^2 and 80 cm^2 respectively. What is the ratio of their corresponding heights?

A) $\frac{5}{4}$ B) $\frac{6}{5}$ C) $\frac{4}{5}$ D) $\frac{7}{4}$ E) $\frac{9}{11}$

6. In the given figure AB || QR and PA : AQ = 6 : 5 then $\frac{\text{area}(\Delta ABC)}{\text{area}(\Delta QCR)}$ is...



A) $\frac{121}{36}$ B) $\frac{25}{36}$
C) $\frac{36}{121}$ D) $\frac{36}{25}$
E) None of the above

7. The perimeters of two similar triangles ABC and PQR are 42 cm and 35 cm respectively. If PQ = 14 the length of AB is...

A) $16\frac{2}{5}$ cm B) $16\frac{4}{5}$ cm
C) $16\frac{3}{5}$ cm D) $16\frac{1}{5}$ cm
E) None of the above

8. Two isosceles triangles have equal vertical angles and their areas are in the ratio of 16 : 49. The ratio of their corresponding heights is...

A) 7 : 4 B) 8 : 11 C) 11 : 8
D) 4 : 7 E) 11 : 3

9. The ratio of the angles of a quadrilateral are in the ratio 2 : 3 : 4 : 6. Twice the smallest angle of the quadrilateral is equal to the bigger angle of a parallelogram. What is the measure of the angle of the parallelogram adjacent to its larger angle?

A) 84° B) 132° C) 94°
D) 90° E) 110°

10. The angles of the quadrilateral are in the ratio 7 : 23 : 27 : 15. An angle of a parallelogram is three degrees less than twice the difference between the two larger angles of the quadrilateral. What is the measure of the obtuse angle of the parallelogram?

A) 135° B) 140° C) 143°
D) 134° E) 124°

11. Area of the triangle formed by a straight line $\frac{x}{\cos\theta} + \frac{y}{\sec\theta} = 3$ with x - axis and y - axis is...

A) 9 sq.units B) $\frac{5}{2}$ sq. units
C) 3 sq. units D) $\frac{9}{2}$ sq. units
E) None of the above

12. The distance between the points (x, 0) and (–8, 0) be 12 units, then the possible values of 'x' one

A) 0, 12 B) 4, –20
C) –4, 20 D) 12, 0
E) None

13. Locus of the point, the sum of whose distance from the Co-ordinate axis is 18 is...

A) $x^2 - y^2 = 18$
B) $x^2 + y^2 = \sqrt{18}$
C) $x^2 - y^2 = 18$
D) None of those
E) Can't determine

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

భారత చెస్‌లో మైలు రాయి

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్-2025 ఫైనల్‌లో తన సహచర భారత క్రీడాకారిణి కోనేరు హంపిపై విజయం సాధించి చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్‌కు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. 'భారత చెస్‌లో అత్యున్నత రేటింగ్ పొందిన మహిళా క్రీడాకారిణి, రన్నరప్‌గా నిలిచిన హంపికి కూడా అభినందనలు. వీరిద్దరి మధ్య జరిగిన ఫైనల్ పోటీ భారత చెస్‌లో ఒక మైలురాయి క్షణంగా గుర్తుండిపోతుంది' అని పేర్కొన్నారు.

ఈ విజయం స్ఫూర్తిదాయకం: చంద్రబాబు

ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా నిలిచిన దివ్య దేశ్‌ముఖ్‌కు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా అభినందించారు. రన్నరప్‌గా నిలిచిన కోనేరు హంపి గట్టి పోటీనిచ్చారని, అసాంతం ప్రతిభ కనబరిచారని కొనియాడారు. వీరి విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

చెస్ విజేతకు పవన్ కల్యాణ్ అభినందనలు

చదరంగంలో ప్రపంచ మహిళా ఛాంపియన్‌గా నిలిచిన యువ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. 'ఫైనల్‌లో ఇద్దరూ మన క్రీడాకారిణులే తలపడటం విశేషం. ఛాంపియన్‌షిప్ సాధించడానికి కోనేరు హంపి అద్భుతమైన ఆట తీరును కనబర్చారు' అని పేర్కొన్నారు.

ఇది చరిత్రాత్మక ఫైనల్: మాజీ సీఎం జగన్

'ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్-2025 ఫైనల్‌లో ఎంతో అద్భుతమైన ఆట తీరును కనబర్చిన కోనేరు హంపి, మన కొత్త ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌లకు హృదయపూర్వక అభినందనలు. ఇది నిజంగా చరిత్రాత్మకం' అని మాజీ సీఎం జగన్ సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆదిత్య ఎల్-1 నుంచి 20 టెరాబైట్ల డేటా

- ఇస్రో ఛైర్మన్ నారాయణన్



పారిస్, న్యూస్‌టుడే: ఆదిత్య ఎల్-1 నుంచి ఇప్పటివరకు 20 టెరాబైట్ల డేటా అందిందని, దీనిపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఈ ఏడాది డిసెంబరులో 'వ్యోమ్‌మిత్ర' అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నట్లు చెప్పారు. ఇది విజయవంతమైతే వచ్చే ఏడాది మరో రెండు మానవరహిత మిషన్లను చేపడతామని, ఆ తర్వాత 2027 మార్చిలో భారత తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ ఉంటుందని స్పష్టం చేశారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్‌లోనే ఇంటర్న్‌షిప్

ఈనాడు, అమరావతి: డిగ్రీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరో సెమిస్టర్‌లో ఒకేసారి ఇంటర్న్‌షిప్ అమలు చేయనున్నారు. ఇప్పటివరకు మొదటి ఏడాది వేసవి సెలవుల్లో కమ్యూనిటీ ప్రాజెక్టు, రెండో ఏడాదిలో రెండు నెలలు, చివరి ఏడాదిలో ఒక ఆరు నెలలు ఇంటర్న్‌షిప్‌ను అమలు చేస్తుండగా.. ఈ సంవత్సరం ఒకేసారి నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. గతంలో 10 నెలల ఇంటర్న్‌షిప్‌నకు 20 క్రెడిట్లు ఉండగా, వీటిని ఈ ఏడాది నాలుగు క్రెడిట్లకు కుదించారు. దీంతో మొదటి, రెండో ఏడాదిలో చేసే స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌లను రద్దు చేశారు. ఆరో సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌తో పాటు నాలుగు పేపర్లు చదవాల్సి ఉంటుంది. సింగిల్ మేజర్, మైనర్ మేజర్‌కు సంబంధించి రెండేసి చొప్పున పేపర్లు ఉంటాయి. ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ 180 గంటలు లేదా ఎనిమిది వారాలు ఉంటుంది. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మేజర్, మైనర్ సబ్జెక్టులుగా తీసుకున్నారు. విద్యార్థులు కావాలంటే మేజర్‌గా లేదంటే మైనర్‌గా క్వాంటమ్ కంప్యూటింగ్ చదువుకోవచ్చు. బీఎస్సీ కంప్యూటర్స్ వారికి క్వాంటమ్ కంప్యూటింగ్ సబ్జెక్టును తప్పనిసరి చేయనున్నారు. కృత్రిమ మేధ(ఏఐ)ను విద్యార్థులందరూ చదవాల్సి ఉంటుంది. ఏఐ గురించి పరిచయం, ఆయా సబ్జెక్టులో ఏఐ అమలును సిలబస్‌లో తీసుకొస్తున్నారు.

టీచర్లకు పీ-4 తప్పనిసరి చేయడం తగదు: ఫ్యాప్టో

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులకు పీ-4 కార్యక్రమాన్ని తప్పనిసరి చేయడం తగదని, నిర్బంధ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, చిరంజీవి డిమాండ్ చేశారు. 'పీ-4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కచ్చితంగా కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేయడం తగదు. దత్తత తీసుకోవడం అంశం ఐచ్ఛికంగా ఉండాలి కానీ నిర్బంధం చేయడం సరికాదు. ఏలూరు జిల్లా విద్యాధికారి సోమవారం సాయంత్రంలోపు పీ-4లో రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. మధ్య తరగతి స్థాయిలో ఉండే ఉపాధ్యాయులు, ఉద్యోగులు పేద కుటుంబాలను దత్తత తీసుకొని ఆర్థికంగా సహాయం చేసే పరిస్థితి ఉండదని నిజం ప్రభుత్వ పెద్దలు తెలుసుకోవాలి. ఒకవేళ ఎవరైనా దత్తత తీసుకుంటామంటే స్వాగతిస్తాం' అని పేర్కొన్నారు.

విద్యకు సంబంధం లేని పనులు ఉపాధ్యాయులకు అప్పగించొద్దు

- పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యా శాఖకు సంబంధం లేని పనుల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌ను భాగస్వామ్యం చేయొద్దని కలెక్టర్లకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి సూచించారు. పాఠశాల విద్య డైరెక్టరు తెలియకుండా విద్యకు సంబంధం లేని పనులు అప్పగించొద్దని స్పష్టం చేశారు. కొంతమంది కలెక్టర్లు కొన్ని విభాగాల డేటా అప్‌లోడ్‌కు వీరిని వినియోగిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. విద్యేతర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నందుకు ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి తెలిపారు. దీంతోపాటు అనవసరమైన యాప్‌లను తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

సింగపూర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర రూపకల్పన

- సీబీఐ ఏపీ ఛైర్మన్ మురళీకృష్ణ

ఈనాడు, అమరావతి: సింగపూర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్-2047గా రూపొందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని సీబీఐ ఏపీ ఛైర్మన్ మురళీకృష్ణ పేర్కొన్నారు. 'ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం, సీబీఐ భాగస్వామ్య సమిట్ రోడ్‌షో'లో ఆయన మాట్లాడారు. 'సీబీఐ, ఏపీ ప్రభుత్వ సహకారంతో విడుదల చేసిన స్వర్ణాంధ్రప్రదేశ్ టాస్క్‌ఫోర్స్ నివేదిక ఏపీని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే సమగ్ర రోడ్ మ్యాప్‌ను అందిస్తుంది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయం, పర్యాటకం, పునరుత్పాదక ఇంధనం వంటి కీలక రంగాల్లో వ్యూహాలను ప్రతిపాదిస్తుంది. ఏపీని భారత ఆర్థిక వృద్ధిలో ముందుండే రాష్ట్రంగా నిలుపుతుంది. సింగపూర్‌లో సీబీఐ 1994 నుంచి కార్యాలయం ఉంది. భారత- సింగపూర్ ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి సంబంధిత వాటాదారులతో కలిసి పని చేస్తోంది. డిజిటల్ ఎకానమీ, ఏఐ, క్వాంటమ్ ఇన్నోవేషన్ రెండు ప్రాంతాల మధ్య గొప్ప సమన్వయం ఉంది. సింగపూర్ పెట్టుబడిదారులు, టెక్నాలజిస్టులను ఏపీతో భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తున్నాం. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సీబీఐ భాగస్వామ్య సమిట్‌కు అందర్నీ ఆహ్వానిస్తున్నాం' అని పేర్కొన్నారు.

బిజినెస్ ఫెడరేషన్ తరఫున ఏపీకి సాయం: ప్రసూన్ ముఖర్జీ

సీఎం చంద్రబాబు డైనమిక్ నాయకత్వంలో భారతదేశంలో అత్యంత డైనమిక్ రాష్ట్రంగా ఏపీ ఎదుగుతోందని సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆడ్వకసీ కమిటీ ఛైర్మన్ ప్రసూన్ ముఖర్జీ పేర్కొన్నారు. 'ఏపీ, సింగపూర్ మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం ఉంది. సింగపూర్ కంపెనీలకు ఏపీ స్థిరమైన పెట్టుబడి, స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తోంది. సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ తరఫున ఏపీకి సహాయం చేస్తాం' అని తెలిపారు.

పెట్టుబడులకు ఏపీ ఉత్తమ రాష్ట్రం

- భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే

భారత్- సింగపూర్ సంబంధాలు గతేడాది నుంచి బాగా బలపడ్డాయని సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే అన్నారు. 'సింగపూర్ వ్యాపారులు భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి ఏపీ ఒక ఉత్తమ ఎంపిక. ఆ రాష్ట్రంలో విజన్, ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, క్రమశిక్షణ, సామర్థ్యం సింగపూర్‌ను పోలి ఉంటాయి. విశాఖపట్నంలో నవంబరులో జరిగే సీబీఐ సమిట్‌కు వెళ్లి ఏపీలోని అభివృద్ధిని స్వయంగా చూడండి' అని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం నుంచి విశ్రాంతి లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రశంసించారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులను రద్దు చేయండి

- గ్రామ సరిహద్దులు ఖరారు చేయకుండా నిర్ధారించారు
- సుప్రీం కోర్టులో తప్పుల ఏకాంబరం వ్యాజ్యం
- ఓఎంసీ అక్రమాల కేసులో న్యాయపోరాటం

ఈనాడు, దిల్లీ: ఓబుళాపురం అక్రమ మైనింగ్‌కు ప్రధాన కారణమైన అంతర్రాష్ట్ర సరిహద్దుల వివాదం విషయంలో కేంద్ర సాధికార సంస్థ దాఖలుచేసిన నివేదికను రద్దు చేయాలని ఈ కేసులో న్యాయపోరాటం చేస్తున్న తప్పుల ఏకాంబరం సుప్రీంకోర్టులో వ్యాజ్యాన్ని లీన దరఖాస్తు దాఖలుచేశారు. 'ఆంధ్రప్రదేశ్- కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న తుమ్మి- విఠలాపురం- మలపనగుడి-సిద్దాపురం గ్రామ సరిహద్దులను ఖరారు చేయకుండా సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించిన అంతర్రాష్ట్ర సరిహద్దులకు ఎలాంటి ప్రాతిపదికా లేదు. అంతర్రాష్ట్ర సరిహద్దులు గ్రామ సరిహద్దులను అతిక్రమించకూడదు. సరిహద్దుల నిర్ధారణకు ఇదే ప్రాథమిక సూత్రం. గ్రామ సరిహద్దులను పక్కనపెట్టేసి అంతర్రాష్ట్ర సరిహద్దులను ఆటోమేటిగ్గా ఖరారుచేయడం కానీ సర్వే ఆఫ్ ఇండియా (ఎస్‌ఓఐ) ఇరు రాష్ట్రాల సరిహద్దులను నిర్ధారించే క్రమంలో గ్రామ సరిహద్దులను పూర్తిగా విస్మరించింది. ఎస్ఓఐ స్ట్రిప్ మ్యాప్‌లో చూపిన అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఎక్కడా గ్రామాల సరిహద్దులను ప్రత్యేకంగా చూపలేదు. కర్ణాటక పరిధిలోకి వచ్చే తుమ్మి, విఠలాపురం గ్రామాల సరిహద్దులు బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని కొండలపై ఉన్నాయి. అక్కడ సరిహద్దు రాళ్ల గుర్తులు ఇప్పటికీ ఉన్నాయి. వీటిని ఎస్ఓఐ పరిగణనలోకి తీసుకోలేదు. అంతర్రాష్ట్ర సరిహద్దులను ఖరారుచేస్తూ సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన స్ట్రిప్ మ్యాప్‌నే కేంద్ర సాధికార సంస్థ సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో పొందుపరిచింది. మైనింగ్ లీజుల సరిహద్దుల నిర్ధారణకు 1962, 1969లో గ్రామ సరిహద్దులు ప్రాతిపదికగా తీసుకున్నారు తప్పితే అంతర్రాష్ట్ర సరిహద్దులను కాదు. ఎస్ఓఐ ప్రస్తుతం నిర్ధారించిన అంతర్రాష్ట్ర సరిహద్దులు బళ్లారి ఫారెస్ట్ మ్యాప్-1896 లోని సరిహద్దులు, రాళ్ల గుర్తులతో సరిపోవడం లేదు. కాబట్టి వాటి ఆధారంగా ఇచ్చిన సీఈసీ రిపోర్టును రద్దు చేయండి' అని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దుల్లోని అటవీ భూమిలో అంతర్రాష్ట్రంగా ఉన్న గ్రామాల సరిహద్దులను అక్కడున్న రాళ్ల గుర్తుల ద్వారా గుర్తించి, దాని ప్రకారం అంతర్రాష్ట్ర సరిహద్దులను ఖరారు చేసేలా సర్వే ఆఫ్ ఇండియాను ఆదేశించాలని కోర్టుకు విన్నవించారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేస్తాం: ఫ్యాప్టో

ఈనాడు, అమరావతి: విద్య, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2, 12 తేదీల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆగస్టు 2న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 12న రాష్ట్రస్థాయిలో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. "2023 జులై నాటికి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా.. రెండేళ్లు పూర్తయినా కనీసం వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయలేదు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, కమ్యుటేషన్, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించడం లేదు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోతున్నాయి. పీ4 కార్యక్రమాన్ని టీచర్లకు నిర్బంధం చేయరాదు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన పోస్టులకు వెంటనే ఉపాధ్యాయులను వెంటనే జీతాలు చెల్లించాలి. వీటితో పాటు ఏకీకృత సర్వీసు నిబంధనల సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయ బదిలీల చట్టంలో మార్పులు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. హైస్కూల్ ప్లస్‌లో పనిచేసే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, యథాతథంగా కొనసాగించాలి. అంతర జిల్లా బదిలీలు చేపట్టాలి. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి" అని ఫ్యాప్టో డిమాండ్ చేసింది.

బయో వ్యర్థాల నిర్వహణపై ఫిర్యాదులకు '104'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఫిర్యాదుల కోసం 104 కాల్ సెంటర్‌ను వినియోగించాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టీ.కృష్ణబాబు ఆదేశించారు. సచివాలయంలో బయో మెడికల్ వ్యర్థాల రాష్ట్ర సలహా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఏజెన్సీలు ఆసుపత్రుల నుంచి ఎంత పరిమాణంలో వ్యర్థాలు తీసుకెళ్తున్నాయి? సెంటర్‌కు చేరుతున్నది ఎంతో పరిశీలించేందుకు థర్డ్ పార్టీ ఏజెన్సీని నియమించాలని కృష్ణబాబు ఆదేశించారు. ఆసుపత్రుల సందర్శనకు జిల్లాలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులను కూడా ఆహ్వానించాలని సూచించారు. కేరళలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై అధ్యయనం చేయాలన్నారు. వ్యర్థాల నిర్వహణ సరిగ్గా చేయని ఏజెన్సీలపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య స్పందిస్తూ శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఎన్విరాన్‌మెంటల్ సహాకారిస్తే తప్ప సమర్థంగా పర్యవేక్షించలేమన్నారు. దీనిపై స్పెషల్ సీఎస్ స్పందిస్తూ కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అటవీ పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్.శరవణన్, ఆరోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండియన్, సెకండరీ హెల్త్ సంచాలకుడు ఎ.సిరి, డీఎంఈ నరసింహం, డీహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతిగృహాల్లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ఈనాడు, అమరావతి: బీసీ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మానసిక ఒత్తిడి దూరం చేయడంతోపాటు పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు ఆగస్టు 6 నుంచి మూడు రోజులపాటు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ మంత్రి సవిత వెల్లడించారు. అన్ని తరగతుల విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మీరు ఇటా.. అటా...

- కృష్ణా జలాల వివాదంపై సుప్రీంకోర్టు ప్రశ్న

ఈనాడు, దిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా జలాలపై వివాదం నేపథ్యంలో మీరు ఎటువైపు ఉన్నారంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సన్నివేశం సోమవారం చోటుచేసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగిస్తూ కేంద్రం 2021, 2022లో జారీచేసిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ కేసు సమయంలో కేంద్ర నోటిఫికేషన్ల ప్రకారమే ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించేలా ఆదేశించాలని, దీనిపై తుది నిర్ణయం వచ్చేవరకు తెలంగాణ జారీ చేసిన జీవో-34ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం రెండు వేర్వేరు రిట్‌పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే. ఇది వరకు విచారణ జరిపిన జస్టిస్ అభయ్ ఎస్.ఓక పదవీ విరమణ చేయడంతో సోమవారం ఈ కేసులు జస్టిస్ రాజేష్ బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. తెలంగాణ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ జోక్యం చేసుకుంటూ వీటికి కొంత సమయం పట్టే అవకాశముందని, ఈ కేసులు వాయిదా వేయాలని కోరారు. దీనిపై జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ఎక్కడున్నారని ప్రశ్నించారు. తాము హాజరైనట్లు అదనపు సొలిసిటర్ జనరల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది స్పందించడంతో "మీరు ఎవరి వైపు? అటువైపా, ఇటువైపా..... లేదంటే మధ్యనా" అని జస్టిస్ రాజేష్‌బిందల్ ప్రశ్నించారు. దాంతో న్యాయవాది 'మధ్యస్థం' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. అప్పుడు జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ మీరిప్పుడు ఉత్తర్వులు జారీ చేశారా? లేదంటే చేయడం లేదా? అని ప్రశ్నించగా... తామెలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని, ఏపీ తరఫు న్యాయవాది మాత్రం స్టే కోరుతూ చేస్తుంటూ నాడు 2021లోనే నోటిఫికేషన్ జారీ చేశారని, దాన్ని అమలు చేయాలని కోరుతూ తాము రిట్‌పిటిషన్ వేశామన్నారు. తెలంగాణ న్యాయవాది స్పందిస్తూ, 'కేఆర్ఎంబీ కేంద్ర ఉత్తర్వులను అమలు చేసే స్థితిలో లేదు. వాస్తవానికి ఇరురాష్ట్రాల సీఎంలు ఇటీవల జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సమస్యలను కమిటీకి ప్రతిపాదించారు" అని తెలిపారు. అపుడు ఏపీ ప్రభుత్వ న్యాయవాది జైదీప్‌గుప్త జోక్యం చేసుకుంటూ ఈ కేసు పూర్తిస్థాయి విచారణకు సమయం పడుతుందని గత దర్మాసనం చెప్పిందంటూ తాము మధ్యంతర ఉపశమనం కోరామని, అందువల్ల తొలుత దానిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. వైద్యనాథన్ జోక్యం చేసుకుంటూ ఏపీ పిటిషన్లకన్నా విచారణార్హతపైనా వాదనలు వినాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం ఈ కేసుల విచారణను వచ్చేనెల 19కి వాయిదా వేసింది.

భాజపా నేత హత్య కేసులో

ఉగ్రవాది అబూబాకర్ సిద్ధిక్‌ను విచారిస్తున్న పోలీసులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: వేలూరులో భాజపా నేత హత్య కేసుకు సంబంధించి ఉగ్రవాది అబూబాకర్ సిద్ధిక్‌ను తమిళనాడు పోలీసులు అంధ్రప్రదేశ్ తీసుకెళ్లి దర్యాప్తు చేశారు. కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసులో పాతికేళ్లుగా పరారీలో ఉన్న అబూబాకర్‌ను ఇటీవల ఏపీలో తమిళనాడు పోలీసులు పట్టుకున్నారు. 1995లో తమిళనాడు, కేరళ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో పేలుళ్లు సహా పలు ఉగ్రవాద చర్యలకు సూత్రధారిగా వ్యవహరించిన అబూబాకర్ సిద్ధిక్‌ను 30 ఏళ్ల తర్వాత అన్నమయ్య జిల్లా రాయచోటిలో తమిళనాడు యాంటీ టెర్రరిజం (ఏటీఎస్) పోలీసులు గత నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం చెన్నై తీసుకొచ్చి ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో 2013లో వేలూరులో జరిగిన భాజపా నేత అరవింద్‌రెడ్డి హత్య కేసుకు సంబంధించి సిద్ధిక్‌ను 5 రోజులు కస్టడీకి తీసుకుని ఏటీఎస్ పోలీసులు విచారిస్తున్నారు. ఆ కేసు విషయమై శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటికి తీసుకెళ్లి దర్యాప్తు చేశారు. అక్కడ కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకుని ఆదివారం చెన్నైకి తరలించారు. భాజపా సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రథయాత్ర సమయంలో మదురై జిల్లా తిరుమంగళం సమీపం వంతెన కింద బాంబు పెట్టిన కేసుతో పాటు పలు కేసుల్లో అబూబాకర్ సిద్ధిక్‌ను విచారిస్తున్నారు.

మహిళలు, చిన్నారుల సంక్షేమ పథకాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం

ఈనాడు, అమరావతి: మహిళలు, చిన్నారులకు సంబంధించిన అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా మిషన్ సమన్వయకర్తల పోస్టులు ఖాళీగా ఉన్న 26 జిల్లాలకు 26 మంది అధికారులను నియమించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ శక్తి, వాత్సల్య పథకాలను వీరు పర్యవేక్షించనున్నారు.

విశాఖలో ఏర్పాటు చేసే రెండు స్టార్ హోటళ్లకు రాయితీలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో కొత్తగా ఏర్పాటు చేసే రెండు ఫైవ్ స్టార్ హోటళ్లకు ఏపీ పర్యాటక విధానం 2024-29లో ప్రకటించిన రాయితీలు అందిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. పాలసీలో భాగంగా ఎస్‌జీఎస్టీ, విద్యుత్తు ఛార్జీలు, ఆస్తి పన్ను, నీటి ఛార్జీలు తదితరాలపై రాయితీలు అందించనుంది. కోలకతాకు చెందిన ఐటీసీ హోటల్స్ సంస్థ విశాఖలో రూ.328 కోట్లతో ఏర్పాటు చేసే ఫైవ్ స్టార్ హోటల్ ద్వారా 300 మందికి ఉపాధి లభించనుందని ప్రభుత్వం పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన లాన్సమ్ లీజర్స్ ఎంటర్‌టైన్మెంట్ రూ.86.78 కోట్లతో ఏర్పాటు చేసే ఫైవ్ స్టార్ హోటల్ ద్వారా 200 మందికి ఉపాధి లభించనుందని తెలిపింది. ఇందుకు సంబంధించి పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యాధి గుట్టు రట్టు కారాదని తమ్ముడిని కడతేర్చిన అక్క

- కన్నడనాట దారుణం

పెళ్లికెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: తన తమ్ముడికి వచ్చిన వ్యాధి బయట తెలిస్తే పరువు పోతుందని భావించిన అక్క, తన భర్తతో కలిసి తమ్ముడిని హతమార్చిన ఘటన కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా హొళల్కెరె పరిధిలోని దుమ్మి గ్రామంలో జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్మి గ్రామానికి చెందిన నాగరాజప్ప కుమారుడు మల్లికార్జున, నిశా సంతానం. నిశాకు శ్యామసాగరకు చెందిన మంజునాథ్‌తో వివాహం జరిపించారు. మల్లికార్జున బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సొంతూరుకు వస్తుండగా అతను ప్రయాణిస్తున్న కారు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన మల్లికార్జునను దావణగెరె



మల్లికార్జున ★ నిందితులు నిశా, ఆమె భర్త మంజునాథ్

లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా అతనికి రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు క్షతగాత్రుడికి ఎయిడ్స్‌తో పాటు, క్యాన్సర్‌ ఉన్నట్లు గుర్తించారు. ఆ విషయాన్ని నిశాకు తెలిపారు. బాధితుడికి మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు వాహనంలో బయలుదేరారు. మల్లికార్జున తనకు సయంకాని వ్యాధి సోకిందని, అప్పులు చేశానని, జీవించడానికి ఆసక్తి లేదని అక్క వద్ద బాధపడుతూ వచ్చాడు. వ్యాధి విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని భావించిన అక్క ఆమె తన భర్త మంజునాథ్ సాయంతో మార్గమధ్యలో మల్లికార్జునను వాహనంలోనే అతని గొంతుకు టవల్ బిగించి హతమార్చారు. ఈ విషయాన్ని దాచి పెట్టి బార్యాభర్తలు మల్లికార్జున శవాన్ని నేరుగా దుమ్మికి తీసుకొచ్చారు. మార్గమధ్యంలో తమ్ముడు మృతి చెందినట్లు ఇంట్లోవారిని నమ్మించారు. అంత్యక్రియలు చేస్తున్నప్పుడు మల్లికార్జున గొంతు పై గాయాలు ఉన్నట్లు గుర్తించిన తండ్రి నాగరాజప్ప కూతురు, అల్లుడిని పోలీసులు నిలదీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. నిశా, మంజునాథ్‌లను అదుపులోకి తీసుకున్నారు.



పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

తిరుపతి ఐఐటీలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2,313 కోట్లు

- లోక్‌సభలో కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: తిరుపతి ఐఐటీలో మౌలిక వసతుల విస్తరణ, రీసెర్చ్ పార్క్ ఏర్పాటుకు రూ.2,313.02 కోట్లు ఖర్చుచేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. ఈ నిధులను రెండో దశలో భాగంగా మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయించినట్లు వెల్లడించారు.

విజయవాడ స్కూల్లో సిబ్బంది భర్తీకి చర్యలు

విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ప్రస్తుతం 8 బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఖాళీలు భర్తీ చేయడానికి 16 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

- ఏపీలోని 18 జిల్లాల్లోని 37 కేంద్రీయ విద్యాలయాల్లో 2024-25 నాటికి 29,547 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. హిందూపురం తెదేపా సభ్యుడు బీకే పార్థసారథి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 2024 డిసెంబరులో దేశవ్యాప్తంగా 85 కొత్త కేంద్రీయ విద్యాలయాలు కేటాయించామని, అందులో ఏపీకి 8 దక్కినట్లు చెప్పారు.

ఆకాంక్షిత జిల్లాలకు రూ.34 కోట్లు

ఏపీలోని ఆకాంక్షిత జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, వైఎస్సార్ కడప జిల్లాలకు రూ.34.25 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 48 కొలమానాల ఆధారంగా ఈ జిల్లాలను ఎంపిక చేసినట్లు చెప్పారు.

ఏపీలో 74% ఇళ్లకే జల్‌జీవన్ మిషన్ నీటి సరఫరా

జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఏపీలోని 74% ఇళ్లకే కుళాయి నీటి సరఫరా సౌకర్యం ఉన్నట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి వి.సోమన్న ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఈ పథకం కింద అతి తక్కువ ఇళ్లకు కుళాయి నీటి సౌకర్యం ఉన్న రాష్ట్రాల్లో ఏపీ చివరి నుంచి 6వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సగటున 81% ఇళ్లకు కుళాయి సౌకర్యం ఉండగా ఏపీలో అది 74%కే పరిమితమైనట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 95,53,169 ఇళ్లలో ఇప్పటివరకు 70,62,676 గృహాలకు కుళాయి నీటి సౌకర్యం ఉందని వెల్లడించారు.

ఓర్వకల్లు వారానికి 18 విమానాల రాకపోకలు

కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రస్తుతం వారానికి 18 విమానాల రాకపోకలు సాగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ రాజ్యసభలో తెలిపారు.

రాష్ట్రంలో రూ.5,700 కోట్ల స్మార్ట్‌సిటీ పనులు పూర్తి


స్మార్ట్‌సిటీ పథకం కింద ఏపీలో రూ.6,589 కోట్లతో 280 ప్రాజెక్టులు చేపట్టగా అందులో రూ.5,700.65 కోట్ల విలువైన 236 ప్రాజెక్టులు (84%) పూర్తయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోకన్ సాహు పేర్కొన్నారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. ప్రస్తుతం రూ.888.36 కోట్ల విలువైన 44 పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. నాలుగు నగరాలకు కేంద్ర వాటా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1,860 కోట్లు క్లెయిమ్ చేసిందని, అందులో రూ.1,840 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపిందని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ పథకం ఈ ఏడాది మార్చి 31తో ముగిసిందని వివరించారు.

ఏపీలో జులై 11 నాటికి స్మార్ట్‌సిటీ పథకం అమలు ఇలా..

నగరం	మొత్తం		పూర్తయిన		కొనసాగింపు	
	ప్రాజెక్టులు	రూ.కోట్లు	ప్రాజెక్టులు	రూ.కోట్లు	ప్రాజెక్టులు	రూ.కోట్లు
అమరావతి	19	902.94	14	746	5	156.94
కాకినాడ	92	1,908.09	80	1,731.17	12	176.92
తిరుపతి	104	2,082.75	79	1,610.65	25	472.10
విశాఖపట్నం	65	1,695.23	63	1,612.83	2	82.40

తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకం

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, చిత్రంలో అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహియుద్దీన్, గాడి ప్రవీణ్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. న్యాయవాదుల కోటా నుంచి గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లను అదనపు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో వీరిని అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మతోపాటు కొత్తగా అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఈ నెల 31న ప్రమాణం చేసే అవకాశం ఉంది.

థర్మల్ విద్యుత్తు ఉత్పత్తిలో 10 శాతం వృద్ధి

- ఈ ఏడాది సాధించిన ఏపీ జెన్కో
- అధికారులను అభినందించిన సీఎస్ విజయానంద్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్తు అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కార్యనిర్వహణ సామర్థ్యం, నిర్దిష్ట సమయానికి పనుల పూర్తి తదితర అంశాలపై దృష్టి సారించడం కీలకమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో అధికారులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. 'ఏపీ జెన్కో, ఏపీపీడీసీఎల్ సంస్థలు 2025 ఆర్థిక సంవత్సరంలో థర్మల్ విద్యుత్తు ఉత్పత్తిలో 10 శాతం, జల విద్యుత్తులో 95 శాతం వృద్ధిని నమోదు చేసినందుకు ఆయన అధికారులను అభినందించారు. ప్రతి ఉత్పత్తి కేంద్రం తన గరిష్ఠ సామర్థ్యం మేరకు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్తు కేంద్రం యూనిట్-7 సహా పలు యూనిట్ల ఓవర్ హాల్ పనుల పురోగతిని సమీక్షించారు. అంతరాయాలను తగ్గించి, కొనసాగింపు ప్రివెంటివ్ మెయింటెనెన్స్‌ను పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. బొగ్గు నిల్వల నిర్వహణ కీలకమని, సరఫరా పరిమాణం, నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

వైకాపా ప్రభుత్వంలో పారిశ్రామికీకరణ పదం వినబడలేదు

నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో పారిశ్రామికీకరణ, పెట్టుబడులు అన్న పదాలు రాష్ట్రంలో వినిపించలేదని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. ఐబీఎం, అశోక్ లేల్యాండ్, పీపీటెక్, లులు లాంటి పలు కంపెనీలు రాష్ట్రం విడిచి వెళ్లాయన్నారు. కూటమి ప్రభుత్వంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడాన్ని వైకాపా ఓర్వలేకపోతుందని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీల మీద వైకాపా నేతలు చేస్తున్న దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండించారు.

వెంకటేశ్‌నాయుడు పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో సోమవారం ఇరువర్గాల వాదనలు ముగిశాయి. తుది తీర్పు నిమిత్తం వచ్చే నెల 18కి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు. మద్యం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ 38) బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై గత వారం వాదనలు పూర్తి అయ్యాయి. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది.

అద్భుతమైన కచ్చితత్వంతో ఆపరేషన్

వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించాలని... [illegible]... కాపాడాలని... భారత సైన్యం... మంగా భారత్ చేపట్టిందని వైకాపా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. లోక్‌సభలో వైకాపా తరఫున ఆయన మాట్లాడారు. 'మన సాయుధ దళాలు అద్భుతమైన కచ్చితత్వంతో ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేశాయి. శత్రువు రెచ్చగొట్టేలా వ్యవహరించినప్పటికీ అంతర్జాతీయ నిబంధనలను అనుసరించి భారత్ ఆపరేషన్‌ను నిర్వహించింది. పాకిస్థాన్ మాత్రం ఐరాస నిబంధనలు... పాదచారుల... నిబంధనలను... [illegible]... ప్రజా ప్రాణాలను పొట్టన పెట్టుకొంది' అని అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు.

పాఠశాలలో పరీక్ష రాస్తూ విద్యార్థిని మృతి

కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ఆందోళన



భూక్య ప్రతిమ

ఖమ్మం గ్రామీణం, ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: పాఠశాలలో పరీక్ష రాస్తూ పదో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఉపాధ్యాయులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. తెలంగాణ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం బోడియాతండాకు చెందిన భూక్య రమేశ్, బాబమ్మల కుమార్తె ప్రతిమ(15) ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎఫ్ఏ-1 సోషల్ పరీక్ష రాస్తుండగా ఒక్కసారిగా కళ్లు తిరిగి(ఫిట్స్ వచ్చి) కింద పడిపోయింది. అక్కడే ఉన్న సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. సాయంత్రం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అయితే, తమ కుమార్తెకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని.. ఫిట్స్ వచ్చినట్లు తమకు సమాచారం ఇవ్వకుండా ఆసుపత్రికి ఎందుకు తీసుకెళ్లారని ప్రతిమ తల్లిదండ్రులు, బంధువులు ప్రశ్నించారు. పనితీరుపైనా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రతిమ మృతి చెందిందని ఆరోపించారు. ఆసుపత్రికి వచ్చిన అధికారులను ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు.

విశాఖ భాగస్వామ్య సదస్సుకు రండి

- ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం రోడ్‌షోలో సీఎం చంద్రబాబు



ఈనాడు-అమరావతి: విశాఖలో నవంబరులో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆయన సోమవారం 'ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం' తరఫున సీఐఐ భాగస్వామ్య సమ్మిట్ రోడ్‌షోలో పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి గణాంకాలను వివరించారు.

◆ జీఎస్‌డీపీ 180 బిలియన్ డాలర్లు. అది జీడీపీలో 5 శాతం.

◆ తయారీరంగం 23 శాతం. వ్యవసాయం 35 శాతం. సేవల రంగం 42 శాతం.

◆ 2024లో ఎగుమతులు 20 బిలియన్ డాలర్లు. దేశంలో ఆరో అతిపెద్ద ఎగుమతిదారు ఏపీ.

మా దార్శనికత

◆ ఏపీ స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికతో భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం.

◆ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ. తలసరి ఆదాయం 42 వేల డాలర్లు.. ఎగుమతుల లక్ష్యం 450 బిలియన్ డాలర్లు.

◆ నూరు శాతం అక్షరాస్యత, పర్యావరణ హోం, ఫిజికల్, వర్చువల్ వర్కింగ్, జీరో పేదరికం విధానాలు రాబోతున్నాయి. అందుకు అనుగుణంగా మానవ వనరులు సిద్ధం చేయాలన్నది లక్ష్యం.

◆ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యావిధానాలను మార్చుతాం. దానికి సింగపూర్ విధానాలను అనుసరిస్తాం.

◆ పునరుత్పాదక ఇంధన రంగం వాటా 75 శాతం.

◆ పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరిపి టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ఒక విజన్ డాక్యుమెంట్ తయారు చేశారు.

ఏపీలో మౌలిక సదుపాయాలు సిద్ధం

◆ పెట్టుబడుల ఆకర్షణకు అత్యుత్తమ పాలసీలు ప్రకటించాం.

◆ అందుబాటులో ప్రపంచంలోనే అత్యుత్తమ లాజిస్టిక్ సేవలు.

◆ మూడు ఎకనామిక్ కారిడార్లు.

◆ అమరావతి కేంద్రంగా క్వాంటం వ్యాలీ రానుంది.

◆ కేంద్రంలోని గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ వ్యాలీ ఏర్పాటు.

◆ ప్రస్తుతం ఆరు పోర్టులు ఉన్నాయి. మరో నాలుగు రాబోతున్నాయి.

◆ ఇప్పుడు 7 విమానాశ్రయాలు ఉన్నాయి. మరో 9 నిర్మించబోతున్నాం. లాజిస్టిక్ ఖర్చులు తగ్గి అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడే అవకాశం ఉంది.

భారీ సంస్థలు...

◆ విశాఖలో ఆర్సెలార్ మిత్తల్ అతిపెద్ద ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయనుంది. అదానీ డేటా సెంటర్.. గూగుల్ క్లౌడ్ రానున్నాయి.

◆ దేశంలోనే మొదటి డ్రోన్ సిటీ కర్నూలులో రాబోతోంది.

పారిశ్రామికవేత్తలకు వేగంగా అనుమతులు

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ నాలుగేళ్ల దేశంలోనే మొదటి స్థానంలో ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని తెచ్చాం. పారిశ్రామికవేత్తలు ఒప్పందంపై సంతకాలు చేస్తే చాలు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని అనుమతులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది' అని తెలిపారు.

సాంకేతికతతో అనుసంధానం

డీప్ టెక్నాలజీ.. టెక్ ఆధారిత విద్యావిధానంపై ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. 'పోర్టులను ఆటోమేషన్ చేస్తున్నాం. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ రానుంది. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను అందిస్తున్నాం. పునరుత్పాదక విద్యుత్ రంగంతో పాటు ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్ రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయి' అని వివరించారు.

గ్రూప్-1 తర్వాతే గ్రూప్-2 ఉద్యోగాల ఎంపిక జాబితా వెల్లడి

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 ఉద్యోగ నియామకాలకు ఎంపికచేసిన వారి జాబితాను త్వరలో ఏపీపీఎస్సీ ప్రకటించనుంది. అయితే, ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో మెరిట్ ప్రాతిపదికన ఉన్న స్పోర్ట్స్ అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ఉన్నతాధికారుల కమిటీ ఎంపిక చేయాల్సి ఉంది. ఈ కమిటీ పంపించే నివేదికను అనుసరించి గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను ఏపీపీఎస్సీ వెల్లడించనుంది. అందుకు కనీసం వారం వరకు సమయం పట్టవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ జాబితా ప్రకటించిన ఒకటి, రెండు వారాలకు గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేయనుంది. గ్రూప్-1 ఉద్యోగాల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన వారిలో సుమారు 30 మంది గ్రూప్-2 ఉద్యోగాల సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కూ హాజరయ్యారని, ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది.

అవుకులో 800 మెగావాట్ల పీఎస్‌పీ ప్రాజెక్టు

ఈనాడు, కర్నూలు: నంద్యాల జిల్లా అవుకుకు రాష్ట్ర ప్రభుత్వం 800 మెగావాట్ల పీఎస్‌పీ (పంప్డ్ స్టోరేజ్ పవర్) ప్రాజెక్టును మంజూరు చేసింది. ఆ మేరకు సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ ప్రాజెక్టును నిర్మించనుంది. తొలుత అరబిందో రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అవుకులో పీఎస్‌పీ ప్రాజెక్టు ఏర్పాటుకు 2022లో అనుమతి ఇచ్చారు. పలు కారణాలతో ఆ సంస్థ అక్కడ నిర్మాణాలను ప్రారంభించలేదు. దీంతో పీఎస్‌పీ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ముందుకొచ్చింది. ఆ ప్రతిపాదనపై ఇటీవల జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించారు. ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రతిపాదనను మండలి ఆమోదించింది. ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూమిని ఎకరానికి సంవత్సరానికి రూ.31 వేలు చొప్పున లీజుకు అప్పగించనున్నారు. ప్రభుత్వ భూమిని ఎకరానికి రూ.5 లక్షలకు కొనుగోలు చేసే అవకాశం కూడా కల్పించారు. జలవనరులశాఖ అధికారులు ఆ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని కేటాయించనున్నారు. ప్రాజెక్టును 48 నెలల్లో పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించాలి'

ఈనాడు, అమరావతి: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు వన్ టైం బదిలీ అవకాశం కల్పించాలని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డి.దయామణి, గౌరవ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఇతర ప్రతినిధులు సోమవారం మంగళగిరిలో వైద్యారోగ్య శాఖ కమిషనర్, ఎన్‌హెచ్‌ఎం సంచాలకులు వీరపాండియన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 'ఎన్‌హెచ్‌ఎంలో 22 వేల మంది 186 క్యాడర్లలో పనిచేస్తున్నారు. గత 15 ఏళ్లుగా వీరంతా గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది కుటుంబాలకు దూరంగా ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నందున బదిలీల సమస్యకు పరిష్కారం చూపాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏటా ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్ బకాయిలు చెల్లించాలి' అని పేర్కొన్నారు.

విద్యుత్తు ఉద్యమాన్ని విజయవంతం చేయాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5న చేపట్టనున్న విద్యుత్తు ఉద్యమంలో పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూచించారు. అదానీతో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ జిల్లా కార్యదర్శులతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి విద్యుత్తు ఉద్యమంలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలి. వైకాపా హయాంలో అదానీతో చేసుకున్న ఒప్పందాల కారణంగానే ట్రూ అప్ ఛార్జీలు పెంచాల్సి వస్తోందని ప్రభుత్వం దాటవేస్తోంది. ఈ సమస్యపై ప్రతిపక్షంగా ఉన్న వైకాపా నోరు మెదపడం లేదు. సింగపూర్, మలేసియాలో లులు షాపింగ్ మాళ్లు మూతపడ్డాయి. అక్కడి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. అలాంటి లులుకు ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను ధారాదత్తం చేస్తోంది' అని విమర్శించారు.

అసలు నగలు ఎత్తుకెళ్లి.. నకిలీవి పెట్టి

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 2 కిలోల బంగారం ట్యాంపరింగ్



వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం నగర డీఎస్పీ శ్రీనివాసరావు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒక బ్యాంకులో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను.. అటు అధికారులకు, ఇటు ఖాతాదారులకు తెలియకుండా వేరే సంస్థలో తాకట్టుపెట్టి డబ్బులు కాజేసిన ఘటన అనంతపురం జిల్లా కేంద్రంలోని రాంనగర్ హెచ్‌డీఎఫ్‌సీ శాఖలో చోటుచేసుకుంది. ఈ మోసానికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అనంతపురం నగర డీఎస్పీ శ్రీనివాసరావు కథనం.. అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన వెంకటంపల్లి సతీశ్‌కుమార్ రాంనగర్ హెచ్‌డీఎఫ్‌సీ శాఖలో గోల్డ్‌లోన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. జాకీర్ కొట్టాలకు చెందిన జయరాములు అదే బ్యాంకులో సేల్స్ ఆఫీసర్‌గా ఉన్నారు. సతీశ్‌కుమార్‌కు స్థానికుడు సాయికృష్ణతో స్నేహం ఉంది. వీరికి నందమూరినగర్‌కు చెందిన బోయ శ్రీనివాసులు పరిచయమయ్యాడు. వీరందరూ జల్సాలకు అలవాటు పడి, బ్యాంకులో కుదువపెట్టిన బంగారాన్ని ట్యాంపరింగ్ చేసి, వేరే చోట రుణం తీసుకున్నారు.

మోసం చేశారిలా..: సతీశ్‌కుమార్, జయరాములు బ్యాంకులోని వినియోగదారుల బంగారు ఆభరణాలను దొంగతనంగా తీసుకొని వాటిని తిలక్‌రోడ్డులోని కీర్తన ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టి రుణం తీసుకునేవారు. ఎవరికీ అనుమానం రాకుండా ఆభరణాలు ఉన్న కవర్‌కు చిన్నపాటి రంధ్రం చేసి అసలైన నగలను బయటకు తీసి, వాటి స్థానంలో నకిలీ ఆభరణాలు పెట్టేవారు. ఏడాదిగా ఇలా చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల బ్యాంకు ఆడిట్‌లో గుర్తించారు. దీనిపై బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జగదీశ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల్లో నలుగురిని సోమవారం అరెస్టు చేశారు. కీర్తన ఫైనాన్స్ మేనేజర్ నరేశ్ పరారీలో ఉన్నాడు. మొత్తంగా సుమారు రూ.2.02 కోట్ల విలువ చేసే బంగారాన్ని మార్చినట్లు గుర్తించారు.

సీల్డ్ కవర్‌లో కాళేశ్వరం నివేదిక!

ఒకటి లేదా రెండో తేదీన ప్రభుత్వానికి సమర్పణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై న్యాయ విచారణ నివేదిక సీల్డ్ కవర్‌లో జస్టిస్ పీసీ ఘోష్ అందించనున్నట్లు తెలిసింది. గతేడాది జూన్ నుంచి ప్రత్యక్ష విచారణ చేపట్టిన జస్టిస్ ఘోష్ కమిషన్.. వందల అఫిడవిట్లు, బహిరంగ విచారణలు, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్ నివేదికలు, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం ఆమోదించిన మంత్రి మండలి మినిట్స్, ప్రభుత్వం సమర్పించిన వేల పేజీల సమాచారాన్ని పరిశీలించింది. వాటి నుంచి కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. బ్యారేజీల్లో చోటుచేసుకున్న లోపాలు, వాటికి సంబంధించిన ఆధారాలతో భారీ నివేదికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా నివేదిక సిద్ధం కాగానే కమిషన్ కార్యదర్శి ఈ నెలాఖరున నీటిపారుదల శాఖకు సమాచారం అందించనున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆగస్టు ఒకటి లేదా రెండో తేదీన శాఖ ముఖ్య కార్యదర్శి నివేదికను స్వీకరించి ప్రభుత్వానికి సమర్పించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ మంత్రి, ఎంపీ ఈటల రాజేందర్‌లు విచారణకు హాజరైన అనంతరం బహిరంగ విచారణ ప్రక్రియను కమిషన్ పూర్తి చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ప్రజాప్రతినిధుల అవకతవకలకు సంబంధించిన కేసు ఒకటి సుప్రీంకోర్టులో విచారణలో ఉండగా.. దానిపై కమిషన్ పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ఆ కేసు ప్రభావం.. కమిషన్ నివేదికపై పడే అవకాశాలు లేవని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

ఏడుచోట్ల ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటుకు ఏపీ నుంచి ప్రతిపాదనలు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో ఏడుచోట్ల ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. ఒంగోలు, భీమవరం, కడప, అనంతపురం, చిత్తూరు, ఏలూరు, హిందూపురంలలో ఈ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు చెప్పారు.

డోన్ పశ్చిమ ప్రాంతంలో 900 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టులు

- రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు
- రూ.900 కోట్ల పెట్టుబడికి తొలగిన అడ్డంకులు

ఈనాడు, కర్నూలు: నంద్యాల జిల్లా డోన్ పశ్చిమ ప్రాంతంలో రూ.900 కోట్ల వ్యయంతో రెండు పవన విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం రెండు సంస్థలకు సోమవారం అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.600 కోట్ల వ్యయంతో 600 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టును నిర్మించనుంది. తొలుత ఈ ప్రాజెక్టు డోన్‌కు కేటాయించినప్పటికీ గత ప్రభుత్వం దాన్ని శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు కేటాయించింది. పలు కారణాల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ఆ ప్రాజెక్టు నిర్మాణం మొదలుకాలేదు. ఈ నేపథ్యంలో తాము ముందుగా దరఖాస్తు చేసుకున్న విధంగా డోన్‌లో పవన విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతివ్వాలని కోరడంతో ప్రభుత్వం వారి ప్రతిపాదనను ఆమోదించింది. దీంతో డోన్‌కు 600 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంటు నిర్మాణానికి అడ్డంకులు తొలగాయి. ఇదే ప్రాంతంలో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రభుత్వం పవన విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చింది. తాజాగా రెన్యూ సంస్థకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో ఇండోసోల్‌కు డోన్ పశ్చిమ ప్రాంతంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేసింది.

◆ రెన్యూ యోమాన్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డోన్ పశ్చిమ ప్రాంతంలోనే 300 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని కూడా గతంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కేటాయించారు. ఆ సంస్థ డోన్ పశ్చిమ ప్రాంతంలో వారి ప్రాజెక్టును ఏర్పాటుచేస్తామని ప్రభుత్వాన్ని కోరడంతో వారి ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించింది.

◆ రెన్యూ విక్రమ్ శక్తి, రెన్యూ యోమాన్ సంస్థలు రెండూ ఏపీ శుద్ధ ఇంధన విధానం-2024 ప్రకారం అక్కడి భూములకు ఎకరానికి సంవత్సరానికి రూ.31 వేల లీజు రుసుమును చెల్లించాలని సూచించింది. ప్రతి రెండేళ్లకూ ఆ లీజు రుసుమును 5శాతం పెంచాల్సి ఉంటుంది.


తెలంగాణలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లోకి మరో 4 కొత్త కళాశాలలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మరో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లోకి చేరాయి. వాటిల్లో ఒకటి కొత్తది కాగా.. మరో మూడు గతంలో మూతపడి మళ్లీ ఈసారి తెరుచుకున్నాయని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో జీకే ఇంజినీరింగ్ మైనారిటీ కళాశాలకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసినందున దాన్ని కౌన్సెలింగ్‌లో చేర్చారు. దాంట్లో 240 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈసారి పునరుద్ధరించిన మరో మూడు కళాశాలల్లో 240 సీట్లకు మాత్రమే అనుమతి దక్కింది. దాంట్లో 70 శాతం సీట్లకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 17 సీట్లు కలుపుతారు. వాటికి తోడు రెండో విడత కౌన్సెలింగ్‌లో ఎన్‌సీసీ, క్రీడా, ఆర్మీ కోటా సీట్లను కలపడంతో మరో 600 వరకు సీట్లు వచ్చాయని చెబుతున్నారు. మొత్తం మీద 1,100కు పైగా సీట్లు చేరినట్లు సమాచారం. రెండో విడత సీట్లను ఈ నెల 30వ తేదీలోపు కేటాయిస్తారు.

జైపాల్‌రెడ్డికి నివాళి

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్మృతి స్థల్‌లో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. వీరితోపాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు జైపాల్‌రెడ్డికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

– న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్



నర్సింగ్ స్కూల్‌లో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

తెలంగాణలో ఘటన



తరగతి గదిలో ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణలోని వరంగల్ మహాత్మా గాంధీ స్మారక(ఎంజీఎం) ఆసుపత్రి ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం రాత్రి శ్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 1965లో నిర్మించిన భవనంలో నర్సింగ్ స్కూల్, విద్యార్థుల వసతి గృహం నిర్వహిస్తున్నారు. ఈ స్కూల్‌ను ఇటీవల జిల్లా కలెక్టర్ డా.సత్యశారద సందర్శించి.. రైల్వే స్టేషన్ ముందున్న గృహనిర్మాణ శాఖకు చెందిన భవనంలోకి విద్యార్థులను మార్చాలని ఆదేశించారు. కానీ, పలు కారణాలతో సాధ్యపడలేదు. ఈ ప్రమాదంపై ఎంజీఎం ఆసుపత్రి ఆర్ఎంవో-2 డా.వసంతారావు విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ.. నర్సింగ్ స్కూల్, వసతి గృహాన్ని మరో చోటుకు మార్చడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అక్రమ కేంద్రాల లెక్క తేల్చండి!

- 'సృష్టి' ఘటన నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం
- అవకతవకలపై ప్రత్యేక డ్రైవ్‌కు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని 'సృష్టి' సరోగసీ కేంద్రం మోసానికి పాల్పడటం, ఇదే ప్రాంతంలో అక్రమంగా వీర్యకణాలు, అండాల సేకరణ చేస్తున్న 'ఇండియన్ స్పెర్మ్ టెక్' క్లినిక్ గుట్టు రట్టవ్వడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలో అక్రమంగా నడిపిస్తున్న సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల లెక్క తేల్చేందుకు అధికారులు రంగంలోకి దిగనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 381 రిజిస్టర్డ్ సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాలు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేంద్రాలు 158 వరకు ఉన్నాయి. అయితే అనధికారికంగా మరెన్నో కేంద్రాలు గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారాలు నడిపిస్తూ..ఒక్కో జంట నుంచి చికిత్స విధానాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఐయూఐ (ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్), ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) లాంటి కేంద్రాలు పెద్ద సంఖ్యలో వెలుస్తుండగా, సరోగసీ (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ -ఆర్ట్) కేంద్రాల్లోనూ పెద్ద మొత్తంలో వసూళ్ల పర్వం కొనసాగుతోందని సమాచారం. ఇలాంటి వాటిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో తనిఖీలు ముమ్మరం చేసేందుకు డీఎంహెచ్‌వో నేతృత్వంలో బృందాలు సిద్ధం కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రిజిస్టర్డ్ కేంద్రాల్లోనూ చట్ట ప్రకారం ప్రక్రియను అనుసరిస్తున్నారా.. నిబంధనలు అతిక్రమిస్తున్నారా అనే విషయాలను పరిశీలించనున్నారు. వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలతో పాటు జిల్లాల్లో సైతం సంతాన సాఫల్యం పేరుతో జరిగే దందాలపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించనుంది. ఈ మేరకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవకతవకలు గుర్తిస్తే వెంటనే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె 'ఈనాడు'కు తెలిపారు.

లయ తప్పుతున్న యువ హృదయం

- ఆకస్మిక మరణాలకు హెచ్‌సీఎం ఓ కారణం
- వ్యాయామం, క్రీడల సాధనకు ముందు పరీక్షలు తప్పనిసరి

ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో రాకేశ్ అనే 26 ఏళ్ల యువకుడు బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలాడు.. సికింద్రాబాద్‌కు చెందిన యువకుడు(24) జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఇటీవల గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి. క్రీడాకారుల్లో ఎక్కువ శాతం ఆకస్మిక మరణాలు గుండె సంబంధిత వ్యాధులతోనే జరుగుతున్నాయని ఇరాన్‌కు చెందిన టెహ్రాన్ ఫోరెన్సిక్ సెంటర్ అధ్యయనంలో తేలింది. గుండె సంబంధిత మరణాలు పలు రకాలుగా ఉంటాయని నిమ్స్ కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డా.సాయి సతీశ్ విశ్లేషిస్తున్నారు.

చిన్న వయసులో..!

✦ చిన్న వయసులోనే క్రీడాకారులు ఇలాంటి ఆకస్మిక మరణానికి గురైతే హెచ్‌సీఎం(హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి) కారణం అయి ఉంటుంది. ఇది ఉన్న వారిలో గుండె కండరాలు లావుగా ఉంటాయి. ఇది వంశపారంపర్యంగా వచ్చి ఉంటుంది. వ్యాయామం చేసే సమయంలో గుండె నిమిషానికి 210 సార్లకంటే ఎక్కువగా కొట్టుకోవడం ద్వారా దాని చలనం ఆగిపోయి.. రక్తప్రసరణ జరగకుండా మృతి చెందుతారు. ఎక్కువ శాతం ఇలాంటి సంఘటనలు 20 నుంచి 25 సంవత్సరాల వ్యక్తుల్లో కనిపిస్తాయి.

✦ అథ్లెట్లు, క్రీడాకారులు కొన్ని రకాల స్టెరాయిడ్లు వినియోగించినా కండరాలు అధికంగా సంకోచ వ్యాకోచాలకు గురై ఒక దశలో ఆగిపోయి చనిపోతారు.

✦ వ్యాయామానికి ముందు యువకులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. తల్లిదండ్రులకు ఇతర రక్తసంబంధీకులకు గుండెజబ్బులు ఉంటే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

పెద్దలకు ఇలా..!

40 సంవత్సరాలు పైబడిన వారు నడుస్తూనో.. వ్యాయామం చేస్తూనో.. గుండెనొప్పితో కుప్పకూలిపోతున్నారు. కార్డియాక్ అరెస్టు కావడమే ఇలాంటి ఘటనలకు కారణం. రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉన్నా.. ముందే గుర్తించకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. కొవిడ్ అనంతరం కూడా పెద్దలు, యుక్తవయసు వారు గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందుతున్నారు. కొవిడ్ సమయంలో వాడిన మందుల వల్ల గుండె రక్తనాళాల్లో వాపు వస్తుంది.

✦ ఆహారం తీసుకున్న వెంటనే కసరత్తులు చేయకూడదు. ఆహారం ఊపిరితిత్తులకు చేరడం వల్ల(రక్తనాళాల్లో) అడ్డుపడి మృత్యువాత పడతారు. స్టెరాయిడ్లు వాడకూడదు. కొద్దిగా వ్యాయామం చేసినప్పుడు, పరిగెత్తినా అలసటగా ఉంటే వెంటనే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని డా.సాయి సతీశ్ సూచిస్తున్నారు.

'ఆట'లోనే ఆగిన గుండె

- బ్యాడ్మింటన్ కోర్టులో ప్రాణం విడిచిన యువకుడు



బ్యాడ్మింటన్ ఆడుతూ కోర్టులో కుప్పకూలిన రాకేశ్



గుండ్ల రాకేశ్

ఉప్పల్, న్యూస్‌టుడే: బ్యాడ్మింటన్ ఆడుతూ కోర్టులోనే కుప్పకూలి యువకుడు ప్రాణం విడిచిన విషాద ఘటన హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన గుండ్ల వెంకటేశ్వరరావు కుమారుడు రాకేశ్(26)కు సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలని లక్ష్యం. ఓ సారి ప్రయత్నించి విఫలమయ్యాడు. పట్టు వదలలేదు. ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఎస్సై ఉద్యోగానికి సన్నద్ధం అవుతూ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్నాడు. హైదరాబాద్‌లో ఆర్టీసీ ఎక్స్ రోడ్‌లోని అపార్టుమెంట్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా స్నేహితులతో కలిసి ఉప్పల్ భగాయత్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్నాడు. ఆదివారం రాత్రి బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్నేహితులు నాగోల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. గుండె సంబంధిత సమస్యతోనే మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా వైద్యులు గుర్తించారు. రాకేశ్ బ్యాడ్మింటన్ ఆడుతూ కుప్పకూలిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అతనికి అనారోగ్య సమస్యలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.